Telugu Classics – Popular Edition Series

# మొల్లరామాయణము

మొల్ల

సంపాదకురాలు :

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

Akella Raghavendra's
Online.com

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవనం, హైదరాబాదు — 4

ప్రథమ ముద్రణ
ప్రతులు 2000

Akella Raghavendra's
Online-ias.com

మూల్యము
రు. 1-00

ముద్రణ :
మాతృశ్రీ ప్రింటర్సు
బాపట్ల

# తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ అకాడమీ, తెలుగు భాషలోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటించవలెనని నిశ్చయించినది. తెలుగుభాషలోని పూర్వ గ్రంథ సముదాయము ఈనాడు పాఠకునకు సక్రమముగా సరసమైన ధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమీ, ఒక ప్రణాళికను సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము ఈ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించనైనది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన; రెండవది మహాభారతము, భాగవతము, హరివంశము, భాస్కర రామాయణము, బసవ పురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట; మూడవది భారత భాగవతాల నుండియు నాచనసోమన, కంకంటి పాపరాజు, కూచిమంచి తిమ్మకవి రచనల నుండియు భాగాలను ఏర్చికూర్చి ప్రకటించుట. మొదటి తరగతిలో 27 ప్రబంధాలను 27 సంపుటాలుగా, రెండవతరగతిలోని గ్రంథములను 15 సంపుటాలుగా, మూడవ తరగతిలోని గ్రంథాలను 8 సంపుటాలుగా మొత్తము 50 సంపుటాలను ప్రకటించు కార్యక్రమము స్వీకరించవలెనని అకాడమీ తీర్మానించినది.

ఈ ప్రణాళిక ప్రకారము ప్రతి సంపుటము కి డెమ్మిసైజులో క్యాలికో బైండుతో 200 పేజీల గ్రంథముగా నుండవలెనని నిర్ణయించనైనది. ప్రతి గ్రంథములో గ్రంథకర్తనుగూర్చి, గ్రంథ

Akella Raghavendra's
Online-ias.com

ప్రాశస్త్యమునుగూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించనైనది. ప్రతిసంపుటము వెల ఒకరూపాయి మాత్రమే. ఈ విధముగా యీ సంపుటాలన్నింటిని సుమారు 5 సంవత్సరముల కాలములో ముద్రించి ప్రకటించవలెనని అకాడమీ కార్యవర్గము తీర్మానించినది.

మేము కోరినంతనే ఈ సంపుటము సిద్ధముచేయు బాధ్యతను స్వీకరించి, నిర్ణయించిన గడువులోపల వ్రాతప్రతిని కార్యాలయానికి అందజేసిన శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనిన 50 సంపుటాల వ్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు, అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమీకి ఇచ్చుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి యిందులో కొంతడబ్బును విడుదలకూడ చేసినవి. ఇందుకు అకాడమీ పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. అనుకొనిన వ్యవధిలో సంపుటాలను సిద్ధముచేసి, ఆంధ్రపాఠక లోకానికి అందజేయుట జరుగగలదని విశ్వసించుచున్నాము.

హైదరాబాదు
1-1-1967

దేవులపల్లి రామానుజరావు

Akella Raghavendra's
Online-ias.com

# మొల్ల రామాయణము

Akella Raghavendra's
Online-ias.com

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| తొలిపలుకు | .... | iii |
| ముకుంద వికాసము (పీఠిక) | .... | 1 |
| పీఠిక | .... | 1 |
| బాలకాండము | .... | 6 |
| అయోధ్యాకాండము | .... | 27 |
| ఆరణ్యకాండము | .... | 34 |
| కిష్కింధాకాండము | .... | 47 |
| సుందరకాండము | .... | 54 |
| యుద్ధకాండము ఆ. ౧ | .... | 96 |
| యుద్ధకాండము ఆ. ౨ | .... | 120 |
| యుద్ధకాండము ఆ. ౩ | .... | 136 |


Akella Raghavendra's Online-ias.com

# ముకుందవికాసం

తడియారని మలుపచ్చి గంధపుపూత వలపుల పసగల కలికి పలుకులూ, కండచక్కెరపలుకులనుండి తొరగి పారుచు చొకాటపు తేనెలుగా వాకలుగట్టిన కవి ప్రభువుల ఒయారపు తలపుల మెలపులూ తనకు గరువపు పరువము నింపగా పలు శతాబ్దుల బరువైన కాల చైతన్యమును మధురవాహినిగా మలచి, రసలోకమును ఓహరి సాహరి నానంద డోలికల నుయ్యాల లూగించిన సుధాతరంగిణి ! ఆంధ్ర సారస్వతము !

ఆ సుధా తరంగిణిని పొలుపుసెంది తామరతంపరగా వెల్లివిరిసిన అమల మౌక్తికముల అబ్బురపు పంటయే ఆంధ్ర కావ్యపరంపర !

బెళుకు తళుకు లీను ఈ ముత్తెపు సరాలు ధరించి కలికి చూపులకడగంటి ప్రసారాలతో కళామయుల సుదిమెత్తని యెదలలో మాణిక్య దీపములు నిలిపి వెలుగులు పండించిన శారదాదేవీ విమలదరహాస రేఖయే మొల్లరామాయణం !

మాయామానుష వేషధారియై మానవాళికి ఉదాత్తచరిత్రరూపకల్పన మొనరించడానికి శ్రీరామచంద్రుడుగా భూమియందవతరించి ముకుందధర్మ ప్రతిపాదనం చేసిన వైకుంఠుని చరిత్రమైన రామాయణాన్ని సంగ్రహ రూపంలో మన కందించిన మొల్లరామాయణం శారదాదేవీ విమలదరహాసరేఖయే !

భారతజాతి మనుగడకు, సంస్కృతికీ ప్రధానాలంబములైన శ్రీరామాయణ భారత భాగవతములలో కర్మావేశ పరతంత్రులైన ఆంధ్రులకు భాగవతంకంటె, రామాయణ భారతాలు అభిమాన పాత్రాలైన ఆదర్శ గ్రంథాలు. అందువలననే ఆంధ్రులకు శ్రీరామచంద్రునికంటె ఇతరుడైన ఇష్టదైవమును లేదు; రామాయణము కంటె ప్రీతి పాత్రమైన కావ్యమునూ లేదు ! నాదతపస్వి యయిన త్యాగ బ్రహ్మ "ఇతర దైవములవలన ఇలను సౌఖ్యమా రామా" అని ఆంధ్రుల హృదయాభిరతినీ, వారి సంస్కార ప్రియత్వాన్నీ చక్కగా సంకీర్తనం చేశాడు.

Akella Raghavendra's Online-ias.com

కమ్మని జవాదులై గుబాళించు తెలుగు నుడికారముల సును కాంతులలో ఏకపత్నీ వ్రతుడైన భారత ధర్మవీరుని పావనగాథ మెఱుగు లీని వింత సొబగులు వెలయించింది.

రసధర్మ లోలుపులైన తెలుగువారి హృదయకుహరాలలో పరిమళ లహరులై సుడులు దిరిగిన శ్రీరాముని అమలిన శృంగార ధర్మవీరాలతోబాటు ఇడుముల సిడెమెత్తి, తన జాతి గుండెలలో కరుణకు గుడికట్టిన సాధ్వి సీతమ్మ శోకంకూడా తెలుగువారి మెత్తని యెదలను ఘూర్ణిల్లచేసింది. ఆంధ్ర సారస్వతంలో రామాయణ కావ్యరచన ఎక్కువగా కనబడడానికి ఇదే కారణం. దేవ భాషలోని వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని తెలుగు కవులెందరో తమతమ భావ చైతన్యాన్నిబట్టి ఎన్నో సంగ్రహ రామాయణ కావ్యాలను రచించారు – నాటికీ నేటికీ ఈ విధంగా రచింపబడిన రామాయణ సంగ్రహ కావ్యములలో మొల్లరామాయణమే విశిష్టంగా వాసికెక్కియుండడం ప్రశంసార్హమైన విషయం.

కవయిత్రీమతల్లియైన మొల్ల రచించిన రామాయణకావ్యం ఒకటికి రెండుసార్లు చదువుతూంటే పరమ పావనోదార గృహస్థచరిత్రశోభనుడైన శ్రీరాముని గాథామృతాన్ని ఆంధ్రులకు నులివెచ్చని గోరుముద్దలుగా అందించిందా ఆతల్లి అనిపిస్తుంది! బాలకాండతో అందుకొని అరణ్యకాండ అంతంవఱకు చరచరా సాగిపోయిన కథాకథనవేగం ఈఅంశాన్ని విశదం చేస్తుంది.

మొల్ల ఈవిధంగా ఇంత సరళ గంభీరంగా రామాయణ కావ్యరచనచేయడానికి అనేకములైన కారణాలను మనం ఊహించవచ్చును.

ఆకారణాలను చెప్పేముందు ఆమె జీవించి ఉన్న కాలమాన పరిస్థితులను మనం కొంచెం పరిశీలించడం అవసరం.

## మొల్ల జీవించినకాలము

మొల్ల తనకాలాన్ని గూర్చి కావ్యంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అయినా "సురసన్నుత జ్ఞాను, సువివేకి వాల్మీకి..." అనే కృత్యాది సీసంలో "రసికులైనట్టి శ్రీనాథు, రంగనాథు" అని చేసిన పూర్వకవి సన్నుతినిబట్టి ఈమె శ్రీనాథునకు తర్వాత కాలము నాటిదని చరిత్రకారులు వ్రాస్తూ ఉన్నారు. ఈ విషయాన్ని శ్రీ వీరేశలింగంపంతులుగారినుండి ఇంతవఱకూ సాహిత్య

Akella Raghavendra's Online-ias.com

చరిత్రలు వ్రాసిన వారందఱూ అంగీకరించిన విషయం. ఆమె తన కావ్యంలో శ్రీనాథుని ప్రస్తుతించియుండి నందువలన అందఱూ ఆవిధంగానే ఊహించడానికి అవకాశంకూడా లేకపోలేదు.

ఆంధ్రదేశంలో వాడుకలో ఉన్న కొన్ని గాథలనుబట్టి శ్రీకృష్ణదేవ రాయల ఆస్థానకవి యయిన వికటకవి తెనాలి రామలింగ డీమెను కూడా తన హాస్య కాలక్షేపానికి పాత్రురాలిని చేశాడనే అంశం ఒకటి వ్యవహారంలో ఉన్నది.

ఈమె ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయల సమకాలీనురాలని అనుకోవడానికి అవకాశం ఇచ్చే ఈ ప్రవాదాన్ని సమర్థించడానికో అన్నట్లు

"ఊయెల మంచముల్పసిడి యుప్పరిగల్లపురంబు వీడెముల్
మాయని పుట్టము ల్రుచిర మండనముల్గడలేని క్రొవ్విరుల్
గాయన గాయనీ మధురగాన సుఖంబులు గన్నగాని నీ
పాయదె.................................."

అనే పద్యంతో

నిరుపహతిస్థలమ్ము రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కర్పూరవిడె మాత్మకింపయిన భోజనమూయెలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞులూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొఱకినగాక యూరకకృతుల్ రచియింపు మటన్న శక్యమే.

అని సామంతములాడి చెల్లించుకొన్న 'ఆంధ్రకవితా పితామహ' అల్లసాని పెద్దనార్యుని అధిక్షేపించిన పంచతంత్ర చంపూకావ్యకర్త బైచరాజు వెంకట నాథకవి.

"ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢముగాక, ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యరచాటగు నాంధ్రవధూటి చొక్కపుం
జనుగవ బోలి గూఢతయు, జాటుదనంబును గాకయుండ జె
ప్పిన యదెపో కవిత్వమనిపించు, నగించటుగాక యుండినన్"

అనే పద్యాన్ని వ్రాయగా, మొల్ల దానిని మనసులో ఉంచుకొని దానికి ప్రతిధ్వనిగా :-

"వలిపెపు సన్నపయ్యెదను వాసిగ గందపుపూత తోఁచుతన్
గొలదిగగానవచ్చు వలిగుబ్బ చనుంగన కీవి నొప్పగా
దెలుగని చెప్పుచోట గడు తేటలమాటల గ్రొత్త రీతులం
బొలుపువహింపకున్న మఱి పొందగునే పటహాది శబ్దముల్.
(పీఠిక 15)

ఈ పద్యం చెప్పిఉంటుందని ఊహించి మొల్లను పదునైదవ శతాబ్ద్యంత భాగానికి నెట్టివేశారు ఈ మధ్య, కొందఱు విమర్శకులు:

ఈ విమర్శ కేవలమూ మొల్ల వెంకటనాథ కవిని అనుకరించిందనడానికే వారికి ఉపకరిస్తుంది; కాని నిజపరిస్థితిని తెలుపడానికేమాత్రమూ సాయపడదు.

ఎందువల్లనంటే, ప్రతాపచరిత్ర వ్రాసిన ఏకామ్రనాథుడు (కాలం సరిగా నిర్ణయంకాలేదు. 15వ శతాబ్ది ఉత్తర భాగంవాడని చూచాయగా అంటూఉన్నారు.) సిద్ధేశ్వర చరిత్రంలో:-

"తిక్కన సోమయాజుల వరప్రసాదంబుచేత కుమ్మర మొల్ల రామాయణంబను వచనకావ్యంబు రచియించి ప్రతాపరుద్రున కంకితమ్ముగా సేయు సమయంబున, ఆరాజు సమ్ముఖంబున ఉన్న విద్వాంసులు విని ఇది శూద్రకవిత్వంబు, ఇది నిషిద్ధంబని, నిరాక రించిన నారాజు, సర్వజ్ఞుండుగావున, వారిని మెచ్చి, బ్రాహ్మణ కృతంబైన కావ్యంబు కావలెననిన, నా విద్వాంసులు భాస్కరుని పిలిపించిన అతండు రచించిన శ్రీమద్రామాయణంబు విను సమయం బున, అచటికి మొల్ల యేతెంచి, రామాయణంబు మున్ను రచియించి యున్నానని అచట నొక పద్యంబు చిత్రంబుగా చదువుటయు, నారాజు సర్వజ్ఞుండు కావున, దాని ప్రజ్ఞకు మెచ్చి, విప్రజనంబుల మనంబులు నొచ్చునోయని, మొల్లను పిలిపించి, పల్లకియును, నగరిని, నిత్యజీవి

Akella Raghavendra's Online-ias.com

ఖంబుననుండ జేయుటయు, నా వార్త విని శాఖవెల్లి మల్లిఖార్జునభట్టు నిరోష్ఠ్య రామాయణంబు రచించుటయు.........."

(సిద్ధేశ్వర చరిత్ర-పుట 160)

వ్రాసియున్న ఈ పైపంక్తులనుబట్టి చాలా విషయాలు మొల్లను గూర్చి మనకు తెలుస్తూ ఉన్నవి.

ఈ ఏకామ్రనాథుడు 1380 - 1420 లోపువాడని కొందఱు వాఙ్మయ చరిత్రకారులు వ్రాసియున్నారు. మున్ముందు మొల్లనుగూర్చి చరిత్రలో పేర్కొనిన వాడీతడే. అయితే ఇందుటంకింపబడిన రామాయణము వచన కావ్యముగదా! "పద్య రామాయణకావ్యకర్త్రి యగు మొల్లకూ ఈమెకూ సంబంధమేమిటి?" అనే సందేహం మనకు కల్గడం ప్రకృతిసిద్ధం. కాని ఇందే మొల్ల శూద్రకుల సంజాత కావున ఆమె కవిత్వము నిషిద్ధమని నిరాకరించడమూ, బ్రాహ్మణ కృత కావ్యం కావలెనని భాస్కరుని పిలిపించి తత్కృత రామాయణాన్ని వినడమూ అప్పుడు మొల్ల వచ్చి నేనింతకుముందే రామాయణాన్ని రచించి యున్నానని ఒక పద్యాన్ని చిత్రంగా చదివిందనీకూడా ఉటంకింపబడి యుండెను కదా!

దీనినిబట్టి ఈక్రింది విషయాలు మనకు ద్యోతకం కావడానికి అవకాశ మున్నది- కేవలం అవకాశం ఉండడమేకాదు- ఈ క్రింది విషయాలు మనకు స్పష్టమౌతూ ఉన్నాయనే చెప్పవచ్చు.

1295 లో పట్టాభిషిక్తుడైన ద్వితీయ ప్రతాపరుద్రుని రాజ్యకాలం 1340 ప్రాంతాల వఱకు నడిచిందని కొందఱు చరిత్రకారులంటూ ఉన్నారు. ఈ ప్రతాప రుద్రుని రాజ్యకాలంయొక్క అంత్యభాగం నాటికి మొల్ల బాలికయైయుండి వచన రామాయణం వ్రాసియుండవచ్చును. తాను శూద్రకులసంజాత కావడం వలన తనచే రచింపబడిన రామాయణానికి ప్రభువు మన్నన జరుపక మిన్నకుండడమూ, భాస్కర రామాయణాన్ని గౌరవించడమూ ఆమె తన కండ్లతోనే కాంచిన నగ్న సత్యం కావడమూ మొల్ల కుసుమ సుకుమార హృదయానికి దుర్భరశాపకారణం అయియుండవచ్చు. అంతట ఆమె వయఃపరిణతి కల్గిన వెనుక రామాయణాన్ని పద్యకావ్యంగా వ్రాసియుండవచ్చును. సిద్దేశ్వర చరిత్రంలోని పైవచనంలో, ఆమె

Akella Raghavendra's Online-ias.com

తెలిసినదేఅని కూడ స్పష్టపడుతూవున్నది. ఒకమారు తాను రచించిన వచన రామాయణం నరాంకితమై వన్నెవాసీ చెందకపోవడంవలననూ, వయః పరిణతితో బాటు భక్తి భావపరిణతికూడా కల్గిన వెనుక రచింపబడడం వలననూ, పద్యకావ్యమై మనముందు దివ్యభక్త్యంశతో నేటికీ సాక్షాత్కరిస్తూ ఉన్న రామాయణాన్ని శ్రీరామాంకితంగా గానంచేసి యుండవచ్చును. ఆమె ఈ రామాయణం రచించిన పరిణత వయస్సులో అనగా 1395, 1400 సంవత్సరాల నాటికి శ్రీనాథుని శృంగార ప్రౌఢ కవిత్వాలను బాగా ఎఱిగియుండినదై యుండవచ్చు. 1914 వ సంవత్సరమున మద్రాసు ఆనంద ముద్రాలయమున ముద్రింపబడి, ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీ వారిచే ప్రకటింపబడిన శ్రీనాథ కవికృత ఆంధ్రశృంగార నైషధ పీఠికలో 19 వ పుటలో 1395 ప్రాంతమునకే శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్ర, శాలివాహన గాథా సప్తశతి, శృంగార నైషధములను రచించియుండెనని వ్రాసిన విషయములు వాయీ యూహకు ఉపబలకములు. శ్రీనాథుడు సుమారుగా 1365, 1450 వఱకు జీవించిన దీర్ఘజీవి – ఆవిధముగానే గురులింగజంగమార్చన పరుడైన ఆతుకూరి కేసయసెట్టి వరపుత్రికయైన మొల్లకూడా 1320, లేక 25–1400 లేక 1405 వఱకూ జీవించిన దీర్ఘజీవనియై యుండవచ్చును. 20 వ శతాబ్దియందలి మనకంటె ఆనాటి వారు దీర్ఘకాల జీవులై యుండిరనే విషయం అసందిగ్ధమేకదా! అందును మొల్ల బ్రహ్మచారిణి! (అనియే నా ఉద్దేశము.) అట్టియెడ ఆమె శ్రీనాథుని తనకృత్యాదిలో ప్రస్తావించడంలో అసమంజసమేమున్నది? 'సురసన్నుతజ్ఞాను సువివేకివాల్మీకి' అనే పద్యంతర్వాత ఉన్న "తొల్లిటి ఇప్పటి కవులను" అనే పద్యం ఈ నా నిర్ణయాన్ని చక్కగా బలపరుస్తూంది. శ్రీనాథునకు పూర్వం వారంతా తొల్లిటికవులు, శ్రీనాథుడు ఇప్పటికవి. శ్రీనాథుడుకూడా తొల్లిటికవులలోని వాడైతే పై సీసంలో ఇప్పటి కవి యెవరు?

ఈ విధంగా స్పష్టమైయున్న విషయాన్ని కాదని 'ఘనతరఘూర్జరీ కుచయుగశ్రీయ...' అన్న పద్యాన్ని అనుసరిస్తూ మొల్ల 'వలిపెపు సన్న పయ్యెద...' అనే పద్యం వ్రాసిందనే అత్యల్ప విషయాన్ని సమర్థించడంకోసం మొల్లను 16వ శతాబ్ది చివఱకు లాక్కురావడంలో సహజత కన్పడదు.

న్యాయంగా ఆలోచిస్తే—

"నో ఘూర్జరీస్తన ఇవాతితరాం నిగూఢః
న ద్రావిడీస్తన ఇవాతితరాం ప్రకాశః
అర్థోగిరామపి హితః పిహితశ్చ కశ్చిత్
సౌరభ్యమేతిమహరాష్ట్రవధూకుచాభః"

అనే సంస్కృత శ్లోకమే వైచరాజు వేంకటకవికైనా ఆధారమేమో! ఏమో ఎవరు చెప్పగలరు! ఈ మనచరిత్రలలో అన్నీ ఏమో ఏమోలేగాదా!

......................"గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరముచేత
నెఱిఁగవిత్వంబుచెప్పగా నేర్చికొంటి"

నని మొల్ల వ్రాసుకొని యుండుటచేత ఈమె నెల్లూరు మండలంలోని గోపవర గ్రామ నివాసిని అనే విషయంకూడా తెల్పుతున్నది. ఈవిధంగా ఆమె కాలాన్ని నిర్ణయం చేసుకొన్నతర్వాత మొల్లకు పూర్వం రామాయణ (సంగ్రహ) కావ్యరచన చేసినవారు (భాస్కర రామాయణ కర్తలుకాక) ఆరుగురు కనబడుతూ ఉన్నారని మనం సులభంగా పేర్కొనవచ్చు.

వారు:-

(1) ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱన!

(2) తాళ్ళపాక అన్నమయ్య.

(3) కొరవి సత్యనారయ

(4) తిక్కన సోమయాజి.

(5) రంగనాథుడు.

(6) శాఖవెల్లి మల్లికార్జునభట్టు - వీరుకాక ఆకాలంనాటికే ఇంకా కొందఱుకూడా ఈవిధంగా రామాయణ రచనంచేసి యుండవచ్చు. తరువాత కాలంలో సుప్రసిద్ధులు అయ్యలరాజు రామభద్రుడూ, రఘునాథనాయకుడూ రామాయణం వ్రాసింది మనకు సుస్పష్టంగా తెలిసిన విషయమే. కంకంటి పాపరాజు ఉత్తరరామ చరిత్ర వ్రాశాడు. తరువాత గోపీనాథ రామాయణాదులు ఎన్నో అసంఖ్యాకంగా వెలసినవి ఉన్నాయి.

Akella Raghavendra's
Online-ias.com

కవయిత్రులలో మొల్లను విడిచి పరిశీలిస్తే రఘునాథనాయకుని రామాయణాన్ని సంస్కృతీకరించిన మధురవాణినీ, సుభద్రారామాయణకర్త్రి ని శీరము సుభద్రయాంబనూ, సరస్వతీ రామాయణం వ్రాసిన చేబ్రోలు సరస్వతీదేవినీ చేర్చి లెక్కిస్తే స్థూలంగా ముగ్గురు తేల్తూఉన్నారు. మఱి యిన్ని రామాయణాలలోనూ మొల్ల రామాయణానికున్న ప్రచార ప్రాచుర్యం తక్కిన రామాయణాలకు లేని విషయం అందఱకూ తెలిసినదే.

## కావ్య విశిష్టత

దీనికి కారణాలు: కథ చెప్పుకుపోతూ ఉన్నట్లు ప్రధానవిషయాలతో సరళంగా చెప్పాలనే దీక్షపట్టి రచించిందా? అనేటట్లు రచించడమూ, అంత సరళంగాఉన్నా, పేలవంగా ఉండకుండా పాండిత్య స్ఫోరకంగా, సాలంకారంగానూ, మిక్కిలి ప్రస్తుతి పాత్రమైన పాత్రౌచిత్యసంపదతోనూ, మిక్కిలి నవీన పద్ధతి ప్రకృతివర్ణనలతోనూ నిండియుండడమూ కావచ్చును. ఈ ఉద్దేశంతోనే తనకంటే పూర్వం ఎన్నిరామాయణాలు ఉన్నా తాను మహిళా హృదయ మార్దవంతో, మాతృహృదయ సౌమనస్యంతో రామాయణంవ్రాసి మానవాళిని తరింపజేయడానికి సంకల్పించింది కవయిత్రీమతల్లి! మొల్లతల్లి!!

అయితే, తనకు పూర్వం చాలామంది కవులు రామాయణ కావ్యరచన చేసియుండగా"నీవు మళ్ళీ రామాయణ కావ్యరచనం చేయుడమెందుకు?" అని ఒరులు తనను ప్రశ్నించినట్లుగా తనలోతానే ప్రశ్నించుకొని

ఆదిరఘురాము చరితము
నాదరముగ విన్నఁ గ్రొత్తయై లక్షణసం
పాదమ్మై పుణ్యస్థితి
వేదమ్మై తోచకున్న వెఱ్ఱినెచెప్పన్.?

అని సమాధానం చెప్పింది. ఆదిరఘు రాముచరితము ఆదరముగా విన్నవారికిని నిత్యమూ క్రొత్తదిగానే ఉండి ఒడలు పులకలెత్తేటట్లుగా ఆనంద పారవశ్యం కల్గించడంకూడా ఒక కారణమే. కాకపోతే మాత్రం ఎవరైనా "నాకంటెముందు వ్రాసినవాళ్ళు ఎవరూ బాగా వ్రాయలేదు. అందుకు మళ్ళీ నేనువ్రాస్తూ ఉన్నాను." అని చెప్తారా? అంతేకాక,

భూజన కల్పకం బగుచు భుక్తికి ముక్తికి మూలమైన
యూరాజును దైవమైన రఘు రాముని....

ఎన్నిమార్లు నుతిస్తేమాత్రం 'తప్పుకల్గునే'? అనికూడా ఎదురు ప్రశ్నించింది! ఆది రఘురాము చరితమింత పుణ్యస్థితి వేదమైనది కనుకనే "విబుధుల మదికిన్ వీనుల విందగునట్లు"గా, "తెలుగునకు పొందగు" నట్లుగా "సామెతలందముగా గూర్చి" కందువ మాటలతో హెచ్చుగా కందాలతో అందాలు చిందేటట్లు పండిత పామరుల డెందాలను ముదమొందింపజేస్తూ సర్వజనాకర్షకంగా రామకథాసంకీర్తనం చేసి తరించింది మొల్ల!

తాను

గురులింగజంగమార్చన
పరుడును, శివభక్తిరతుడు, బాంధవహితుడున్
గురుడాతుకూరి కేసయ
వరపుత్రి......................

నని మొల్ల చెప్పుకొన్న దాంట్లో ఏమీ అతిశయోక్తి లేదు. ఆమె ఆతుకూరి కేసయసెట్టికి వరపుత్రికయే. "రాముపదకంజ యుగమ్ము"ను మనంబున చిక్కబట్టి ఆజీవితమూ బ్రహ్మచారిణీ వ్రతదీక్షతో పవిత్రురాలైన వరపుత్రిక!

తండ్రి "గురులింగ జంగమార్చన పరుడూ, శివభక్తిరతుడూ. తాను కొలించింది "సల్లలితప్రతాప గుణసాగరుడైన శ్రీరామనరపాలకుని". ఈవిధంగా తండ్రీ కూతుల అంతరంగాల్లో శివకేశవాద్వైతభక్తి ఏచిపూచింది!

## మొల్ల కవితా ప్రతిజ్ఞ

తండ్రీకూతుళ్ళు అంత ప్రభావసంపన్నులు కాబట్టే ముందు ముందుగా:-

దేశీయపదములు, తెలుగులు సాంస్కృతుల్
సంధులు ప్రాజ్ఞుల శబ్దవితతి

Akella Raghavendra's Online-las.com

శయ్యలు, రీతులు, జాటు ప్రబంధము
లాయానసమాసంబు లర్థములును
భావార్థములు గాన్యపరి పాకములు, రస
భావ చమత్కృతుల్ పలుకుసరణి
బహువర్ణములును, విభక్తులు, ధాతుల
లంకృతి చ్ఛందో విలక్షణములు

గావ్యసంపద, క్రియలు, నిఘంటువులును
గ్రమము లేవియు నెఱుగ విఖ్యాత గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరముచేత
నెఱిఁ గవిత్వంబు జెప్పఁగా నేర్చికొంటి॥

నని సవినయంగా వినయాంజలి పచరిస్తూ కావ్యరచనా సాధన సామగ్రి సముల్లాస సంపదనంతా ఒకపెద్ద పట్టికగా ఏకరువుపెట్టి, నాకేమీతెలియదని నమస్కారంచేసినా, అదిఏదో మర్యాదకూ, వినయానికీ పల్కినదేకాని, ఆమె బాహ్యాంతరాల్లో గొప్ప స్థిత ప్రజ్ఞురాలు! అంతేకాదు. కావ్యరచనా విషయంలోకూడా ఎట్లావ్రాస్తే బాగుంటుందో ఎట్లావ్రాస్తే బాగుండదో నిక్కచ్చిగా తెగవేసి చెప్పగలంత ప్రాజ్ఞురాలు కూడా! ''వలిపపుసన్న పయ్యెద....'' అనే పద్యంలో కావ్యం ధ్వనిపూర్ణంగా ఉండాలని కావ్యలక్షణాన్ని నిర్వచనం చేసింది – అంతేకాదు. క్రొత్త రీతులతో వ్రాయాలనీ కేవలం పటహాది శబ్దాలతో వ్రాస్తే అందులో కావ్యలక్షణం పొందుపడదనికూడా ఆమె చెప్పింది.

దీన్నే ఇంకా వివరించి ధ్వని పూర్ణంగా వ్రాసినా "తేనెసోక వోరు తియ్యవయగు రీతిగా" ఉండాలికాని ధ్వని పూర్ణంగా ఉండాలన్నాంకదా! అని "అర్థమెల్ల దోపకుండ గూఢశబ్ద వితతి గూర్చి" వ్రాస్తే అది "మూగ చెవిటివారి ముచ్చ"టౌతుంది కాని కావ్యం కాదన్నది. ఇట్లా– ఎట్లాంటి కవిత్వం రాణిస్తుందో, కమ్మని కవిత్వపాకానికి ఏవి పానకంలో పుల్లలో తేటతెలుగు పదాల్లో నాకేమి తెలియదంటూనే మెల్లమెల్లగా చల్లచల్లగా చెప్పకల్గిన చదురాయి! మొల్ల! ఆమెను ఏమీ తెలియని సామాన్యురాలని ఎట్లా అనగలం!

Akella Raghavendra's Online-ias.com

ఇంకా లోతుగా ఆలోచిస్తే తాను చెప్పిన లక్షణానికి సరిగ్గా తనరచనను లక్ష్యంగా సరళ గంభీరంగా వ్రాసి చూపిందని కూడా మనకు విశదమౌతుంది.

అంతేకాకుండా ఇంకొకగొప్పవిషయం చెప్పింది. తెలుగుభాషఎంతసంస్కృత భాషామయమైనా, సంస్కృత కావ్యాలను తెలుగులో వ్రాసేటప్పుడు "తమవిద్య మెఱయ"– అంటే తమపాండిత్య ప్రజ్ఞలు కనబఱచు కోవడంకోసం – "క్రమ్మఱ ఘనమగు సంస్కృతము చెప్పగా రుచియగునే" అని సాకూతంగా కొందఱి కొందఱి కవిత్వాలపై దెబ్బ కొట్టింది. దీన్ని రెండు విధాల అర్థంచేసుకోవచ్చు– తనకంటే పూర్వం రచింపబడిన రామాయణ రచనలు సంస్కృతమయాలుగా ఉండి ప్రజా సామాన్యానికి అందుబాటులోలేవనీ, అందుకేమళ్ళీ తాను రామాయణరచనకు పూను కోవడానికి కారణం ఏర్పడిందనీ, అయఃపిండాలుగా, గమికర్మీకృతనైక నీవృతంగా తెలుగులో కావ్యాలువ్రాస్తే ఏమి ప్రయోజనమనీ సన్నసన్నగా చెప్పేసింది.

అన్నింటికీ మించిన చమత్కారం ఇంకొకటి ఉన్నది– స్త్రీ (అందులో శూద్ర) యైయుండి కావ్య రచనకు పూనుకోవడానికి రామచంద్రుడు తనలో ఉండి చెప్పించడమూ భక్తిశక్తి కారణంకాని చదువు కారణం కాదని చెప్పడం:

చూడండి ఈ క్రింది పద్యాలు:

చెప్పుమని రామచంద్రుఁడు
చెప్పించిన పల్కుమీద చెప్పెద నేనె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్య చరిత్ర తప్పు లెంచకుడు కవుల్!

నేరిచి పొగడిన వారిని
నేరక కొనియాడువారి నిజకృపమనుపం
గారణమగుటకు భక్తియె
కారణమగుగాని చదువు కారణమగునే!

రామచంద్రుడు చెప్పిస్తే భక్తితో నేనీకావ్యాన్ని చెప్తూ ఉన్నాను– మీరు ఎంచే, తప్పొప్పుల పరీక్షకుకాదు: అబద్దార్ అన్నది.

Akella Raghavendra's Online-ias.com

మఱి ఇట్లాంటి సందర్భంలోనే

చెల్లునటంచు నొక్కకవి చేసిన లక్షణ మొక్కరీవలం
జెల్లదటంచు తారొకటి చెప్పగ ఛాందస విస్తరంబు సం
ధిల్లుటఁ గావ్యశంక లవనిం దలుచయ్యొ, రసజ్ఞులార! నా
యుల్లపు సౌధవీథి గొలువున్న సరస్వతి సత్యవాణి నా
తల్లి యొసంగు పల్కులివి తప్పులుసేయక చిత్తగింపుడీ.

అని దీనపరిదేవనం చేశాడు అబ్బయామాత్యుడు! భక్తురాలైన మొల్ల పల్కులకు, సామాన్యుల పల్కులకూ తారతమ్యం గమనించండి- మొల్ల చేసిన ఈ సవాలులో ఇంకొక విషయంకూడా నాకు స్ఫురిస్తూంది। వెనుక జరిగిన వచన రామాయణ కావ్యాంకిత సందర్భాదులను మనసులో పెట్టుకొని ఈవిధంగా వ్రాసిం దేమోనని నాకనిపిస్తూంది. ఆమెచేత ఈవిధంగా అనిపించింది అంతరాత్మ ప్రేరణమైన ఒకానొక అవ్యక్త దివ్యశక్తియే. మొల్ల''దేశీయపదములు........'' అనే పద్యంలో పేర్కొన్న పట్టికఅంతా కావ్యోక్తి సంసార జంబాలానికి మాత్రమే కారణాంకాలు- కాని, నిజంగా శక్తి కలవారికి ఈ పట్టిక భట్టీపట్టడం వలన కలిగే ప్రయోజనమేమీ ఉండనిమాట అందఱెఱిగినదే కదా।

ఛందోలంకారాదుల
పొందెఱిగిన నెద్దిలేక పొసగదు కవితా
సుందరత! శక్తి! యదియా
కందువ తానెఱుగువాడె కవినరుడెందున్॥

శక్తి వెలియైనఁ గావ్యోక్తి సాధనంబు
లెల్లఁ జీకటియింటిలో నిడిన సరుకు
లెన్ని ఋతువులు గల్గిన నెట్లు పూచు
మహి వసంతాగమములేక మావి మోక॥

అనిపెద్దలు చెప్పినట్లు శక్తి అనేది లేకపోతే కళారాజమైన సాహిత్య కళాసరస్వతి చేసన్నమెలంగుట సమకూడని పనికదా। లక్షణ కర్తలైన

వారుకూడా "శక్తిస్తత్ర సుదుర్లభః" అన్నారు. మన భాగ్యం వలనమొల్లయందు భక్తిసిద్ధమైన ఈశక్తి మాత్రం అఖండంగా ఉండడంప్రశంసార్హం.

## మొల్ల రచనావైశిష్ట్యం

ఇక ఈరామాయణం మహిళా విరచితం కావడంవలన కృత్యాది యందలి త్రిమూర్తులదేవేరుల వర్ణనలో ఒకప్రత్యేకత భాసించినది. చూడండి:—

కరిముఖుడుంగుమారుడు వికారపు జేతుల ముద్దు సూపుచున్
గురువులువాఱుచున్సరిగ గుబ్బలుదాటుచు జన్నుదోయితో
శిరములు రాయుచుం, గబరిం జేర్చిన చంద్రునిబట్టి తీయగా
గరములు జాప నవ్వెడు జగమ్ముల తల్లి శుభంబు లీవుతన్॥

మహనీయమైన మాతృ సంభావనా మధులిప్సయందు, బాల కైశోర సుందరమూర్తులై పసిపిల్లల అల్లరి పనులయందుగల సౌందర్యాన్ని కళ్ళకుగట్టినట్లు చక్కగా వర్ణించింది; జగన్మాతృపరమైన ఈస్తుతి పద్యంలో

సామజయుగ్మ మింపలరం జల్లసినీరు పసిండికుండలన్
వేమఱు నంచినంచి కడువేడుకతో నభిషిక్తం జేయంగా
దామరపువ్వుగద్దియ ముదంబున నుండెడి లోకమాత మా
కామునితల్లి సంపద లఖండముగా నిడు మాకు నెప్పుడున్॥

లక్ష్మీదేవిని వర్ణించి "లక్ష్మీర్దివ్యైర్గజేంద్రైర్మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః" అనే శాస్త్రోక్త విధానంగానే వర్ణించినా "కామునితల్లి" అనేపదం వేస్తేనేగాని ఆ తల్లి భావన ఒనివి పడలేదు.

ఇక

మేలిమి మంచుకొండ నుపమింగజాలిన యంచనెక్కి వా
వ్యాళి నటించివచ్చు చతురాస్యు నెదుర్కొని నవ్వుదేరంగా
వాలిక సోగకన్నుల నివాళి యొనర్చి ముదంబుగూర్చు వి
ద్యాలయ, వాణి ... ... ... ...

Akella Raghavendra's Online-ias.com

రాయంచతేరి నెక్కి వాహ్యాళి వటించివచ్చిన చతురాస్యునకు వాలిక సోగ కన్నులతో నివాళి యొవర్చివదట; చదువులతల్లి! వినయశీలంతో కూడిన గృహిణీ విద్యా మర్యాదలే విజ్ఞానసంపదగా నభ్యసించిన భారతీయ గృహిణి, భారతీ రూపంలో సాక్షాత్కారమిస్తుంది; మనకీ పద్యంలో మొల్లనుగూర్చి ఆనోటా ఆనోటా నలిగి తెలుగునాట మెలగుతూఉన్న గాథలు గంపెడున్నవి. ఆగాథలలోని నిజపరిస్థితి మనకు సంపూర్ణంగా తెలియక పోవచ్చు. కానీ ఆగాథలవలన ఆమె వితంతువనే నమ్మకంకంటె, ఆమె బ్రహ్మచారిణి అనే నమ్మకమే నాకెక్కువ కల్గింది. ఏమైనా ఆమె మగనాలుకాదు గదా? మగనాలు కాకపోయినా ఈ కావ్యంలో, ఈ సందర్భంలో మహిళా స్వభావశీల గంభీరతను, చక్కగా పోషించింది. గృహిణి సౌభాగ్యగరిమలోని గరువతనాన్ని ముచ్చటగా చూపింది.

అసలు తనకావ్య పాఠకులైన ఆంధ్రమహాజనాన్ని పసిపిల్లలుగా ఉపలక్షించి శ్రీరామ చరితాన్ని కథచెప్పి నట్లుగా మహా వేగంతో చెప్పుకుపోవడంకూడా దీనికి నిదర్శనమే.

సుందరకాండ వఱకూ ఒకేబిగిని సాగిన కథా కథన వేగ సంరక్షణలో ఆమె విడిచివేసిన ఘట్టాలు చాలా ఉన్నవి. దశరథ పత్నులను గూర్చి మొదట్లో పేర్కొననేలేదు. అయితే రామాయణ మూలంలో వాల్మీకికూడా పుత్రకామేష్టి సందర్భంలో కౌసల్యపేరునూ, పాయస విభాగమప్పుడు తక్కిన రాణులనూ, పేర్కొన్నాడు; కాని ముందు చెప్పలేదు. శ్రావణకుమార చరిత్ర, మంథరా వృత్తాంతము, అహల్యాచరిత్ర (శాపవిమోచనం) చెప్పింది. కాని చరిత్రచెప్పలేదు. కబంధవధ, సుగ్రీవ రావణ ద్వంద్వయుద్ధం, ఆదిత్యహృదయం, త్రిజట సీతను తీసికొనివచ్చి రణభూమి చూపుట మొదలైన అనేకఘట్టాలు ఘట్టాలే విడువబడినవి. విశ్వామిత్రయాగ సంరక్షణ సందర్భంలో మారీచ సుబాహుల వధ సందర్భంకూడా చాలా మార్పుతో చెప్పింది. లంకలో హనుమదన్వేషణం చాల తగ్గించింది. అరణ్యానికి వెళ్ళేటప్పుడు శ్రీరామచంద్రుడు దశరథుని దగ్గఱకే వెళ్ళలేదు. సంగ్రహరామాయణ కర్తలు తక్కినవారుకూడా ఇట్లా కొన్ని ఘట్టాలు విడువక తప్పలేదు.

ఈ విధంగా ఆయా ఘట్టాలువిడువడంలోకూడా ఆయా కవుల చైతన్య సంస్కారాలు ద్యోతకం అవుతాయి.

Akella Raghavendra's Online-ias.com

రామాయణం పరమేశ్వరుని శ్రీరామచంద్రావతార గాథ. దుష్టశిక్షణ, శిష్టరక్షణలే ముఖ్య ప్రయోజనంగాగల, అవతార రహస్యంలో, శ్రీరామావతార ప్రయోజనం ప్రధానంగా దుష్టశిక్షణకే ఉద్దేశింపబడినదగుట చేతను, రామాయణం, లోక కంటక "పౌలస్త్యవధ కథనాన్ని, తత్ప్రేరకమైన" జానకీ మహాచరితాన్ని ఉపలక్షించేది కావడంవలననూ, ప్రధానకథకు భంగం రాకుండా కొన్నికొన్ని ఘట్టాలను విడిచి వేయడం ఎవరికైనా అవసరమే. అట్లా విడువకపోతే మళ్ళీ యీ కావ్యాలన్నీ పురాణాలే అవుతాయి. సంగ్రహకావ్యాలు కానేకావు. ఈ సందర్భంలో దుష్టశిక్షణకు ఆలంబమైనా కబంధవధను ఉజ్జగించి, శబరీ సంరక్షణాన్ని చేపట్టడంలో మొల్లహృదయ సౌమనస్యం మనకు తెల్లమౌతుంది.

## సంభాషణ చాతుర్యం

సంభాషణలను చాలా సమయోచితంగానూ, యుక్తిసహంగానూ, దొంకతిరుగుళ్ళు లేకుండానూ నడిపి "స్త్రీకర్తృకం కాబట్టే యీ సంభాషణ చాతుర్య విశిష్టత ఈ కావ్యానికబ్బిందా?" అనుకొనేటట్లు నిర్వహించింది.

"సుందరకాండలో సుమారు ఇరువై పద్యాలతో నడచిన సీతారావణ సంవాదాన్ని కొంచెం మచ్చు చూడండి.

అలకేశ్వరుండు పాయసనము గానిచ్చిన
అంచితచీని చీనాంబరములు
దివిజాధినాథుండు దినదినంబును నిచ్చు
పారిజాతోల్లసత్ప్రసవములును
... ... ... ...
గలవు నాయింట నేప్రొద్దు గడమలేక
... ... ... ...
విడువుమడియాస రామభూవిభునిమీద
ఎవ్వాని వీటికి నేడు వారాసులు
పెట్టని కోటలై పెచ్చుపెరుగు
... ... ... ...
నాకెరక్కంగ గలదె యెనాటనైనకే

Akella Raghavendra Online-ias.com

"జగదీశుడు మానవుడట – నగరే! భుజశక్తి చేత నాకెదురన్నన్
నగధరుడో, నగధన్వుడో
నగభేదియొ కొంత కొంత నాతో బోరన్॥

అని తనపై భవాన్ని, శ్రీరాముని అల్పత్వాన్ని, మాటమాటికీ రెట్టించి చూపుతూ

నీకన్నుల సౌభాగ్యము
నీకుచముల గలుగునేలు నీముఖకాంతుల్
నీకరముల లావణ్యము
నాకస్త్రీలందులేవు నాకుంజూడన్॥

అని మెల్లగా సీతమ్మ సౌందర్య వర్ణన చేస్తూనే అందులోనూ తన త్రైలోక్య విజయ పరిచయాలను చెప్పకుండా చొప్పించి ఆఖరకు

వ్రీడ యలంకారముగా
నాడుము, భయముడిగి మధురమైనమృదూక్తుల్
వేడిసలనేలు కన్నుల
జూడుము కనుఱెప్పలెత్తి సుదతీ! నన్నున్॥

తన నీచాభిలాషాన్ని తుక్కుగోడుగులా బైటపెట్టాడు.

"అని యిట్లు నోరికి వచ్చిన మచ్చునం బ్రేలుచున్న యానీచుని దుష్ట భాషణంబులకురోసి తృణంబు చేపట్టి జనక భూపాలనందన...." ఏవిధంగా జవాబి స్తుందో చూడండి:–

"పతిదైవముగా నెన్నుదు
మతిదలచుచు నుండునట్టి మగువల జెఱుపన్
బ్రతినగలయట్టి నీతో
బ్రతివచనము లాడుకంటె బాపముగలదే॥

Akella Raghavendra's Online ias.com

"పరదారాపేక్షకులగు
పురుషుల కాయువు నశించు...

అని పరదారాదుర్వ్యసనాన్ని ముందు పరాస్తంచేసింది. తరువాత త్రిలోక విజయగర్వంతో తన్నుతాను పొగడుకొన్న ఘట్టాన్ని సబబైన సూక్తితో దూదిపింజలా ఎగురగొట్టి పారేసింది.

"తన సాహసంబుతానే
కొనియాడు సతండు హీనగుణుడని వినుచున్
నిను నీవ పొగడు కొంటివి
వినగూడదు నీదు నీతి విరహిత భాషల్॥

ఇంక ముఖ్యమైనది శ్రీరామ శౌర్య ప్రతాప కథనం! ఆఘట్టాన్ని ఇంత గొప్పవాడనని బొమ్మలు విరుచుకొనే రావణుడు చేసిన మోసకారితనంతో ప్రారంభిస్తుంది.

"సంగర రంగమందు నతిశౌర్యమునన్ రఘురాముతోడనీ
– – – – – – నీవుపో
రంగను నోపకిప్పుడు – – – –
దొంగిలి నన్ను దెచ్చితివి తుచ్ఛపు పల్కులు పల్క బాడియే॥
"పాదరజమున నొకఱాయి బడతిజేసె
రాజమాత్రుండె మేదినీ రక్షకుండు
రామభూపాలు డాదినారాయణుండు॥

నీపరాక్రమం కేవలం భౌతికమూ, పాశవికమూ మాత్రమే. అందులోనూ నీవు నీచగుణరతుడవై పగము హీనసత్త్వుడవైనావు. నావిభుడైన శ్రీరాముడు పావనత్వంచేత రాతిని నాతిని జేసినవాడూ, శౌర్యంచేత మేదినిని రక్షించువాడూ సుమా! అట్టి మహామహుడు నరరూపియైన కేవల రాజమాత్రు డనుకొంటున్నావేమో. ఆదినారాయణుడు అని యథార్థంచెప్పి యింకా ఈ క్రింది విధంగా హెచ్చరిక చేస్తుంది:–

"అట్టిరాముని కీయబ్ధి యనగనెంత
లంకయన నెంత, దనుజుల పొంక మెంత
నీవనగనెంత, నీలావు చేవయెంత,
చెప్పనేటికి నీవెచూచెదవుగాక.

"వీరాలాపము లాడనేల ... ... ... ...
క్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్ పెట్టు భూతాళికిన్॥

"నేవెళ్లి శాంతింపుమా" అని ముక్కకు ముక్క ప్రతివచనం ఇచ్చి అధిక ప్రసంగంలేకుండా నీచునితో ఎంతవరకూ మాట్లాడాలో అంతవరకూ మాట్లాడి రావణుని, రావణుని అఖండ దోర్గర్వాన్ని తోటకూరకాడలో పురుగులా తీసి అవతల పారేసింది.

ఇంత ఒప్పిదంగా మాట్లాడింది కాబట్టే రావణుడు "తన్ను జీరికిం గొనక వీరాలాపంబులాడ, ఒడుపుదప్పిన కాలాహిచందంబునమండి" పడ్డాడు.

ఈ సంభాషణలోని సీతా ప్రతివచనాల్లో స్త్రీ సహజమైన పొదుపూ, తూచినట్లు సమయోచితంగా మాట్లాడి కార్యసాధన చేసుకొనే నేర్పూ ప్రతి మాట లోనూ కనబడుతుంది.

## ఔచిత్యపోషణం

ఇట్లాగే ఔచిత్యాన్ని ఇంకా అనేక ఘట్టాలలో ఆమె పోషించింది.

శూర్పణఖకు ముక్కు చెవులు కోసిన ఘట్టంలో శూర్పణఖ మీద ముందు తప్పుచూపించి "అంతేలే ఆరాక్షసి తులువతనానికి అటువంటి శాస్తే జరగాలిలే" అని మనం మనసారా సంతృప్తిగా సంతోషపడేలాగా శిక్ష విధింప జేస్తుంది: శూర్పణఖయే "ఆమనుజేంద్రసూనుల, ముందుదండింప దలంచిన, నదియెఱింగి భరతానుజుండు దాని నాసికా కర్ణంబుల గోసివై చె"నట.

హనుమ సీతమ్మ కొఱకు లంక అంతా గాలించి, గాలించి ఆమె వెక్కడా పొడగానక జానకి కనబడకపోతే అంతపనిచేస్తా, ఇంతపనిచేస్తా అని హంగామాచేసే సందర్భములో "త్రుంతు విధాత జందెములు" అంటాడు. బ్రహ్మ

గారి జందెములు త్రుంచితే ఒరిగిపడే దేముంది? ఇది చదువగానే బ్రహ్మాండమంత నవ్వువస్తుంది. ఎంతపండితుడైనా ఎంతసమర్థుడైనా కోతి చేష్టలు పోలేదు – అని అనుకొని ఒకమాఱు మొల్ల స్వభావ పరిశీలనా వైదగ్ధ్యాన్ని మెచ్చుకొంటాం మనము.

రావణుడంతవాడు సీత తనమాటవినలేదనిదయ్యాలకుబలిపెట్టానంటాడు. "గడికండలుగా గోసుక పడతులు భక్షింపు డింతి పలలంబంతన్...." దర్పోద్ధతుడైన రావణుని మాటలేనా ఇవి? లేక స్త్రీలమధ్య స్త్రీలో సంబంధించిన పాపచింతనకల సమయం కనుక మొల్ల ఆ నృశంసునిచే అట్లా అనిపించిందా? చదువరులే ఊహించండి.

అశోక వనంలో జానకిని బెదిరించి రావణుడు వెళ్ళిపోయినతరువాత, దనుజ కాంతల పల్కులకు "నదరి సీత తనకు దిక్కులేమిఁ దలపోసి దుఃఖింపు" చుండగా పవన సుతుడు వెంటనే సందర్భానికి అతికినట్లుగా–

"ఉన్నాడు లెస్సరాఘవు
డున్నాడిదె, కపులగూడి యురుగతి రానై
యున్నాడు నిన్ను గొని పో
నున్నాడిది నిజము నమ్ము మురర్వీతనయా."

"ఉన్నాడు శ్రీరామచంద్రుడు. నీకుదిక్కుగాఉన్నా"డని హనుమ ఎంతో సమయోచితంగా పల్కుతాడు. నడిసముద్రంలో మునిగిపోయే నావను చేతితో పైకెత్తి ఉద్ధరించినంత ఉపకారం జరుగుతుంది ఈ మాటలవలన.

హనుమ మళ్ళీ రామునియొద్దకు తిరిగివచ్చి జానకీ వియోగదందహ్యమానుడై క్షణమొక యుగముగా వేస్తూఉన్న రాముని హృదయం చల్లబడేటట్లు "కంటిన్ జానకిఁ బూర్ణచంద్రవదనన్" చూచాను నేను సీతమ్మను–అని తన కథ నాన్ని ప్రారంభించడంలోనూ–

రావణుని పాతాళహోమం చెడగొట్టాలని అంగదుడు మందోదరిని లాక్కొనివచ్చి రావణుని కన్నెదుట నిలిపినప్పుడు మందోదరి, భర్తయైన రావణునితో

"రాముని దూతలు నన్నును
బాములు వెట్టంగజూడ బందువె నీకున్
నామానము గాపాడని
నీమానుష మేటికిపుడు నిర్జరవైరీ.

రావణునికి పౌరుషం వచ్చేటట్లు ఎట్లా తెచ్చగొట్టాలో అట్లా ఎత్తిపొడవడంలోనూ-

రామునంతటి మహానుభావునకు, ధీరోదాత్తునకు సీతా విరహవ్యథలో "కూరలు నోటికిన్ రుచులు గూడుటదప్పె" నట. పత్నీ విరహం పరమ ధీర స్వాంతులకుగూడానూ అస్వాధీనతనూ, అతిదీనతనూ కల్పిస్తుందని రూపించడంలోనూ-

రావణ వధానంతరము "గుహ్య కాళికి కూడు నోటికిఁబోయె, సురల కంటికి నిద్రపోకెనంత" అని సహజరీతిగా చెప్పడంలోనూ- స్త్రీ సహజమైన ప్రతి పద జాగరూకతా, చిక్కని మాటపొదుపూ, దుబారా ఇష్టపడని సార్థకపదప్రయోగ విజ్ఞతా, కావ్యం అంతటా తూచి తూచి వాడే పదాల హృదయంలోనుండి తొంగి చూచే ఆయాపాత్రల సజీవమూర్తులూ ఈ కావ్యం అంతటా చెంగలించి పఠితల హృదయాలను దొంగలిస్తాయి. "కంటిన్ జానకిఁ బూర్ణచంద్రవదనన్" అనే ఘట్టంలో మూలంలోకూడా "దృష్టామయాసీతా" అనే ఉన్నది. దానికి యథాతథాను వాదమేకదా ఇది! ఇందులో ఈమె ప్రత్యేకత ఏమున్నది? అని కొంచెం సేపు మనం అనుకొన్నా, "కంటిన్ జానకిఁ బూర్ణచంద్ర వదనన్" అనే ఎత్తుగడలోని సొగసూ, పలుకుబడిలోని కలికితనమూ మూలంలో కనబడ్డంలేదని విజ్ఞులైనవారు నాలాగే భావించకతప్పదు.

## వర్ణనలలోని వైయక్తికత

వర్ణనలలోకూడా మణులతో, మాణిక్యాలతో ఉపమించి స్త్రీలకు రంగులపై, మణి, మాణిక్యాలపై కల మక్కువతో ప్రకృతి చిత్రాలు రూపొందిస్తుంది.

అయోధ్యాకాండలోని అంధకార, నిశావర్ణనలు చాలా హృదయం గమంగా ఉండడమే కాకుండా లౌకికానుభవాన్నీ, ప్రకృతి శోభను ఆకళింపు చేసు [illegible]

చీకటిని "కారుమొగులు రీతి కాటుక చందాన" అని అందంగా వర్ణించ గలదు. "నీటిచందాన నింద్ర నీలమహిమ" అంటుంది. చీకటిని నీటితో పోల్చడంలో ఆమె నవ్య భావుకత మనకు స్పష్టంగా కనబడ్తుంది. కటిక చీకటి గ్రమ్మిన ఒకరేయి ఏ యేటి ఒడ్డునకైనా — ఏయేటి ఒడ్డునకో ఎందుకు? పినాకినీ తీరానికే వెళ్ళిఉండవచ్చు -- వెళ్ళి ఆ చీకటిని పరిశీలిస్తే ప్రశాంత గంభీరమైన ఆవాతావరణంలో ఇదినీరూ, ఇదిచీకటీ అని గుర్తింప నలవికాని దృశ్యం ఆమె మనస్సున కనుభవమై ఉండవచ్చు. 'ప్రకృతికిన్ బాష్యప్రణేతల్ కవుల్' కాబట్టి ఆమె తన అంతరంగాన్ని ఈ శబ్దార్థాల్లో వికసింపజేసింది. దానికితోడు "ఇంద్ర నీలమహిమ"-దీన్నిగురించి ఇందాకే అనుకొన్నాము. ఇది స్త్రీలకుండే ఆభరణాల మోజు అని- ఇంకా క్రింద పరిశీలించండి. "మాషరాశి పోల్కి"- మినుములు కోసి రాసిపోసినపుడు నల్లడల క్రమ్ముకొనే నల్లటి కాంతియొక్క క్రీనీడ తెరలు ఆమె నేత్రాంచలాల్లో తారాడి ఉంటాయి.

కుంభకారవనిత కావడమూ, ఊరిమధ్యనఉండే సంకుల వాతావరణంలో కాకుండా, ఊరిచివర భాగాల్లోఉండే సహజ ప్రశాంత ప్రకృతి కళ్ళముందు నిత్యమూ తాండవించే అవకాశం ఎప్పుడూ లభ్యమయ్యే స్వేచ్ఛా వాతావరణంలో పెరగడమూ, సుందర సుస్నిగ్ధ ప్రకృతి రామణీయకంలోని అణువణువునూ ఆస్వాదించి అమృతమయంగా జీర్ణంచేసుకోగల పేశల కవయిత్రీ హృదయం కావడమూ, ఆమె అంతచక్కగా తనభావనాపథంలో మూగగా నిదురించే ప్రకృతి సౌందర్యానికి మాటలు తొడిగి మనముందు గజ్జకట్టించింది.

ఇప్పుడొక్కసారి పద్యమంతా హృద్గతంచెయ్యండి:-

కారుమొగులురీతి కాటుక చందాన
నీటిభాతి, నింద్రనీలమహిమ
మాషరాశిపోల్కి, మఱి మఱి యపుడంధ
కారమవనియెల్ల గలయబర్వె॥

మధురావిజయంలో గంగాదేవి చంద్రుణ్ణి వర్ణిస్తూ 'అమృతాంధసులు తమతమ భాగాలు సరిగా తీసుకోవడం కోసం చంద్రుడనే అమృత కలశంలో

Akella Raghavendra's Online-ias.com

విశాదేవి ఉంచిన మిణ్ణగరిబెలా ఉన్నది చంద్రునిలోని కళంకం- అంటుంది. ఈ వర్ణనలోని సొబగుకంటె తల్లిహృదయానికి ఇంత సహజంగా, ముచ్చటగా తెక్కలు దొడిగి చంద్రుని వఱకూ ఎసురవేసిన గంగాదేవి శ్రీమూర్తి మన మనః ఫలకంమీద ముందు సింహాసనం వేసుకొంటుంది.

మఱియిక్కడ మొల్లకూడ ఇంత అలతి అలతి తెలుగు పదాలతో పాదానికి రెండుగా విరిగే చిన్న వాక్యాలతో. ఆ వాక్యాలతోబాటు రెండు రెండుప మానాలతో చిక్కనిచిమ్మ చీకటిని కళ్ళఎదుట రూపు కట్టించింది.

ఇట్లాగే

మేలిమి సంధ్యారాగము
వ్రాలిన చీకటియుఁగలిసి వరుణుని వంకన్
నీలము గెంపును నతికిన
పోలిక జూపట్టె నట నభోమణి తలగన్॥

ఇక్కడకూడా సందుచూచుకొని గగనరంగంలో అతికిపోయిన నీలాల, కెంపుల బిగువు కాంతి నుండి చదువరుల చూపులు తప్పించుకు పోలేవు. నన్నె చోడ మహాకవి ఒకచోట వెన్నెలను వర్ణిస్తూ

తనసుతుడగు శశిమెయిఁ గఱఁ
గని, చెచ్చెరఁ గడిగిపుచ్చగానని, దుగ్ధాం
బునిధి, నభంబున కెగసెనో
యనఁ జంద్రిక పర్వె, సాంద్రమై, విమలంబై॥

అన్నారు.

ఈ భావాన్నే మొల్ల,

కొడుకుదయించె నంచలరి కోరి సుధాంబుధి మిన్నుముట్టె, య
వ్వడు జగమెల్లగప్పెననఁ బూర్ణత నొందెను సాంద్ర చంద్రికల్

ఇట్లా మలుపుత్రిప్పింది. నన్నెచోడమహాకవి యిచ్చినఅనుభవం మొల్ల అంతరంగంలో బాగా మధితం అయి ఇట్లా క్రొంగ్రొత్త రూపం ధరించింది. కొడుకు వచ్చాడన్న సంతోషంతో పాల్కడలి పొంగడంలో ఉండే ఔచిత్యం, ఔన్నత్యం నన్నెచోడకవి వర్ణనలో పొడగానరాదుకదా! నిజంచెప్పాలంటే చంద్రుణ్ణిచూచి ఆనందంలో పరవశించిన కవయిత్రి హృదయ భావౌన్నత్యమే క్షీర సాగరమై పొంగులువారి తెలుగు సాహిత్య జగతిమీద పరవళ్ళు త్రొక్కింది.

నారదులైరి సన్మునులు, నాకమహీజములయ్యె భూజముల్
శారదలైరి భామినులు, శంకరశైలములయ్యె గోత్రముల్
పారదమయ్యె నీరధులు, పన్నగ నాయకులయ్యె నాగముల్
వారిదవర్గమెల్ల సితవర్ణములయ్యెను బండువెన్నెలన్॥

సృష్టిలోని ఏ పదార్థాన్నైనా తన ధావళ్యంతో నింపివేసే స్వభావంకల వెన్నెలయొక్క పరమోదార భావాన్ని కవయిత్రి ఈ పద్యంలో ఉదారకల్పనా రమణీయంగా పర్యవసింపజేసింది. ఇందులోకూడా సిత 'వర్ణ' ప్రసక్తి రాకమాన లేదు. వర్ణనలలో ఈ వర్ణ ప్రసక్తి కవయిత్రి భావపైయక్తికతా ముద్రకు చెఱగని చిహ్నం!

పరమేశ్వరుడిచ్చిన హక్కుతో వెన్నెలలో స్వేచ్ఛగా విహరిస్తూ వెన్నెల తీగలను ముక్కున గఱచుకొని ప్రియుల నోళ్ళకు అందించి ఆనందించాలనే తహ తహతో మెఱుపు తీగల పంచకళ్యాణులవలె దౌడుతీసే జక్కవకవలూ,

"పాకశాసని దివికి నెగురవైచిన సేనంతిబంతివలె"

పూర్వభాగంలో పొడిచిన వేగురుజుక్కా, మొదలైన వివిధ ప్రకృతి చిత్రాలు విశిష్టభావవ్యక్తిత్వంకల మొల్ల విదలించిన కుంచెలరంగుల్లో వింతవేషాల ముస్తాబు సవరించుకొని ఆకాశరంగంలో మనకు దర్శనం ఇస్తాయి. ఈమెయొక్క ఈ వింతదృష్టి, ప్రకృతి వర్ణనలలోనేకాదు ఇంకా ఇతరసందర్భాలలోకూడా మనకు కనబడుతుంది.

"వడిగా ధరశృంగంబున
నడుగులువడినూది త్రొక్కి యద్భుతశక్తిన్
... ... ... ... ...
మిడివింటన్ బసిడియుండ మీటెనరీతి." గా

పావని జలరాశిదాటడానికి పైకెగిరాడట. ప్రకృతి పరిశీలనలోనూ, ప్రతి సంఘటనను రసోదంచితంగా వర్ణించడంలోనూ కవయిత్రికిగల అసామాన్య వ్యక్తిత్వాన్ని ఎత్తిచూపగల ఈ ఉపమలు; చదువగానే మనకు ప్రతిపదరసావేశ నిర్భరమైన అవ్యక్తానందాన్ని కల్గించడానికి తోడ్పడతాయి.

అలంకారాలు కావ్యేందిరకు నిజంగా అలంకారాలేఅన్నారు లాక్షణికులు. ఎవరికైనా సొమ్ములు తగు మాత్రంగా ఉంటేనే అందం: అవి అధికమైతే సుర సుందరియైనా కన్నులకు "భారమాత్ర గోచరాయతే". మొల్ల తన కావ్యేందిరను అలంకరించడంలో సముచిత జాగ్రత్తనే అనుసరించింది. పైన పేర్కొన్న ఉపమాదులను పరిశీలించియే ఉన్నాముకదా: ఇంక అయోధ్యావర్ణన సందర్భంలోని

"కవిగురు బుధమిత్రాదులు
వివిధార్చనలనమరపురి వెలయుదురెలమిన్
కవిగురు బుధ మిత్రాదులు
వివిధార్చనల నమరఁబురి వెలయుదురెలమిన్.

"ప్రకటానురాగ సంపన్న తౌదురుకాని
రమణీయరుక్మ కార్ముకులుగారు."

రాజులు కాంతియందు, రతిరాజులు–రూపమునందు, వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు–విక్రమ కేళియందు, గో
రాజులు భోగమందు, దినరాజులు–సంతత తేజమందు, రా
రాజులు మానమందు, నగరమ్మున రాజకుమారు లందఱున్."

ఈ యీ పద్యాలలోని శ్లేష, విరోధాభాస, యమకాది వివిధ శబ్దార్థా లంకారాలను పరిశీలిస్తే సముచితాలంకారాలతో తన కావ్యేందిరకు శోభలు దిద్దడంలో మొల్ల పనితనం మనకు బాగా తెలిసిరాగలదు.

# స్వభావోక్తి చాతుర్యం

అన్నింటికంటె స్వభావోక్తిలో మొల్ల చూపిన నైపుణ్యం, అనితరమైన చూపు పదనూ మనం మెచ్చుకోదగినవిగా ఉంటాయి. సామాన్యంగా రాత్రులందు జరిగే వివిధ కార్యకలాపాలలో శ్రద్ధా, దీక్షా, లౌకికదక్షతా గల కవయిత్రియైన మొల్ల చూపు వాడినుండి—

సుస్థితములేకయుస్సురను బోటీ, మగడుడికించుకాంతా, సరసమైఱుంగు చంద్రముఖీ, సావడిదంటా, బేరకత్తే, పరపురుషాభిలాషము బాయని భామినీ, పోరు కట్టునెన్ బరగిన భామినులూ, తప్పించుకోలేక తమతమ నిసర్గస్వరూపాలతో కవయిత్రి తీసిన రాత్రి సినిమాలోకి ఎక్కకుండా తప్పించుకోలేక పోయాయి.

అసూర్యంపశ్యయై, రాజాంతఃపురాలలో మెత్తని పూలరాశిలో అడుగు లిడడమే భారంగా బాధపడే సుకుమారీ, నవశిరీష కుసుమకోమలాంగి అయిన సీతమ్మ కఠినకంటకశిలాపరివృతమైన అడవులలో నడవనేరనికొమ్మ అడుగులు బొక్కలై శర్కర నలములశ్రమము జెందినవట— ఈభావం సామాన్యంగానే ఉన్నది. కాని "వీచిన చేతులవ్రేళ్ళు నెత్తురుగ్రమ్మి బొటమర్లు కెంపులపోల్కి నమరె"నట. ఇది మఱీ దయనీయమైన ఉదాత్త కల్పన! సీతమ్మ! పాపం! అదే పనిగా నడుస్తూఉండేటప్పుడు నడక ఊతానికి ఊగేచేతుల వ్రేళ్ళలోనుండి నెత్తురు బైటకు చిమ్మి బొటమరించి కెంపులవలె ఆమె శరీరానికి అందమిచ్చినదట. ఇందులో రెండు విశేషాలు మొల్ల సూచించింది— మొదటిది రాజకుమార్తె అయిన సీతమ్మయొక్క అత్యంత సౌకుమార్య సంపదా, రెండవది అట్లా పైకిచిమ్మిన నెత్తురు బొటమర్లుకూడా ఆమెకు చక్కనమ్మ చిక్కినా బాగుంటుందన్నట్లు సొగసునే చేకూర్చాయనడం. ఉత్తరోత్తర రమణీయంగాఉన్న ఈపద్యంలో ఇంకా పైచరణాల్ని పరికించండి—

ధవుని నడుగడుగునకు కైదండగొనుచు
నెగడు దప్పని నిట్టూర్పు లెగసి చిగురు
బెదవు లెండంగ నీడకు నుదిల గొనుచు
మనసులో జేవయూతగా...

దూరాన్ని త్వరలో గమించడానికి యత్నం చేసిందట సీతమ్మ!

పాపం! తనంతతాను తనబలంపై నడిచేస్థితికూడా సన్నగిలి భర్తయైన రామచంద్రునికై దండ ఆసరా చేసుకొని మనస్సులో ఏచేవ— బహుశః ధర్మదీక్ష బలమేమో— ఊతయై తనను అప్రయత్నంగా ముందుకు నెట్టేస్తూ ఉంటే వేసే ప్రతి అడుగునకూ దప్పికతో ఎండిన పెదవులను నాలుకతో తడుపుకుంటూ నీడఎక్కడ దొఱకుతుందా అని పరిసరాలు పరికిస్తూ, నడవలేక నడవలేక ఊడిగిలబడే పిచ్చి జానకమ్మపాట్లు కరుణావిలంగా మన మనస్సును, తలంపులను చుట్టేసి ఎంతవారికి ఎంతచుమ్మర్లు వచ్చాయి! అనే భావానికి ప్రతిఫలంగా కళ్ళనీళ్ళు రప్పిస్తాయి!

వాలివధను, హనుమంతుని సాగరలంఘనోద్యతత్వమునూ వర్ణించిన

సాలము పొంతనిల్చి రఘుసత్తము డమ్మరివోసి శబ్దవి
న్మూలము గాగవిల్ దివిచి, ముష్టియు, దృష్టియుగూర్చి గోత్రభృ
త్కూలము వజ్రపాతహతి గూలువిధంబునఁ గూల నేసె న
వ్వాలి, ప్రతాపశాలి, మృడవందనశీలి సురాళి మెచ్చగన్॥

మొగము బిగించి పాదములు మొత్తముగాపట నూదిత్రొక్కి, నీ
టుగ మొగమెత్తి భీకర ఘోరరవంబుననార్చి బాహుల
త్యగణితలీల సాచి వలయంబుగ వాలముద్రిప్పి వ్రేగునన్
నగము సగమ్ముగ్రుంగ, గపినాథుడు నింగికిదాటె జివ్వునన్॥

ఎంత చిత్ర విచిత్ర భంగిమములనైనను ఉన్నది ఉన్నట్లు చిత్రించు నేర్పు ఈమెకు అభ్యస్తశిక్ష.

పదములూనఁ ద్రొక్కి వదనంబు దిగజూచి
చేతులూని నడుము చిక్కబట్టి
క్రుంగి, నిక్కి ఎగసి, కుప్పించి, వడిదాటి ... ...

అనిల సుతుడు గగనవీధి కేఁరెనట. ఛందము చిన్నదైనను పెద్దదైనను వర్ణ్యవస్తువును విశదంగా చూపించగలదు. జలనిధి మధ్యంలో, లంకలో, రాక్షసరాజైన రావణుని అశోకవనంలో, శింశుపాతరువునీడలో, పతివియోగశతదుఃఖ దుఃఖితయైన సీతమ్మను హనుమంతుని వ్యాజమున మనకు చూపించిన తెలుగు అద్వితీయము:—

Akella Raghavendra
Online-ias.com

పతిబాసినట్టి యాపదకంటె బలుమారు
　　　　వివిధ మాయలచేత వేఁగి వేఁగి
వీరదానవకోటి వికృత వేషంబులు
　　　　గనుగొని చిత్తంబు గ్రాఁగి గ్రాఁగి
కర్ణకఠోరంబుగా నాడుమాటల
　　　　దొరఁగెడి కన్నీట దోఁగి దోఁగి
తనదిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ
　　　　లోపల మిక్కిలి లోఁగి లోఁగి
రాము దలఁచు కొంచు, రామునిఁ జేర్కొంచు
　　　　రామరామ యనుచు ... ... ...

విధిలేక శోకమూర్తిగా జీవించియున్న మైథిలిని హనుమతోపాటు కరుణావిలంగా మనమూ చూస్తాము. అల్పాక్షరాలలో అనల్పార్థ భావసంపదలను, స్వభావౌచిత్యాన్నీ ధారగా కురిపించడంలో ఈమె ప్రసిద్ధహస్త.

ఇట్లాగే

నిడుద పెన్నెఱివేణి జడలుగా నవరించి
... ... ... ...
అహితలంకా మహాద్వీప గహనసీమ
దపము సేయుచునున్నాను ... ప్రత్యక్షమగునాకు ...

మని నాథునకు విన్నవింపుమని మారుతిచే రామునకు ప్రతిసందేశమంపిన సీతా ప్రతివచనంలోనూ కంటికికడివెడునీళ్ళతో గానవచ్చే సీతమ్మను మనకుగోచరం చేసిన భావానుభావసంపద అద్వితీయమైనది. మనసు మెత్తన. తలపు అంతకంటె మెత్తనా అయిన మొల్ల హృదయ మొల్లము నందుండి సుదిమెత్తనైన పలుకురాక వేరొకటి ఎట్లావస్తుంది?

మెత్తని ఈ పలుకుల మొత్తంలోనుండి కొట్టవచ్చినట్లు కనబడే సీతాసాధ్వి ఉత్తమశీలసంపద ఎంతబరువుగా ఎంతపరువంగా ఆకృతిని మలచుకొన్నదో ఆలోచించ గల్గితే ఈమహాకవయిత్రియొక్క మహనీయ కవితా శిల్పం మనకు దృగ్గోచర మౌతుంది.

Akella Raghavendra's Online-ias.com

# సీతమ్మ శీలసంపద

ఇవన్నీ ఒకయెత్తు.

మొల్ల హృదయంలో మూసకట్టుకొని పలుకులలో రూపు దిద్దుకొన్న సీతమ్మ పాత్ర మొకయెత్తు.

ఇనవంశోత్తముడైన రాఘవుడు......

ధనువు దునిమిన సమయంలో ధరణీశ సూనులు శిరమువంచి సిగ్గుపడుచుండగా ''మేనువెంచి''న సీత ప్రప్రథమంగా మనకు దర్శనమిస్తుంది.

తరువాత చెప్పుకోదగిన ఘట్టం: రావణునికి ప్రతివచన మిచ్చినపుడు ఆమె సహజంగా లజ్జాశీల కాబట్టే కామియైన ధూర్త రావణుడుకూడా "వ్రీడయలంకారముగా నాడుము" అంటాడు. కాని రావణునితో ఆమె మూడోకన్ను తెఱచి మఱీ మాట్లాడుతుంది. హనుమతో మాట్లాడే సపుడామె అప్పటి దయనీయ పరిస్థితికి మఱింత మెఱుగు పెట్టుంది మొల్ల! పాపం బంగారు లేడి గొడవలో లక్ష్మణుని తొందరపడి తూలనాడానే దానిఫలితమేనేమో ఈ చెఱలనుకొన్నదేమో అప్పటినుండీ ఆగాయం మానకుండా రేగుతూనే ఉన్నది. క్షమాపణ చెప్పడానికి కూడా సమయం సంప్రాప్తం కాలేదు. ఎప్పుడు సమయం వస్తుందా అని ఎదురు చూస్తూ ఉన్న సీతమ్మకు హనుమ కనబడడం ప్రాణం లేచివచ్చినట్లయి

ఆమాటలు మదినుంచక
నామానసముగావు మనుచు ... ...
... ... ... ...
సౌమిత్రికి జెప్పవయ్యా సాహసికర్యా॥

అని పశ్చాత్తాప పడ్తుంది.

హనుమంతుడు ఇపుడే నిన్ను తీసికొని వెళ్తాను. రావమ్మా అంటే అది తగదని హితవు పల్కుతుంది. హనుమంతుని శోకకు నిప్పంటించినట్లు విని "అగ్నిమంత్రము. బ్రహ్మమంత్రమును ఉచ్చరించి" హనుమకు చల్లదనము కల్గిస్తుంది.

Akella Raghavendra's Online-ias.com

రావణవధానంతరం శ్రీరాముడు " కులసతిని జెలగొని పోయిన........ శాత్రవు........ గెలిచితి- పగజంపితి- చెలతా! నీయిచ్చజనుము నేనిన్నొల్లన్" అని నోనాడితే

కర్ణములకు వాడిగలిగినట్టి నారసములు సోకినట్లయి-

నరవర! నాదు చిత్తము మనంబును నీవయెఱింగి యుండియున్
బరుషములాడ నేమిటికి, నాయెడ శాపములేదు కాదు పో
సురలు నుతింప నేటి సొద జొచ్చెద మెచ్చు...

దని ధీరంగా పల్కుతుంది సీతమ్మ! అష్టకష్టాలుపడి, అన్ని అవమానాలూ సహించింది అభర్తృసాన్నిధ్యం కొఱకేకదా! విగ్రహవంతుడైన ధర్మమైన శ్రీరాముడంతటివాడు "చెలతా! నీయిచ్చజను"మంటే ఇక ఆమాటవిన్న స్త్రీకి గుండె ఎన్ని ఖండతుండేలుగా విచ్చిపోతుంది? జీవన్మరణ సమస్యగా ఏర్పడిన ఆ విషమ సమయంలో కూడా మొల్ల సీత సహజ ధైర్యాన్ని విడువలేదు. నాయెడ శాపములేదు- కాదు పో సొద జొచ్చెద నని నిర్భీకంగా ఆడు సింగంలా గర్జించింది- ఆ మహాయిల్లాలు! ఎంత సూటిగా, ఎంతనిక్కచ్చిగా, ఎంతనిర్దుష్టంగా ఒరవిడిచిన బాకులా చఱుమని సవాలు చేసిందో! చూడండి- కుళ్ళు కూహకంలేని నిజమైన స్త్రీహృదయం ఖాఱ పొచ్చెము లెఱుంగని పొలతి మాట వాడీ ఇలాగే ఉంటాయి. టకటొంకులూ, టాలాటాలీలూ, మెఱమెచ్చులూ, నంగి నంగిమాటలూ, నీళ్ళనమలడాలూ అకుటిల స్వభావానికి అల్లంతదూరంలోనే ఉంటాయి- "విగ్రహవాన్ ధర్మః" అనిపించుకొన్న రాముని ధర్మ కవచాన్ని తన నిర్భయ శీలంతో పగుల గొట్టి పారేసింది మొల్లసీత! ఈ కావ్యంలో మేనుపెంచి మనకు దర్శనమిచ్చిన సీతమ్మ తుదివఱకూ అట్లాగే ధీరంగా మేను వంచకుండానే నిలువబడింది. సూక్ష్మంలో మోక్షంగానైనా, ఉన్నంతలో సీతమ్మ శీలానికి విజయ కిరీటం పెట్టింది మొల్ల! బాలు! మొల్ల వ్యక్తిత్వ సౌభాగ్యానికీ, ఔన్నత్యానికీ ఈశిల్పం ఒక జయగీతిక!

## నుడికారములు—జాతీయములు

ఆయాపాత్రలు ఆయా సందర్భాలలో ప్రసంగవశంగా వాడిన పలుకుబడిసొంపూ, నుడికారపు సంపదా చాలాసహజంగానూ సజాతీయంగానూ ఉంటుంది.

Akella Raghavendra's Online-ias.com

"దయ్యాలకు బలిపెట్టెద"
"గడికండలు కోసి తినుడు"

మొదలైన జాతీయాల వాడుకను గూర్చి ప్రస్తావించుకున్నాము. తెలుగు భాషకు సహజమైన సొమ్ములైన ఈ నుడి కారాలను బంగారంలో మణులను అదికినట్లు చాలా చక్కగా సంభాషణల్లో పొదిగి యియ్యడంలో మొల్ల అందవేసిన చెయ్యి!

పరిశీలించండి:- లక్ష్మణుడు రణరంగంలో మూర్ఛాగతుడైనపుడు హనుమ ద్రోణాచలంనుండి 'సంజీవకరణి'ని తీసుకొని రావడానికివెళ్ళి ఆమూలిక ఏదో తనకు తెలియక ఆపర్వతాన్నే మొత్తంగా పెకలించి తీసుకువస్తాడు. ఆపర్వతం లోని ఓషధులు ప్రాచీ దిక్కునందు శతకోటివారిజాప్తదీప్తి గనుపట్టగా శ్రీరాముడాదీప్తిని జూచి సూర్యోదయ మగుచున్నదనే భ్రమతో

"మాకులంబునకెల్లను మహనీదలప
దానె కర్తయైయుండియు ధర్మమగునె?
యుదయమందంగ మనుమడిట్లున్న యెడను
కొనరిచుట్టాలు బగవారిఁ గూడవలెనె?"

ఇక్కడ కొనరిచుట్టాలు బగవారిఁగూడవలెనె? అనే సామెత ప్రయోగింపబడిన సంఘటనా సహజత, మిక్కిలి ప్రశంసా పాత్రమైనది.

ఇట్లే కదన క్షోణిలో రావణునిపై కినిసి యాడే రాముని శూర వచనాలలో ఇరికి తొంగిచూచే ఈ అపహాస్యపు చెత్తిపొడుపు గమనించండి:-

ఆలములోన వానరుల నాలము సేసినయట్లుగాదు నా
పాలిశరంబు నీనుదుటిఁవ్రాలు హరింపగ బాలుబడ్డ దీ
వేళ! వృథాపహాస్యములు వేయి విధంబుల మానవేమి! తాఁ
గాలుడు కన్నుగీటెనిదె కాలము డగ్గతె నీకు రావణా!

అంతయుద్ధ భీభత్సంలోనూ 'కాలుడు కన్నుగీటి' మనమనస్సులలోని భయోద్రేకాలను ఒక క్షణకాలం మఱపింప జేస్తాడు?

ఇట్లాగే

'ఎల్లవేళలనేఁ జెవినిల్లుగట్టి విన్నపముసేయ'
'నేడెల్లి శాంతింపుమా'
'కూరలు నోటికిన్ రుచులు గూడుటదప్పె'
'పూటగా భారపడంగ జాలుదు...'
'వెన్నెతో బెట్టిన విద్య'
'ఒకతలకు దెచ్చెనౌనని'
'కంటిలో నెఱసు చందమున'
'కనుగోఁబ్రాలైతి.'

శ్రుతి హృద్యములైన ఇటి ప్రయోగాలెన్నో మొల్ల కావ్యాదిని చేసిన శపధ నిర్వహణకు బాసటనిల్చి ఉన్నవని చెప్పడానికి చాలినన్ని కలవు.

ఇవికాక "కూరాటి తేరులు, కావేటి గుత్తాలు" మొదలైన అపురూప ప్రయోగాలెన్నో!

ఈ పద ప్రయోగ వైచిత్ర్యం కంటె మన మనస్సు నాకట్టే ఈ క్రింది పద్యాలలోని ఉక్తి చాతుర్యం, ఆ పద్యాలలోనుండి పఠితలను పలకరించే సజీవ భావమూర్తుల విలాసాలూ మనకబ్బురం కల్గిస్తాయి. గుహుడు సరయూనదిలో రాముని ఓడపై ఆవలి యొడ్డునకు దాటించే సందర్భంలో-

సుడిగొనిరాముపాదములు సోకినధూళివహించి రాయియే
ర్పడ నొకకాంతయయ్యెనట! సన్నుగ నీతని పాదరేణు వి
య్యెడ వడినోడసోక నిదియేమగునో యని సంశయాత్ముడై...

'గుహుండు భయమ్ము పెంపునన్' 'రామ పదకంజ యుగమ్మును' గడిగాడట! ఏమి ఈ పద్యంలోని గడుసుతనం! నడక సొగసు! పద్యంలోని యొయారపు భావపు సొంపు!

ఏ సందర్భమేకాని అనల్ప శిల్ప రమణీయంగా పద్యాన్ని మలిచి భావానికి ప్రాణంపోసి ఆ సన్నివేశాన్ని మన యెదుట నిలబెట్టి ఆడించగల నేర్పు మొల్లకు బాగా తెలుసు!

Akella Raghavendra's Online-ias.com

అయితే అధ్యాత్మ రామాయణాన్ని చూచే ఈమె యిది వ్రాసిందంటారు.

అందులోని గుహుడు-

క్షాళయామి తవపాదపంకజం నాథ! దారు దృషదోః కిమంతరం
మానుషీకరణ చూర్ణమస్తి తే పాదయోరితి కథా ప్రథీయసీ.

ఈ విధంగా అన్నాడు. 'నీ పాదాలలో మనుష్యులను చేసే చూర్ణం ఉన్నదని ఒక కింవదంతి ఉన్నది; అందుకని నీ కాళ్ళు కడుగుతా'నన్నాడు; మన మొల్ల పద్యంలో ఉన్న సొబగు దీనిలో వెదకిచూద్దామన్నా కన్పడదు.

ఈ భావాన్నే తులసీదాసూ, అయ్యలరాజు రామభద్రుడూ కూడా తీసుకొన్నారు. ఎవరేకాని ఈ భావానికి మొల్ల చూపినంత సొగసైన తొడుగు తొడగలేకపోయారు; మొల్ల రచనలో ఒక్కొక్క పదంలోనే కాక పద్యం పద్యం అంతా నృత్యంచేసి పఠితలను ఇంకో ఆలోచనకు పోనీయని మువ్వల రవళియో, పఠితల మనస్సులపై ఒక్కమారు గుమ్మరించిన పారిజాత ప్రసూనాల గుబాళింపో అందాలు ఆరబోస్తూ లాస్యం చేస్తుంది. అట్టి పద్యాలలో ఈ పద్యం ఆంధ్ర వాఙ్మయంలో అంత ప్రసిద్ధికెక్కింది. ఇంకా అనేక సన్నివేశాలలో మహా సులువుగా, అలవోకగా బంధించిన ఈ అందాల పోహళింపు మనం చూడగలం.

పరశురాముడు రాము నెదుర్కొని

రాముడు గీముడంచును ధరాజనులెల్ల నుతింప దిట్టవై
భీముని చాపమున్ విరిచి ప్రేలెద! వందుల కేమిగాని! యీ
శ్రీమహిళేశు కార్ముకము చేకొని యెక్కిడు దేని నేడు నీ
తో మరి పోరుసల్పి పడద్రోతు రణస్థలి నీశరీరమున్॥

అని కయ్యానికి కాలుదువ్వుతాడు. ఎంత సహజంగా భావాలు పరుగులు పెట్టాయో చూచారుగదా!

అంతేగాదు

శివుని చివుకువిల్లు శీఘ్రంబె యానాడు
విఱచినాడ ననుచు విఱ్ఱవీగ
వలదు... ... ...

Akella Raghavendra Online-ias.com

శివునిది చివుకు విల్లటః చివికి పోయిన మామూలు తెలుగు పదానికి సందర్భ శుద్ధిగా ఎంత జీవం పోసిందో మొల్లః నేర్పరియైన చిత్రకారుడు కుంచె విదిలింపులోనే నవరసాలూ, శతసహస్రరాగాలూ సాక్షాత్కరింప జేసినంత సులువుగా సన్నివేశాన్ని మొల్ల రక్తికట్టించి గజైకట్టిస్తుంది:

ఈవిధంగా,

పావనమూర్తి రామనరపాలకు పంపున ... ...

మొదలైన పనేక పద్యాలు ధారా వేగంతో పరవళ్ళుద్రొక్కే సెలయేళ్ళ వలె మొల్లరామాయణం అంతటా పరుగులు పెట్టాయి.

## పూర్వప్రయోగాలు

మొల్ల లినపూర్వుల ననుసరించిన ప్రయోగాలూ ఉన్నాయి. తనతరువాతి తరానికి అందించిన అనితరపూర్వ ప్రయోగాలూ ఉన్నాయి.

మగటిమి గల్గిన పురుషులై  
మగతనము విడిచి నడుపగ మగువలు సగరా!  
తగదనక నేడు మఱుగున  
విగత వ్రీడుండ నగుచు వేల్పొందగునే ?

(యు. కాం. తృ. ఆ. 8)

అనే పద్యం చానమ్మను జ్ఞాపకంతెస్తే ఆరణ్యకాండములో 'ద' ప్రాసతో నడిపిన

ఒడలెల్లను బంగారము  
పొడలెల్లను రత్నసమితి బోలిన మెఱుపుల్  
నడలెల్ల మెఱసి మెలగెడు  
కడలెల్ల విలాసరేఖ కళలందొప్పెన్॥

అనే పద్యమూ

చెప్పుమని రామచంద్రుఁడు
చెప్పించిన పలుకుమీఁదఁ జెప్పెదనే నె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్య చరిత్ర తప్పులెంచకుఁడు కవుల్॥

అనే పద్యమూ

"వాలి ప్రతాపశీలి మృడవందనశీలి సురాలి మెచ్చఁగన్"

అనే ప్రయోగమూ ముఖ్యంగా పోతన్నగారి శిష్యత్వాన్ని చెప్పక చెప్తాయి. నన్నెచోడుని జ్ఞప్తికి దెచ్చిన ఒక పద్యాన్ని ముందే గమనించి ఉన్నారు.

## మొల్ల మార్గదర్శికాత్వం

"కూఁకటి ముడికినై కురులు కూడనినాఁడె"

సుం. కాం. 64

అనే ప్రయోగం-

"కూఁకటి వేణితో కురులు కూడకమున్నె" అనే ప్రయోగంలో-

పింగళి సూరనార్యునకు దారిచూపింది.

'చంపవచ్చినట్టి శత్రువునైనను'

అనే ప్రయోగాన్ని-

'చంపదగిన యట్టి శత్రువునైనను'

అనే విధంగా వేమన తీసుకొన్నాడేమో!

'... తలపట్టి యీడ్వకనుగోఁబ్రాలైతి నీ ముంగటన్'

యు. కాం. తృ. ఆ. 13

అనే ప్రయోగానికి మనసుపడి తెనాలివాడు

...రాజీవ యుగంబు వాచె...... కన్గొనుమి-

Akella Raghavendra's Online-ias.com

అని ప్రయోగించారేమో!

ముందు వెనుకలు పారజూచుకొంటే ఇట్టివెంతవారికైనా తప్పవనిపిస్తుంది.

"తెప్పర్లి," "అంతపనయ్యనేని", "కోసుక" మొదలైన ప్రయోగాలు ఈమె రచనలో కనబడ్తూఉన్నాయి. కాని యిందులో "కోసుక, పట్టుక"వంటి ప్రయోగాలు పిన వీరభద్రుడుకూడా వాడియున్నాడు. మొల్లకు ముందు తిమ్మక్క ఈ 'క' ప్రయోగాన్ని వాడింది. తరువాత చేమకూర వాడిన "ఊదుకపోవు శంఖము నహోగళరేఖ" అనే ప్రయోగం మిక్కిలి ప్రసిద్ధమైనదేకదా! అయితే ఈ 'క' ప్రయోగాన్ని ఆ యా రచయిత్రీ రచయితలు అందమైన ప్రయోగమని భావించి వాడారేమో మఱి! తెలియదు. ఈ అన్ని ప్రయోగాల్లోనూ చేమకూరవారి ప్రయోగం చాలా మనోజ్ఞంగా ఉండి తక్కినవారి ప్రయోగాలు ఏదోకక్కుర్తికోసం అనేటట్లు ఉండిపోయాయి. అయినా మొల్ల కావ్యంలోని ఈ ప్రయోగాలు అంతగా రచనా రామణీయకత్వానికి అడ్డం తగల్లేదని చెప్పవచ్చు.

ఒకచోట–

శుంభుడు ... ...
సంభ్రమము ... ...

అనే ప్రాస కనబడుతూ ఉన్నది–

సంయుతాసంయుత ప్రాసగా దీనిని అప్పకవి అంగీకరించియే ఉన్నాడు–

క్షత్రియ వంశ్యులై ధరణి ...
... ... ...
... ... ... మాం
ధాతృరఘుక్షితీశులు... .....

(ఆ.ప. 2–173)

అనే పద్యంలో నన్నయభట్టారకుడూ–

నాతోమార్కొన లేరు ...
... ... ...
ఈ త్రైలోక్యమునందు ...

అని నాచనసోముడూ వాడినట్లు అప్పకవియే చూపియున్నాడు–

Akella Raghavendra's Online-ias.com

# మొల్లకవితా శిల్పం

పద్యశిల్పంలో మొల్ల ప్రత్యేకించి కందం విషయంలో శ్రద్ధ తీసుకున్నదా! అనిపిస్తుంది. మొల్లరామాయణం ఇంచుమించుగా 900 పద్యాలు. అందులో ఆమె సుమారు 250 కందాలు వ్రాసింది. అన్ని ఛందాలూ ఒకయెత్తు. కందాల అందాలు ఒకయెత్తూ! అన్ని కందాలూ పంచకళ్యాణి గుఱ్ఱాలలాగా మాంచి దిట్టమైననడకతో ఖదను త్రొక్కినవే.

అసలు ఇంకొక రహస్య మేమిటంటే అన్నికందాలూ వరుసగా చేరిస్తే మొల్లకంద రామాయణం అవుతుందేమో ననిపిస్తుంది! కొన్ని కందాలు వరుసగా చదవండి—

ఇమ్ముల నప్పురవ్రము
కొమ్మలపైనుండి పురము కొమ్మలు వేడ్కన్
దమ్ములచుట్టము పదజల
జమ్ములు పూజింతురోగి సజస్రము ప్రీతిన్॥

వేటుగొని రామచంద్రుడు
సూటిగ నొకదిట్టకోల సురలు నుతింపన్
ఘోటకసమవక్షస్స్థల
దాటక నత్యుగ్రలీల ధరపై గూల్చెన్॥

విల్లాయిదికొండాయని
తల్లడపడి సంశయంబు తలకొన మదిలో
బల్లిదులగునృపనందను
లెల్లరు దౌదవుల నుండిరెంతయు భీతిన్॥

కరితురగ స్యందనములు
పరివారము దెగినపిదపఁ బటురోషమునన్
గరకరబడుచును నెదిరిన
ఖరకర వంశజుఁడు ద్రుంచె ఖరుని శిరంబున్॥

Akella Raghavendra's Online-ias.com

కుయ్యాడక నామ్ముందర
గయ్యమునకు కాలుదువ్వగడగెను దీనిన్
దయ్యాలకు బలివెట్టెద
వ్రయ్యలుగా నరికి యెల్లవారలు జూడన్॥

చుక్కలు తలపూవులుగా
నక్కజముగ నేను పెంచి యంబరవీధిన్
వెక్కసమై చూపట్టెస
నక్కోమలి ముఖమునొందె నాత్మస్థితికిన్॥

ఖండించెద నీచేతులు
తుండించెద నడుము రెండు తునకలు గాగన్
చెండించి నీదుకండలు
వండించెద జమురుతోన వాచవి గాగన్॥

భూనాయకు డతివేగమ
దానవ సేనలకు నెదురు దార్కొని పోరన్
వానర సేనల బంపెను
భానుజ ముఖ్యాధిపతుల పౌరుష మడరన్॥

తల్లులు మువ్వురకును రఘు
వల్లభుడే తెంచునట్టి వార్తను తెలుపన్
బల్లిదుడగు తనతమ్ముని
నల్లన సాకేతపురికి ననిపెన్ వేడ్కన్॥

దానంబులిచ్చి భద్ర
స్నానంబులు సేసి భూషణంబులు పూతల్
చీనాంబరములు బరిమళ
సూనంబులు దాల్చిరధిక శోభన లీలన్॥

ఈరామ చరిత మెప్పుడు
వారక విన్నట్టివారు వ్రాసినవారున్
గోరిపఠించినవారును
శ్రీరాముని కరుణ, మేలు సెందుదు రెలమిన్॥

ఈకందాలు ఇలా చదువుతూ మనం ఒకవిధంగా రామాయణం చదివిన వాళ్ళమే కాగలము; ఇందు త్రిప్రాసంతో కూడిన "ఖండించెద నీచేతులు" పద్యం వంటి పద్యాలుకూడా ఉన్నవి.

అసలు ఒక్కొక్కచోట కొన్నిఘట్టాలు ఖిలమైనాయేమో ననిపిస్తుంది. అన్ని కాండల ఆరంభాలలోనూ, అంత్యాలలోనూ ప్రస్తావింపబడిన వాల్మీకి నుద్దేశించిన నారదకథనం బాలకాండ ప్రారంభంలో లేకపోవడం, ఇంకాకొన్నిచోట్ల చేసిన "తెప్పిర్రి" మొదలైన వెలితి ప్రయోగాలూ అక్కడక్కడ ఎవరైనా పూరణ కార్యానికి తలపడ్డారేమో? అనే ఊహకు ఎడమిస్తాయి. లేకపోతే చక్కని కవితా శిల్పం తెలిసి, కొంచెం జాగ్రత్త తీసుకుంటే సరిపోయే ఇట్లాంటి చిన్నవిషయాలను మొల్ల అంత అజాగ్రత్తగా వదిలేస్తుందా?

ఇక "చెప్పుమని రామచంద్రుడు చెప్పించిన పలుకుమీద ఇహపరసాధన మైన ఈ పుణ్య చరిత్రను" చెప్పితినని చెప్పిన మొల్లయే తాను ఎన్నుకొన్న కవిత్వ తత్త్వాన్నిగూర్చి చెప్తూ-

వలిపెపుసన్న పయ్యెదను వాసిగగందపుఁ బూతతోడుతన్
గొలదిఁగఁగానవచ్చు వలిగుబ్బచనుంగవ నీవి నొప్పగా..."

అను పద్యమును వ్రాసియుండునా? అనే సంశయం సాహిత్యవేత్తలకు కల్గడం సహజం.

సాహిత్యం ఉత్తమోత్తమమైన కళ. కళకు 'పరమాత్మను గ్రహించునది' అనే నిర్వచనం ఉన్నది- సౌందర్యారాధనతో 'రసోవైసః' అని మనం భావించే ఆ రస సామ్రాట్టును సాక్షాత్కరింప జేసుకోవడమే ఉత్తమకళాధర్మం. సాహిత్య కళను పరమేశ్వరారాధనగా భావించినందువలననే పూర్వులు కేవలము ధర్మార్థ ప్రతిపాదకమైన కావ్యపరంపరను సృష్టించారు. ప్రాచీన కవులలో కవిత్వమునెడ చాలా పవిత్ర భావములు కన్పట్టుచున్నవి. పూజ్యుడు నన్నపార్యుడు-

Akella Raghavendra's Online-ias.com

"భారత భారతీ శుభగభస్తి చయంబులజేసి ఘోరసంసారవికారసంతమసవిజృంభమును" వాయ ప్రయత్నించెను. తిక్కన సోమయాజి తన కావ్యమును "దేవదేవునకు ప్రీతిగనిచ్చి భక్తకోటికి వరణీయు" డయ్యెను. ప్రబంధ పరమేశ్వరుడు "విష్ణు ధర్మ ప్రశంసా పాత్రమైన ప్రబంధమునుజెప్పి యఖిలేప్సిత పుణ్యఫలోదయోన్నతుల బొందెను. పోతనగారు సరేసరి. "మందారమకరంద మాధుర్యమునదేలు మధుపము" మనసములకు పోదని నిష్కర్షగా చెప్పవైచెను.

కవిత్వకళను ఇహపర సాధకముగా నింత పవిత్ర భావముతో ఉత్తరాంధ్ర కవులు ఆరాధింపలేకపోయిరి. 'రాణి నారాణి' యని పినవీరన వెకిలిగా మాట్లాడగా మల్లన రుక్మాంగద చరిత్రలో-

సౌరభ్యంబును బంధ చాతురి తగన్, శయ్యాచమత్కార శృం
గారంబుల్ .. .. .. ..
.. .. .. .. ..
వారస్త్రీయునుబోలె నొప్పవలదా వర్ణింప గావ్యంబిలన్.

అని వారస్త్రీగా మాత్రమే కవితామతల్లిని భావింప గల్గెను.

వేరొకరు "గంధగజ"మనిరి- ఇంకొకరు 'పంచకళ్యాణి' యనిరి. ఈ రీతులలో వారి వారి హృదయ సంస్కారములు మాత్రమేబైటబడినవి. కవితామతల్లి గౌరవోన్నతుల కేలోపమును ఎప్పుడును వాటిల్లలేదు. అయితే ఈ భావనముల వలన ఆయా కాలపు అభిరుచులుకూడ వ్యక్తమై రానురాను కవిత్వమునెడ వారికి వారికిగల నీచాభిరతి స్పష్టపడినది.

మఱి భక్తురాలైన మొల్ల ఈరీతిగా వ్రాసిన దనిన ఆకాలమునాటి ప్రజాభిప్రాయమే ఆమెపై ప్రభావము చూపినదనవలెను. అయినను ఆమె, పైన చూపిన కొందఱవలె కవితాసతిని అంత హీనముగా భావింప లేకపోయినదనే అంశాన్ని గమనించవలసి ఉన్నది.

వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥

Akella Raghavendra's Online-ias.com

అని ఆదికవి, పూజ్యుడు వాల్మీకి మహర్షి భావించినట్లే మొల్లకూడా "ఆదిరఘురాము చరితము"ను పుణ్యస్థితి వేదమనే భక్తి విశ్వాసములతోనే రచించి తాను ధన్యయై, ఆంధ్రమహాజనులను ధన్యాత్ముల నొనర్చినది. ఇహపరసాధనమైన ఈ పవిత్రగాధ "ఆదరముగవిన్న గ్రొత్తయై" నెగడు నిత్యనూతనసామగ్రీ సముల్లాసితం. కాబట్టే ఆధునికులలో ఒకరు మొల్లనూ, మొల్ల వ్రాసిన రామాయణాన్నీ సంస్తుతి చేస్తూ-

పాడిన పాటనే తిరిగిపాడియు శాశ్వత జీవమూాదికి
గ్గాడులగుండె గాడినడిగాచెడ నాడిన మొల్లకిచ్చెదన్
... ... ... ...
... ... సుమాంజలి యుల్లము పల్లవింపగన్॥

అని అయిదు పదిచేసి మొల్లకు సుమాంజలి నర్పించారు-

కపురపుతావులో, కలకండల పలుకులోయనగా దేశభాషయందు లెస్సయై పసమీరిన కమ్మని తెలుగులో రఘురామచరిత్రామృతాన్ని ఆంధ్రులకు జుర్రున చూలగా ద్రావనిచ్చిన మొల్లరామాయణం ఎన్నటికీ జగన్మాన్యముగా సేవింపదగినదే.

మొల్ల మహాతల్లి అందించిన ఈ ధర్మామృతాన్ని ఆంధ్రులేమాత్రము అందుకోగల్గినా ఈ మాప్రయత్నం సార్థకమైనదే యనే ఆశతో ఆంధ్ర మహాజనుల హృదయ సన్నిధిని భక్త్యనురాగ హృదయంతో దోయిలిస్తున్నాం.

—ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.

Akella Raghavendra's Online-ias.com

శ్రీ

# రామాయణము

## పీఠిక

శ్రీమహిమాభిరాముఁడు వ
సిష్ఠమహామునిపూజితుండు సు
త్రామవధూకళాభరణ
రక్షకుఁ డాశ్రితపోషకుండు దూ
ర్వామలసన్నిభాంగుఁడు మ
హాగుణశాలి దయాపరుండు శ్రీ
రాముఁడు ప్రోచు భక్తతతి
రంజిలునట్లుగ నెల్లకాలమున్. 1

ఉ. శ్రీనగమందిరుం డమరసేవితుఁ డర్ధశశాంకమౌళి స
న్మౌనిమనఃపయోజదిననాయకుఁ డబ్జభవామరేశ్వర
ధ్యానపరప్రసన్నుఁ డతిధన్యుఁడు శేషవిభూషణుండు వి
ద్యానిధి మల్లికార్జునుఁడు తా నిడు మాకు శుభంబు లొప్పఁగన్. 2

ఉ. తెల్లని పుండరీకముల తేజము మెచ్చని కన్నుదోయితో
నల్లనిశక్రనీలరుచి నవ్వెడు చక్కని దేహకాంతితో
నల్లనఁ బిల్లఁగ్రోవి కరమందలి సంజ్ఞల నింపు నింపఁగా
గొల్లతలన్ విరాళిగఁ గొల్పెడు కృష్ణుఁడు ప్రోచుఁగావుతన్. 3

ఉ. పెంచి సమస్తలోకములు మిన్నక తాఁ దన నేర్పుమీఱ ని
ర్మించి ప్రగల్భతన్ మెఱసి మేలును గీడును బ్రాణికోట్లు సే
వించ ఘటించి శాస్త్రములు వేదములుం గొనియాడుచుండు నా
కాంచనగర్భుఁ డిచ్చు నధికంబుగ నాయువు శిష్టకార్యముల్. 4

Akella Raghavendra's
Online-ias.com

సీ. చంద్రఖండ కలాపుఁ జారువామనరూపుఁ
గలితచంచలకర్ణుఁ గమలవర్ణు
మోదకోజ్జ్వలబాహు మూషకోత్తమవాహు
భద్రేభవదను సద్భక్తసదను
సన్మునిస్తుతిపాత్రు శైలరాడ్దౌహిత్రు
ననుదినామోదు విద్యాప్రసాదుఁ
బరశువరాభ్యాసుఁ బాశాంకుశోల్లాసు
సురుతరఖ్యాతు నాగోపవీతు

తే. లోకవందితగుణవంతు నేకదంతు
నతులహేరంబు సత్కరుణావలంబు
విమలరవికోటితేజు శ్రీవిఘ్నరాజుఁ
బ్రథితవాక్ప్రౌఢికై యెప్డు బ్రస్తుతింతు. 5

చ. కరిముఖుఁడుంగుమారుఁడువికారపుఁజేఁతలముదుసూపుచు
న్గురుపులువాఱుచున్సరిగ గుట్టలుదాటుచుఁజన్నుదోయితో
శిరములు రాయుచుం గబరిఁజేర్చినచందురునిఁ బట్టి తీయఁగాఁ
గరములఁ జాఁప నవ్వెడు జగమ్ములతల్లి శుభంబు లీవుతన్. 6

ఉ. సామజయుగ్మ మింపలరఁ జల్లనినీరు పసిండికుండలన్
వేమఱు వంచివంచి కడువేడుకతో నభిషిక్తఁ జేయఁగాఁ
దామరపువ్వుగద్దియ ముదంబుననుండెడిలోకమాత మా
కామువితల్లి సంపద[1] నఖండముగా నిడు మాకు నెప్పుడున్. 7

ఉ. మేలిమిమంచుకొండ నుపమింపగఁజాలినయంచ నెక్కి వా
హ్యాళి నటించి వచ్చుచతురాస్యు నెదుర్కొని నవ్వుదేరగా
వాలికసోగకన్నుల వివాళి యొనర్చి ముదంబు గూర్చువి
ద్యాలయవాణి శబ్దముల నర్థములన్ సతతంబు మాకిడున్. 8

సీ. సురపన్నుతజ్ఞాను సువివేకి వాల్మీకి
నఖిలవేదాగమాభ్యాసు వ్యాసు

1. సంపద లఖండముగా

Akella Raghavendra's Online-ias.com

ఘోరాంధకారప్రభారవి భారవి
సత్కాంతిహిమకరశ్లాఘు మాఘు
వివిధకళాన్విత విఖ్యాతి భవభూతిఁ
బ్రకటకార్యధురీణు భట్టబాణు
మానినీలోకసమ్మదముద్రు శివభద్రుఁ
గవితారసోల్లాసుఁ గాళిదాసు

తే. స్తుతగుణోద్దాము నాచనసోము భీము
నవ్యమంజులవాగ్ధుర్యు నన్నపార్యు
రసికు లైనట్టి శ్రీనాథు రంగనాథుఁ
దిక్కకవిరాజును నుతించి దీని మించి. 9

క. తొల్లిటి యిప్పటి సత్కవి
వల్లభులను రసికవినుతవాగ్విభవకళా
మల్లులఁ గవితారచనల
బల్లిదు లైనట్టి ఘనుల భక్తిగఁ దలతున్. 10

క. గురులింగజంగమార్చన
పరుడును శివభక్తిరతుడు బాంధవహితుఁడున్
గురుఁ డాతుకూరికేసయ
వరపుత్రిని మొల్ల యనగ వఱలినదానన్. 11

సీ. దేశీయపదములు దెనుగులు సాంస్కృతుల్
సంధులు ప్రాజ్ఞులశబ్దవితతి
శయ్యలు రీతులుఁ జాటుప్రబంధంబు
లాయాసమాసంబు లర్థములును
భావార్థములుఁ గావ్యపరిపాకములు రస
భావచమత్కృతుల్ పలుకుసరవి
బహువర్ణములును విభక్తులు ధాతుల
లంకృతిచ్ఛందోవిలక్షణములుఁ

Akella Raghavendra's
Online-ias.com

తే. గావ్యసంపద క్రియలు విఘంటువులును
క్రమము లేవియు నెఱుఁగ విఖ్యాతగోప
వరపుశ్రీకంఠమల్లేశువరముచేత
నెఱిఁ గవిత్వంబుఁ జెప్పఁగా నేర్చికొంటి. 12

క. చెప్పు మని రామచంద్రుఁడు
సెప్పించిన పలుకుమీఁదఁ జెప్పెద నే నె
ల్లప్పుడు విహపరసాధన
మిప్పుణ్యచరిత్ర తప్పు లెంచకుఁడు కవుల్. 13

వ. అని మఱియును, 14

చ. వలిపపుపన్నపయ్యెదను వాసిగ గందపుఁబూఁతతోడుతన్
గొలదిగఁ గానవచ్చువలిగుబ్బచనుంగవలీవి నొప్పఁగాఁ
దెలుఁ గని చెప్పచోటఁగడు తేటలమాటలఁ గ్రొత్తరీతులం
బొలుపు వహింపకున్న మఱి పొందగునే పటహాదిశబ్దముల్. 15

క. మును సంస్కృతములఁ దేటగఁ
దెనిఁగించెడిచోట నేమి దెలియక యుండ౯
దనవిద్య మెఱయఁ గ్రిమ్మఱ
ఘన మగుసంస్కృతముఁ జెప్పఁగా రుచి యగునే. 16

ఆ. తేనె సోఁక నోరు తీయన యగురీతి
తోడ నర్థమెల్లఁ దోఁచకుండ
గూఢశబ్దములను గూర్చినకావ్యమ్ము
మూఁగ చెవిటివారిముచ్చ టగును. 17

క. కందువమాటలు సామెత
లందముగాఁ గూర్చి చెప్ప నది తెలుఁగునకుం
బొందై రుచియై వీనుల
విందై మఱి కానుపించు విబుధులమదికి౯. 18

వ. అని మఱియును 19

Akella Raghavendra's Onlineclas.com

క. ఆది రఘురామచరితము
నాదరముగ విన్నఁ గ్రొత్తయై లక్షణసం
పాదమ్మై పుణ్యస్థితి
వేదమ్మై తోఁచకున్న వెఱ్ఱినె చెప్పన్. 20

ఉ. రాజితకీర్తి యైనరఘురామచరిత్రము మున్ గవీశ్వరుల్
తేజ మెలర్పఁ జెప్పి రని తెల్సియుఁ గ్రమ్మఱఁ జెప్పనే లనన్
భూజనకల్పకం బగుచు భుక్తిముక్తికి మూల మైనయా
రాజును దైవ మైనరఘురాము నుతించినఁ దప్పు గల్గునే. 21

క. వారాంగన శ్రీరాముని
పే రిడి రాచిలుకఁ బిలిచి పెంపు వహించెన్
నేరుపు గలచందంబున
నారాముని వినుతి సేయ హర్షము రాదే. 22

క. నేరిచి పొగడినవారిని
నేరక కొనియాడువారి నిజకృప మనుపం
గారణ మగుటకు భక్తియె
గారణ మగుఁ గాని చదువు కారణ మగునే. 23

ఉ. సల్లలితప్రతాపగుణసాగరుఁ డై విలసిల్లి ధాత్రిపై
బల్లిదుఁ డైన రామనరపాలకునిన్ స్తుతిసేయుజిహ్వకున్
జిల్లరరాజలోకమును జేకొని మెచ్చఁగ నిచ్చ పుట్టునే
అల్లము బెల్లముం దినుచు నప్పటికప్పటి కౌన సేయునే. 24

వ. అని వితర్కించి ముదంబున నిష్టదేవతా ప్రార్థనంబును బురాతన కవీంద్ర స్తుతియునుం జేసి నా చేయంబూనిన మొల్లరామాయణమునకుఁ గథావిధానం బెట్టిదనిన.

Akella Raghavendra's Online-ias.com

శ్రీ

# రామాయణము

## బాలకాండము

సీ. సరయూనదీతీరసతతసన్మంగళ
      ప్రాభవోన్నతమహావైభవమ్ము
కనకగోపురహర్మ్య ఘనకవాటోజ్జ్వల
      త్ప్రాకారగోపురశ్రీకరమ్ము
గజవాజిరథభటగణికాతపత్రిచా
      మరకేతుతోరణమండితమ్ము
ధరణీవధూటికాభరణవిభ్రమరేఖ
      దరిసించుమాణిక్యదర్పణమ్ము

తే: భానుకులదీపరాజన్యపట్టభద్ర
భాసినవరత్నఖచితసింహాసనమ్ము
నాఁగ నుతి కెక్కు మహిమ వనారతమ్ము
ధర్మనిలయమ్ము మహి నయోధ్యాపురమ్ము. 1

సీ. మదనాగయూథసమగ్రిదేశము గాని
      కుటిలవర్తన శేషకులము గాదు
ఆహవోర్వీజయహరినివాసము గాని
      కీశసముత్కరాంకితము గాదు
సుందరస్యందనమందిరం బగుఁ గాని
      సంతతమంజుళాశ్రియము గాదు
మోహనగణికాసమూహగేయము గాని
      యూధికావికరసంయుతము గాదు

Akella Raghavendra's OnlineIAS.com

తే. వరన సత్పుణ్యజననివాసమ్ము గాని
కఠిననిర్దయదైత్యసంఘమ్ము గాదు
కాదు కాదని కొనియాడఁ గలిగినట్టి
పురవరాగ్రిమ్ము సాకేతపురవరమ్ము. 2

సీ. భూరివిద్యాప్రౌఢి శారదాపీఠమై
గణుతింప సత్యలోకమ్మువోలె
మహనీయగుణసర్వమంగళావాసమై
పొగడొందు కైలాసనగమువోలె
లలితసంపచ్ఛ్రీలక్ష్మినివాస మై
యురవైనవైకుంఠపురమువోలె
విరచితప్రఖ్యాతహరిచందనాఢ్యమై
యారూఢి నమరాలయమ్మువోలె

తే. రాజరాజనివాస మై తేజరిల్లి
నరవరోత్తరదిగ్భాగనగరివోలె
సకలజనములు గొనియాడ జగములందుఁ
బొలుపుమీరును సాకేతపురవరమ్ము. 3

క. ఇమ్ముల నప్పురి వప్రము
కొమ్ములపై నుండి పురముకొమ్మలు వేడ్కన్
దమ్ములచట్టము పదజల
జమ్ములు పూజింతు రొగి నజస్రముఁ బ్రీతిన్. 4

క. పరువున మరుశై యుండును
సురపురమునఁ గల్పతరులు చూపట కింపై
పరువున మరువై యుండును
దురగంబు లయోధ్యఁ గలప్రతోళికలందున్. 5

క. దానగుణమ్మున సురపురి
నేనాదును నమరరత్న మెన్నిక కెక్కున్
దానగుణంబున మిక్కిలి
యేనుగు లాపురములోన నెన్నిక కెక్కున్. 6

Akella Raghavendra's Online-ias.com

క. కవిగురుబుధమిత్రాదులు
వివిధార్చనలను[1] సురపురి వెలయుదు రెలమిన్
గవిగురుబుధమిత్రాదులు
వివిధార్చనలం బురమున వెలయుదు రెపుడున్. 7

క. భోగానురాగసంపద
భోగులు వర్తింతు రందు భూసుతలీలన్
భోగానురాగసంపద
భోగులు వర్తింతు రిందు భూసుతలీలన్. 8

సీ. ప్రకటానురాగసంపన్ను లౌదురు గాని
రమణీయరుక్మకారకులు గారు
శుభభపవిత్రోజ్జ్వలసూత్రధారులు గాని
టక్కరిహాస్యనాటకులు గారు
ఉభయసంధ్యాదివిధ్యుక్తకర్ములు గాని
చర్చింపఁగా నిశాచరులు గారు
తిలకించి చూడ సద్ద్విజు లౌదురే కాని
తలఁపంగఁ బక్షిజాతములు గారు

బాడబులు గాని యగ్నిరూపములు గారు
పండితులు గాని విజ్ఞులపగిదిఁ గారు
దీపకులు గాని జాతినిందితులు గారు
పరమపావను లాపురిధరణీసురులు. 9

ఉ. రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో
రాజులు భోగమందు దినరాజులు సంతత తేజమందు రా
రాజులు మానమందు నగరమ్మున రాజకుమారు లందఱున్. 10

---

1. వివిధార్చనల నమరపురి

2. వివిధార్చనల నమరఁబురి.-ఈ పాఠాంతరములచే శ్లేషపోషింపఁ బడినది. సంపాదకురాలు.

Akella Raghavendra's Onlineias.com

సీ. తగ దాన విఖ్యాతి ధరఁగుబేరులు గాని
సతతాంగకుష్ఠపీడితులు గారు
నిర్మలసత్యోక్తి ధర్మసూతులు గాని
చర్చింప ననృతభాషకులు గారు
ప్రకటవిభూతిసౌభాగ్యరుద్రులు గాని
వసుధపై రోషమానసులు గారు
కమనీయగాంభీర్య ఘనసముద్రులు గాని
యతులితభంగసంగతులు గారు

తే. వర్తకులు గాని పక్షి లేవరుసఁ గారు
భోగులే గాని పాము లెప్పుడును గారు
సరసులే కాని కొలఁకులజాడఁ గారు
వన్నె కెక్కిన యప్పురివైశ్యు లెల్ల. 11

క. పంటల భాగ్యము[1] గలరై
పంటలపైఁ బంట లమర బ్రతుకుదు రెపుడున్
బంటలు బాడియుఁ గలయా
పంటలు మొదలైనకాఁపుఁబ్రజ లావగతిన్. 12

సీ. కలికిచూపులచేతఁ గరఁగింప నేర్తురు
బ్రహ్మచారుల నైన భ్రాంతి గొలిపి
మృదువచోరచనల వదలింప నేర్తురు
ఘనమునీంద్రుల నైనఁ గచ్ఛతమ్ములు
వలపులు పైఁజల్లి వలపింప నేర్తురు
సన్న్యాసులను నైనఁ జలముపట్టి
సురతబంధమ్ములఁ జొక్కింప నేర్తురు
వ్రతములు గైకొన్నయతుల నైన

తే. అచల మెక్కింప నేరుతు రౌషధముల
మతులు గొలుపంగ నేర్తురు మంత్రములను

---

1. భాగ్యోదయులై.

Akella Raghavendra's Online-ias.com

ధనము లంకింప నేర్తురు తక్కు-సేసి
వాసి కెక్కినయప్పురివారసతులు. 13

సీ. శారద గాయత్త్రి శాండిల్య గాలవ
కపిల[1]కౌశిక కులఖ్యాతి గలిగి
మదన విష్వక్సేన మాధవ నారద
శుక పై జయంతి కార్జునులు గలిగి
చంద్రార్క గుహ గిరిసంభవ జయ వృష
కుంభ బాణాదులఁ గొమరు మిగిలి
సుమన ఐరావత సురభి శక్రామృత
పారిజాతముల పొంపారఁ గలిగి

తే. బ్రహ్మనిలయమ్ము పై కుంతపట్టణమ్ము
నాగకంకణుశైలమ్ము నాకపురము
లలితగతిఁ బోలి మేవేశఁదులను దూఁగి
ఘనత నొప్పారు నప్పురివనము లెల్ల. 14

చ. కనకవిలాసకుంభములు గబ్బికుచంబులలీలఁ జిత్రకే
తనములు పైఁటకొంగులవిధంబునఁగ్రాల గవాక్షములబ్రహిన్
గనుఁగవయట్లపొల్పెనఁగఁగా భువిభోగులు మెచ్చ భోగినీ
జనములరీతిఁ జెల్వమరు సౌధనికాయము పాయ కప్పురిన్. 15

తే. మకరకచ్ఛపశంఖపద్మములు గలిగి
ధనదునగరమ్ముపైఁ గాలుద్రవ్వుచుండు
పరసమాధుర్యగాంభీర్యసరణిఁ బేర్చి
గుణితు మీఱిన యప్పురికొలఁకు లెల్ల. 16

గీ. అమృతధారాప్రవాహమ్మునందు నెపుడు
నొక్క ధేనువు దివి[2]మన్న నుచిత మగునె
అమృత ధారాప్రవాహమ్మునందు నెపుడుఁ
జెక్కు ధేనువు లప్పురిఁ బేరు నొందు. 17

---

1. కౌశికుల విఖ్యాతి గలిగి
2. దివినెన్న

Akella Raghavendra's Online-ias.com

క. ఈకరణి సకలవిభవ
శ్రీకర మయి తాఁ బ్రసిద్ధిఁ జెలఁగుచు మహిమన్
నాకపురితోడ నొఱయుచు
సాకేతపురమ్ము వెలయు జగము నుతింపన్. 18

వ. అట్టిమహాపట్టణంబున కధీశ్వరుం డెట్టివాఁ డనఁగ. 19

సీ. తనకీర్తికర్పూరతతిచేత వాసించెఁ
బటుతరబ్రహ్మాండభాండ మెల్లఁ
దనశౌర్యదీప్తిచే నినబింబ మనయంబుఁ
బగలెల్ల మాఁగుడువడఁగఁ జేసెఁ
దనదానవిఖ్యాతి ననుదినంబును నర్థి
దారిద్ర్యములు వెళ్ళఁ బాఱఁ దఱిమెఁ
దననీతిమహిమచే జనలోక మంతయుఁ
దగిలి సంతతమును బొగడఁ దనరెఁ

తే. భళిరఁ కొనియాడఁ బాత్రమైపరఁగినట్టి
వైరినృపజాలమేఘసమీరణుండు
దినకరాన్వయపాథోధివనజవైరి
నిశితకౌక్షేయకకరుండు దశరథుండు. 20

సీ. పాలింపఁ డవినీతిపరుల నన్ననఁ జేసి
పాలించు సజ్జనవ్రతతి నెపుడు
మనుపఁ డెన్నఁడు చోరులను గారవము చేసి
మనుచు నాశ్రితకోటి ఘనము గాఁగ
వెఱ పెఱుంగఁడు వైరివీరులఁ బొడఁగన్న
వెఱచు బొంకేయెడ దొరలునో యని
తలఁకఁ డర్థివ్రాతములు మీఱి పైకొన్నఁ
దలఁకు ధర్మమ్మెందుఁ దప్పునో యని

తే. నరవిఁబోషింప దరిగణషట్క మెపుడు
వెలయఁ బోషించు విత్తమ్ము విప్రవరుల

Akella Raghavendra's Online-ias.com

భాస్కరాన్వయతేజోవిభాసితుండు
మానధుర్యుండు దశరథక్ష్మావరుండు. 21

సీ. కనఁగోరఁడొకనాఁడుఁ గన్నులఁ బరవధూ
లావణ్యసౌభాగ్యలక్షణములు
వినఁగోరఁ డొకనాఁడు వీనుల కింపుగాఁ
గొలుచువారలమీఁదికొండెములను
చిత్తంబు వెడలించి జిహ్వాగ్రమునఁగోరి
పలుకఁడు కాఠిన్య భాషణములు
తలఁపఁ డించుక యైన ధనకాంక్ష నేనాఁడు
బంధుమిత్రాశ్రితప్రతతిఁ జెఱుప

తే. సతతగాంభీర్యధైర్యభూషణపరుండు
వార్తకెక్కినరాజన్యవర్తనుండు
సకలభూపాలజనసభాసన్నుతుండు
ధర్మతాత్పర్యనిరతుండు దశరథుండు. 22

సీ. విరహాతిశయమున వృద్ధిఁబొందఁగ లేక
విషధరుండును గాలి విషముఁబూనె
తాపంబు క్రొవ్వెంచి తరియింప నోపక
పలుమాఱుఁ గడగండ్లఁ బడియెఁ గరులు
కందర్పశరవృష్టి నంద నోపక ఋషి
వనవాసమునఁ గ్రుస్సి వనరు సూపె
దీపించి వల పాఁప నోపక కూర్మంబు
కుక్షిలోపలఁ దలఁ గ్రుక్కికొనియె

తే. కుంభినీకాంత తమ మీఁదికూర్మి విడిచి
ప్రకటరాజన్యమస్తకాభరణముకుట
చారుమాణిక్యదీపితచరణుఁడైన
దశరథాధీశుభుజపీఠిఁ దగిలియుండె 23

Akella Raghavendra's Online-ias.com

క. ఆరాజురాజ్యమందలి
వారెల్లను విరళధర్మవర్తను లగుచున్
భూరిశ్రీవిభవంబుల
దారిద్ర్యం బెఱుఁగ రెట్టితఱి నేనాఁడున్. 24

వ. ఇట్టి మహాధైర్య సంపన్నుండును మహైశ్వర్యధుర్యుండును నగు దశరథమహారాజు సకల సామంతరాజ లోకపూజ్యమానుండగుచుఁ బ్రాజ్యంబగు రాజ్యంబు నేలుచు నొక్కనాఁడు, 25

సీ. సంతానలబ్ధికై చింతించి చింతించి
శిష్టవర్తనుఁ దౌ వసిష్ఠుఁ జూచి
తనకోర్కి విసుపింప విని మునిసింహుండు
పలికె ఋశ్యశృంగు నెలమిఁ దేర
ఘనుఁ డాతఁ దొగిఁ బుత్రకామేష్టి యను పేర
యాగమ్ముఁ గావింప నందువలన
వినుతికెక్కఁగఁ జాలుతనయులు గలుగుట
సిద్ధమ్ము నామాట బుద్ధిలోన

తే. నిలుపుమని చెప్ప నారాజు నెమ్మితోడ
నకుటిలాత్మకు నా విభాండకుని తనయు
నెలమి రావించి పుత్త్రకామేష్టి యనెడి
జన్న మొనరించు చున్నట్టి సమయమునను. 26

ఉ. రావణు చేతిబాధల నిరంతరమున్ బడి వేఁగి మూఁక లై
దేవతలెల్ల గిష్పతికిఁ దెల్లముగా నెఱిఁగింప వారి రా
జీవతనూజుఁ డున్నెడకు శ్రీఘ్రమ తోడ్కొనిపోయి చెప్ప నా
దేవుఁడు విష్ణు సన్నిధికి దిగ్గనఁ జేకొనిపోయి యచ్చటన్. 27

వ. అప్పురాణపురుషోత్తముం గాంచి నమస్కరించి యింద్రాది దేవతలం జూపి బ్రహ్మ యిట్లని విన్నవించె. 28

ఉ. రావణుఁ డుగ్రుఁడై తపపరాక్రమశక్తిని వీరి వంధవదల్
వావిరిఁ గొల్లలాడి త్రిదివంబును బాధ్యుగ్గ శేఖ్యు నేఁడు దే

Akella Raghavendra's
Online-ias.com

వావలి దీనభావమున వక్కడ నుండఁగ నోడి భీతిచే
దేవరఁగాన వచ్చె నిఁక దేవరచిత్తము వీరి భాగ్యమున్. 29

వ. అని విన్నవించిన విని వనరుహలోచనుండు దయాయత్తచిత్తుం డై
యనిమిషనాయకునిఁగూర్చి యిట్లానతిచ్చె. 30

తే. వనజగర్భునిఁగూర్చి రావణుఁడు మున్ను
తపముజేసిన వర మిచ్చుతఱినిఁ దనకు
నేరిచేఁజావు లేకుండఁ గోరువాఁడు
నరులవానరులను జెప్ప మఱచినాఁడు. 31

వ. అక్కారణంబునం జేసి. 32

తే. వనరు గలిగెను మనకు రావణునిఁ జంప
వినుఁడు మీరెల్ల నామాట వేడ్క మీఱ
దశరథుం డనురాజు సంతాన కాంక్ష
నొనర జన్నంబు గావించుచున్న వాఁడు. 33

క. ధరణీపతి యగుదశరథ
నరనాయకునింటఁ బుట్టి నరరూపమునం
బెరిగెద నేనిఁక మీరును
సురకంటకుమీఁద లావు సూపుటకొఱకై. 34

క. కొందఱు కపివంశంబునఁ
గొందఱు భల్లూకకులమున గురుబలయుతు లై
యందఱు వన్నె తెఱంగుల
బృందారకులారః పుట్టి పెరుగుఁడు భువిపై. 35

వ. అని కృపాధురీణుండైన నారాయణుం డాన తిచ్చిన విని వన
జాసనాది దేవతానికరం బవ్వనజోదరునిపాదారవిందమ్ములకు వందనమ్ము లాచ
రించి నిజనివాసమ్ములకుం జనిరయ్యవసరమ్మున. 36

Akella Raghavendra's Online-ias.com

మ. ఇలసాకేతనృపాలశేఖరుఁడు దా హేలావిలాసంబుతో
ఫలకాంక్షన్ [1] గ్రతువుం బొనర్చినయెడన్ బంగారుపాత్రమ్ములో
పల దుగ్ధాన్నము చాలనించుకొని తాఁ బ్రత్యక్షమైనిల్చి ని
ర్మల తేజంబునఁ బావకుండనియెఁ బ్రేమన్ మంజు వాక్యంబులన్. 37

క. భూపాల! నీదుభార్యల
కీపాయస మారగింప నిమ్ము తనయుల్
శ్రీపతి పుత్త్రసమానులు
రూపసు లుదయింతు రమితరూపస్ఫూర్తిన్. 38

వ. అనిచెప్పి యప్పాయసపాత్రంబు చేతి కిచ్చిన. 39

ఆ. పాయసమ్ము రెండు భాగముల్ గావించి
యగ్రసతుల కీయ నందులోన
సగము సగము దీసి ముగుద సుమిత్రకు
నొసఁగి రంత నామె మెసవెఁ బ్రీతి. 40

A. P. SAHITYA AKADEMI
LIBRARY
HYDERABAD

వ. అంతం గొన్ని దినంబులకుఁ గౌసల్యా కైకేయీ సుమిత్రలు గర్భవతులై యొప్పారుచుండ. 41

సీ. ధవళాక్షు లనుమాట తథ్యంబు గావింపఁ
దెలు పెక్కి కన్నులు తేటలయ్యె
నీలకుంతల లని నెగడిన యామాట
నిలుపంగ నెఱులపై నలుపు సూపె
గురుకుచ లనుమాట సరవి భాషింపఁగఁ
దోరమై కుచముల నీరువట్టె*
మంజుభాషిణు లనుమాట దప్పక యుండ
మెలఁతలపలుకులు మృదువులయ్యెఁ

1. హవనంబు సేసిన యెడన్,

శ్రీ కం, వీరేశలింగము పంతులవారి ప్రతిలోని పాఠములు.

* మందయాన లనంగ మాత్రైనయమ్మాట
విశ్వంబుగా మాంద్యమెక్కె నడల.

Akella Raghavendra's Online-ias.com

తే. గామిను లటంట నిక్కమై కాంతలందు
మీఱి మేలైన రుచులపైఁ గోరికయ్యె
సవతిపోరనఁ దమలోన సారె సారె
కోకిలింతలు బెట్టుచిట్టములఁ బుట్టె. 42

వ. మఱియును. 43

సీ. తనుమధ్య లనుమాటఁ దప్పింపఁ గాఁబోలుఁ
బొఱ లేక నడుములు పొదలఁజొచ్చెఁ
గుచములు బంగారుకుండలో యనుమాట
కల్లగా నగ్రముల్ నల్లనయ్యెఁ *
జంద్రాస్య లనుమాట సరవి మాన్పఁగఁ బోలుఁ
గళలవిలాసమ్ము పలుచ నయ్యె
సుందరు లనుమాట సందియమ్ముగఁ బోలు
గర్భభారమ్ములఁ గాంతిదప్పె

తే. వనుచుఁ గనుఁగొన్న వారెల్ల నాడుచుండఁ
గట్టుచీరెల ప్రేకంబు పుట్టుచుండ
నానతులఁ జూచి యందఱు వలచుచుండఁ
గాంతలకు నప్డు గర్భముల్ గానుపించె. 44

వ. ఇట్లు దుర్భరంబులైన గర్భంబులు దాల్చిన కౌసల్యాది కాంతాత్రయమ్మును చైత్రమాసమ్మున శుక్లపక్షమ్మున నవమీ భానువాసరమ్మునఁ బునర్వసు నక్షత్రంబునఁ గర్కాటకలగ్నంబున శ్రీరామభరత లక్ష్మణశత్రుఘ్నులం గాంచినం దదనంతరంబున దశరథుండు యథోచితకర్తవ్యంబులు జరపి యన్నది దినంబులు నరిష్టంబులేక ప్రతిదినవర్ధమాన మగుచున్న కుమార చతుష్టయంబునకుఁ గాలోచితంబులగు చౌలోపనయనాది కృత్యంబులు గావించి వెండియు విద్యాప్రవీణు లగునట్లు జేవర్చి గజాశ్వరథారోహణంబులు నేర్పి ధనుర్వేదపారగులం గావించి పెంచుచున్న సమయమ్మున. 45

* ముదుర కళోలజు [illegible] గబ్బగాఁ జెక్కులు వెల్లనయ్యె.

Akella Raghavendra's Online-ias.com

సీ. ఒకనాఁడు శుభగోష్ఠి నుర్వీశ్వరుఁడు మంత్రి
హితపురోహితులును నెలమిఁజేరి
బంధువర్గము రాయబారులుఁ జారులుఁ
బరిచారకులు నెల్ల సరవిఁ జేరి
గాయకులును భృత్యగణమును మిత్త్రులు
సతులును సుతులును బక్క నలరి
సరసులుఁ బతుపలుఁ బరిహాసకులుఁ గళా
వంతులుఁ గదు నొక్కవంకఁ జేరి

తే. కొలువఁ గొలువున్నయెడ వచ్చి కుశికపుత్త్రుఁ
డర్థి దీవించి తా వచ్చినట్టి కార్య
మధిపునకుఁ జెప్ప మదిలోన నార్త్రపడుచు
వినయ మొప్పార నిట్లని విన్నవించె. 46

క. రాముఁడు దనుజులతో సం
గ్రామము సేయంగఁ గలఁడె కందుగదా! నే
నే మిమ్ముఁ గొలిచి వచ్చెద
నో మునిరాజేంద్ర! యరుగు ముచిత ప్రౌఢిన్. 47

మ. అనిపం గౌశికుఁ డాత్మ నవ్వి వినుమయ్యా! రాజ! నీచేతఁగా
దవరా దైనను రాక్షసుల్ విపులగర్వాటోపబాహాబలుల్
ఘనుఁడీరాముఁడు దక్క వారిఁ గెలువంగారాదు పిన్నంచు నీ
వనుమానింపక పంపుమింకఁ గ్రతురక్షార్థంబు భూనాయకా. 48

వ. అని ప్రియోక్తులు వలుకుచున్న విశ్వామిత్త్రునకు మిత్త్రకుల
పవిత్రుం డైన దశరథుండు మాఱాడ నోడి యప్పుడు. 49

క. మునినాథువెంట పుత్రా
ముని వలఁబడి వెట్టుచున్న మూర్తులపై రా
ముని సౌమిత్రిని వెస న
మ్మునితో నానందవార్ధి మునుఁగుచుఁ బనిచెన్. 50

Akella Raghavendra's
Online-ias.com

మత్త. వారిఁదోడ్కొని కౌశికుండట వచ్చువయ్యెడ ఘోరకాం
తారమధ్యమునందు నొక్కతె దైత్యకామిని భీకరా
కార మొప్పఁగ నట్టహాసవికాస మేర్పడ రాఁగ నా
క్రూరరాక్షసిఁ జూచి యమ్మునికుంజరుం డొగి రామునిన్. 51

క. తాటక వచ్చినదదిగో
నాటగ నాఁడుదని మేల మాడక నీ వీ
పాటి పడ నేయు మని తన
చాటున భయపడెడి రామచంద్రున కనియెన్. 52

వ. ఇట్లు చెప్పిన యా మునిచంద్రుని పల్కు లాలించి రామచంద్రుండు తన యంతరంగమ్మున నిట్లని వితర్కించె. 53

క. ఈ యాఁడుదానిఁ జంపఁగ
నాయమ్మున కేమిగొప్ప నగరే వీరుల్
చీ యని రోయుచు నమ్ముని
నాయకుభయ మెఱిఁగి తనమనమ్మున నలుకన్. 54

క. వ్రేటు గొని రామచంద్రుఁడు
సూటిగ నొకదివ్యకోల సురలు నుతింపన్
ఘోటక సమవక్షస్థలిఁ
దాటక నత్యుగ్రలీల ధరపైఁ గూల్చెన్. 55

వ. ఇట్లు దాటకం గీటణంచినయంత నమ్మునీంద్రుండు మేటి సంతోషమ్మున రాముని గొనియాడుచు నశ్రమంబున నిజాశ్రమంబున కేతెంచి రామసౌమిత్రుల సాయంబున జన్నంబు సేయుచున్న సమయంబున. 56

క. ఆకాశవీథి నెలకొని
రాకాసులు గురిసి రమితరక్తముఁ బలలం
బాకౌశికు యజ్ఞముపై
భీకరముగ మునిగణంబు భీతిం బొందన్. 57

ఉ. అంబరవీథి నిల్చి త్రిదశాంతకు లెంతయు నేచి రక్తమాం
సంబులు గాధినందనుని జన్నముపైఁ గురియంగ నంతలో

Akella Raghavendra's Online-ias.com

నంబర రత్నవంశకలశాంబుధిచంద్రుఁడు రామచంద్రుఁ డు
గ్రంబుగఁ ద్రుంచెఁ జండబలగర్వులఁదమ్ముఁడుఁదానవొక్కటై. 58

వ. ఇట్లు రామచంద్రుండు సాంద్రప్రతాపంబు మించ నింద్రారులఁ ద్రుంచిన నమ్మునిచంద్రుఁడు నిర్విఘ్నంబుగా జన్నంబొనర్చి రామసౌమిత్రులం బూజించె నట్టి సమయమ్మున. 59

క. ధరణీసుత యగుసీతకుఁ
బరిణయ మొనరింప జనకపార్థివుఁడిల భూ
వరసుతుల రం డని స్వయం
వర మొగిఁ జాటించె నెల్లవారలు వినఁగన్. 60

వ. ఇట్లు స్వయంవరమహోత్సవఘోషంబున సంతోషమ్ము నొంది విశ్వామిత్రుండు రామసౌమిత్రుల మిథిలానగరంబునకుఁ దోడ్కొని చనుచుండు మార్గంబున. 61

క. ముదితాపసి వెనువెంటను
వదలక చనుదెంచునట్టివడి రామునిశ్రీ
పదరజము సోఁకి చిత్రం
బొదవఁగఁ గనుపట్టె నెదుట నొకయుపల మటన్. 62

క. పదనై యొప్పిద మై కడుఁ
గదలుచు బంగారుపూదె కరఁగినరీతిన్
మెదలుచు లావణ్యస్థితి
సుదతిగఁ జూపట్టి నిలిచె సురుచిరలీలన్. 63

ఉ. ఆమునివల్లభుండు గొనియాడుచుఁ బాడుచు వేడ్కతోడ శ్రీ
రాముని జూచి యిట్లనియె రామ భవత్పదధూళిసోఁకి యీ
భామిని రాయి మున్ను కులపావన చూడఁగఁ జిత్రమయ్యె నీ
నామ మెఱుంగు వారలకు నమ్మఁగవచ్చును ముక్తిముక్తులన్. 64

వ. అని యక్కాంతారత్నంబు పూర్వవృ[illegible]ంతయు [illegible] వంశమమ్మున నమ్మునశేంద్రనందనుల కెఱింగింపుచు [illegible]నరంబునకు [illegible] నప్పుడు. 65

సీ. ద్రవిడ కర్ణాటాంధ్ర యవన మహారాష్ట్ర
రాజకుమారులు తేజ మలరఁ
పాండ్య ఘూర్జర లాట బర్బర మళయాళ
భూపనందనులు విస్ఫూర్తి మీఱ
గౌళ కేరళ సింధు కాశ కోసల సాళ్వ
ధరణీశపుత్రులు సిరి వెలుంగ
మగధ మత్స్యకళింగ మాళవ నేపాళ
నృపతనూభవులు నెన్నికకు నెక్క

తే. మఱియు మత్కాల కోంకణ మద్ర పౌండ్ర
వత్స గాంధార సౌరాష్ట్ర వంగ చోళ
రాజ్యముల నొప్పుచున్న రాజసుతులు
వచ్చి రక్కామినీస్వయంవరమునకును. 66

ఉ. కొందఱు పల్లకీల మఱికొందఱు తేరుల నందలంబులం
గొందఱు కొందఱశ్వములఁ గొందఱు మత్తగజేంద్ర సంఘము
న్గొందఱు స్వర్ణడోలికలఁ గోరిక నెక్కి నృపాలనందనుల్
సందడిఁ గాఁగ వచ్చిరి * ఋజంబు ఋజంబును ద్రోపులాడఁగన్. 67

వ. అట్టి సమయంబున. 68

చ. గురుభుజశక్తి గల్గుపదికోట్ల జనంబులఁ బంప వారు నా
హరునిశరాసనంబుఁ గొనియాడుచుఁ బాడుచుఁ గొంచు వచ్చి సు
స్థిరముగ వేదిమధ్యమునఁ జేర్చిన దానికి ధూప దీపముల్
విరులును గంధ మక్షతలు వేడుక నిచ్చిరి చూడ నొప్పఁగన్. 69

వ. అట్టి సమయంబున జనకభూపాలుండు రాజకుమారులం గనుంగొని యిట్లనియె. 70

ఉ. కొంతక సావధానమతిఁ గూర్చి వినుండిదె మత్కుమారికై
యుంతువ పెపెఁనాడ వివిధోజ్జ్వల మైనధనంబుఁ గాన నీ
శంకరుచాప మెక్కిడిన సత్త్వమునుండగువాని కిత్తు నీ
పంకజనేత్ర పేత నరపాలకులారా వినుండు చెప్పితిన్. 71

---

* ఋజంబు ఋజంబును

Akella Raghavendra's Online-ias.com

ఆ. అనుచుఁ బలుకుచున్న యవనీశతిలకుని
వాక్యములకు నుబ్బి వసుమతీశ
సుతులు దాముతామె మతిలోనఁ జెలఁగుచు
దగ్గఱంగఁబోయి ధనువుఁజూచి. 72

క. విల్లా యిది కొండా యని
తల్లడపడి సంశయంబు తలకొన మదిలో
బల్లిదు లగునృపనందను
లెల్లరు దొదవుల నుండి రెంతయు భీతిన్. 73

క. కొందఱు దగ్గఱ నోడిరి
కొందరు సాహసము చేసి కోదండముతో
నందంద పెనఁగి పాఱిరి
పందుల గొందులను దూఱి సత్త్వము లేమిన్. 74

సీ. గాలిఁదూలిన రీతిగా నెత్తఁజాలక
తముఁ దామె సిగ్గునఁ దలను వంచి
కౌఁగిలించిన లోను గాక వెగ్గల మైన
భీతిచే మిక్కిలి బీరువోయి
కరముల నందంద పొరలించి చూచిన
గదలక యున్నఁ జీకాకునొంది
పాషాణ మున్నట్టి పగిది మార్దవ మేమి
గానరాకుండినఁ గళవళించి

తే. రాజసూనులు కొందఱు తేజ ముడిగి
జగతి రాజుల మోసపుచ్చంగఁ దలఁచి
జనకుఁ డీమాయఁ గావించెఁ జాలు ననుచుఁ
దలఁగిపోయిరి దవ్వుగా ధనువు విడిచి. 75

సీ. ఇది పర్వతాకార మీవిల్లు కనువిచ్చి
తేఱి చూడఁగ రాదు దేవతలకు

Akella Raghavendra's Online.ias.com

నటుగాక మును శేషకటకునిధను వంట
హరుడె కావలెఁ గాక హరియుఁ గాక
తక్కినవారికిఁ దరమె యాకోదండ
మెత్తంగఁ దగుచేవ యెట్లు గలుగు
దీని దగ్గఱ నేల దీని కోడఁగ నేల
పరులచే నవ్వులు పడఁగ నేల

తే. గుఱుతు సేసియుఁ దమలావుకొలఁదిఁ దామె
తెలియవలెఁ గాక యూరక తివుర నేల
యొరుల సొమ్ములు తమ కేల దొరకు ననుచు
దలఁగి పోయిరి రాజనందనులు గనుతు. 76

వ. అంత విశ్వామిత్ర మునీంద్రుండు రామచంద్రునిముఖావలోకనంబుఁజేసిన.

ఉ. కదలకుమీ ధరాతలమ కాశ్యపిఁ బట్టు ఫణీంద్ర భూవిషా
ప్పదులను బట్టుకూర్మమ రసాతలభోగిఢులీకులీశులన్
వదలక పట్టు ఘృష్టి ధరణీఫణికచ్ఛపపోత్రివర్గమున్
దొదువుచుఁ బట్టుఁడీ కరులు భూవరుఁడీశుని చాపమెక్కిడున్. 78

క. ఉర్వీనందనకై రా
మోర్వీపతి యెత్తు విప్ప నుగ్రునిచాపం
బుర్వింబట్టుడు దిగ్గం
త్యుర్వీధరకిటిఫణీంద్రు లూఁతఁగఁ గడిమిన్. 79

వ. అనుచు లక్ష్మణుండు దెలుపుచున్న సమయంబునఁ 80

మ. ఇనవంశోద్భవుఁడైన రాఘవుఁడు భూమీశాత్మ[1]జాల్ వేడ్కతో
దను వీక్షింప మునీశ్వరుం డలరఁ గోదండంబు చేపంది చి
వ్వన మోపెట్టి గుణంబు పట్టి పటుబాహాశక్తితోఁ [2]దీసినన్
ధునిఁగెన్ జాపము ఘోరఘోషమున వార్ధుల్ ప్రోయుచుండంబునన్. 81

---

1. "జ్ఞాతముల్"
2. "తీసినన్"

ఆ. ధనువు దునిమినంత ధరణీశసూనులు
శిరములెల్ల వంచి సిగ్గు పడిరి
సీత మేను వెంచె శ్రీరామచంద్రునిఁ
బొగడె నపుడు జనకభూవిభుండు. 82

వ. ఇట్లు శ్రీరామచంద్రుని సత్త్వసంపదకు మెచ్చి సంతోషించి జనక మహారాజు వివాహంబు సేయువాఁడై రమ్మని దశరథేశ్వరుని పేరిట శుభలేఖలు వ్రాయించి పంచిన దశరథమహారాజును నా శుభలేఖలం జదివించి సంతోషంబున నానంద బాష్పంబులు గ్రమ్ముదేర మంత్రి ప్రవరుండగు సుమంత్రునిం బిలిపించి సుమంత్రా! యిపుడు మన మందఱమును బయలుదేఱి మిథిలాపట్టణంబునకుం బోయి యట జనకమహారాజునింట మన రామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు వివాహ మహోత్సవము జరుపవలయుఁ గావున వసిష్ఠాదిద్విజవర్యులనుఁ గౌసల్యాదికాంతా జనమ్మును నరుంధతి మొదలుగాఁగల భూసురభార్యలను మఱియు సకలబంధు జనంబును రావించి బంగరుటరదంబుల నిడికొని దోడ్కొనిరమ్మని యంపిన నతండును మహాప్రసాదంబని తత్క్షణమ యంతఃపురంబునకుం బోయి కౌసల్య కైక సుమిత్ర మొదలగు రాజకాంతలను వసిష్ఠాదిద్విజవరిష్ఠులను నరుంధతి మొదలుగాఁ గలముత్తైదువలను మిగిలిన సకల బంధుజనమ్మును రావించి యుక్త ప్రకారమ్ముగాఁ గనకరథమ్ముల పైనిడికొని దశరథమహారాజుకడకుం గొనివచ్చిన యంత దశరథుండు పుత్రద్వయసహితమ్ముగ రథమారోహించి సమస్త సేనాస మన్వితుండగుచు వాద్యఘోషంబులు దశదిశలునిండ నడచుచున్న సమయమ్మున నంతకుముందు జనక భూవల్లభుండు దశరథమహీపాలు నెదుర్కొని తోడితెచ్చి యడుగులు గడిగి యర్ఘ్యపాద్యాదివిధుల విధ్యుక్తంబుగాఁ బూజించి మానితంబుగఁ గ్గానుక లొసంగి సకలసంపత్సంపూర్ణ మయిన నివేశముం గల్పించి యందుఁ బెండ్లివారిని విడియించె నంత నక్కడఁ గనకవికారమైన పీఠమ్ముపైఁ గూర్చున్న సమయమ్మున దేవా! శుభముహూర్తం బాసన్నమగుచున్నది రమ్మని వసిష్ఠుండు సనుదేర నాతఁడు సని రామలక్ష్మణభరతశత్రుఘ్నులకు మంగళస్నానమ్ములఁ జేయించి నిర్మలాంబరాభరణంబు లొసంగి వేర్వేఱ నొక్కముహూర్తమ్మున దనకూఁతు సీతను శ్రీరామచంద్రునకును, దన తమ్ముఁడు కుశధ్వజానికూఁతు మాండవ్యూర్మిళా శ్రుతకీర్తులను భరతలక్ష్మణశత్రుఘ్నులకును నిచ్చి వివాహ

Akella Raghavendra's Online-ias.com

ముంజేసి తన ప్రియతనయల కొక్కొక్కతెకు నూఱేసి భద్రగజమ్ములను వేసేసి తురంగంబులను బదివేలు దాసీజనమ్ముల లక్ష ధేనువులను నరణంబులిచ్చి దశరథాదిరాజలోకమ్మునకు బహుమానమ్ముగా నవరత్నఖచితభూషణమ్ములను జినిచీనాంబరమ్ములను నొసంగి సుగంధద్రవ్యమ్ముల నర్పించి పూజించి యంపె నంత దశరథమహారాజు మరలి యయోధ్యాపట్టణంబునకు వచ్చుచుండగా మధ్యేమార్గంబున. 83

ఆ. పరశురాముఁ డడ్డుపడి వచ్చి మీనామ
మెవ్వరనిన మొలకనవ్వుతోడ
నేను దశరథుండ నితఁడు నాపుత్త్రుండు
రాముఁ డండ్రు పేరు భీమబలుఁడు. 84

వ. అని వినిపించినఁ గ్రోధావేశవశంవదుం డై యప్పు డప్పరశురాముండు రాముం గనుంగొని యిట్లనియె. 85

క. రాముఁడు నేనై యుండఁగ
నామీఁద నొకండు గలిగెనా మఱి యోఁగా
కేమాయె రణ మొనర్పఁగ
రామా రార మ్మటంచు రహిఁ బిలిచెఁ దగన్. 86

వ. పిలిచినతోడనే రామచంద్రుం డతని కిట్లనియె. 87

ఆ. బ్రాహ్మణుండ వందుఁ బరమపవిత్రుండ
వదియుఁగాక భార్గవాన్వయుండ
వైననిన్నుఁ దొడరి యాహవస్థలమున
జగడ మాడ నాకుఁ దగునె చెపుమ. 88

వ. అనిన విని పరశురాముం డిట్లనియె. 89

క్షత్రముఁ దాల్చినం దగునె సన్నుతికెక్కిన బ్రాహ్మణుండవన్
శాస్త్రముగాదు నా కెదిరి సంగరభూమిని నిల్చినంతనే
శాస్త్రములంటలన్ వృథలుగాఁ జేయుదుగాన విప్రుఁడున్
శస్త్రము శాస్త్రముం గలఁడు సాహస వృత్తిని రమ్ము తీరఁగన్. 90

Akella Raghavendra's Online-ias.com

వ. అనిన రామచంద్రుండిట్లనియె. 91

మ. విను మావంటి నృపాలురైనఁ గలనన్ వీరత్వముం జూపఁగా
ననయోఁగాక మహానుభావుఁడవు నిన్నాలంబులో మీఱఁగా
నెనయన్ ధర్మమె మాకుఁజూడమటినీవేమన్న నీమాటకుం
గనలన్ మంచికాదు మాకెపుడు దోర్గర్వంబు మీపట్టునన్. 92

వ. అనిన విని యెంతయు సంతోషించి భార్గవరాముం డారఘురామునితో నిట్లనియె. 93

ఆ. శివుని చివుకువిల్లు శిథిలించె యానాఁడు
విఱిచినాఁడ ననుచు విఱ్ఱవీఁగ
వలదు నేఁడు నాకు వశమైన యీచాప
మెక్కుపెట్టి తివియు మింతెచాలు. 94

ఉ. రాముఁడు గీముఁ డంచును ధరాజనులెల్ల నుతింప దిట్టవై
భీముని చాపమున్ విఱిచి ప్రేలెద వందుల కేమిగాని యీ
శ్రీమహిశేశుకార్ముకముఁ జేకొని * యెక్కిడుదేని నేఁడు నీ
తో మఱి పోరు సల్పి పడఁద్రోతు రణస్థలి నీశరీరమున్. 95

చ. అని తన చేతివిల్లు నృపులందఱుఁ జూడగనంది యీయ నా
ధనువునుఁగూడి తేజముఁ బ్రతాపము రామునిఁజెందె నంతనే
జనవరుఁ డాశరాసనముఁ జక్కఁగ నెక్కిడి వాఁడి బాణ మం
దుననిడి యేది లక్ష్యమనఁ ద్రోవలుచూపినఁ ద్రుంచెగ్రక్కునన్. 96

వ. ఇట్లు మహాప్రతాపంబున [1] నావిలు ద్రుంచి యనర్గళ ప్రతాపమ్మున భార్గవ రాముదోర్గర్వంబు నిర్గర్వంబు గావించి జయమ్ముఁ గైకొన్న కుమారునిం గౌఁగిలించుకొని దశరథుండు కుమార చతుష్టయమ్ముతో నయోధ్యానగరంబుఁ బ్రవేశించి సుఖోన్నతి రాజ్యంబు నేలుచున్న సమయంబున. 97

శా. పారావారగభీరికిన్ ద్యుతిలసత్పద్మారికిన్ నిత్యవి
ప్సారోదారవిహారికిన్ సుజనరక్షాదక్షదక్షారికిన్

---

* యెక్కిడవేని

1. నాదారిఁ ద్రుంచి, దావిలుఁ ద్రుంచి

Akella Raghavendra's Online-ias.com

సారాచారవిచారికిన్ మదరిపుక్ష్మాపాలసంహారికిన్
వీరాసాటి నృపాలకుల్ దశరథోర్వీనాథజంభారికిన్. 98

వ. అని కొనియాడఁ దగిన నృపాలశేఖరుఁడు ధర్మమార్గంబు నొక్కింత యేనిఁ దప్పకుండ రాజ్యంబు సేయుచుండె ననుట విని నారదుని వాల్మీకి మహా మునీశ్వరుండట మీఁది కథా విధానం బెట్టిదని యడుగుటయు. 99

క. జలజాక్షః భక్తవత్సలః
జలజాసనవినుతపాద జలజాతః సుధా
జలరాశిభవ్యమందిర
జలజాకరచారుహంసః జానకినాథా! 100

గద్యము. ఇది శ్రీ గౌరీశ్వర వరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద[1] సూరిజనవినుత కవితా చమత్కారాతుకూరి కేసనసెట్టి తనయ మొల్ల నామధేయ విరచితంబైన శ్రీ రామాయణ మహాకావ్యంబునందు బాలకాండము సర్వము నేకాశ్వాసము.

Akella Raghavendra's Online-ias.com

1. శివశైవాచార సంపన్న- అను విశేషణమొకటి అధికముగా కన్పట్టుచున్నది.

శ్రీ

# రామాయణము

## అయోధ్యాకాండము

క. కందర్పరూప! ఖండిత
కందర్పవిరోధిచాప! కరుణాద్వీపా!
వందితశుభనామా! ముని
సందోహస్తుత్యభూమ! జానకిరామా! 1

వ. శ్రీనారదమునీశ్వరుండు వాల్మీకిమహామునికి కెఱింగించిన తెలుంగు
వినిపించెద నాకర్ణింపుము. 2

సీ. తనసుమంత్రాదిప్రధానులతోఁ గూడి
సుఖగోష్ఠి నుండఁగ సకలజనులఁ
జక్కఁగా రావించి సమ్మదంబున వంశ
గురువుతో దశరథధరణినాథుఁ
డనియె నీభూభార మంతయు నొక్కఁట
నేలితిఁ జాలదె యేకహేళి
నటుగాక పగతుర నవలీలఁ గెల్చితి
నిల్పితి ధర్మమ్ము నిష్ఠతోడ
తే. వింత చాలదె యాశకు నెంత కెంత
రామచంద్రుని ధరణికి రాజు గాఁగ
మీరు సూడంగఁ బట్టంబు భూరిమహిమఁ
గట్టవలయును మంచిలగ్నమునఁ జెలఁగి. 3

తే. అనుచు గురునకుఁ దెల్పి తా నతవిసమ్మ
తమున సౌభాగ్యమంగళదివ్యసమితిఁ

గూర్చుఁ దనుచును మంత్రులకును నెఱుంగఁ
జెప్పి శృంగార మీపురిఁ జేయుఁ డనియె. 4

వ. అట్టిసమయంబున. 5

తే. పగలు ప్రాగ్భాగమున నుండి గగనవీధిఁ
జరమదిక్కున కేఁగఁగా శ్రమముదోఁచి
చెమట పట్టిన స్నానంబుఁ జేయ నరుగు
కరణి నపరాబ్ధిలో దివాకరుఁడు గ్రుంకె. 6

క. మేలిమి సంధ్యారాగము
ప్రాలినచీఁకటియుఁ గలిసి వరుణునివంకన్
నీలముఁ గెంపును నతికిన
పోలికఁ జూపెట్టె నట నభోమణి తలఁగన్. 7

క. వారక కల్పద్రుమమునఁ
గోరకములు పుట్టినట్లు గురుతరకాంతిన్
దారకములు తల సూపెన్
జోరానీకమ్ము మిగుల స్రుక్కుచు నుండన్. 8

ఆ. కారు మొగులురీతిఁ గాటుకచందాన
నీటిభాతి నింద్రనీలమహిమ
మాషరాశిపోల్కి మఱిమఱి యపు డంధ
కారమవని యెల్లఁ గలయఁ బర్వె. 9

వ. అట్టి సమయంబున. 10

చ. తలవరులన్ నిజాధిపుల దర్పకునేర్పునఁ గన్నుఁ బ్రామి య
త్తలఁ దమపిన్నపాపల నుదారత నేర్పడ నిద్రపుచ్చి ని
ర్మలకరకంకణావళులు రట్టుగ దా మటు మ్రోఁగనీక వి
చ్చలవిడిగాఁ జరించి రొగి జారలతాంగులు మధ్యరాత్రులన్. 11

చ. సురతము లేక యుస్సురనుచోటి మగండుడికించు కాంతయున్
పరస మెఱుంగుచంద్రముఖి సావడిదంటయు బేరకత్తెయున్

Akella Raghavendra's Online-ias.com

బరపురుషాభిలాషమును బాయనిభామిని పోరుకట్టునన్
బరఁగినభామలాది యుపభర్తలఁ గూడి చరించి రత్తఱిన్. 12

ఉ. భానుసహస్రసత్కిరణపంక్తుల నుద్భవ మైనయాబృహ
ద్భానుని వెట్టఁబెల్లడఁకఁ బద్ధసుధాంబుధి మీఁదిమీఁగడల్
పూని సమీరుచేఁ దెరల పూర్వదిశం గనుపట్ట దానిపై
ఫేన మనంగ నొప్పె శశిబింబము తూరుపుఁగొండపైఁ దగన్. 13

చ. కుముదములుం జకోరములుఁ గోమలసస్యముఁ జంద్రకాంతముల్
రమణఁజెలంగ వెన్నెల తిరంబుగఁజేసె జగంబులుబ్బఁగాఁ
గమలములున్ వియోగులధికంబుగఁ జోరులుఁ జక్రవాకముల్
రమణఁగలంగ వెన్నెలతిరంబుగఁగాచె జగంబు లుబ్బఁగాన్. 14

ఉ. నారదులైరి సన్మునులు నాకమహీజము లయ్యె భూజముల్
శారదలైరి భామినులు శంకరశైలము లయ్యె గోత్రముల్
పారద మయ్యె నీరధులు పన్నగనాయకు లయ్యె నాగముల్
వారిదవర్గ మెల్ల సితవర్ణము లయ్యెను బండువెన్నెలన్. 15

చ. కొడు కుదయించె నంచలరి కోరిసుధాంబుధి మిన్నుముట్టి య
ప్పుడు జగమెల్లఁగప్పె ననఁబూర్ణత నొందెను సాంద్రచంద్రికల్
పుడమికిఁ బాలవెల్లి గతిఁ బొల్పెసలారఁగఁ జంద్రుఁడొప్పె న
య్యుడుపతి మేనిమచ్చయును నొప్పెఁబయోనిధి పద్మనాభుఁడై. 16

వ. అట్టిసమయంబున. 17

ఉ. కోరి చకోరదంపతులు గుంపులుగుంపులు గూడి రంతులన్
బేరిన చంద్రికారసముఁ బేర్కొనిమార్కొని పొట్టనిండగాఁ
బారణసేసి పెన్పయలఁ ద్రాఁకుచుఁ జంచుపుటంబు లెత్తుచున్
బేరెము వారుచుండె మదిఁ బ్రేమ జనింప వధూటికోటికిన్. 18

ఉ. వెన్నెలతీఁగలన్ గొనలు వేడుకముక్కులఁ ద్రుంచి తెచ్చి దా
ర్కొన్నప్రియాంగనాతతికిఁ గూరిమి నోరికి నిచ్చి కేళికిన్
సన్నపుఁగంఠనాళముల సన్నలు పేసి సుఖించె వింపుగన్
దివ్వనిచంద్రికాంతమణితిన్నెలమీఁదఁ జకోరదంపతుల్. 19

Akella Raghavendra's OnlineJas.com

తే. పాకశాసని సేవంతిబంతి దివికి
నెగుర వైచినకైవడి నేమి చెప్పఁ
బాండువర్ణంబుతోఁ బూర్వభాగమందు
నొంపు మీఱంగ వేగురుఁజుక్క వొడిచె. 20

వ. అట్టిసమయంబున. 21

క. రవి యుదయించెను జనుఁడీ
దివియలు నక్షత్రసమితి తిమిరము శశియున్
బవ లేమిటి కనురీతిని
గువలయమున గూళ్లఁ గోళ్లు గూయ మొదలిడెన్. 22

చ. వదలక పద్మరాగమణి వట్రువ గాత్రిలఁగఁ బట్టి నేర్పు పెం
పొదవఁగఁదూర్పుకొండపయికొప్పుగఁదెచ్చిజగద్గురుండు దాఁ
ద్రిదశవరేణ్యుకట్టెదురఁ దేఁకువ నిల్పినదర్పణంబు నా
నుదయము నొందె భానుఁడు సముజ్జ్వలకోకసదప్రదీప్తులన్. 23

వ. ఆరాత్రి రాజశేఖరుని చిత్తంబు వచ్చునట్టుగా మెలంగి యాతఁడు దన్ను మెచ్చు టెఱింగి కైక యిట్లనియె. 24

ఆ. వసుమతీశ! నాకు వర మిచ్చి తప్పుట
తగవు గాదు మీకుఁ దలఁపులోన
మఱచినా రదేమొ మన్నించి తొల్లింటి
యావు లీయవలయు నీక్షణంబ. 25

క. జననాథ! నాకుమారుని
వినుఁడీ పట్టంబు గట్టి వేవేగను రా
ముని మునిఁగా ననుపుఁడు మఱి
వనమునఁ బదునాలుగేండ్లు వర్తింపంగన్. 26

వ. అని ప్రార్థించిన విని పార్థివేంద్రుడు డిల్లపడి తల్లడిల్లుచు నుల్లంబు గలంగి మునుంగిడి యచ్చేడియ పలికిన పలుకులకు మాఱాడనోడి మిన్నక యున్న సమయంబున సుమంత్రుం డేతెంచి స్వామీ! రామచంద్రునిఁ బట్టంబు గట్ట సుము

Akella Raghavendra's Online-ias.com

హూర్తం బాసన్నంబయ్యెఁ గావున మిమ్ము నచ్చటికి విచ్చేయ నవధరింపుడని వసిష్ఠభగవానుండు విన్నవించుమని పంపెనని చెప్పిన విని కైక యిట్లనియె. 27

మ. అనిలోమున్న నృపాలు చిత్తమున కే నాహ్లాదముంగూర్చి నా
తనయుం బట్టముగట్టి రాఘవుని బద్నాల్గేండ్లు కాంతారమం
దునువర్తిల్లఁగఁబంపఁగొన్న వరమున్ ద్రోయంగరాదెంతయు
న్వనసీమన్ మునివృత్తినుండుమనుఁడీ వైళంబ యారామునిన్. 28

క. అని పలుకు కైకపలుకులు
విని వేగమ మరల వచ్చి విన్నదనంబున్
దనుక వసిష్ఠుని తోడన్
వినుపించె సుమంత్రుఁ డట్టివిధ మేర్పడగన్. 29

వ. అనిన విని వసిష్ఠాది ప్రముఖులును సుమంత్రాది ప్రధాన జనంబులును సైన్యంబులును బరివారంబులును విన్ననైయున్న నాసన్న యెఱింగి రామచంద్రుండు రాజచిహ్నంబులు త్యజించి జటావిభూతి వల్కలంబులు దాల్చి ధనుర్ధరుండై యున్నంత లక్ష్మణుండు భూపుత్త్రికయును దోడం జనుదేరఁ దల్లులకు నమస్కరించి వసిష్ఠానుమతంబున నాశీర్వచనంబులుగైకొని యాస్థానంబు వెలువడి యరణ్యంబున కరుగునప్పుడు పురజను లందఱును బురపురం బొక్కుచు దశరథ మహారాజును దూషించుచుఁ గైకను నిందించుచు మూఁకలై శోకించుచుండ నదియంతయు విని దశరథుండు పురోహితామాత్య బంధు వర్గంబులతో శ్రీరామచంద్రుఁ డేఁగిన త్రోవం జన్నంత నారాముఁడు దూరంబునం జనియె దశరథుండును మరలి వచ్చి పుత్త్రశోకంబున నాకపురంబునకుం జనియెఁ దదనంతరంబ. 30

ఆ. చనుచు రాఘవుండు స్వర్ణదియొద్దున
గుహునిఁ గాంచి యతనిఁ గుస్తరించి
పడవ కోడఁ బెట్టి దాఁటింపు మనవుడు
నట్ల చేయఁదలఁచి యాత్మలోన. 31

చ. సుడిగొని రాము పాదములు సోఁకినధూళివహించి రాయి యే
ర్పడ నొకకాంత యయ్యెనఁట పన్నుగ నీతవిపాదరేణు వి
య్యెడ పడి నోడసోఁక నిది యేమగునోయని పంశయాత్ముఁడై
కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్.

Akella Raghavendra's Online-ias.com

వ. ఇట్లు శ్రీరామచంద్రుని శ్రీపాదంబుల నీటఁగడిగి యోడపైనెక్కించి యమ్మువ్వుర నవ్వలికి దాఁటించిన నాక్షణంబ. 33

ఉ. రాజకులావతంసుఁ డగురాముఁడు తమ్ముఁడుఁ దాను నాభర
ద్వాజమహామునీంద్రు పదవారిజముల్ గని మ్రొక్క నాతఁడం
భోజహితాన్వయాబ్ధిపరిపూర్ణ సుధాకరుఁడైన రామునిం
బూజ లొనర్చి కందఫలమూలములం బరితృప్తుఁ జేసినన్. 34

వ. సంతసించుచు నారాత్రి యచ్చట నివసించి మఱునాటి దినమర్కోద యమ్మున. 35

ఆ. ముదముతోడఁదమ్ము మునిభరద్వాజుండు
భక్తిననుప రామభద్రుఁడపుడు
చనియె భ్రాతృదార సహితుఁడై సన్ముని
కూటమునకుఁ జిత్రకూటమునకు. 36

మ. ఘనుఁడా రాముఁడు చిత్రకూటమున వేడ్కం జేరి యున్నంతలో
నన దంతావళవాజిరత్నరథనానాయోధసంఘంబుతో
డనమాత్యద్విజ బంధువర్గములతోడం గూడి వాద్యంబులం
జనుదెంచెన్ భరతుండు రాముకడకున్ సద్భక్తి యేపారఁగన్. 37

సీ. చనుదెంచి రాముని చరణంబులకు మ్రొక్కి
కైకేయి చేసినకపటమునకు
నగరంబు విడిచి యీపగిది ఘోరారణ్య
మున కిట్లు రానేల మునులపగిది
నది గాక మనతండ్రి యత్యంత మైనట్టి
పుత్త్రశోకంబునఁ బొక్కిపొక్కి
త్రిదశాలయమ్మున దేవేంద్రుఁగనఁబోయె
నని చెప్ప విని రాముఁ డంతలోన

తే. భరతలక్ష్మణశత్రుఘ్న ధరణిసుతలఁ
గూడి దుఃఖించి దుఃఖించి కొంతవడికి
వాప్తవర్గంబుచే మానె నంతమీఁద
భరతుఁ డిట్లనె శ్రీరామభద్రుతోడ. 38

Akella Raghavendra's Online-ias.com

తే. రాజు లేకున్నచో మఱి రాష్ట్రమందుఁ
గార్య మెట్లౌను మీ రెఱుంగనిది గలదె
నేఁటిసమయానఁ బట్టంబు నిలుపుకొనఁగఁ
దిరిగి విచ్చేయుఁ డనుడు నాభరతుతోడ. 39

వ. శ్రీరామచంద్రుం డిట్లనియె. 40

చ. జనకుడు సేసినట్టిమితిఁ జక్కఁగఁ దీర్చికడంక నేను వ
చ్చినగుఱిదాఁక భూతలము జేకొని రాజ్యముఁ జేయుమాట గా
దనకు మటన్న నొల్ల నన నాతనికిం దనపాదుకాయుగం
బొనరఁగ నిచ్చిపొమ్మనుచు నుర్వికి రాజుగఁబంచె సొంపుగన్. 41

వ. ఇట్లు భరతుని భరతాగ్రజుం డనునయించి మరలించి నాకలోక కవాటంబగు చిత్రకూటంబు కదలి సౌమిత్రిభూపుత్రులం గూడి పోవునెడ నటవీ మధ్యంబున విరాధుండను దైత్యాధముం డపరాధంబుచేసి దిగ్గన డగ్గఱి జగతీతనూభవనెత్తుకొని గగన మార్గంబున కెగిరిపోవునెడ వాఁడిబాణంబున వానికంఠంబును ద్రుంచి గారుడాస్త్రంబున మరల నొయ్యన జనకనందనందించి భయంబు వాపి ప్రియంబుసూపి యొయ్య నొయ్యన నయ్యెడనున్న యత్రిమహాముని యాశ్రమంబు నకుం జని ఘనంబున నాఘనుండు సేయు పూజలం గైకొని రామచంద్రుం డచ్చటి మునీంద్రులకు దైత్యులవలనిభయంబు లేకుండ నభయంబిచ్చి మన్ననం గొన్ని దినంబు లాయామునుల యాశ్రమంబుల నిలుచుచు వారలనుప శరభాదిమృగోత్కర శరణ్యంబగు నరణ్యంబుఁ జొచ్చిపోయెనని చెప్పిన విని నారదుని వాల్మీకి మునీంద్రుండటు మీఁది కథావిధానం బెట్టిదని యడుగుటయు. 42

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకినాథా! 43

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగ మార్చన వినోద * సూరిజనవినుత కవితా చమత్కారాతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితంబైన శ్రీరామయణ మహాకావ్యంబునం దయోధ్యాకాండము సర్వము నేకాశ్వాసము.

---

* నిత్యశైవాచార సంపన్నఅను విశేషణము అధికముగా కన్పట్టు చున్నది.

శ్రీ

# రామాయణము

## అరణ్యకాండము

క. మునిదత్తధనుర్వేదా!
మునినాథప్రియసతీసుపూజితపాదా!
జనకార్చిత గుణధామా!
సనకాది స్తవ్యనామ! జానకిరామా! 1

వ. శ్రీ నారదమునీశ్వరుండు వాల్మీకి కెఱింగించిన తెఱంగు విని
పించెద. 2

చ. ఇతనికిఁ బాదచారితన మేటికి వచ్చెనొ పట్టభద్రుఁడీ
సతి నవరూపరేఖలను జిక్కని దయ్యెను నిట్టిదుర్దశల్
ప్రతివసియించు టెట్లొ రతిరాజసమానుల వీరినేల యీ
గతిఁబడఁద్రోచె బ్రహ్మయని కొందఱు చెంచెత లమ్మహాత్ములన్. 3

సీ. నడువనేరనికొమ్మ యడుగులు పొక్కులై
శర్కరస్థలముల శ్రమముఁజెందె
వీచిన చేతుల వ్రేళ్ళ నెత్తురు గ్రమ్మి
పొటమర్లు కెంపులపోల్కి నమరె
వడిగాలి సుడివడి వాడిన లేఁదీఁగ
భావంబునను మేనిచేవ తఱిగెఁ
బూర్ణచంద్రుని కాంతి పున్నమవేకువఁ
గనుపట్టుగతి మోము కళల విడిచె

తే. ధవుని నడుగడుగునకుఁ గైదండఁ గొనుచు
నెగడుదప్పిని నిట్టూర్పు లెగసి చిగురుఁ
బెదవు లెండఁగ నీడకు నదిల గొనుచు
మనసులోఁ జేవ యాఁతగఁ జనెదువేళ. 4

Akella Raghavendra's Online-ias.com

వ. ఇట్లు సీతయు రాముండును సత్యభూషింబోని సౌమిత్రియుఁ గతిపయ
ప్రయాణంబులఁ బంచవటికిం జని సంతోష భరితాంతరంగులై. 4

క. అచ్చటఁ గొన్నిదినంబులు 5
ముచ్చటపడి యుండఁ దలఁచి మునిముఖ్యులచే
మచ్చికఁ దమ్ముఁడుఁ దానును
గ్రచ్చఱ నొకపర్ణశాలఁ గావించి తగన్.

ఆ. అందు రామచంద్రుఁ డనుజన్ముఁడును దాను 6
గొన్నివాసరంబు లున్నవేళ
వికృతవేషధారి వేవేగ నటఁజొచ్చె
నాక యనెడి దైత్యనారి యోర్తు. 7

వ. రామునిఁగని ప్రేమాభిరామం బగుమనంబునఁ దన్నుఁగామించి
రమ్మనిన రామచంద్రుండు సౌమిత్రిం జూప నతఁడు మున్ను మాయన్న నభిల
షించుటజేసి నాకు దోషంబుగాన నీవా రామునికడకు మరలఁ జనుమన్న నది యట్ల
చేసిన రామచంద్రుండు దిరుగ లక్ష్మణుం జూపినఁ గోపించి యారాక్షసి మను
జేంద్ర సూనుల దండింపందలంచిన నెఱింగి భరతానుజుండు దానినాసికా కర్ణంబులు
గోసివైచిన నది నెత్తురు జొత్తిల్లఁ బసిపాపయుంబోలి యేడ్చుచు ఖరదూషణాది
సోదరులకుం జెప్పిన వారు గనలి రాక్షణంబున. 8

క. పదునాల్గువేల దైత్యులు
మదమున సోదరులు గొల్వ మండుచు శూరా
స్పద మగురథనికరముతోఁ
గదనంబున రాముకడకు ఖరుఁ డేతెంచెన్. 9

ఆ. ఖరుఁడు వచ్చివట్టి కలకలం బాలించి
రాఘవుండు తనదురమణియొద్దఁ
దొలఁగ కుండ ననుజుఁ దోడుగాఁ గాఁపుంచి
బెదర కంతఁ గలని కెదిరి నిలిచె. 10

శా. ఆవేళన్ ఖరుఁడుగ్రవృత్తిలయ కాలాభీలఘోరాకృతుల్
దైవారన్ గజవాజి సంఘములతో దైత్యాళితో భూరిరో

Akella Raghavendra's
Online-ias.com

షావిర్భూత మనస్కుఁడై నడిచె గర్వారంభ సంరంభుఁడై
దేవవ్రాతము భీతిఁబొంది కలఁగన్ దేజంబు సొంపారఁగన్. 11

వ. ఇట్లు ఖరుండు సనుదెంచి భయంకరంబుగా రణంబు సేయు సమయంబున. 12

ఉ. అప్పుడు రామచంద్రుఁడు భయంకర రౌద్ర రసంబు కన్నులన్
నిప్పులు రాల్చుచున్ నెరయ నిర్జరులార్వ విచిత్ర శస్త్రముల్
కుప్పలు గాఁగ నేయుచునుఁ గుంజరవాజి రథావళుల్ ధరన్
దప్పక కూల్చుచున్ రుధిరధారలఁ దేల్చె సురారిసంఘమున్. 13

వ. అట్టిసమయంబున. 14

క. కరితురగస్యందనములఁ
బరివారము దెగినపిదపఁ బటురోషమునన్
గరకరపడుచును నెదిరిన
ఖరకరవంశజుఁడు ద్రుంచె ఖరునిశిరంబున్. 15

వ. త్రుంచినం గని తీవ్రంబుగా. 16

క. ఘోషించి రామచంద్రుని
దూషించుచు వచ్చినట్టి దూషణు మీఁదన్
రోషించి సురలు కడు సం
తోషింపఁగ వానికరముఁ ద్రుంచెఁగడంకన్. 17

ఆ. త్రిశిరుఁ డంతఁ గనలి దివ్యాస్త్రసంపద
రాముమీఁదఁ జూపి రణ మొనర్చె
మూఁడుశరము లతఁడు ముదలించి యట వాని
మూఁడుతలలఁ ద్రుంచె మొగ్గరముల. 18

వ. ఇట్లు ఖరాది రాక్షసుల శిక్షించి జయంబు గొని ధను వెక్కుడించి మరల పర్ణశాల కేతెంచి తమ్ముఁడును దానును సమ్మదంబునం గలిసియున్న సమయంబున. 19

Akella Raghavendra's Online-ias.com

చ. చలమున నంత శూర్పణఖ సయ్యన లంకకు నేఁగి రావణుం
గొలువునఁ గాంచి మ్రొక్కి తనకున్ నృపసూనులు సేసినట్టిచేఁ
తలు వినుపించి వారి తమతంత్రి యసుఙ్ఞను వచ్చి కానలోఁ
పలఁ దిరుగాడు చందములఁ బన్నుగనేర్పడఁ జెప్పి పిమ్మటన్. 20

క. ఆరాముభార్యవిభ్రమ
మేరాజతనూజలందు నెఱుఁగము[1] విని మున్
ధారుణిలోపలఁ గ మిను
లారమణికి సాటిఁ బోల రభినుతిఁ జేయన్. 21

సీ. కన్నులు గలువలో కాముబాణంబులో
తెలివిగా నింతికిఁ దెలియరాదు
పలుకులు కిన్నెరపలుకులో చిలుకల
పలుకులో నాతి కేర్పఱుపరాదు
అమృతాంశుబింబమో యద్దమో నెమ్మోము
తెంపుతో[2] జెలికి భావింపరాదు
కుచములు బంగారుకుండలో చక్రవా
కమ్ములో చెలి కెఱుగంగరాదు

తే. కురులు నీలంబులో తేఁటిగుంపు లొక్కొ
పిఱుదు పులినంబొ మన్మథు పెండ్లియరుఁగొ
యనుచుఁ గొందఱు సంశయం బందుచుండ
వెలఁది యొప్పారు లావణ్యవిభ్రమముల. 22

క. కలదో లేదో యనుచును
బలుమఱు నెన్నడుము జూచి పలుకుదు రితరుల్
బలిమో కలిమో యనుచును
బలుమఱు జఘనంబుఁ జూచి పలుకుదు రితరుల్. 23

---

1. విను. ఈ పాఠాంతరమే సమంజసముగ నున్నది.
2. సతికి.

సీ. షట్పదంబులపైకి సంపెంగ పువ్వుల
జలజాతములపైకిఁ జందమామఁ
గిసలయంబులపైకి వెసఁ గలకంఠముల్
సింధురమ్ములపైకి సింహములను
దొండపండులపైకి దొడ్డరాచిలుకల
నలరుఁదూఁడులపైకి హంసవితతిఁ
బండువెన్నెలనిగ్గుపైకిఁ జకోరముల్
పవనంబుమీఁదికిఁ బాపతేని

తే. మరుఁడు వైరంబు చేసినమాడ్కి నలక
నాసికాకరానన చరణస్వనములు
వరపయోధరమధ్యోష్ఠవచనబాహు
గమనహాసాక్షులూ ర్వారు రమణి కమరె. 24

క. బంగారు నీరు నిలువునఁ
బొంగారుచు నుండ నజుఁడు వోసినమాడ్కిన్
శృంగార మెల్ల నిలువునఁ
బొంగారుచు నుండఁ గరఁగి పోసిన మాడ్కిన్. 25

వ. అట్టివయోరూపంబులను గనుపట్టునట్టి యక్కాంతా రత్నంబు నీకు సిద్ధించె నేని నీవు త్రిభువనంబులు విజయంబు చేసిన యంతకన్నను సంతసింతు వన్న విని కామాశుగంబులం దగిలి కామాంధుండై కన్నులు గానక యన్నుకొని తన్నుఁదా మరచి యొడ్డోలగంబు సాలించి పుష్పకంబనువిమాన రత్నంబుపై నధిష్ఠించి మారీచుకడకుం జని ప్రార్థించి నీవు కనకమృగంబవై జన స్థానంబునకుం జని దశరథనందనుండగు శ్రీరాముండున్న పర్ణశాలకడం బొడకట్టిన నతండును నిన్ను వెనుకొను నీవు నతని నతిదూరంబుగాఁ గొనిపోయి మాయంబైన నేను రాముని భార్యంగొనివత్తు ననిన విని సమ్మతిలక మాఱుత్తరం బిచ్చిన రావణుండుగ్రుండై మండిపడ నతం డాసన్నయెఱింగి కనకమృగ రూపంబును ధాల్చె నాక్షణంబున. 26

క. ఒడ లెల్లను బంగారము
బొడ లెల్లను రత్నసమితి బోలినమెఱపుల్

Akella Raghavendra's Online-ias.com

నడ లెల్ల నెఱపి మెలఁగెడు
కడ లెల్ల విలాసరేఖ కళలందొప్పెన్. 27

వ. ఇట్లు కనకమృగాకారంబు గైకొని పర్ణశాలకడకుం బోయిమెలంగు నప్పుడు. 28

క. కనియును వినియును నెఱుఁగము
కనకమృగం బనుచు వేడ్కఁ గడలుకొనంగన్
గనఁగ మృగం బద్భుత మిది
కనకమృగం బేమిసేయఁ గలదో మీఁదన్. 29

వ. అని కనుఁగొన్న మునిజనంబులు మనంబులం దలంకునెడ నా మృగంబును మృగనేత్రయగు ధాత్రీపుత్రి గని దాని నభిలషించిన నాసన్న యెఱింగి సౌమిత్రిని భూమిజకుం దోడిడి శ్రీరామచంద్రుండు దాని వెనుకొని చను చున్న యవసరమ్మున. 30

సీ. తనుఁబట్ట నొయ్యన వెనుకొని చనుదెంచు
నిలఁబోనితలఁపు దాఁదెలిసి తెలిసి
చేరువ మెలఁగుచుఁ బారి మేయుచు డాసి
మెల్లన యంతంత మెలఁగి మెలఁగి
తననీడఁ గనుఁగొని తానె దిగ్గనదాటి
భయమునఁ బరువెత్తి పఱచి పఱచి
యెడదైనఁబోవక యెలయించి కనుఁగొన్నఁ
దరువుల నొయ్యన నొరసి యొరసి
తే. చెవులు నిక్కించి చూచుచుఁ జెలఁగి చెలఁగి
పోవ రాముండు దవ్వుగాబోయి పోయి
యెలమి మాయామృగం బని యెఱిఁగి మదిని
దీనిఁ జంపుదుఁగా కని తెగువ చేసి. 31

క. ఏచినకినుకను బలు నా
రాచము సంధించి డాసి రాఘవుఁ డామా
రీచుని దైత్యాధముఁ గుల
నీచునిఁ గూలంగ నేసె నిర్జరు లలరన్. 32

Akella Raghavendra's Online-ias.com

వ. వాఁడునుం గూలునవ్వేళ "హా! లక్ష్మణా!" యనురవంబుం జేసిన నాధ్వని విని జనకనందన మనంబున నులికి లక్ష్మణుం బిలిచి మీయన్న కేమి కీడు వాటిల్లెనో కాని నిన్నుఁ దలంచె నీవునుం బోయి మీ యన్నకుశలస్థితిం దెలిసికొని రమ్మనిన నతండు తలంకక నామెతో నిట్లనియె. 33

ఉ. ఏమిటి కింతభీతి మది నీవగ తోఁచుట యేమి నీకు నో
భామిని రామునందు నొకభారము చెందదు చెందెనేనియున్
భూమివడంకదే నభము బోరన మోయదె వార్ధు లింకవే
తామరసాప్తసోమ గ్రహతారక లెల్లను నేల డుల్లవే. 34

ఉ. అంత పనయ్యెనేని దనుజాంతకు నంతకు మన్మథాంతకున్
బంతము మీఱఁగాఁ గలఁచి పన్నగమర్త్యసురేంద్రలోకముల్
బంతులు గట్టి యాడ్చి రిపుభంజను రామునిఁ గందకుండ న
ర్పింతును నీకుఁ దెచ్చి మదిభీతిని బొందకు మమ్మ జానకీ. 35

వ. అని లక్ష్మణుండు పలికిన విని జనక రాజనందన కినిసి వినరాని మాటలం దూలనాడిన మనంబునం గందికుందుచు శ్రీరామచంద్రుం డేగిన మార్గంబునన చనియె నంత నిక్కడ. 36

క. సన్న్యాసివేష మలరఁగ
నన్యాయము తలఁచుకొనుచు నసురేంద్రుఁడు దాఁ
గన్యారత్నముఁ గని సౌ
జన్యమునన దీవన లిడె శాంతము దోఁపన్. 37

క. దీవించుచు మునియే యని
భావింపుచుఁ జేర వచ్చుభామిని నపు డా
రావణుఁడు రథముమీఁదికి
వేవేగమ తిగిచి గగనవీథినిఁ జనియెన్. 38

వ. అయ్యవసరంబున. 39

ఆ. అసుర గొంచుఁబోవ నవనీతనూభవ
వెఱచి పలికె దిశలు వినఁగ నంత

సీత నాదు పేరు శ్రీరామభార్యను
నన్నుఁ గావరయ్య మిన్న కిపుడు. 40

వ. అని మఱియును. 41

ఆ. దేవగణములార! దిక్పాలవరులార!
వృక్షజాతులార! పక్షులార!
కుటిలదానవుండు గొంపోవుచున్నాఁడు
కరుణతోడ నన్నుఁ గావరయ్య. 42

ఆ. అనుచుఁ బలుకుచున్న నార్తనాదంబు
విని జటాయు వనెడి విహగనాథుఁ
డరుగుదెంచి కలహ మత్యుగ్రముగఁ జేయ
రావణుండుఁ బక్షిరాజుఁ దాఁకె. 43

చ. అసురవిభుండు వైచు నిశితాస్త్రముఖంబులనొచ్చి పక్షియున్
గొసరక దైత్య నాయకుని గుండెను నొవ్వఁగఁ దన్ను నంతలోఁ
గసరి నిశాచరుండు కరఖడ్గముఁ ద్రిప్పుచు బక్షయుగ్మమున్
వసుధఁ బడంగఁ ద్రుంచి కడు వైళమ లంకకు నేఁగునత్తఱిన్. 44

క. వనచరు లొకగిరిచేరువ
వనమునఁ జరియింపఁ జూచి వసుధాసుతయున్
దనచీరకొంగుతునుకను
దనసొమ్ములు మూటగట్టి ధరపై వైచెన్. 45

క. అంతట దైత్యుఁడు లంకకుఁ
బంతముతో నేఁగి శింశుపాతరు క్రిందన్
సంతసమున నిడి దానవ
కాంతల నవనిజకుఁ దోడు కావలి యుంచెన్. 46

ఉ. అత్తఱి రాఘవుండు తను నాసలఁ బెట్టుచుఁ గొంచుఁ బోవఁగాఁ
జిత్తము నొచ్చి యామృగము శీఘ్రమునం బడనేసి దానిపై
తిత్తిని దీసి వింటికొనఁ దెచ్చెడివేళఁ బయోజమిత్రవం
శోత్తముఁడుల్కఁ గానఁబడె నొక్కెడలక్ష్మణుఁ దన్నదృష్టికిన్. 47

Akella Raghavendra's Online-ias.com

చ. పొడగని గుండె ఝల్లుమన బుద్ధిఁ గలంగుచు రామచంద్రుఁడ
య్యెడఁగడు నుగ్రుఁడై పలికె నీవిటు నాకడ కేల వచ్చి త
క్కడ నిను బర్ణశాలకడఁ గావలి యుంచినచోట నొంటిమైఁ
బడతుక డించి రాఁదగునె వన్యమృగోత్కర మధ్యసీమకున్. 48

ఆ. అనుచుఁ బలుకుచున్న యన్నకుఁ బ్రణమిల్లి
వినయవాక్యఫణితి విన్నవించె
జనకతనయపలుకు చందంబు మొదలెత్తి
లవముఁ దప్పకుండ లక్ష్మణుండు. 49

వ. చెప్పిన మాటలువిని విన్నఁదనంబున జిన్నఁబోవుచు దుర్ని
మిత్తంబులంగనుచుఁ దత్తరంబున నాశ్రమంబునకుఁ జని యక్కడ. 50

ఆ. పర్ణశాలలోనఁ బరికించి పరికించి
సీత గానఁ బడమిఁ జిన్నవోయి
చిత్తమంతఁ గలఁగి శ్రీరామచంద్రుండు
పలువరింపఁ జొచ్చె బ్రమసి బ్రమసి. 51

సీ. నీదృగ్విలాసంబు నెఱి నభ్యసించెదు
గురుకుచఁ గానవే హరిణవిభుఁడ!
నీమంజులాలాప నిచయంబుఁ గైకొన్న
సుకుమారిఁ గానవే పికకులేంద్ర!
నీనిండుసత్కాంతి నెమ్మోము గలయట్టి
రుచిరాంగిఁ గానవే రోహిణీశ!
నీపక్షవిస్ఫూర్తి నెనయుధమ్మిల్లంబు
గలయింతిఁ గానవే యళికులేశ!

తే. స్తనభరంబున నీపొల్కఁ దనరినట్టి
యతివఁ గానవె చక్రవాకాధినాథ!
నెఱయ నినుఁబోలునెన్నడ నేర్చినట్టి
రమణిఁ గానవె నీవు మరాళరాజ! 52

Akella Raghavendra's Online-ias.com

సీ. ఘనసారభూజంబ! కానవే నీవంటి
గంధంబు గలయట్టికరటియానఁ
గదళీకాంతరురాజ! కానవే నీయట్టి
మెఱుఁగుఁ బెందొడల మా మీన నేత్ర
విలసిల్లు చంపకవృక్షంబ! కానవే
లలి నీదుపుష్ప విలాసనాసఁ
గమనీయలత! నీవు కానవే నీయట్టి
కరములు శోభిల్లుకంబుకంఠిఁ

తే. గ్రముకధరణీరుహాధీశ! కానవయ్య
నీఫలస్ఫూర్తి కంఠంబు నీలవేణిఁ
గళికలను మించునవకుంద! కానవమ్మ
నీదు కోరిక నిభదంత నీరజాస్య. 53

సీ. వనిజాస్య! నినుఁగూడి వర్తించునతిఘోర
వనములు శృంగారవనము లగును
పడఁతి! నీతోఁగూడి పవళించుకర్కశ
శయ్యలు పూవులశయ్య లగును
గలకంఠి! నీచేతికందమూలాది భో
జనములు మధుర భోజనము లగును
హరిమధ్య! నినుఁ గూడి చరియించునటువంటి
తపములు సత్పుణ్యతపము లగును

తే. గెరలి నీతోడఁ గూడి భోగించునట్టి
భోగమంతయు దేవేంద్రభోగ మగును
సుదతి! పొడకట్టఁగదె నాకుఁ జూడవలయుఁ
గన్నులకుఁ గానఁబడ వేమి కమలనయన! 54

వ. అని మఱియును. 55

సీ. ఏమృగంబును గన్న నేణాక్షిఁ గానవే
యని పెక్కుభంగుల నడిగి యడిగి

యేపక్షిఁ గనుఁగొన్న నెలనాఁగ గానవే
యని పెక్కుభంగుల నడిగి యడిగి
యేమ్రానుఁబొడగన్న వామాక్షిఁ గానవే
యని పెక్కుభంగుల నడిగి యడిగి
యేగట్టుఁ బొడగన్న నిభయానఁ గానవే
యని పెక్కు భంగుల నడిగి యడిగి

ఆ. కలఁగు భీతి నొందుఁ దలఁకుఁ జిత్తములోన
సొలయు మూర్ఛఁబోవు వలయు నలఁగు
సీతఁ గానఁబడమి శ్రీరామచంద్రుండు
విరహతాపవహ్ని వేఁగి వేఁగి. 56

వ. ఇట్లు సీతావియోగంబునకుఁ బలవరించుచున్న యన్నం గని సౌమిత్రి యిట్లనియె. 57

క. దీనునికైవడి నూరక
మానము సెడి వగవనేల మనుజేశ్వర! యీ
కాననభూముల వెదకఁగఁ
గాననిమీఁదటను వగవఁగా దగు మనకున్. 58

వ. అని ప్రతాపించి కోప మాఁపుకోఁజాలక కన్నులు జేగురింప నన్నతో నిట్లనియె. 59

ఉ. వ్రచ్చెద నాకలోకమునవారలగుండెలు నాగలోకమున్
గ్రొచ్చి యహీంద్రవర్గమును గూల్చెదఁ గవ్వపుగొండ కైవడిన్
ద్రచ్చెద మర్త్యలోకము నుదారత నేగతి నైనఁ గ్రమ్మఱం
దెచ్చెద సీత నీక్షణమ దేవరచిత్తము మెచ్చునట్లుగన్. 60

వ. అని యిట్లు పలికి మఱియును. 61

ఉ. చించెద దైత్యసంఘములఁ జిందఱవందఱఁ జేసి బ్రహ్మ బా
ధించెద లోకపాలకులఁ ద్రెళ్ళఁగ నేసెద భూతలమ్ము గ్ర
క్కించెద శైలజాలముల గీటడఁగించెద భూమినందనన్
గాంచెదఁ దల్లడిల్లకుము కంజహితాన్వయ వార్ధి చంద్రమా. 62

Akella Raghavendra's Online-ias.com

క. భూతలమును నాకసమును
పాతాళంబును వెదకియొ బాధించియొ నే
సీతను దెచ్చినపిమ్మట
నీతమ్ముఁడ ననుచు మెచ్చు నిఖిలోర్వీశా. 63

వ. అని పలుకుచున్న తమ్మునిశౌర్య ధైర్యాదిగుణంబులకు సంతోషించుచు జనస్థానంబు వెడలి జనకనందన నన్వేషించుచు దక్షిణాభిముఖులై చనుచు ముందట. 64

క. పక్షములుఁ గాళ్ళుఁ దుఁనిగిన
పక్షీంద్రునిఁజూచి రామభద్రుఁడు మదిలో
రాక్షస మాయయొ యనుచును
శిక్షింపఁ దలంచునంత శీఘ్రమె పలికెన్. 65

క. నీతండ్రికి నతిమిత్త్రుఁడ
నోతండ్రీ! నన్ను నేయ నుచితమె నీకున్
నాతగు పేరు జటాయువు
సీతాధిప! నన్ను నెఱుఁగు చిత్తములోనన్. 66

వ. అని చెప్పి వెండియు నాజటాయు విట్లనియె. 67

మ. వినుమో రాఘవ! పంక్తికంధరుఁడు దోర్వీర్యంబు సంధిల్లగా
జనకక్ష్మాపతి నందనన్ గొనుచు స్వేచ్ఛావృత్తితో నేఁగుచో
వనితా రత్నము దీనయై పలుకు తద్వాక్యంబు లేర్పాటుగా
విని పోరాడఁగఁ బ్రాప్తమయ్యె మఱి యీవేషంబు భూమీశ్వరా. 68

క. అని సీతతెఱఁగుఁ దనపని
జననాయకుఁడైన రామచంద్రునితోడన్
వినిపించి యాజటాయువు
తనువెరియఁగ నంత గాలధర్మము నొందెన్. 69

వ. ఇట్లు రామచంద్రునకు సకల వృత్తాంతమును నెఱింగించి శరీరంబు విడిచిన యప్పక్షిరాజునకు భక్తి పూర్వకంబుగా నగ్ని సంస్కారాది విధులు దీర్చి

Akella Raghavendra's Online-ias.com

దక్షిణాభిముఖులై చనుచుఁ జిత్రరూపంబున నున్న కబంధుని వధియించి ముందట. 70

క. చనిచని యెదుటను రాముఁడు
గనుఁగొనియె మహీజనోగ్రకలుషాద్రి మహా
శనిరూపం బనఁదగునా
ఘనముక్తివధూవిలాసకబరిన్ శబరిన్. 71

తే. కాంచినను మ్రొక్కి యాభూమికాంతునకును
మించి సద్భక్తిఁ బూజ గావించినంత
శబరితోడను దమకార్యసరణిఁ దెలియ
వినయమునఁ జెప్ప నాకాంత విన్నవించె. 72

తే. ఇనకులాధీశ! సుగ్రీవుఁడనెడువాఁడు
కపికులశ్రేష్ఠుఁడత్యంతఘనుఁడు తలఁప
నతనితోఁ బొత్తు గావింపు మన్నిపనులఁ
జక్కనౌటకు నాత్మ నిస్సంశయంబు. 73

వ. అని చెప్పి వీడ్కొలిపిన నమ్మనుజేంద్రనందను లటమీఁదఁ బంపాతటంబునకుం జని రని చెప్ప నారదుని వాల్మీకి మునీశ్వరుం డటమీఁదికథావిధానం బెట్టిదని యడుగుటయు. 74

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుత పాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకినాథా. 75

గద్యము. ఇది శ్రీగౌరీశ్వర వరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద * సూరిజనవినుత కవితాచమత్కార రాతుకూరి కేసనసెట్టి తనయ మొల్ల నామధేయ విరచితంబైన శ్రీరామాయణ మహాకావ్యంబునం దారణ్యకాండము సర్వము నేకాశ్వాసము.

* నిత్యశైవాచార సంపన్న-

Akella Raghavendra's Online-ias.com

శ్రీ

# రామాయణము

## కిష్కింధాకాండము

క. పక్షీంద్రవాహా! గిరిజా
త్ర్యక్షమనోజ్ఞాతగేహా! యపహృతమోహా!
రాక్షసభీమా! మునిజన
సాక్షాత్కృతనైజధామా! జానకిరామా! 1

వ. శ్రీనారదమునీశ్వరుండు వాల్మీకిమహామునీశ్వరున కెఱింగించిన తెఱం గెఱింగించెద నాకర్ణింపుము. 2

సీ. పంపాతటమ్మున బాణాసనాయుధ
పాణులై యున్న భూపాలసుతులఁ
గనుఁగొని భీతిల్లి కమలాప్తసూనుండు
వాలిపంపున వీరు వచ్చి రనుచుఁ
గలఁగి తా ఋశ్యమూకంబున నుండంగ
వెఱచి మలయశైలవిపినసీమ
దిరిగి వారలరాక తెఱఁగెల్లఁ దెలిసి రాఁ
బవనాత్మజుని వేగ పంప నతఁడు

తే. వచ్చి రఘురామశ్రీపాదవారిజముల
కర్థిఁ బ్రణమిల్లి మీ రెవ్వ రయ్య యిటకు
నేమికతమున వచ్చితి రేది నామ
మనుచు నడిగిన సౌమిత్రి యతనికనియె. 3

సీ. దశరథుం డను రాజుతనయుల మాతని
పంపునఁ దప మాచరింపఁ గోరి

Akella Raghavendra's Online-ias.com

వచ్చి కాననభూమి వర్తించుచుండ నీ
రాజుదేవిని దుష్ట రావణుండు
కుటిలవృత్తిని నెత్తుకొని పోవ నాజాడ
వదలక దిక్కులు వెదకివచ్చి
శబరికి మారాకచందంబుఁ దెలియంగ
జెప్పిన నర్కజుచేతఁ గాని

తే. మీదుకార్యంబు నెగ్గదు మీర లరిగి
వేగ సుగ్రీవుచెల్మి గావింపుఁడనిన
వచ్చినారము గనుఁగొన వలసి యతని
నతఁడు రాముండు లక్ష్మణుం డంద్రు నన్న. 4

తే. తలఁప నీరాజునకు నెందు ధాత్రిలోన
విను మసాధ్యంబు లైనట్టిపనులు లేవు
సూర్య వంశోత్తముఁడు మహాశూరుఁ డితఁడు
నీకుఁ బేరేమి చెప్పుమా మాకు నన్న. 5

తే. వాయుదేవునిఁ బ్రార్థించి వేయిగతుల
నంజనాదేవి గాంచిన యాత్మజుండ
నర్కజునిమంత్రినై యుందు ననుదినంబు
వినుఁడు నాపేరు హనుమంతుఁడనుదు రిలను. 6

వ. అని చెప్పి మఱియు నిట్లని విన్నవించె. 7

చ. వినుఁడు మహాత్ములార! యరవిందహితాత్మజుఁ దోడితెచ్చి మి
మ్మనుబొడఁగానుపింతునని మ్రొక్కుచు నేఁగి కపీంద్రుఁజేరి తాఁ
జనిన తెఱంగు వారిఁగనుచందము నేర్పడఁజెప్పిగొబ్బునన్
బనిగొనివచ్చి రాముపదపంకజముల్ గనిపించె నంతటన్. 8

వ. సుగ్రీవుండు శ్రీరామచంద్రుని పగతీర్పఁదా భారంబు వహించి తనకుఁ బగవాఁడైన వాలినిఁ జంపింపం దలంచి వానితోఁ దనకుఁ గలిగిన పూర్వ వైరంబు తెఱంగు శ్రీరామునకుఁ దెలియ విన్నవించి వాలి మహాసత్త్వశాలి యతండు రాముని చేతం దెగుట దెల్లంబుగా దుందుభి కళేబరంబును బదియోజనంబుల

దూర మెగురఁ జిమ్ముటయును సప్తతాళంబులొక్క బాణంబునఁ దెగ వేయుటయునుఁ జూచి సుగ్రీవుండు భయకంపిత హృదయుండై రాఘవేశ్వరుల పాదారవిందంబులకు వందనం బాచరించి జనకనందన మున్ను జారవిడిచిన యాభరణంబుల మూటఁ దెప్పించి చూపినం జూచి మూర్ఛిల్లి గొబ్బునం దెలిసి యర్కకులేశ్వరుండైన శ్రీరామచంద్రుండర్క సంభవుండైన సుగ్రీవునితో నిట్లనియె. 9

క. పగనీ కెక్కడి దింకను
నగచర నగభేదిసుతుని నాయస్త్రమునన్
దెగ నేయుదు నమ్ము మనుచు
జగదీశుఁడు వలుక నతఁడు సంతోషించెన్. 10

వ. ఇట్లు ప్రమాణవచనంబుల నయ్యచలచరాగ్రణి స్వాంతంబును సంతోషింపఁ జేసిన నతండును శ్రీరామచంద్రుని కార్యంబునకు సహాయుఁడై యుండ నొడంబడి యమ్మహానాయకుని యనుమతంబున యుద్ధసన్నద్ధుండై కిష్కింధానగరంబునకుం జని తద్ద్వారంబున నిలిచి సింహనాదంబుఁ జేసినం గనలి యాదేవేంద్ర తనూభవుండు సనుదెంచె నంత నయ్యిరువురుం గదిసి భుజంబు లప్పళించుచు గర్వాలాపంబు లాడుచు నొండొరు మార్కొని. 11

శా. శైలంబుల్గడువేగ ఉవ్వుచుమహాయుంకారహుంకారముల్
చాలంజేయుచు భీకరోద్ధతులచే సాలంబులన్ వ్రేయుచున్
వాలాగ్రంబుల మోదుచున్ వడివడిన్ వక్త్రంబుల న్రక్తముల్
కూలన్ వాలియుసూర్యసూతియు వడిం గోపాత్ములై పోరఁగన్. 12

వ. అట్టిసమయంబున. 13

ఉ. *సాలముపొంత నిల్చి రఘుసత్తముఁడమ్మరివోసి శబ్దవి
న్మూలముగాఁగ పిల్ దివిచి ముష్టియు దృష్టియుఁగూర్చిగోత్రభృ

---

* ఓలము వంచియెయ్యన రఘూద్వహు డమ్మరివోసి శబ్దవి
న్మూలము దాఁక.........

ఈ పాఠము నేను చూచిన ఏ గ్రంథముల యందును లేదు. కాని కొట్ర శ్యామలకామశాస్త్రిగారిచే వ్రాయబడిన ఆంధ్ర వాచస్పత్య నిఘంటు ప్రథమ సంపుటమున 617వ పుటలో "ఓలము" అను పదమున కర్థమునిచ్చు సందర్భమున నియ్యఁబడినది.

— సంపాదకుఁడు.

Akella Raghavendra's Online-ias.com

తూ్కలము వజ్రపాతహతిఁగూలువిధంబునఁ గూలనేసె న
వ్వాలిఁ బ్రతాపశాలి మృదువందనశీలి సురాలి మెచ్చఁగన్. 14

వ. తదనంతరంబున 15

క. తారాపతి శిక్షింపుచుఁ
దారాపతిఁ ధవళకీర్తిఁ దగు నర్కజునిన్
దారాదేవికిఁ బురి కా
తారార్కము గాఁగ రాజతనయుఁడు నిల్పెన్. 16

క. నిగ్రహము మాని నృపతి శు
భగ్రహలగ్నంబునందుఁ బట్టము గట్టెన్
నిగ్రహరాజోవగ్రహు
సుగ్రీవుని హేమదామ సుగ్రీవుఁ దగన్. 17

వ. ఇటు సుగ్రీవునిఁ గపిరాజ్య పట్టభద్రునిం జేసి వాలితనూసంభవుని నంగదకుమారుని యువరాజ పదంబున నిలిపె నంత వరాకాలము గడచునంత దనుక శ్రీరాముని మాల్యవంతంబుపై నుండ నియమించి వారు సనిరయ్యవసరమున. 18

సీ. బ్రహ్మాండ మగలంగఁ బటపటధ్వనులతో
నుఱుము లంతంతకు నుఱుముచుండఁ
గడు భయంకరముగా వడమ్రోగుఁ మ్రోఁతలఁ
బిడుగు లాడాడ గుభిల్లు మనఁగఁ
గ్రముకంబు లంతేసికణములతోఁ గూడఁ
గరుడు గట్టిన వడగండ్లు రాలఁ
గొరవిదయ్యంబుల వెఱపించు తెఱఁగున
విద్యుత్ప్రకాశమ్ము విస్తరిల్ల

తే. ముసుఁగు వేసినచందాన మొగులు గప్పి
మీఱి నలు పెక్కి చీఁకట్లు కాఱుకొనఁగ
మించి కడవల నుదకంబు ముంచి తెచ్చి
కుమ్మరించినగతి వాన గురిసె నపుడు. 19

Akella Raghavendra's Online-ias.com

క. ఏఱులు కాల్వద తప్పఁగఁ
బాఱెను సస్యములు పండె ఫలవృక్షములున్
మీఱి ఫలించెను ధరఁ బా
లేఱులుగా సురభు లెల్ల నెప్పుడుఁ బితికెన్. 20

వ. అంత వర్షాకాలాంతంబు గాఁగ నమ్మహీకాంతుండు ప్రేయసీ
వియోగ పరితాపానలంబునఁ బొరలుచు నోర్వలేక విభ్రాంత స్వాంతుండై
యుండ. 21

సీ. పలుమాఱు నీహస్తపల్లవంబులచేత
నళివేణి! నాతాప మార్ప వేల
నళినాక్షి! పరిరంభణక్రీడఁ దేల్చు నీ
మది నొప్పి నానొప్పి మాన్ప వేల
చెలియ! యోష్ఠామృతసేవకై నీయల్క
వడిఁ దప్పి నాదప్పి గడప వేల
భామ! దావానలపరితాప ముడుప నీ
తనువు నాతనువునఁ బెనఁచ వేల

ఆ. యనుచు సీతఁ బిలుచు నందంద పరికించు
దిక్కు లాలకించు నిక్కి చూచు
దశరథాత్మజుండు తన్నుఁదా మఱచుచు
బయలు కౌఁగిలించుఁ బలువరించు. 22

వ. అని మఱియును. 23

ఉ. కూరలునోటికిన్ రుచులుగూడుట దప్పెను దుంపదూఁడు లుం
గారము తోఁచె జిహ్వకును గమ్మని తేనెలు చేఁదులయ్యెఁ గం
గారయెఁ జిత్తమంతయును గంటికిఁ నిద్రరహింపదయ్యె శృం
గారమెలర్ప సీతఁ బొడగానమి రామనృపాల మౌళికిన్. 24

ఉ. తాలిమి దూలిపోయి పరితాపమునం దిరుగాడు నొక్కచోఁ
గాలును నిల్వఁద్రొక్క నధికారముచాలక యెప్పుడుం గడుం

Akella Raghavendra's Online-ias.com

జాలి వహించుఁ జిత్తమున జంచలతం గను భూమిపుత్త్రిపై
మేలిమిఁ జేసి రాముఁడట మిన్నక వేదురుగొన్నకైవసిన్. 25

వ. ఇట్లు విరహతాపంబునఁ బొరలుచున్న సమయంబునఁ గార్తికమాసంబు సనుదెంచిన శ్రీరామచంద్రుండు బలంబులం గూర్చుకొని రమ్మని సుగ్రీవుపాలికి సౌమిత్రి ననుప నారాముతమ్మునిఁ గూడి యినజుండు తారాసమేతుండై చనుదెంచి రాఘవేశ్వరులచరణారవిందమ్ములకు నమస్కరించి తన బలంబులఁ దోడు సూప దొడంగె నెట్లనినఁ బదులును నూఱులును వేలును బదివేలును లక్షలును బదిలక్షలును గోట్లును శతకోట్లును నర్బుదంబులును న్యర్బుదంబులును ఖర్వంబులును మహాఖర్వంబులును బద్మంబులును మహాపద్మంబులును క్షోణులును మహాక్షోణులును శంఖంబులును మహాశంఖంబులును క్షితులును మహాక్షితులును క్షోభంబులును మహాక్షోభంబులును నిధులును మహానిధులును సాగరంబులును మహాసాగరంబులును బరిమితంబులును మహాపరిమితంబులును ననంతంబులును మహానంతంబులును గడచి లెక్కకు మిక్కిలి యెక్కువయై డెబ్బదిరెండు వెల్లువలుగల కపిబలంబుతోడ దోడు సూపినంజూచి రాఘవేశ్వరుండు సంతోషించి సవితృనందను గారవించి కౌఁగిలించుకొని సీతాన్వేషణంబుఁ జేయఁగలవానరోత్తముల నధికబలయుతుల నేర్పఱిచి దిశలకుం బంపునవుడుఁ దూర్పునకు మైందుండును బశ్చిమంబునకు సుషేణుండును నుత్తరంబునకు శతబలియు ననువారిని నేర్పఱించి వారలకుఁ దోడుగా వానరవీరులను లక్షలక్షసంఖ్యాకుల నేర్పఱించి యిచ్చి జానకియున్న చొప్పును దెలిసి యొక్కనెలలో రమ్మని యనిపి హనుమంతునిం బిలిచి నీవు దక్షిణమ్మునకుం బొమ్మని యనుపపుడు శ్రీరామ భూపాలుండు వాని విశ్వాసాది గుణమ్ములకు మెచ్చినవాఁడై దగ్గఱఁగాఁ బిలిచి నీవు శౌర్యవంతుండవు హితుండవును గావున నీచేత మత్ప్రియోజనం బీడేఱునని పలికి తనచేతి యంగుళీయకం బతనిచేతికిచ్చి యీముద్రిక జనకరాజనందనకు సమర్పించి యాజానకీ శిరోరత్నంబు మాకొనవాలుగాఁ దెమ్మని యనుప నతండదియ్యకొని మ్రొక్కిన నాతనికిఁ దోడుగా నంగదజాంబవదాదులం గూర్చి యనిపె ననుటయు విని నారదుని వాల్మీకి మహామునీశ్వరుం డటమీఁది కథావిధానం బెట్టిదని యడుగుటయును. 26

Akella Raghavendra's
Online-ias.com

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకినాథా! 27

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగమార్చనవినోద * సూరిజనవినుత కవితా చమత్కార రాతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితంబైన శ్రీరామాయణ మహాకావ్యంబునం గిష్కింధాకాండము సర్వము నేకాశ్వాసము.

Akella Raghavendra
Online-ias.com

* నిత్యశైవాచారసంపన్న- (అనుదానిని అదనముగా చేర్చవలయును.

శ్రీ

# రామాయణము

## సుందరకాండము

క. సూర్యకులరత్నదీపా!
సూర్యసహస్రప్రతాప! సుందరరూపా!
ఆర్యారాధితనామా!
శౌర్యాధికసుగుణసీమ! జానకిరామా! 1

వ. శ్రీనారదమహాముని వాల్మీకి కెఱింగించిన తెఱంగు విన్నవించెద నవధరింపుము. 2

తే. * రాజునకు మ్రొక్కి యక్కపిరాజుకరుణఁ
దక్షిణంబున వెడలిరి దక్షిణంబు
వెదకువా రగువానర వీరవరులు
పంతములతోడ నెంతయు సంతసమున. 3

క. మును తా మేఁగినదిక్కులు
పనివడి వెదకంగఁ జనినబలిముఖు లెల్లన్
జనకజఁగానక వచ్చిరి
మనుజేశునికడకు చనినమార్గంబుననే. 4

వ. అట్టిసమయంబున. 5

క. గిరులును నదులును వనములుఁ
*బరికింపుచుఁ బట్టణములు బహువిధగతులం
దిరుగుచు వెదకుచుఁ గానక
కరువలికొడుకాది యైనకపివరు లెదుటన్. 6

* రామునకు.

Akella Raghavendra's Online-ias.com

క. ఆలోఁ గాంచిరి సత్కపి
జాలముఁ గరిశరభసింహశార్దూల మృగా
భీలముఁ బుణ్యకదంబవి
శాలము నగునమ్మహేంద్రశైలము లీలన్. 7

వ. ఇట్లు మహేంద్ర పర్వతంబుం గనుంగొని డాయంజని యచ్చట. 8

ఉ. ఆతఱి వానరప్రవరు లాధరణీసుతఁ గానలేక దుః
ఖాతురులై వగం బడఁగ నయ్యెడఁ దద్గిరినుండి వచ్చి సం
పాతి యనం బ్రసిద్ధుఁడగు పక్షికులేంద్రుఁడు రావణుండు దా
సీతను గొంచుఁబోవుగతిఁజెప్పుచుఁ దెల్పెను లంకత్రోవయున్. 9

క. ఆపక్షీంద్రునిచేతను
జాపలశుభనేత్ర రామచంద్రునిదేవిన్
బాపాత్ముఁ డైన దైత్యుఁడు
వే పట్టుక చనినత్రోవ విని కపులెల్లన్. 10

వ. మహానందంబు నొంది యమ్మహేంద్రపర్వతం బారోహించి పురో
భాగంబున. 11

క. ఆకపివీరులు గనుఁగొని
రాకాశనదీప్రచుంబితార్భటభంగా
నీకమహాఘనరవభయ
దాకారనటత్ప్రికాశు నాజలధీశున్. 12

వ. అట్లుకనుంగొని. 13

క. తమతమసత్త్వస్థితులను
గమియించెదునబ్ధికొలఁదిఁ గనుఁగొని మదిలో
భ్రమయుచుఁ బలికెను గపిసం
ఘము లెంతయు డెందమందుఁ గళవళపడుచున్. 14

క. ఈవార్ధి దాఁట సత్త్వము
మావలనం జాలదింక మారుతిః వినుమా

Akella Raghavendra's Online-ias.com

పావని వగుటం జేసియు
నీవలనం దక్క నొరులు నేరరు దాఁటన్. 15

వ. అని యిట్లు ప్రార్థించినతోడనే యబ్ధి వారివచనంబులకు సమ్మతించి వాయుతనూజుం డిట్లనియె. 16

ఉ. పావనమూర్తి రామనరపాలకుఁ పంపున నబ్ధి దాఁటెదన్
దేవవిరోధి దొంగిలినదేవినిఁ జూచెదఁ గాన కుండినన్
లావున గద్దతోఁ బెఱికి లంకయ తెచ్చెద నట్లు గానిచో
రావణుఁబట్టి తెచ్చెదను రాముని సన్నిధి కెన్ని రీతులన్. 17

వ. అని వారిమనంబులు సంతసిల్లునట్లుగా బిరుదులు వక్కాణించి తనకుఁ దండ్రియైన వాయుదేవునకునుఁ ద్రిమూర్త్యాత్మకుండైన లోకబాంధవునకును నింద్రునకును సంద్రమ్మునకును నమస్కరించి శ్రీరామలక్ష్మణులఁ దనమనఃపద్మంబు నందిడికొని మ్రొక్కి బంధుమిత్రులం గౌఁగిలించుకొని వారిచేత దీవనలంబొంది గమనోన్ముఖుండై. 18

చ. మొగము బిగించి పాదములు మొత్తముగా నటనూఁది త్రొక్కినీ
టుగ మొగమెత్తి భీకర కఠోరరవంబున నార్చి బాహు ల
త్యగణితలీల సాఁచి వలయంబుగ వాలముఁ ద్రిప్పివ్రేగునన్
సగమునగమ్ము గ్రుంగఁ గపినాథుఁడు నింగికి దాఁటె ఱివ్వనన్. 19

వ. ఇట్లు నింగి కెగిరిపోవుచుండు సమయంబునఁ బావనికి నడ్డంబుగా మానవరూపంబున మైనాక పర్వతంబును సురస యను నాగజననియు ఛాయాగ్రాహిణియైన సింహికయునుం గనుపట్టిన * నెల్లర నతిక్రమించి సువేలాచలంబున కరిగి యక్కడ నలయిక దీఱ నొక్కయిక్కువ నించుకసేపు విశ్రమించియున్న సమయంబున. 20

ఉ. భేరికిసాటి యౌదనుట భీషణభాషలు భద్రనాగఘీం
కారవినాదముల్ హయనికాయపు హేషలుకాహళధ్వనుల్
వీరమృదంగనాదములు విశ్వభయంకరరలీల లంకలో
భోరుకలంగఁగా శ్వసనపుత్త్రుఁడు చాలఁగ నాలకించుచున్. 21

---

* మెల్లవ.

ఉ. కోటికిఁగోటులై పరఁగుకుంజరవర్గము ఘోటకంబులుం
గోటికి నెక్కుడై పరఁగుగోత్ర సమానము లౌరథంబులుం
గోటికి హెచ్చులై పరఁగుఘోరనిశాచరకోటికోట్లతో
సాటికినెక్కుడప్పురము సాహసవంతుఁడు గాంచె ముందరన్. 22

వ. ఇట్లాలంకాపుటభేదనంబున్ వీక్షించి తనమనంబున. 23

శా. ఘోరాకారులు కామరూపులు మహాక్రూరాత్ము లత్యుగ్రులీ
శూరుల్ వీరలఁగన్నుఁద్రామి పురిలో శోధించులావెట్లొకో
యీరూపంబునఁ బోవఁగాఁగనిన వారెగ్గేమి గావింతురో
నారీరత్నము సీత నందుఁగనఁగా నాకెట్లు సిద్ధించునో. 24

వ. అని తలంచుచున్న యవసరమ్మున. 25

ఉ. క్రుంకెఁబయోజబాంధవుఁడు గూండ్ల కుఁబక్షులు సేరె నెల్లడన్
బొంకము తీసెఁదామరలు పూచెను గల్వలు తారకావళుల్
బింకముఁజూపెఁగాంతి నళిబృందముకూర్కెఁదమంబుఁబర్వె నే
వంకను జారచోరకులు వాలి చరించిరి కౌతుకంబునన్. 26

వ. ఇట్లు నిశాసమయమునందుఁ దనమేటిగాత్రం బణుమాత్రంబుగా గుదియించి యగ్గిరి డిగ్గి చనుచు నల్లనల్లనఁ బురద్వారంబు నొద్దకుఁ జేరి వానర కులపుంగవుండు పురప్రవేశంబుసేసి. 27

ఉ. మేడలు రచ్చకొట్టములు మిద్దెలుమచ్చులు నాటకూటముల్
మాడుపులంగళుల్ దనుజమందిరముల్ పురగోపురావళుల్
వాడలు దేవగేహములు వప్రచయంబును వేశవాటికల్
గోడలు నాదిగాఁగఁగపికుంజరుఁడప్పుడు చొచ్చిచూచుచున్. 28

క. మఱువులు సందులు గొందులు
విరవులుఁ జొరరానిచోట్లు నేకాంతంపుం
దెరువులు నంతఃపురములు
వెరవునఁ గపికుంజరుండు వెదకం జొచ్చెన్. 29

ఆ. గాలిలీల శీతకరకాంతివిఖ్యాతి
ధూమరేఖరీతిఁదూఱి చొచ్చి

Akella Raghavendra's
Online-ias.com

యసురమందిరముల నక్కడ నిక్కడఁ
గలయఁదిరిగి వెదకెఁగపివరుండు. 30

వ. ఇట్లు తిరిగి తిరిగి వెదకుచుఁ దనమనంబున. 31

క. మాయాబలుండు రాక్షస
నాయకుఁడిటఁ బట్టి తెచ్చినాఁడతని మహా
కాయము నుగ్రాకృతిఁగని
తోయలి తనతనువు నెచటఁ దొలఁగెనొ యకటా! 32

మ. అటుగా కీతఁడె యన్యదేశమున నాయబ్జాక్షిఁ బెట్టించెనో
ఘటయంత్రస్థితివార్ధి మధ్యమునఁ దాఁ గ్రౌర్యంబునన్దాఁచెనో
పటుబాహాబలశక్తి * నాకభువనప్రాగ్దేశమందుంచెనో
చటులోగ్రాకృతిరాముబాణములకున్ శంకించి యెందుంచెనో. 33

వ. అని యీగతి వితర్కించి. 34

ఉ. త్రుంతు విధాతజందెములు ధూర్జటి శైలము ప్రత్తు విష్ణు సే
వింతుగ్రహంబులందిరుగ వేయుదుఁ బూర్ణపయోధులేకుఁగా
రింతు నుడువ్రజంబులఁబొరిన్ గణియింతును భూతలంబు గ్ర
క్కింతునహీంద్రలోకమును గిద్పడఁ జేయుదుసాహసంబున్. 35

ఉ. కొట్టుదు నింద్రుఁ బావకుని గుండెలు వ్రత్తుఁ గృతాంతుఁ జెండుదున్
బట్టుదు దైత్యునిన్ వరుణుమానముఁగొందును గాలిఁ దూలఁగాఁ
దట్టుదుఁ గిన్నరేశ్వరుని ప్రాణము కల్లుదు శూలిఁ దోలుదున్
జట్టలు ద్రుంతు రావణుని సారసలోచనఁ జూపకుండినన్. 36

క. ఈమాడ్కిఁ జేయ దేవ
స్తోమమ్ములు చంద్రవదనఁ జూపెద రొండెన్
ఏమిటికిఁ గీడు తగ దని
రాముఁడు వల దనుచు మరలి రమ్మను నొండెన్. 37

* నాభువనజన్.

Akella Raghavendra's Online-ias.com

వ. అని యనేక ప్రకారంబుల నాలోచించుచు నొక్క గోపురం బారోహించె నా సమయంబున. 38

క. పావని కనుంగొనె నప్పుడు
పావన విఖ్యాతసుగుణభావోపేతన్
సేవితదనుజవ్రాతన్
భూవనితాజాత నిత్యపూతన్ సీతన్. 39

వ. ఆ రామం జూచి శ్రీరామచంద్రుని దేవినింగాం దలంపుచు నగ్గోపురంబునుండి డిగ్గి సూక్ష్మరూపంబుం గైకొని శింశపావృక్షంబారోహించియుండు. 40

సీ. పతిం బాసినట్టి యాపదకంటెం బలుమాఱు
వివిధ మాయలచేత వేంగి వేంగి
వీరదానవకోటి వికృత వేషంబులు
కనుంగొని చిత్తంబు క్రాంగి క్రాంగి
తనదిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ
లోపల మిక్కిలి లోంగి లోంగి
కర్ణకఠోరంబుగా నాడుమాటలం
దొరంగెడికన్నీటం దోంగి తోంగి

ఆ. రాముం దలంచుకొంచు రామునిం బేర్కొంచు
రామ! రామ! యనుచు రమణి పలుకం
గపివరుండు సూచి కామినీరత్నంబు
సీత యనుచుం బొంగెం జిత్తమందు. 41

వ. అట్టి సమయంబున రావణాసురుండు సీతాపహృత హృదయుండై పన్నీట మజ్జనం బాడి దివ్యాంబరంబులు గట్టుకొని కర్పూర సమ్మిళితంబైన శ్రీగంధంబు నెఱపూంత పూసి పారిజాత పుష్పంబులు ముడిచి మవ్వంపుం దావి నివ్వటిల్లెడు జవ్వాది మెత్తి దశశిరంబులయందును రత్నమకుటంబులు ధరించి మణిమండితంబు లగుకుండలములు పూని భానుప్రభా విలసితంబులగు పతకంబులను ముక్తాహారంబులును భుజకీర్తులును బాహుపురులును నంగుళీయంబులును నవరత్న స్థగితంబగు నొడ్డాణంబును నమరించి చంద్రహాస హస్తుండై కందర్ప

విలాస సుందరుండగుచుఁ గిన్నరకింపురుష గంధర్వా మరోరగసిద్ధ విద్యాధరాంగన లుభయపార్శ్వంబుల నాలవట్టంబులు పట్టి మౌక్తిక ఛత్రంబులును దాలవృంతంబులును వింజామరంబులును ధరించిరాఁ గొందఱు కరదీపికా సహస్రంబులు గైకొని ముందఱఁ బిఱుంద నేతేర నశోకారామంబునకుఁ జనుదెంచె నప్పుడు గంధవాతూలంబునందూలు పుష్పలతయునుంబోలె వడవడ వడంకుచుఁ దనసుందరాంగంబులు హస్తోరువస్త్రకేశంబుల మాటియుఁ గప్పియు నడంచియు నివురుగప్పిన నిప్పు చందంబున ధూళిధూసరంబగు రత్నంబుకైవడి మేఘచ్ఛన్నంబగు చంద్రబింబంబు డంబున నిత్తడిపొదిగిన కుందనంపుశలాక లాగున మాఱుపడియున్న జానకివిఁ గదిసి. 42

క. సీతను గనుఁగొని రావణుఁ
డాతతనయవాక్యఫణితి నతికుతుకమునన్
జేతోభవనిశితాంబక
పాతంబులఁ జాల నొచ్చి పలుకఁగఁ దొచ్చెన్. 43

లయగ్రాహి. తోయజదళాక్షి! వలరాయఁడిటు లేచి పటు
సాయకము లేర్చి యిపు దేయఁగఁ దొడంగెన్
దోయదపథంబున నమేయరుచితోడ నుడు
రాయఁడును మంచి వడఁ గాయఁగఁ గడంగెన్
గోయిలలుఁ గీరములుఁ గూయఁగ నళివ్రజము
లేయెడలఁ జూచినను మ్రోయుచుఁ జెలంగెన్
నాయెడఁ గృపారసము సేయ కవివేకమున
నీయెడల నుండు టిది న్యాయమె లతాంగీ! 44

వ. అని మఱియును. 45

సీ. అలకేశ్వరుం డుపాయనముగా నిచ్చిన
యంచితచీని చీనాంబరములు
దివిజాధినాథుండు దినదినంబును నిచ్చు
పారిజాతోల్లసత్ప్రసవములును
దక్షిణాధీశుండు తగఁ గాన్కఁ బంపిన
సురభికర్పూరాదిపరిమళములఁ

Akella Raghavendra's Online-ias.com

పాతాళముననుండి ఫణిసార్వభౌముండు
పుత్తెంచినటువంటి భూషణములు

తే. గలవు నాయింట నేప్రొద్దుఁ గడమ లేక
దేహపరితృప్తిఁగావించి మోహమలరఁ
గాముకేళిసుఖంబులఁ గలయు టొప్పు
విడువు మడియాస రామభూవిభుని మీఁద. 46

సీ. ఎవ్వానివీటికి నేడు వారాసులు
పెట్టనికోట లై పెచ్చు పెరుఁగు
నెవ్వాని సేవింతు రింద్రాదిదేవత
లనుచరబలు లయి యనుదినంబు
నెవ్వాని చెఱసాల నేప్రొద్దు నుందురు
గంధర్వ సుర యక్ష గరుడకాంత
లెవ్వానిభండార మిర వొంద విలసిల్లు
నవనిధానంబుల వివిధభంగి

తే. సకల లోకంబులును మహోత్సాహవృత్తి
నెవ్వనికిఁ జెల్లుఁ బుష్పక మ్మెక్కి తిరుగ
నాకె తక్కంగఁ గలదె యేనాఁటనైన
మద్భుజాశక్తి ప్రతిపోల్ప నద్భుతంబు. 47

సీ. శ్వసనుండు లోగిలి సమ్మార్జనముఁ జేయ
నబ్ధినాథుఁడు కలయంపి సల్లఁ
బావకుండరుదెంచి పాకంబు లొనరింప
శమనుండు వెసఁ బరిచర్యఁ జేయఁ
బాకారి కల్పకప్రకరంబు లర్పింప
దనుజేశ్వరుండు కైదండ యిడఁగ
నరవాహనుండు దా నగరివెచ్చము వెట్ట
నీశానుఁడు విభూతి నెలమినీయ

తే. గురుఁడు పంచాగ మెప్పుడు సరవిఁ జెప్ప
నమరకిన్నరగంధర్వయక్షభుజగ

Akella Raghavendra's Online-ias.com

సిద్ధకింపురుషాంగనల్ చేరి కొలువ
వైభవంబునఁ జెలు వొందువాఁడఁ దరుణి! 48

ఉ. ఎత్తితి శంకరాచల మహీనబలంబున బంతిలాగునన్
మొత్తితి సర్వదిక్పతుల మూఁగినగర్వము విచ్చి పాఱఁగా
నొత్తితి శత్రుభూపతుల నుగ్రణరంబున భూమిఁ ద్రెళ్ళఁగా
మొత్తితి భోగికంఠము లమోఘజవంబున మేటికీర్తులన్. 49

తే. జడలు ధరియించి తపసులచందమునను
దమ్ముఁడును దాను ఘోరదుర్గమ్ములందుఁ
గూరగాయలు గూడుగాఁ గుడుచునట్టి
రాముఁడేరీతి లంకకు రాఁగలండు. 50

ఆ. ఇంకఁ జేయ నేర రీఁదంగ నోపరు
కట్టలేరు చుట్టి పట్ట లేరు
జలధి దాఁట లావు చాలదు నరులకు
వచ్చు బెట్టు చెపుమ వారిజాక్షి. 51

క. దానవు లెప్పుడు చూచిన
మానవులను గెలువఁ గలరు మది నూహింపన్
మానవభక్షకులై మను
దానవులను గెలువ నరులతరమే జగతిన్. 52

క. జగతీశుఁడు మానవుఁ డఁట
నగరే భుజశక్తిచేత నాకెదు రన్నన్
నగధరుఁడో నగధన్వుఁడొ
నగభేదియొ కొంత కొంత నాతోఁ బోరన్. 53

వ. ఆసంగతి యట్లుండ నిమ్ము. 54

క. నీకన్నుల సౌభాగ్యము
నీకుచములఁ గలుగు మేలు నీముఖకాంతుల్
నీకరములలావణ్యము
నాకస్త్రీలందు లేవు నాకుం జూడన్. 55

మ. సురకాంతల్ సరిరారు యక్షసతులున్ సూటింపఁగా రారు కి
న్నర భామల్ ప్రతిరారు సిద్ధవనితల్ న్యాయంబుగాఁబోలరా
గరుడ స్త్రీల సమాన లెంతొ చపుకల్ గంధర్వలోలాక్షులున్
మఱియేరీ నినుఁజెప్పి చెప్పఁదరుణుల్ మత్తేభకుంభస్తనీ. 56

క. క్రీడ యలంకారముగా
నాడుము భయ ముడిగి మధురమైన మృదూక్తుల్
బేడిసల నేలుకన్నులఁ
జూడుము కనుఱెప్ప లెత్తి సుదతీ నన్నున్. 57

వ. అని యిట్లు నోరికి వచ్చినవచ్చునఁ బ్రేలుచున్న యానీచుని దుష్ట
భాషణంబులకు రోసి తృణంబు చేపట్టి జనకభూపాల నందన యిట్లనియె. 58

క. పతి దైవముగా నెప్పుడు
మతిఁ దలఁచుచు నుండునట్టిమగువలఁ జెఱుపన్
బ్రతిన గలయట్టినీతోఁ
బ్రతివచనము లాడుకంటెఁ బాపము గలదే. 59

క. పరదారాపేక్షకు లగు
పురుషుల కాయువు నశించుఁ బుణ్యము సెడు స
త్పురుషుల దూషింపఁగఁ దుది
నరకంబునఁ బడుదు రనెడిన్యాయము వినవే. 60

వ. అదియునుంగాక. 61

క. తనసాహసంబు తానే
కొనియాడునతండు హీనగుణుఁ డని వినుచున్
నిను నీవ పొగడుకొంటివి
వినఁగూడదు నీదునీతివిరహితభాషల్. 62

సంగరరంగమందు నతిశౌర్యమునన్ రఘురాముతోడ మా
తంగతురంగసద్భటశతాంగబలంబులఁ గూడి నీవు పో
రంగను నోప కిప్పుడు విరాధఖరాదులపాటుఁ జూచియున్
దొంగిలి నన్నుఁదెచ్చితివి తుచ్ఛపుఁబల్కులుపల్కఁ బోడిమే. 63

Akella Raghavendra's Online.ias.com

సీ. కూకటిముడికిన్నై కురులు గూడనినాఁడె
బెదరక తాటకఁ బీఁచ మణఁచె
గాధేయుఁడొనరించుక్రతువును రక్షింపఁ
బెక్కండ్రు దైత్యుల నుక్కణంచె
నవనిపై విలసిల్లునఖిలరాజన్యులు
వ్రేలఁ జూఁపఁగలేనివిల్లు విఱిచె
ఘోరాటవులలోనఁ గ్రుమ్మరునప్పుడు
ఖరదూషణాది రాక్షసులఁ జంపెఁ

తే. పాదరజమున నొకరాయిఁ బడఁతిఁ జేసె
లీల మాయామృగంబును గూలనేసె
రాజమాత్రుండె మేదినీరక్షకుండు
రామభూపాలుఁ డాదినారాయణుండు. 64

తే. అట్టిరామున కీయది యనఁగ నెంత
లంక యన నెంత దనుజులపొంక మెంత
నీ వనఁగ నెంత నీలావు చేవ యెంత
చెప్ప నేటికి నీవె చూచెదవు గాక. 65

శా. వీరాలాపము లాడ నేలవినుమీ విశ్వప్రకాశంబుగాఁ
బారావారముఁ గట్టి రాఘవుఁడు కోపస్ఫూర్తి దీపింపఁగా
ఘోరాజిన్ నిను దాసి లావుకలిమిన్ గోటీరయుక్తంబుగాఁ
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్ పెట్టు భూతాళికిన్. 66

శా. ఆరూఢప్రతిమానవిక్రమకళాహంకార తేజోనిధిన్
శ్రీరామున్ సుగుణాభిరాముఁ దెగడన్ జేకొన్నవిన్నాజిలో
దారన్ దొంగిలితంచు నిష్ఠురగతిన్ దండించి ఖండింప ము
న్నీరెట్లైనను దాఁటివచ్చు నలుకన్ నేఁడెల్లి శాంతింపుమా. 67

వ. అని తన్నుఁ జీరికిం గొనక వీరాలాపంబు లాడ నారావణుండొడుపు
దప్పినకాలాహిచందంబున నుగ్రుండై మండిపడి యిట్లనియె. 68

Akella Raghavendra's Online-ias.com

క. ఆఁటది గా యని కూరిమి
పాటించినకొలది నన్నుఁ బలుకఁగఁ జొచ్చెన్
మాటాడకుండ నాలుక
తూఁటులుఁగా జేయకున్న దోసముగాదే. 69

క. కుయ్యాడక నాముందఱఁ
గయ్యమునకుఁగాలు దువ్వఁ గడఁగెను దీనిన్
దయ్యాలకు బలి వెట్టెద
వ్రయ్యలుగా నఱికి యెల్లవారును జూడన్. 70

క. కాకున్న దీని బలిమిని
బైకొని నాకాంక్ష దీఱ భావజకేళిన్
జేకొనక విడిచిపెట్టినఁ
గైకొనునే నవ్వుఁగాక గర్వము పేర్మిన్. 71

శా. భీమాటోపభుజ ప్రతాపమహిమన్ భీమాచలం బెత్తి సు
త్రామాద్యష్టదిగీశసైన్యముల సంగ్రామంబులో నోర్చి యు
ద్దామప్రౌఢిఁ జెలంగుచుండెడు కళాధాముండ నాముందటన్
రామున్ గీమునిఁ జెప్ప గిప్ప నగరా రాకేందుబింబాననా. 72

సీ. అఖిలలోకముల నాయాజ్ఞ నిల్పితి నేక
హేలను బుష్పకం బెక్కి తిరిగి
వేల్పుమూఁకలచేత వెట్టి సేయించితి
దితివంశవల్లభుల్ నుతులు సేయ
గణములతోఁగూడ గైలాస మెత్తితి
బటు వైనపూవులబంతి పగిది
వనజగర్భునిచేత వరములు గైకొంటి
దండిగా నత్యుగ్రతపముసల్పి

తే. చెఱలు పట్టితి గంధర్వసిద్ధసాధ్య
భుజగసురయక్షకిన్నర ముఖ్యసతుల
నిట్టిసామర్థ్య మెవరి కేనాఁడు గలదు
మహిని నాకొక్కనికె కాక మంజువాణి. 73

Akella Raghavendra's Online-ias.com

తే. నాకు నెదిరింప నొకపేదనరుని నొడ్డి
వెఱవ కీరీతి దుర్భాష లఱచు దీని
జిహ్వ మొదలంటఁ బట్టి యాశితకుఠార
ధారఁ దునుమాడి దారుణిఁ బాఱవైతు. 74

వ. అని చంద్రహాసంబు ఝంకించి లేవ నుంకించుతఱిఁ గొందఱు ప్రియ సుందరు లడ్డంబు సొచ్చి. 75

చ. సురవరుఁడో ధనంజయుఁడొ సూర్యతనూజుఁడొ యాతుధానుఁడో
శరధివిభుండొ గాడ్పొ పురశాసనుమిత్త్రుఁడొ భోగిభూషుఁడో
గురుభుజశక్తిఁ గైకొనుచుఁ గోపము సూపఁగ నీకు నెంతయు
త్తరుణిపయింబ్రతాపమున దారుణ కృత్యము సేయఁగూడునే. 76

క. ఏటికి మీ రిటు కినియఁగ
గాటపుజంకెనయె చాలుఁ గరవాలున కీ
యాఁటది యర్థమె మము నీ
మాటికి మన్నించి కావుమా యికఁ జాలున్. 77

వ. అని శాంతవచనంబులఁ బ్రియంబు సెప్పిన నప్పంకరుహాక్షుల విన్నపంబులు మన్నించి యారాక్షస చక్రవర్తి వైదేహికిఁ గావలియున్న యేక జటాద్విజటాత్రిజటాదుర్ముఖీ వాయుముఖీ శూర్పణఖ లాదిగాఁ గలదైత్యకామినుల వంకఁ గనుఁగొని 78

క. గడు విచ్చితి నిరుమాసము
లొడఁబఱుపుఁడు నేర్చినట్టు లొడఁబడ కున్నన్
గడికండలుగాఁ గోసుక
పడఁతులు భక్షింపుఁ డింతిపలలం బంతన్. 79

వ. అని రోషారుణిత నేత్రుండై యతిభీషణాకారంబుఁదాల్చి పలికిన. 80

క. తనపతి నిందించుటకును
దన ప్రియములు చెప్ప వినక తక్కువ మీఁదన్
దనుఁ జంపుఁ దన్న మాటకు
జనకుల వల్లభునిదేవి యేడ్చెన్ వెలుచన్. 81

Akella Raghavendra's Online-las.com

సీ. జానకి శోకింప సాధ్యకిన్నరయక్ష
గరుడోరగామర కాంత లెల్ల
వెంటనే శోకింప విని గంధవహపుత్త్రుఁ
డాత్మలోఁ జింతించి యాగ్రహమున
నీదుష్టదైత్యుపై నిప్పుడే లంఘించి
చెండాడ నాచేతఁ జిక్కనేని
కార్యంబు లెస్సగుఁ గాక సత్త్వము తూలి
బలువిడి వీనిచేఁ బడితినేని
తే. సీతఁగానంగ లేక కృశించి రామ
భద్రుఁడడఁగిన సీతయుఁ బ్రాణ మెడలు
లక్ష్మణుండును జూడ నాలస్య ముడిగి
తెగును నష్టైనఁ గార్యంబు తెఱఁగుఁ దప్పు. 82

చ. అని పవనాత్మజుండు దివిజారిపయిం దెగ వేళ గాదు భూ
తనయకు నాదురాక వసుధావరు మేలు నెఱుంగఁజెప్పి మీఁ
దను మఱి చూత మంచునుచితస్థితి నూరకయుండె నప్పుడా
దనుజవిభుండు వోయె నిజధామముఁ జేర సతీసమేతుఁడై. 83

వ. అప్పుడు యామినీచర కామినులు రావణానుమతంబున ననేకవిధంబులగు మధురాలాపంబుల మిథిలాధీశకుమారిం గుఱించి బోధించి కార్యంబు సాధింపనోపక యలసి యుంటంజేసి యొక్కింతసేపు నిద్రించుచుండ మేల్కాని త్రిజటయను నిశాచరి యిట్లనియె. 84

మ. కలగంటిన్ వినుఁడింతులార! మనలంకాద్వీప మీయబ్ధిలో
పల బ్రాలన్ మన రావణేశ్వరుని శుంభద్రత్నకోటీరముల్
కలనన్ గూల రఘూద్వహుండెలమితో గంధద్విపం బెక్కి యు
జ్జ్వలకాంతిన్ విలసిల్లుసీతఁ గొనిపోవన్ మిన్నకేనిప్పుడే. 85

క. శుద్ధాత్ముఁడైన రాముఁడు
శుద్ధాంతపుదేవిఁ గాన శుభసూచకముల్
శుద్ధ మయి తోఁచుచున్నవి
సిద్ధం బీమాట వేదసిద్ధాంతముగాన్. 86

Akella Raghavendra's Online-ias.com

క. కావున నిక్కోమలి యెడఁ
గావలి యున్నట్టిమీరు కఠినోక్తులు గా
నేవియు నాడకుఁ డీఁక నీ
దేవియ రక్షింప మనకు దిక్కగు మీఁదన్. 87

వ. అని చెప్పి మఱియును. 88

క. అమ్మా వెఱవకు మదిలో
నిమ్మగ మఱి వేడ్కనుండు మిఁక నీమగఁడున్
నెమ్మిగ నినుఁ గొనిపోవును
మమ్మందఱ మనుపు మమ్మ మఱవక కరుణన్. 89

ఆ. అనుచు దనుజకాంత లంతంత నెడఁబాసి
నిదుర వోయి రంత నదరి సీత
తనకు దిక్కు లేమిఁ దలపోసి దుఃఖింపఁ
బవనసుతుఁడు మనుజ భాషఁ బలికె. 90

క. ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
డున్నాఁ డిదె కపులఁ గూడి యురుగతి రానై
యున్నాఁడు నిన్నుఁ గొని పో
నున్నాఁ డిది నిజము నమ్ము మూర్వీతనయా ! 91

సీ. ఆమాట లాలించి భూమిజ తనలోన
వెఱఁగంది శింశుపావృక్ష మరసి
చూడంగ నప్పుడు సూక్ష్మ రూపంబున
నాడికమౌ శాఖలనడుమ నున్న
కపికుమారువిరూప మపురూపముగఁ జేసి
స్వాంతంబులోన హర్షంబు నొంది
దనుజమాయలచేతఁ దఱచు వేఁగుటఁ జేసి
మాటాడ నేరక యూర కున్న

తే. భావ మూహించి తన్ను నాదేవి యాత్మ
శ్రమ్మతుండుట దెలిసి యాకొమ్మమీఁది

Akella Raghavendra's
Online-Jas.com

నుండి క్రిందికి లంఘించి నిండుభక్తి
మ్రొక్కి నిలుచుండి కరములు మోడ్చి పలికె. 92

ఉ. తమ్మునిఁగూడి పుణ్యగుణధాముఁడు రాముఁడువచ్చి మాల్య వం
తమ్మున సైన్యసంఘము ముదంబునఁ గొల్వఁగనుండి భూమిపై
మిమ్ములజూచిరండనుచు మేటికపీంద్రులఁబుచ్చి యందు ము
త్తమ్ముగ మమ్ముఁ గొందఱను దక్షిణ భాగముచూడఁ బంపుచున్. 93

క. అంగనఁ బొడఁగన నీ వి
య్యంగను గడుఁ జాలువాఁడ వంచును నాచే
నుంగర మంపెను శ్రీరఘు
పుంగవుఁ డిదె కొమ్మటంచు భూమిజ కిచ్చెన్. 94

ఉ. ఇచ్చినఁ జూచి రామధరణీశ్వరుముద్రికఁ గా నెఱింగి తా
నిచ్చను మెచ్చి యాకువలయేక్షణ యాత్మగతంబునందు నీ
వచ్చినదాని భావమును వల్లభుచందము నేర్పడంగ నేఁ
జెచ్చెర నంతయుం దెలియఁ జెప్పుము నమ్మిక పుట్టునట్లుగన్. 95

వ. అని విచారించి యిట్లనియె. 96

క. విను విశ్వసింపఁ జాలను
వినుపింపుము నీతెఱంగు విభునివిధము నా
కనవుడుఁ బావని తెలియఁగ
వినయంబున విన్నవించె విస్ఫుటఫణితిన్. 97

ఉ. రాముని డాఁగురించి విను రావణుఁ డెత్తుక వచ్చువేళ నీ
హేమవిభూషణావళుల నేర్పడ ఋశ్యమహాద్రిపైచివన్
మేమవి తీసి దాఁచితిమి మీపతి యచ్చటి కేఁగుదేరఁగాఁ
దామరసాప్తనందనుఁడు తానవి సూపినఁజూచి మెచ్చుచున్. 98

సీ. అర్కసంభవునకు నభయంబు దయచేసి
దుందుభికాయమ్ము దూలఁ దన్ని
యేడుతాడుల సర్వమేకమ్ముగాఁ ద్రుంచి
వాలి నద్భుతశక్తిఁగూల నేసి

Akella Raghavendra's Online-ias.com

సుగ్రీవునకుఁ దార సుదతిగా నిప్పించి
యంగదు యువరాజునంగ నిలిపి
వారలతోడను వానరసైన్యంబు
లెన్నైనిఁ గొలువంగ నేఁగుదెంచి

తే. మాల్యవంతంబునం దుండి మనుజవిభుఁడు
నిన్ను వెదకంగ నందఱ నన్నిదిశలఁ
బనుచునప్పుడు దక్షిణభాగ మరయ
నంగదునితోడఁ గొందఱ మరుగుదేర. 99

తే. వారిపంపున నవలీల వార్ధి దాఁటి
వచ్చి సకలంబుఁ జూచి యీవంకఁ గంటి
రావణుఁడు వచ్చి నిన్ను నుగ్రంబు గాఁగఁ
బలుకునప్పుడు నున్నాఁడఁ బాదపమున. 100

వ. ఇవ్విధంబునఁ బలుకుచుండినను నమ్మక యతనిం గనుంగొని రాముఁ
డేరీతివాఁడో యతని చందం బెఱింగింపు మనవు డావాయుసందనుండు రఘునంద
నునకు వందనం బాచరించి భూమినందన కిట్లని చెప్పుచున్నాఁడు. 101

సీ. నీలమేఘచ్ఛాయఁ బోలు దేహమువాఁడు
ధవళాబ్జపత్ర నేత్రములవాఁడు
కంబుసన్నిభ మైనకంఠంబు గలవాఁడు
బాగైనయట్టి గుల్ఫములవాఁడు
తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాఁడు
ఘనమైన దుందుభిస్వనమువాఁడు
పద్మరేఖలు గల్గు పదయుగంబులవాఁడు
చక్కనిపీనవక్షంబువాఁడు

తే. కపట మెఱుఁగని సత్య వాక్యములవాఁడు
రమణిః రాముండు శుభలక్షణములవాఁడు
ఇన్నిగుణముల రూపింప నెసఁగువాఁడు
వరుస సౌమిత్రి బంగారువన్నె వాఁడు. 102

తే. ఉరుతరాటవిలోన మహోగ్రతపము
వాయుదేవుని గుఱియించి వరుసఁ జేసి
యంజనాదేవి గనియె నన్నర్థితోడ
నర్కజునిమంత్రి హనుమంతుఁడంద్రు నన్ను. 103

వ. అనియిట్లు తాత్పర్యంబునఁ బట్టునట్లుగా విన్నవించి దేవీ! నీదేవుం డయిన శ్రీరాముండు నాచేతి కిచ్చి యంపిన నూత్న రత్నాంగుళీయకంబు నీకు సమర్పించితి నింక నాకు రిక్తహస్తంబులతోఁజనుట దూతల కుచితమైన కార్యంబు గాదు గావున నిన్ను దర్శించినందులకు శ్రీరామునకును నమ్మిక పుట్టునట్టులుగా నీశిరోరత్నంబు దయచేయవలయు ననుటయు నా కుశేశయనయన యిట్లనియె. 104

క. నానాథుక్షేమ మంతయు
ధీనిధి! నీచేత వింటిఁ దెలియఁగ నైనన్
నీనిజరూపము చూడక
నే నారత్నంబు నమ్మి నీ కీయఁ జుమీ. 105

వ. అనుటయు నాహనుమంతుండు. 106

క. చుక్కలు తలపూవులుగా
నక్కజముగ మేనువెంచి యంబరవీథిన్
వెక్కసమై చూపట్టిన
నక్కోమలి ముదము నొందె నాత్మస్థితికిన్. 107

వ. ఇట్లు తనమహోన్నత రూపంబు చూపి యెప్పటియట్ల మరల సూక్ష్మ రూపంబు గైకొని నమస్కరించిన నాహనుమంతునకు నద్దేవి తన శిరోరత్నంబు నను్గ్రహించి యిట్లనియె. 108

చ. రవికుల వార్ధిచంద్రుఁడగు రాముని సేమము చాల వింటి నా
వివిధము లైనపాట్లు పృథివీపతికిం దగఁ జెప్పఁ గల్గె నేఁ
డవిరళభంగి నీవలన నచ్చుగ నే నుపకార మేమియుం
దవిలి యొనర్ప లేను వసుధాస్థలి వర్ధిలు బ్రహ్మకల్పముల్. 109

వ. ఇట్లు దీవించి మఱియును. 110

క. ఏయెడఁ జూచిన ధరణీ
నాయకు శ్రీపాదయుగము నాచిత్తములో
బాయ దని విన్నవింపుము
వాయుతనూజుండ పుణ్యవంతుఁడ తెలియన్. 111

తే. ఇపుడు రావణుఁ డేతెంచి కపటబుద్ధి
గర్వమునఁజేసి నన్నెన్ని కాఱులాడె
నన్నియును నీవు చెవులార విన్న తెఱఁగు
పతికి దయ పుట్టఁగా విన్నపంబు సేయు. 112

సీ. నిడుదపున్నొఱివేణి జడలుగా నవరించి
మలినజీర్ణాంబరం బొలియఁ గట్టి
భూమీరజంబు విభూతి పూఁతగఁబూసి
తనదివ్యమూర్తిఁ జిత్తమున నిల్పి
నిరశనస్థితితోడ నిలిచి భూశయ్యను
బవళించి నిదుర యేర్పడఁగ విడిచి
తారకబ్రహ్మమంత్రంబుఁ బఠింపుచుఁ
గఠినరాక్షస దుర్మృగములలోన

తే. నహితలంకామహాద్వీపగహన సీమఁ
దపము సేయుచు నున్నాను తన్నుఁ గూర్చి
నాకుఁ బ్రత్యక్ష మగు మని నాథునకును
విన్నవింపుము సత్త్వసంపన్న! నీవు. 113

వ. అని చెప్పి మఱియును. 114

చ. జనకునిభంగి రామనృపచంద్రుని నన్నును దల్లిమాఱుగాఁ
గని కొలువంగ నేర్పుగుణగణ్యుని లక్ష్మణు నీతిపారగున్
వినఁ గన రానిపల్కు లవివేకము చేతను బల్కినట్టి యా
వినుతమహాఫలం బనుభవించితి నంచునుఁ జాటి చెప్పుమా. 115

క. ఆమాటలు మది మంచక
నామానముఁ గావు మనుచు నయవినయగుణో

ద్దాముఁడు రాముని తమ్ముఁడు
సౌమిత్రికిఁ జెప్పవయ్య సాహసివర్యా! 116

వ. అని యిట్లు జనక రాజతనయ పలికినపలుకు లాలకించి హనుమంతుం డాజననితో నిట్లనియె. 117

క. ఇనుఁ డుదయింపకమున్నే
వననిధి లంఘించి మనుజవల్లభుకడకున్
నినుఁ గొనిపోయెద వీఁపున
జననీ! కూర్చుండు మనిన సంతోషమునన్. 118

క. నీవంతవాఁడ వగుదువు
నీవెంటనె వత్తునేని నెగడవు కీర్తుల్
రావణునికన్న మిక్కిలి
భూవరుఁడే దొంగ యండ్రు బుధనుతచరితా. 119

వ. అదియునుంగాక రామచంద్రునిం దప్ప నితరుల నంటు దానం గాను గావున నీతో రాఁ దగదు మఱియును. 120

క. దొంగిలితెచ్చిన దైత్యుని
సంగడు లగువాని వారిసాహస మొప్పన్
సంగరముఖమునఁ జంపక
దొంగిలి కొనిపోవఁ దగునె దొరలకు నెందున్. 121

వ. మఱియు రామచంద్రుండు త్రిజగదేక వీరుండును గోదండ దీక్షా గురుండును రాక్షసకులాంతకుండును నగుటంజేసి రాణివాసద్రోహియగు రావణుని సంగరరంగంబునఁ బ్రఖ్యాతంబుగాఁ జంపి కొనిపోవుట ధర్మంబు; నీవు రామచంద్రునకుఁబరమ భృత్యుండవును బుత్త్రసముండవును నగుటంజేసి నీవెంట నరుగు దెంచుట తప్పు గాకబోయినను బగ తీర్పక వచ్చు టుచితంబుగాదు కావున రాఘవేశ్వరుల కిన్నియుం దెలియ విన్నపంబు సేసి తడయక తోడ్కొని రమ్మనిన నద్దేవికి నమస్కరించి హనుమంతుం డిట్లనియె. 122

ఉ. నీవిభుఁడబ్ధి దాఁటి ధరణీతలనాథులు సన్నుతింప సు
గ్రీవసుషేణముఖ్యబలబృందముతో నరుదెంచి నీచునిన్

రావణు నాజిలోఁ దునిమి రాజిన మొప్పఁగ నిన్నుఁగొంచుపే
నావళితోడ నీపురికి నారయ నేగు నిజంబు నమ్ముమా. 123

వ. అని విన్నవించి నమ్రుండై యద్దేవిచేత దీవనలు బొంది మరలి
చనుచున్నవాఁడై తనరాక రావణున కెఱుంగఁ జేయువలయునని తలంచి. 124

సీ. మేదిని సమముగా మేడలు గావించి
కేళీగృహంబుల నేలఁ గలిపి
కమలాకరంబులు కలఁచి గారలు వెట్టి
వృక్షజాతంబుల విఱుగఁ దన్ని
పుష్పగుచ్ఛంబులు పుణికి పాఱఁగ పైచి
తేనెలు రాల్చి పూఁదేనె లుడిపి
పొదరిండ్ల పొదవులు చదియఁగా నుగ్గాడి
చప్పరంబుల నేల చదును జేసి

తే. వనముఁ గాచెడి రాక్షసవర్గములను
వీరవరులను నెనిమిదివేలఁ జంప
సీతఁ గాచెడి రాక్షస స్త్రీలు బెదరి
పాఱిపోయిరి రావణుపాలి కంత. 125

వ. ఇట్లు రావణుం జేరి వారు. 126

క. దేవాః నేఁ డొకమర్కటుఁ
డేవిధమున వచ్చినాడొ యెఱుఁగము సీతా
దేవిఁ గని మాటలాడియుఁ
బోవక వనమెల్లఁ బెఱికి ద్రోవిడి కదఁకన్. 127

తే. వనముఁ గాచెడి రాక్షసవర్గములను
దండి నొకనిని మిడి వోవ కుండఁ బట్టి
మెటిఖుజిశక్తి నందటిఁ గీటడించి
వాఁడె యున్నాఁడు సాహసవంతుఁ డగుచు. 128

Akella Raghavendra's Online-ias.com

వ. అని విన్నవించినంతనే క్రోధరక్తాంత లోచనుండగుచు నవ్వింశతి లోచనుండు విచారించి వాఁడు రామునిపంపున వచ్చినదూత కాఁబోలు వానిం జంపుం డని పదివేల రాక్షసులం బంపిన. 129

క. ఉగ్రాకారుం డగుచు ద
శగ్రీవుం డనుప దనుజసంఘంబులు దా
మాగ్రహమునఁ జనుచు బలో
దగ్రక్రోధాత్ములగుచుఁ దాఁకిరి జడిమిన్. 130

ఉ. తాఁకిన యంత వాయుజుఁడు తానదలించి కఠోరరేఖతో
వీఁక నెదిర్చి పేర్చి రణవీథి నిశాచరసైన్య మెల్ల నొ
క్కూఁకున* వెంటనంటి సమదోగ్రబలంబునఁ బొఱఁబొఱఁగాఁ
దోఁకనుజుట్టిమోఁదె బలుదుర్దములం దునుమాడె నందఱన్. 131

క. అందునఁ జావక మిగిలిన
కొందఱు పఱతెంచి యసురకొల్వున మొఱ్ఱో
యందఱ గ్రింగెను దానవు
లందఱకును వీఁడు దారుణాంతకుఁ డగుచున్. 132

వ. అని విన్నవించిన రాక్షసేశ్వరుం డగు రావణుండు మండిపడి పింగళాక్షుని దీర్ఘజిహ్వుని సశ్మవక్షుని శార్దూలముఖుని వక్రనాసునిఁ బనిచిన వారును దమతమ బలంబులం గూడికొని రథారూఢులై వచ్చి యార్చుచుందాఁకి శస్త్రాస్త్రంబు లడరించిన నవియెల్ల లెక్కగొనక యక్కరువలికొడుకు దర్పంబునంజేర్చి వాల మల్లార్చి యెదిర్చిన బలంబునుబలువిడిగాఁ దోలి పింగళాక్షునిఁ ద్రుంచి దీర్ఘజిహ్వుని దీర్ఘనిద్ర పుచ్చి వక్రనాసునిఁ బరాక్రమంబునం జూర్ణంబుపేసి యశ్మవక్షుని భస్మంబుఁజేసి శార్దూలముఖుని మర్దించి నిర్వక్రపరాక్రమంబున గర్వించి మరలి మకరతోరణంబు నారోహించి యార్చుచున్న సమయంబున. 133

క. చావక మిగిలిన దైత్యులు
రావణుకడ కేఁగి వేగ రాహుత్తులపా
ట్లావాయుజుసాహసమును
వేవిధములఁ జెప్ప నతఁడు విస్మయపడుచున్. 134

* వేఁడినంటి సమరోగ్రబలంబున.

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
సంఖ్య 4291
తేది

Avella Raghavendra's Online-ias.com

మ. కుటిలభ్రూకుటిదుర్నిరీక్షణములం గ్రోధానలజ్వాల లు
త్కటమై పర్వఁగ మంత్రి సూనుల మహాగర్వాంధులన్ గ్రూరుల
న్పటు బాహాబలు రార్వురం బనిచె శంభద్విక్రమాటోపమ
ర్కటపారీంద్రముమీఁద నుద్దవిడి సంగ్రామంబు గావింపఁగన్. 135

వ. ఇట్లు పనిచిన నాయార్వురును. 136

సీ. శతకోటివిక్రమప్రతిమానుఁ డైనట్టి
శతజిహ్వుఁ డత్యంతసాహసుండు
రోషానలాభీలశేషాహి యైనట్టి
రుధిరాక్షుఁ డత్యుగ్రరూపయుతుఁడు
పరసైన్యకాననపావకుం డైనట్టి
రక్తరోముఁడు మహారణబలుండు
కఠినశాత్రవలోకగజసింహుఁ డైనట్టి
శూరదంష్ట్రుఁడు లయకాలయముఁడు

తే. వ్యాఘ్రకబళుండు పృథుతరవైరిజయుఁడు
స్తనితహస్తుండు సాహసోదారబలుఁడు
వీర లార్వురు నత్యుగ్రవేషములను
రూఢి వెడలిరి ఘనరథారూఢు లగుచు. 137

క. తమతమబిరుదులు నెఱపుచుఁ
దమకంబున వెడలి రథికతండము గొలువన్
ఘుమఘుమ భేరీరవసం
భ్రమములతో మంత్రిసుతులు పావనిమీఁదన్. 138

వ. ఇట్లు కదిసి సింహనాదంబు లంబరంబునం జెలంగ గజ తురంగ శతాంగసుభటనికరంబుం గూడి శస్త్రాస్త్రంబులం బొదివిన. 139

తే. వాలమల్లార్చి బ్రహ్మాండగోళ మెల్ల
నగల నార్చుచు భుజయుగం బప్పళించి
రణము చేయంగ మకరతోరణము డిగ్గి
మంతు కెక్కినయాహనూమంతుఁ డంత. 140

Akella Raghavendra's
Online-ias.com

సీ. ఒక్కొక్కరథముతో నొక్కొక్కరథమును
విటతాటనంబుగా విఱుగఁగొట్టి
యొక్కొక్కగజముతో నొక్కొక్కగజమును
జాఁపచుట్టగఁ బట్టి చావఁ గొట్టి
యొక్కొక్కహయముతో నొక్కొక్కహయమును
గడిమితో నలినలి గాఁగఁ గొట్టి
యొక్కొక్కభటునితో నొక్కొక్కసుభటుని
వడి ద్రిప్పి చెక్కలు వాఱఁ గొట్టి

తే. బాహుబలగర్వమునఁ బేర్చి ప్రథనసీమ
మంత్రిసూనుల నార్వుర మడియఁగొట్టి
మకరతోరణమున విక్రమమ్ము మెఱయ
భీకరాకారుఁడై యుండెఁ బెచ్చుపెరిఁగి. 141

క. ఆ రణవీధిని నిలువక
పాఱినహత శేషు లెల్లఁ బల్విడి రాజ
ద్వారమున బొబ్బలిడి రా
ఘోరాజిని మంత్రిసుతులు కూలి రటంచున్. 142

వ. వారిపాటు విని రావణాసురుం డదరిపడి యాజ్యాహుతిం బ్రజ్వరిల్లు హుతాశనుం బోలి మండిపడి ప్రహస్తతనూజుండగు జంబుమాలిం గని నీ వావానరాధముని వధించి శీఘ్రమ్ము రమ్మని యనిపిన. 143

ఉ. అప్పుడు జంబుమాలి భయదాకృతి వీరరసాప్తిఁ గన్నులన్
నిప్పులు రాలఁ బేరలుక నిండఁగ మూర్పులు పర్వఁ జిత్రమై
యొప్పగ రొప్పుచున్ రణమహోత్సుకుఁడై గజవాజిబృందముల్
విప్పుగ వెంటఁ రాఁగఁ గపివీరు నెదుర్కొని విక్రమంబునన్. 144

క. అదలించి వాయునందనుఁ
బ్రదరంబుల సేయ నంతఁ బవనజుఁ డలుకన్
గొదగొని బలముల నన్నిటిఁ
జదియంగా మోఁదె నొక్కసాలము చేతన్. 145

Akella Raghavendra's Online ias.com

ఆ. రథము నుగ్గు నేసి రథసారథినిఁ జంపి
రథతురంగమములఁ బృథులశక్తిఁ
బట్టి వాలమునను బడఁగొట్టి చంపిన
జంబుమాలి కినిసి సాహసమున. 146

క. అడిదంబును గదయునుఁ గొని
పుడమికి లంఘించి వాయుపుత్త్రుని నిటలం
బెదపక వ్రేసిన ధరణిం
బడి మూర్ఛ మునింగి తెలిసి బలయుతుఁ డగుచున్. 147

క. ఆలంబున నాతనికర
వాలంబును ద్రుంచి వైచి వరభుజశక్తిన్
నేలం గూల్చెను విక్రమ
శాలిన్ వడి జంబుమాలి సాహసశీలిన్. 148

ఆ. అట్లు జంబుమాలి యత్యంతబల శాలి
గర్వమెల్లఁ దూల కలన వ్రాలి
వొలిసె ననుట దైత్యపుంగవుఁ డాలించి
యాత్మ సంచలింప నాగ్రహించి. 149

క. సాహసము వెలయ సమరో
త్సాహంబున దుష్టకపినిఁ జంపు మటంచున్
బాహుబలాఢ్యుని నరివిక
రాహవసంహరు వీరు నక్షకుమారున్. 150

వ. అంపిన నతండు. 151

సీ. చిత్రమాణిక్యరంజిత వేత్ర విభవంబు
భానుకోటిప్రభాభాసితంబు
భీకరధ్వజదండబిరుదాలవాలంబు
శస్త్రాస్త్రపరికరసంయుతంబు
బంధురాధిక జవబహుహయోపేతంబు
కుటిలదిక్పాలదృగ్గోచరంబు

Akella Raghavendra's Online-ias.com

ఘననభోమార్గవిఖ్యాతైకగమనంబు
వరతపోలబ్ధాతివైభవంబు

తే. లైనరథ మెక్కి మదవారణౌఘసుభట
వీరహుంకారఝంకారవార ములియఁ
గదలె హనుమంతుపైకి నాగ్రహ మెసంగ
మదము దైవార నక్షకుమారుఁ డలుక. 152

క. అటుచని పావనిఁ గని ది
క్తటములు సెదరంగ నార్చి దండడి భూభృ
త్తటముపయిఁ గురియువరో
త్కటధారలరీతి నంపధారలు గురిసెన్. 153

ఉ. వాయుజుఁడప్పు డంపగమి వాలముఖంబునఁ ద్రుంచెఁ ద్రుంచినన్
వాయుజుమీఁద గ్రమ్మఱ నవార్యబలంబున నేసె నేసినన్
వాయుజుఁ డుగ్రుఁడై తునిమె వానిశరావళి నెల్లఁ బిమ్మటన్
వాయుజు నాట సేసెఁ గడు వాఁడిశరంబుల నక్షుఁ డుద్ధతిన్. 154

వ. ఇట్లేసిన. 155

ఉ. తాలమహీజరాజిని రథంబును గూలఁగ మోఁదె మోఁదినన్
నేల బదాతియై నిలిచి నేర్పున వాఁడు శరాళి మారుతిన్
ఫాలము నొంచె నొంచినను పావని మూర్ఛిలి తేఱి దానవున్
దూలఁగ ముష్టిచే బొడిచె దోర్బలశక్తి రణాంగణంబునన్. 156

సీ. పొడిచిన మూర్ఛిల్లి వడి దేఱి దైత్యుండు
గదఁ గొని వైచె వక్షంబు పగుల
వైచిన మారుతి వడి వానిగదఁ బుచ్చు
కొని వాని దేహంబు గుదియ నేసె
నేసినఁ దనవీక నోసరింపక వాఁడు
గగనంబు కెగసె నాక్షణమునందె
వాయుతనూజుండు వదలక తనవెంట
నెగసిన గదఁ గొని మోదె నతని

Akella Raghavendra's Online-ias.com

తే. నతఁడు గదఁ ద్రుంప ఖడ్గాన నతులశక్తి
వాఁడు మారుతితొడలు నొవ్వంగ నడఁచె
నంత సోలుచు నాహనూమంతుఁ డెగిరి
పట్టుకొని వాని భూమిపైఁ గొట్టిచంపె. 157

తే. అంత హతశేషు లగువార లరుగుదెంచి
సంభ్రమంబున దానవచక్రవర్తిఁ
గాంచి కొలువెల్ల సందడి గాఁగ నపుడు
బహువిధంబుల హనుమంతుఁ బ్రస్తుతించి. 153

సీ. అక్షుండు తెగె నశ్మవక్షుండు తెగటాఱె
రక్తరోముఁడు నీల్గె రణములోన
స్తనితహస్తుఁడు గ్రగ్గె శార్దూలముఖుఁ డీల్గెఁ
గింకరవర్గంబు గీటడంగె
శార్దూలకబళుండు సచ్చె దుర్జయుఁడేఁగె
శతమాయుఁడొరిగెను సమసె వక్ర
నాసుండు మఱి రక్తనాసుండుఁ గడతేఱె
శూలదంష్ట్రుఁడు నేలఁ గూలిపోయె

తే. మడిసె యూపాక్షుఁడట జంబుమాలి తునిఁగెఁ
బింగళాక్షునిపే రంత బిలము సొచ్చె
వనముకావలిరాక్షసవర్గ మడఁగె
దీర్ఘజిహ్వుండు నేటితోఁ దీఱిపోయె. 159

వ. అని వేఱువేఱ విన్నవించిన నసురేంద్రుఁడు విని తనమనంబున. 160

మత్త. వీని వానరుఁడంచు నిక్కము విశ్వసింపఁగఁ జెల్ల దీ
దానవావళి మ్రింగఁ బుట్టిన దయ్యమో యటు గాక వై
శ్వానరుం డిటువంటిరూపున వచ్చి నిల్చెనొ కాక యీ
మేను గైకొని విష్ణుఁ డీడకు మేటియై చనుదెంచెనో. 161

మత్త. కాక యేవర మైన నాకటుకంతుఁడిచ్చిన నుబ్బి యా
నాకవల్లభుఁ డెల్లకాలము నాకు నోడినభీతిమై

క. ఇనతనయుని వరమంత్రిని
జనపతి యైనట్టి రామచంద్రునిదూతన్
ఘనుఁ డగువాయుకుమారుఁడ
హనుమంతుం డండ్రు నన్ను నార్యులు దిశలన్. 202

క. రామునిపంపున వచ్చితి
రాముని సేమంబు నిందు రంజిల్లెడి యా
రామునిసతి కెఱిఁగించితి
రామునికడ కేఁగుచుండి రాజసవృత్తిన్. 203

క. నారాక మీకుఁ దెలియఁగ
బీరంబున వనము గలయఁ బెఱికితి శక్తిన్
ఘోరాజి నాకు నెదిరిన
వారలఁ జంపితిని యమునిపట్నము చూడన్. 204

క. నినుఁజూచి తిరిగిపోయెద
మనమున మఱి కట్టఁబడితి మనుజాశన! నీ
యను వెల్లఁ గంటి నింకను
వినుమా నాబుద్ధిఁ దెలియ వివరముతోడన్. 205

చ. ఘనుఁడవు నీతిమంతుఁడవు కార్యమెఱుంగుదు సాహసంబున
న్నినను నెదిరించి పోరుటకు నిర్జరవల్లభుఁ డోప లేఁడు నీ
వనిన జగత్రయం బళుకు నద్భుతరూపము సెప్పరాదు నీ
యనుపమభోగసంపదల కాఱడి తెచ్చితి విప్డు రావణా. 206

క. కడలేని బలము ధర నె
క్కడ లేని మహాధనంబు కరితురగంబుల్
కడ గావరానిసంపద
చెడ కుండఁగ నీకు బుద్ధిచెప్పెద వినుమా. 207

సీ. కుదియించి సింహంబుకోఱలు పెఱుకంగ
శేషాహిదౌడలు చీల్చివేయఁ
బీడించి దంభోళిఁ బిడికిటఁ బట్టంగఁ
కఠినకాకోలంబు కడిగొనంగఁ

Akella Raghavendra's Online-ias.com

జెలఁగి బ్రహ్మాండమ్ము చిప్ప లూడఁగఁ దన్న
హంకారమున బడబాగ్ని మఱక
నంభోనిధానంబు లఱచేత నడపంగ
గిరివర్గములఁ దల క్రిందుచేయఁ

తే. గలమహాబాహుసత్త్వవిఖ్యాతివిపుల
చండభుజదండసాహసోద్దండవిజయ
కాలరుద్రావతార సంగ్రామభీమ
మూర్తి మంతులు కపులు సత్కీర్తియుతులు. 208

వ. అదియునుంగాక దశరథరాజనందనుండును గౌసల్యాగర్భ సంభవుం
డును దాటకాప్రాణాపహరుండును విశ్వామిత్ర యాగ సంరక్షకుండును నహల్యాశాప
మోక్ష దీక్షాగురుండును హరకోదండఖండనుండును జామదగ్ని బాహుబల భంగుం
డును విరాధనిరోధుఁడును ఖరదూషణత్రిశిరశ్ఛేదనుండును మాయామృగ సంచారి
మారీచ సంహరకుండును గబంధాంతకుండును వాలిప్రాణనిబర్హణుండును సుగ్రీవ
రాజ్యసంస్థాపనపరమాచార్యుండును ధనుర్విద్యాప్రవీణుండును నమోఘ
బాణుండును రాక్షసకులాంతకుండును గాకుత్స్థాన్వయాంభోనిధిచంద్రుండును
గరుణాసింధుండును నగు శ్రీరామచంద్రుండు కరుణాలంకారుండు గావున. 209

ఉ. వారక సీత నిచ్చి రఘువల్లభునిన్ శరణంబుఁ జొచ్చినన్
నేరము లెంచి చంపమికి నీయెడ కెప్పుడు నేను బూఁటగా
భారపడంగఁ జాలుదు శుభస్థితి నమ్ముము నమ్మకూరకే
పోరఁగఁ జూచితేనిఁ బొరిపుచ్చకమానఁడు నిన్నురావణా. 210

ఉ. నావుడు మండి దైత్యకులనాయకుఁ డుగ్రవిలోకనంబులం
బావక విస్ఫులింగములు పైకొని పాఱఁగ వీరఘోరదై
త్యావళిఁ జూచి మీరలు మహావిశిఖంబుల వీనిఁ జంపుఁడీ
యావలరాముఁడులుక్కుచు భయాకులుఁడై చెడిపోవునట్టుగన్. 211

వ. అనిన విభీషణుండిట్లనియె. 212

క. దూతపనిఁ బూని వచ్చిన
దూతలు తమనేరి కేమి తోఁచిన నటా

వ. ఇట్లనేక ప్రకారంబులఁ గాలాగ్ని తెఱంగున వెడలి మిడుంగుఱులు చెదరి పడఁగ బ్రహ్మాండమండలంబుం బట్టుకొనునట్లు పెనుమంట లుప్పరం బెగయ నేతెంచు బ్రహ్మాస్త్రముంగని హనుమంతుండు తన మనంబున. 189

ఆ. తనకుఁ జిన్ననాఁడు దయచేసినటువంటి
వనజభవునిచేతివరముఁ దలఁచి
బ్రహ్మమంత్ర మప్డు పఠియింప నది చంప
కతనిఁ గట్టివైచె నవని మీఁద. 190

వ. ఇట్లు కట్టుపడిన కరువలిపట్టినిఁ జూచి రావణాసురునిపట్టి తనలో నిట్టులనుకొనియె. 191

క. ఈబ్రహ్మాస్త్రము తాఁకుట
కేబలియుఁడు బ్రతుక నోపఁడితఁడు ఘనుండౌ
నీబాహుబలునిఁ గట్టుట
నాబలిమికిఁ దొడవ కాదె నాకులు మెచ్చన్. 192

క. పెక్కండ్ర దనుజవీరులఁ
జక్కాడినవీనిఁ బట్టి సాహసముగ మా
రక్కసుల ఱేనియొద్దకుఁ
జక్కఁగఁ గొనిపోవు టదియ చంపుట గాదే. 193

చ. అని తనసత్త్వసంపద రయంబునఁ బొంగుచు మేఘనాదుఁ డ
య్యనిలజుఁ గొంచు నేఁగె దివిజారి సభాస్థలి కద్భుతంబుగా
ఘనరథదంతిఘోటకనికాయభటావళి శస్త్రదీప్తకే
తనవరశంఖకాహళ వితానరవంబులు మిన్ను ముట్టఁగన్. 194

వ. ఇట్లు గొనిపోయి రాక్షసేశ్వరుండయిన రావణాసురు సమ్ముఖమ్మునం బెట్టినంతనే గాడుపట్టిం గని. 195

క. కుటిలభ్రూకుటినటన
స్ఫుటధూమవిలాసపవనపూత్కృతిజనితో
ద్భటరోషానలకీలో
త్కటనేత్రుండగుచుఁ బలికెఁ గటము లదురఁగన్. 196

Akella Raghavendra's Online-ias.com

ఉ. ఎవ్వఁడ వోరినీకుఁ బ్రభువెవ్వఁడు చెప్పుము నీవిటొంటిమై
నివ్వనరాశి దాఁటి యిట కేగతి వచ్చితి నామ మేమి నీ
వెవ్వని ప్రాపునం బెఱికి తీవన మంతయు శంక లేక యిం
కెవ్వని ప్రాపునం దునిమి తీసురవైరులనెల్ల నుగ్రతన్. 197

సీ. అమరవల్లభుభోగ మంతయుఁ గైకొని
వీతిహోత్రునిసిరి నీట ముంచి
జమునికింకరులను సంహార మొనరించి
రాక్షసాధీశ్వరు శిక్ష సేసి
యంభోధినాథుని గాంభీర్య మణఁగించి
దోర్బలంబున గాలిఁ దూలఁ బెట్టి
విత్తనాథునిమహావిభవంబు గొల్లాడి
శూలహస్తుని నొక్కమూల కదిమి

తే. అమరగంధర్వకిన్నరయక్ష భుజగ
గరుడగుహ్యకముని సిద్ధవరుల నెల్లఁ
బట్టి మును వెట్టి సేయించు నట్టినన్ను
విన్నయంతన గుండెలు వ్రీల వెట్లు. 198

చ. శరనిధిదాఁటివచ్చుటయ చాలక నాపురిఁజొచ్చి చొచ్చియున్
పెఱవక బంటవై వనము వ్రేళ్ళకుఁ ద్రుంచితి త్రుంచి క్రమ్మఱన్
బిరుదవుపోలె రాక్షసులఁ బెక్కురఁ జంపితి చంపి నెమ్మదిన్
గరకరితోడి నాయెదుర గర్వముతోడుత నిల్చి తద్దిరా. 199

క. ఖండించెద నీచేతులు
తుండించెద నడుము రెండుతునకలు గాఁగన్
బెండించి నీదుకండలు
వండించెదఁ జమురుతోన* వాసవుఁ డలుకన్. 200

వ. ఇట్లు పట్టరాని కోపంబున నాటోపంబుగాఁ బలుకుచున్న రావణాసురుం
జీరికిం గొనక హనుమంతుం డిట్లనియె. 201

* వాచవి గలుగన్

Akella Raghavendra's Online-ias.com

తే. తేరు లన్నియుఁ గూరాటి తేరులుగను
గుఱ్ఱముల నెల్లఁ గావేరి గుఱ్ఱములుగ
నేనుఁగుల నెల్ల వెదరూపు టేనుఁగులుగ
దళము లన్నియు మఱి హరిదళముగాఁగ. 174

వ. ఇట్లు సమయింపం జూచి బలంబు పైకుఱికి. 175

సీ. కరియూథములమీఁదఁ గదిసి మావంతుల
తోడఁ గూడఁగఁ బట్టి తునియఁ గొట్టి
గుఱ్ఱంపుఁబౌఁజులకును దాఁటి రౌతులఁ
గలయంగఁ బట్టి చెక్కలుగఁ గొట్టి
రథములపైకి నుగ్రంబుగా లంఘించి
రథికులతోఁ గూడ రసను గొట్టి
బలములమీఁద నిబ్బరముగాఁ గుప్పించి
వాలముఖంబునఁ దూలఁగొట్టి

తే. పటహనిస్సాణకాహళపటిమ లురియఁ
ద్రొక్కి శస్త్రాస్త్రనిచయముల్ తుమురు చేసి
ఛత్రములఁ ద్రుంచి పడగలసత్త్వ మణఁచి
పవనసూనుండు సాహసప్రౌఢి మెఱసె. 176

వ. అట్టి సమయంబున. 177

చ. అనలమురీతి మండి దివిజారితనూజుఁడు తేరు దోలి య
య్యనిలతనూజు నేసె వివిధాయుధ పంక్తుల వాని నెల్లఁ దు
త్తునియలు సేసె వాయుజుఁడు దోర్బలశక్తిని దైత్యుఁ డేయఁ దోఁ
కను దునుమాడె వానివిశిఖంబులనన్నిటి వాయు సూనుఁడున్. 178

క. గిరులును వందలకొలఁదిగఁ
దరువులు నేయంగఁ గినిసి దానవు డంతన్
దురమున నడుమనె త్రుంచెను
శరజాలముచేత నొక్కక్షణమున వానిన్. 179

Akella Raghavendra's Online-ias.com

తే. గంధవహంపుత్త్రుఁడప్పు డాగ్రహముతోడ
రథముఁ గూలంగఁ దన్ని సారథినిఁ * జదిపి
గుఱ్ఱములఁ జంపి కేతువుఁ గూల నడవ
మేఘనాదుండు కినిసి సమీరసుతుని. 180

వ. అహంకారంబునఁ బ్రతిఘటించి. 181

క. వాయవ్యాస్త్రము నంతట
వాయుజుమీఁదికి నతండు వడి నేసిన నా
వాయవ్యాస్త్రముఁ దూలెను
వాయుజునిం జంప నోడి వారనికరుణన్. 182

వ. అది వృథయగుటం గని మఱియును. 183

క. రౌద్రం బదరఁగ నేసెను
రుద్రాస్త్రం బతనిమీఁద రూఢిగ నతఁ డా
రుద్రునియంశం బగుటను
రౌద్రాస్త్రము దేలిపోయె రభసం బొప్పన్. 184

వ. అమ్మహాస్త్రంబుగూడఁ దప్పిపోవుట కాశ్చర్యంబు నొంది యింద్ర
జిత్తు మఱియును. 185

క. సురఖచరయక్షకిన్నర
గరుడోరగసిద్ధసాధ్యగంధర్వగణం
బరుదంది చూడఁగా ని
ర్భరముష్టిం దొడిగి యేసె బ్రహ్మాస్త్రంబున్. 186

వ. అట్టి యవసరమున. 187

క. సప్తాంభోధులుఁ గలఁగెను
సప్తద్వీపములు వణఁకె శైలము లదరెన్
సప్తానిలములుఁ దలఁకెను
సప్తాశ్వుఁడు బ్రమానుపడియె జగములు గదలెన్. 188

* దునిమి.

Akella Raghavendra's Online-ias.com

లోకభీకర మైన రాక్షసలోక మెల్ల నడంపఁగా
నీకరాళపురూపు నిప్పుడ యీడ కంపఁగ వచ్చెనో. 162

మత్త. కాక తక్కినవార లెవ్వరు గర్వసంపద మీఱఁగా
నాకు డీకొని ఢాకతోడ రణంబు సేయఁగ నోపరే
లోకమందిటు క్రోఁతులెక్కడ లోఁచు దానవవీరులన్
జోక వీనికిఁ గల్గెనేనియుఁ జూఱ పుచ్చఁదె సర్వమున్. 163

వ. అని యిట్లనేక ప్రకారంబులఁ జింతించి యక్షకుమారుం దలంచి పలుదెఱంగులఁ బలవించుచున్న తండ్రిం గాంచి మేఘనాదుం డిట్లనియె. 164

క. దేవతలతోడఁ గూడను
దేవేంద్రుని గెలిచినట్టి దేవరకున్ మీ
కీ వగపేటికి నేటికి
దేవా! చిత్తంబులోన దీనునిభంగిన్. 165

క. వానరుని గొందఁ జేసుక
పూనికఁజింతింప నేల భుజబలశక్తిన్
వానిం జంపెద నొండెను
దీనునిఁ గావించి పట్టి తెచ్చెద నొండెన్. 166

వ. నావుడు రాక్షసేశ్వరుం డతనిమాటలకు మనంబున నలరి నీవు విరించివరదత్త ప్రతాపహుతాశనుండవు చాపవిద్యాప్రవీణుండవు తపోబలసమర్థుం డవు దేవేంద్రగర్వవిమర్దనుండవు మత్సమానశౌర్యచాతుర్య ధుర్యుండవుఁ గావున నీ కసాధ్యం బగుకార్యం బెద్దియున్ లేదు నీ విపుడ పోయి వాని సాధించి రమ్మని పంచిన. 167

సీ. మాణిక్యతపనీయమయవిమానముతోడఁ
గెంబట్టుబిరుదు టెక్కెంబుతోడ
నరి చెప్పఁగా రానిశస్త్రాస్త్రములతోడ
బలమైనదివ్యచాపంబుతోడ
నాహవకోవిదుండైనసారథితోడ
ఘనసత్త్వజవతురంగములతోడఁ
గముపట్టి దిక్కుల గగనయానముతోడ
బాలసూర్యోదయప్రభలతోడఁ

Akella Raghavendra's OnlineJas.com

తే. గరము విలసిల్లరథ మెక్కి గంధనాగ
తురగరథభటవందిసందోహపటహ
శంఖకాహళ దుందుభిస్వనము లొలయ
మేఘనాదుండు హనుమంతుమీఁద వెడలె. 168

లయగ్రాహి. పెక్కులగు గుఱ్ఱములఁ జొక్కపురథంబులును
నెక్కువగునేనుఁగులు గ్రిక్కిఱిసి రాఁగా
రక్కసులు సేరి యిరుప్రక్కలును గొల్వఁ గడు
నుక్కునను మీఱి చల మెక్కుడుగ నంతన్
గ్రక్కదల భూతలము చుక్క లొగి రాల శిల
లుక్కసిలి నాదములు పిక్కటిలి మ్రోయన్
దెక్కెములు మించి జన మెక్కుడుగఁ జూపుదళ
మక్కజముగా నడువ దిక్కులు వడంకన్. 169

వ. ఇట్లు భయంకరాకారంబున వెడలి కంఠహుంకృతులును భేరీభాంకృతులును నంబరంబునఁజెలంగఁ బొంగి చనుదెంచుచున్న రాక్షససైన్యంబుం గనుంగొని హనుమంతుండు తోరణస్తంభంబుపై నుండి బధిరీభూతదిగంతరంబుగా భీకరగతి నార్చిన. 170

క. కలఁగినవి దేవగణములు
జలధులు ఘూర్ణిల్లె గిరులు చలనం బొందెన్
జల జాప్తచంద్రు లొదిగిరి
జలధరములు పఱియ లగుచుఁ జదలం బర్వెన్. 171

క. అప్పుడు దానవవీరులు
నిప్పులు వర్షించునట్టినిశితాస్త్రములం
గప్పిరి కెందొగ వానలఁ
గప్పినశైలంబుఁబోలఁగపివరుమీఁదన్. 172

తే. అంపవర్షంబు తనమీఁద జొంపములుగ
లీలఁ గురియంగ నవి యెల్ల లెక్కఁగొనక
భువికి లంఘించి యప్పు డద్భుతముగాఁగ
వాల మల్లార్చి యొకమహాసాల మెత్తి. 173

నేతల నాడుదు రాడిన
దూతలఁ జంపంగఁ దగదు దొరలకు నెందున్. 213

క. కాకుండిన మీచిత్తము
కాకెల్లను దీఱ ముజ్జగంబులు బెదరన్
ఢాక నదలించి తోఁకను
పీఁకను ముట్టించి పోవ విడుచుట చాలున్. 214

వ. అని విన్నవించిన. 215

ఆ. నీతివాక్యసరణి నెఱయంగ విని రావ
ణేశ్వరుండు కోప మెడలి పలికె
వీనిఁదోఁక గాల్చి వెడలంగఁ ద్రోయుఁ డీ
ప్రొద్దె యటకుఁ దిరిగి పోవుఁగాక. 216

వ. అని యిట్లానతిచ్చిన విని రాత్రించరు లతవిని సభామధ్యంబునుండి బయటికి వెడలం గొనిపోయి యొక్కచోట. 217

ఉ. వాలము నిండఁ గోకలు జవంబునఁ గట్టిగ జుట్టి వానిపైఁ
దైలము చక్కఁజల్లి పిఱుఁదం జని పౌరులు సూడఁబావక
జ్వాలఁ దగిల్చి బొబ్బలిడి వాడల వాడలఁ ద్రిప్పుచుండ వా
తూలభవుండు దానికిని దూలక వహ్నిజపంబు సేయఁగన్. 218

ఆ. అగ్నిదేవుఁడప్పు డాత్మలోఁ జింతించి
హితుఁడు నాకు లోకహితుఁడు పవనుఁ
డతని పుత్త్రుఁడైన హనుమంతునకు నేను
చలువ కూర్తు ననుచుఁ జల్లనయ్యె. 219

వ. అప్పుడచ్చటి వృత్తాంతం బంతయుఁ దనకుఁ గావలియున్న రాక్షస కాంతలవలనవిని చింతాభరాక్రాంతయై జనకరాజనందన కరంబు శోకించి కరంబులు ముకుళించి జగద్ధిత కార్యధుర్యుండును రాఘవప్రియానుచరుండును మత్ప్రాణ బంధుండును జగత్ప్రాణనందనుండునునైన హనుమానునకు శీతలుండవు కమ్మని యగ్ని దేవునకు నమస్కరించి యగ్నిమంత్రంబును బ్రహ్మమంత్రంబును నుచ్చరించిన వద్దానివలన వానికి వైశ్వానరభగవానుండు సల్లనయ్యె బ్రహ్మప్రబంధ నంబును నూడెనట్టి సమయంబున. 220

Akella Raghavendra's Online-ias.com

సీ. కొలువుకూటములకుఁ గుప్పించి గజవాజి
శాలలమీఁదికిఁ జౌకళించి
భండారగృహముల పైకిని లంఘించి
మెఱుఁగారు మేడలమీఁది కుఱికి
చప్పరంబులమీఁది కుప్పరంబున దాఁటి
యంతఃపురమునకు గంతువైచి
చవికలమీఁదను సాహసంబున వ్రాలి
గరిడికూటంబుల సౌరిది నెక్కి

తే. వాడవాడల వీథుల వన్నె మెఱసి
హరుఁడు త్రిపురంబు వేల్చినయట్టి లీల
నొక్కగృహమైన లెక్కకు దక్క నీక
దానవేశ్వరపురము దగ్ధంబు చేసె. 221

శా. అంభోరాశిని వాలవహ్ని నతిశౌర్యం బొప్పఁజల్లార్చి య
య్యంభోజానన సీతఁగాంచి తన వృత్తాంతంబు తెల్లంబుగా
గంభీరధ్వని విన్నవింపుచు నమస్కారంబు గావించి సం
రంభం బొప్పఁగ వేడ్కతోఁ గదలె ధీరప్రౌఢి దీపింపఁగన్. 222

క. పోయెడు వాయుజుఁ డెక్కడఁ
బోయెడు నాచేత ననుచుఁ బోనీక వడిన్
డాయఁగ వచ్చినలంకిణి
కాయము వగులంగఁ బొడిచెఁ గడువడిఁ గినుకన్. 223

వ. ఇట్లులంకిణింజంపి సువేలాచలంబెక్కి సింహనాదంబు సేయుచు. 224

క. వడిగా ధరశృంగంబున
నడుగులు వడి మోఁది త్రొక్కి యద్భుతశక్తిన్
జలరాశి దాఁటఁ బావని
మిడివింటం బసిఁడి యుండ మీఁటివరీతిన్. 225

వ. ఇట్లు కుప్పించి యుప్పరం బెగసి వాయువేగంబునం జనుచు

Akella Raghavendra's Online-ias.com

నయ్యబ్ధిమధ్యంబున నున్న సునాభం బనుశైలంబునఁ దన దేహంబు దాహంబుఁ దీర్చికొని సముద్రంబును దాఁటి యవ్వలికిం జనియె నప్పుడు. 226

ఉ. వచ్చిన పావనింగని జవంబున నంగదుఁ డాదియౌ కపుల్
గ్రచ్చఱభక్తితో నెదురుగాఁ జన నందఱుఁ గౌఁగిలించి వా
రచ్చటికార్యమంతయుఁ బ్రియంబునఁదన్నడుగంగఁబోయి వే
వచ్చినచంద మేర్పడఁగ వారికిఁ జెప్పెను దప్పకుండఁగన్. 227

క. రఘువరుఁ డిచ్చిన ముద్రిక
రఘువల్లభుదేవి కిచ్చి రభసంబున నా
రఘువరున కానవాలుగ
రఘువల్లభుదేవిచేతిరత్నముఁ గొంటిన్. 228

మ. అని చెప్పన్ విని యంగదాదులు మహాహ్లాదంబునన్ బొంగి పా
వని బాహాబలసత్త్వముల్ వొగడుచున్ వర్ణింపుచున్ వే పునః
పునరాలింగన మాచరింపుచు వడి న్బూషించుచు న్మ్రొక్కుచున్
ఘనతం బాడుచు నాడుచున్ బలువిడి న్గర్వంబున నాఁటుచున్. 229

శా. నేనే చాలుదు రావణాసురతలల్ నేలం బడం గొట్టఁగా
నేనే చాలుదు వానిపట్టణము మున్నీటం బడం ద్రోయఁగా
నేనే చాలుదు దుష్టదానవతతిన్ నిర్భీతి దండింపఁగా
నేనే చాలుదునంచుఁబంతములు పూన్కింబల్కుచున్దు ఱ్ఱిళ్ళుచున్. 230

క. ఆరాత్రి కీశు లందఱు
మారుతితోఁ గూడి నిలిచి మఱునాఁడచటన్
ధీరత దుర్ధర శైలము
చేరంజని నిద్రచేసి చిత్తము లలరన్. 231

వ. అమ్మఱునాఁ డుదయంబున మధువనంబులోఁ బ్రవేశింప నుద్యోగించి యందఱకన్నను బెద్దవాఁడగు జాంబవంతునిం బిలిచి నీవు శ్రీరామునకు హితుండవు సుగ్రీవునకు మంత్రివి కావున మాకు నొకబుద్ధి యానతిమ్ము. ఈ కపులు క్షుద్బాధావశంబునం బొరలి మహాశ్రమంబును బొందియున్న వారు గావున సుగ్రీవుని మధువనంబున నుండెడు ఫలంబులం బరితృప్తులమై రాముని సన్నిధానం

బున కేగుట లెస్సయని యంగదహనూమంతులువల్క జాంబవంతుండును నత్యుత్సాహంబున నంగీకరించి కపులం బురస్కరించుకొని మధువనంబులోఁ బ్రవేశించినంత. 232

సీ. ఒక్కఁ డాఁకొని కొమ్మ నూఁచినఁ బండ్లెల్లఁ
శేకొని తేర భక్షించు నొకఁడు
ఒక్కఁడాఁకొని రేఁపు చున్నట్టి తేనియల్
తడయక కొల్లాడి త్రాగు నొకఁడు
ఒక్కఁ డాఁకొని కోయుచున్నట్టి కాయలు
మిన్నక యాటాడి మ్రింగు నొకఁడు
ఒక్కఁ డాఁకొని గోళ్ళ నొలిచినట్టి చివుళ్ళఁ
బుక్కిళ్ళకొలఁదిగా బొక్కు నొకఁడు

తే. తరువుపై నుండి తరువుపై దాఁటు నొకఁడు
పండ్ల కెటువంటి మ్రాఁకైనఁ బ్రాకు నొకఁడు
దిగువఁ గూర్చుండి తరువున కెగురు నొకఁడు
పెద్దపొదవున నుండి కుప్పించు నొకఁడు. 233

ఉ. కాయల వ్రేటులాడుచును గంతులువైచుచుఁ బూవుదీవలం
దూయలలూఁగుచు న్దరువులూఁపుచుఁ బండ్లను బొట్టనిండఁగా
మేయుచు వెక్కిరింపుచును మిన్నకదాఁటుచు దోఁకలెత్తుచుం
గూయుచు నేల దూఁకుచును గుంపులుగూడి కపీంద్రు లెంతయున్. 234

క. వనమంతఁగాసి చేయఁగ
వనపాలకు లేఁగుదెంచి వడిఁ గోపముతో
దను నదలించిన వారల
హనుమంతుఁడు మొదలుగాఁగ నగచరు లెల్లన్. 235

క. మెడఁబట్టి వనములోపల
వెడలఁగ నటు పాఱద్రొబ్బి వెడలం దన్నన్
దడయక దధిముఖుఁ డనుతమ
యొడయనికడ కేఁగి వార లుగ్రముగాఁగన్. 236

Akella Raghavendra's Online-las.com

వ. విన్నవించిన యంతనే. 237

ఉ. దధిముఖుఁ దప్పు మండిపడి తాఁ దనవారలఁ గూడి వచ్చి బ
ల్విధముల సంచరించుకపి వీరులఁ గోపముతోడఁ జూచి యీ
మధువనమెల్లఁ గొల్లగొన మర్కటవల్లభునాజ్ఞఁ ద్రోయ మ
మ్మధములఁ జేయ నెంతఘనులంచును బాఱఁగ వారి నుద్ధతిన్, 238

వ. ఇట్లు దండింపుచున్న దధిముఖుపై నంగదాది వనచరులు గదిసి యాగ్రహంబున. 239

క. కొందఱఁ గఱచియుఁ బొడిచియుఁ
గొందఱఁ దలపట్టి యీడ్చి కొట్టియు గోళ్ళన్
గొందఱ ద్రచ్చియుఁ దన్నియు
నందఱ నొప్పింప వార లాగ్రహవృత్తిన్. 240

క. వ్రయ్యలు వాఱఁగ వ్రచ్చినఁ
గ్రయ్యఁగ రక్తములు గ్రమ్మఁగా వడితోడన్
గుయ్యో మొఱ్ఱో యని వా
రయ్యెడ సుగ్రీవుకడకు నరిగిరి భీతిన్. 241

వ. అరిగి రామలక్ష్మణులం గూడియున్న మిహిరనందనుం గనుంగొని నమస్కరించి మధువనంబునందు జరిగిన వృత్తాంతం బంతయు విన్నవించిన వారల నాదరించి సుగ్రీవుండిట్లనియె. 242

క. దేవరపంపునఁ జని వా
రే వెరవున సీతఁ గనిరొ యిటు గాకున్నన్
నావనము పాడుసేయరు
పావని మొదలైనవారు భయవిరహితులై. 243

వ. అని రామభూపాలుండు విన సుగ్రీవుండు వారల నూరార్చి వారి దుండగంబులు వారికే యుండుంగాని వారలందోడ్కొని యతివేగమ రండని యనిపినం జని యంగద హనుమంతులంగని యవనీశ్వరుండీ క్షణంబునమిమ్మందఱ నచ్చటికి రండని యానతిచ్చెం గావునఁ జెచ్చెరఁ బదుండని తోడ్కొనిపోవు నప్పుడు వారల కెదురుగా వానరవీరులఁ గొందఱ ననిపిన వారలంగూడి చనుదెంచి

Akella Raghavendra's Online-ias.com

శ్రీరామచంద్రుని పాదారవిందమ్ములకు సాష్టాంగదండ ప్రణామమ్ము లాచరించి సౌమిత్రికిని వందనమ్ము లొనరించి సుగ్రీవునకు నమస్కరించి తనచేత మేలు వార్త విన నుత్సహింపుచున్న రఘుకులేశ్వరులతలం పెఱింగి హనుమంతుం డిట్లనియె. 244

శా. కంటిన్ జానకిఁ బూర్ణ చంద్రవదనన్ గల్యాణి నాలంకలోఁ
గంటిన్ మీపదపంకజంబులను నేఁ గౌతూహలం బొప్పఁగాఁ
గంటిన్ మీకరుణావలోకనము విఖ్యాతంబుగాఁ గీర్తులం
గంటిన్ మాకపివీర బృందములలో గాంభీర్యవారాన్నిధీ. 245

సీ. కట్టిన వస్త్రంబు కట్టుకొంగే తక్క
జీర్ణించి పోయిన చీరలోడ
నుడుగనివగలచే నోరంత ప్రొద్దునుఁ
జెక్కింటఁ జేర్చిన చేయితోడఁ
బుడమిపైఁ బొరలాడునొడలు బూడిద గ్రుంగి
విరతంబు దొరఁగుకన్నీటితోడ
విడుదపెన్నెఱివేణి సడలించి జడలతోఁ
విరతనిరాహారనియతితోడ

తే. గినుక జంకించుదైత్యకామినులనడుమఁ
దపముఁ జేయుచు దనుజబాధలకు నోర్చి
వనిత ప్రాణంబు దక్క సర్వముఁ ద్యజించి
నిత్యమును మిమ్ము మదిలోన నిల్పియుండు. 246

క. జానకిఁ బొడగనియును మీ
రానతి నాకిచ్చి పంపినట్టి విధంబున్
నేనాయమ కెఱిఁగించియు
జానకిరత్నంబుఁ గొంచుఁ జనుదేఁ గంటిన్. 247

వ. ఇవ్విధంబున సీతచిహ్నంబులు రామచంద్రునకుం జెప్పి దండ ప్రణామంబు లాచరించి తనకు సీతామహాదేవి దయచేసిన శిరోరత్నంబు శ్రీరామ చంద్రునకు సమర్పించినం జూచి యది యక్కునంజేర్చి యానంద బాష్పంబులు గ్రమ్ముదేర మూర్ఛిల్లి తెప్పిఱిల్లి హా! వామలోచన హా! పద్మగంధి హా! సీత హా

సీతా! యనుచు శోకించి సుగ్రీవుంజూచి మనము లంకా ప్రయాణము జేయఁ బోవుదము గాన నీక సేనలం గూర్చుమని యానతిచ్చిన వానరేశ్వరుండు మహాప్రసాదంబని యంగదహనుమజ్జాంబవత్సుషేణ పనస నల నీల గజగవాక్ష గోముఖాదు లగుసేనానాయకుల నఱువదికోట్ల నియోగించిన వారును నొక్కొక్కరు నూఱేసికోట్లబలంబులతోడ రామచంద్రుని కిరువంకల నాడుచుఁ బాడుచు మాల్యవంతంబు వెడలిరని విని నారదుని వాల్మీకిమహామునీశ్వరుండట మీఁది వృత్తాంతం బెట్టిదని యడుగుటయును. 248

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాద జలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకర చారుహంస!జానకినాథా! 249

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద * సూరిజనవినుత కవితాచమత్కా రాతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితం బైన శ్రీరామాయణమహాకావ్యంబునందు సుందరకాండము సర్వము నేకాశ్వాసము.

* నిత్యశైవాచార సంపన్న.

శ్రీ

# రామాయణము

## యుద్ధకాండము

### ప్రథమాశ్వాసము

క. కామారివినుతనామా!
సామీరికృతప్రణామ! సంహృతరక్షో
గ్రామా! వర్షామేఘ
శ్యామా! సంగ్రామభీమ! జానకిరామా! 1

వ. శ్రీనారదమునీశ్వరుండు వాల్మీకిమునీశ్వరున కెఱింగించిన తెఱంగు వినిపించెద సావధానచిత్తంబుతో నాకర్ణించు మట్లు శ్రీరామచంద్రుండు వానరసైన్యముతో వెడలి నడుచుచుండ హనుమంతుం డంతకుముందు తాను లంక కరిగి మగిడి వచ్చి యచ్చటి వృత్తాంతమంతయు శ్రీరామచంద్రున కెఱింగించియుఁ ద్రోవలో నుబుసుపోకకుఁగా మరల రావణుం డుండు చందంబును రాక్షసస్త్రీల సంవాదంబును నింద్రజిత్తతికాయాది కుమారవర్గంబు తెఱంగునుఁ గుంభకర్ణవిభీషణాది సోదరుల యునికియును లంకిణిఁ బొంకం బణంచుటయు లంకలోపలకుఁ బోయిన చందంబును లంకాపురీదహనంబును సముద్రలంఘనంబును నది యిది యననేల తాఁజేసివచ్చిన కార్యంబు నెల్లనెవరెవ్వరేదేది యడిగిన వారి కావృత్తాంతంబు నెఱింగించుచుండ మిగిలినకపులు వినుచుఁ దమజాతిచేష్టలు సూపుచుఁ జనుచున్న చందంబు సుగ్రీవుండు రామచంద్రునకుఁ జూపుచు నడచుచున్న సమయంబున. 2

ఉ. కొందఱు మంతనమ్ములనుగొంచును గొందఱు దొమ్ములాడుచుం
గొందఱు రామలక్ష్మణులకుం బ్రియమౌగతి నాటలాడుచుం
గొందఱు గంతులేయుచును గొందఱు పండ్లిగిలించి చూపుచి
ట్లందఱుఁ బోవుచుండిరి దయానిధిరాముఁడు సంతసిల్లఁగన్. 3

Akella Raghavendra's Online-ias.com

సీ. పాదఘట్టనలచేఁ బరఁగిన పెంధూళి
యాకసమ్మున మేఘమట్లు పర్వ
వీఁకతోఁ దాఁకినవృక్షజాతం బెల్ల
వ్రేల్మిడిఁ గొమ్మలు విఱిగి పడఁగ
బలువడితోఁ బోవు పక్షిజాతమ్ములు
భయముచే నందంద పాఱుచుండఁ
జూపించి రావణాసురునిసైన్యం బిట్లు
మనవారిచేతను మ్రందఁ గలదు

తే. అనుచు శ్రీరామునకు నర్కతనయుఁడిట్లు
సంతసము పుట్టఁజెప్పుచు సాగిసాగి
క్రమముగా నందఱునుఁ గొంతకాలమునకుఁ
దిన్నఁగాఁ జేరిరి సముద్రతీరమునకు. 4

వ. ఇట్లందఱును సముద్రతీరమున విడిసి యున్న సమయంబున హనుమంతుండు బుద్ధిమద్వరిష్ఠుండు గావున శ్రీరామచంద్రునకు నమస్కరించి రావణుండు రాజ్యంబునం బట్టభద్రుండై యున్నవాఁడు వానిం జంపి సీతామహాదేవిం దెప్పించుపనికై వేగ మన మందఱము సిద్ధులమై యుండవలయు ననవుడు రామచంద్రుండు తమ్మునితో. 5

క. ఈవానరులను దోడ్కొని
ప్రావీణ్యముతోడ వృక్షపర్వతతతులన్
వేవేగమె తెప్పింపుము
పోవుద మటమీఁద వైరిపురముం జేరన్. 6

వ. అని యిట్లానతిచ్చి సముద్రతరణోపాయం బాలోచించుచుండె నంత. 7

సీ. అక్కడ రావణుం డఖిలమంత్రుల వేగ
రావించి తగగ వారలకు ననియె
మంత్రిసత్తములార! మర్కటుండొకఁ డేఁగు
దెంచి మనందఱం గొంచెపఱిచి

Akella Raghavendra's Online-ias.com

రాక్షసవీరుల రణభూమిఁ బొలియించి
వనమంత జెకలించి వార్ధిదాఁటి
పోయెను బోరానిపోకలఁ బోవుచు
వాఁడు శ్రీరామునివద్దకేఁగి

తే. ఏమి చెప్పునో యామీఁద నామనుష్యు
లిద్దఱును వానరులఁగూడి యేపుమీఱ
వచ్చి లంకాపురములోనివారినెల్ల
నేమి చేయునో యిపుడు నాకేమి దారి. 8

వ. అని యిట్లు రావణుండు నిండుపేరోలగంబునఁ గూర్చుండి దోలాయమానమానసుండై విచారించుచుండ నాసమయంబున విభీషణుండు సాయం సంధ్యావిధిం దీర్చికొని తన మంత్రులుం దానును గొల్వుకూటంబున కేతెంచి పెద్ద గద్దియపైఁ గొలువున్న యన్నకు సాష్టాంగ దండప్రణామంబు లాచరించిన నతండును సంతోషించి యనుజునకు నర్హపీఠంబుఁ జూపిన నాసీనుండై యన్న కిట్లనియె. 9

తే. అవధరింపుము దేవ! మహానుభావ!
మనపురమ్మునఁ బ్రకృతము చనుతెఱంగు
విన్నవించెద నున్నది యున్నయట్లు
కొంచె మవధానముగ నాలకించుమయ్య. 10

సీ. అన్నంబు నీరును నక్కఱ లేకుండ
భటు లందఱును దుఃఖపడుదురయ్య
కంబాలఁ గట్టిన గజబృంద మెల్లను
జవసత్త్వములు దూలి జడిసెనయ్య
హర్షంబుతోడుత హయజాతమంతయు
మెడ లెత్తుకొని వేడ్క మెలఁగెనయ్య
ప్రజ్వలించుచు నున్నప్రతిహోమకుండంబు
బొగలు గ్రమ్ముచు నాఱిపోవునయ్య

తే. ఇట్టియపశకునముల గన్పట్టుమయ్య
సకలశాస్త్రంబు లెఱిఁగిన జాణవయ్య

Akella Raghavendra's Online-ias.com

యింపుగాఁ జెప్పుచుంటి నాలింపుమయ్య
వేగ రాముని సతి నిచ్చివేయుమయ్య. 11

క. సీతను దెచ్చుట మొదలుగ
నీతో నయవాక్యములను నేఁ జెప్పితి నీ
చేతమునఁ బెట్టవైతివి
ఖ్యాతిగ నీకేల నైన సీత నాతని కిమ్మా. 12

వ. అదియునుంగాక మొన్నరాతిరి సీతయొద్దఁ గావలియున్న రాక్షసకాంత లందఱును నిద్రించుచున్న సమయంబునఁ ద్రిజట దిగ్గన మేల్కాంచి నిదురించుచున్న స్త్రీలను లేపి చెప్పిన దుస్స్వప్నంబు విన్నవించెద నాకర్ణింపుము. రామచంద్రుండు మనలంకపై దండు విడిసినట్లును నీవును గుంభకర్ణుండును దక్షిణాభిముఖులై గార్దభంబులపై నెక్కి పితృభూమి కరుగుచున్నట్లును నింద్రజిదాదికుమార వర్గంబును సైన్యంబును మూలబలంబును సర్వంబును నశించిపోవుచున్నట్లును సీతం జేకొని శ్రీరామచంద్రుం డయోధ్యకుఁ బోవుచున్నట్లును గలఁగన్నదఁట. త్రిజటకలనిక్కంబై తోఁచెడిని. రాముండు వానరసైన్యంబుతోఁగూడి సముద్రతీరంబునకు వచ్చియున్నాఁ డని చారులు విన్నవించిరి. ఆ రాముని దూతలు మఱల నిచ్చటకు రాకమునుపే శ్రీరామచంద్రునకు సబహుమానంబుగా సీతను సమర్పించుటయ లెస్స కార్యము. ఇంతచెప్పనేల మొన్న నొక్కదూత వానరవేషంబున వచ్చి తన పరాక్రమంబు నీకును బరివారమునకును నెఱింగించిపోయె నది గుఱుతుంచుకొమ్ము. అనియిట్లు నీతిచెప్ప తమ్మునిపైఁ గోపించి దిగ్గన కొలువుకూటంబు విడిచి యంతఃపురంబునకుఁ బోయె నాసమయంబున నాసభలోని వారందఱును దమతమ మందిరంబుల కరిగిరి. 13

క. మఱునాఁ డెప్పటియట్లనె
సురుచిరముగఁ గొలువు సేయఁ జోద్యంబుగ ని
ద్దుర బోవుకుంభకర్ణుఁడు
సరిగా మేలుకొని వచ్చె సరభసలీలన్. 14

వ. ఇట్లు వచ్చి గృహప్రవేశంబుఁ జేసి స్నానాదిక్రియలు నిర్వర్తించుకొని భుజియించి మంత్రులతో నన్నకొలువునకుఁ జనుచుండు కుంభకర్ణునితో మఱల విభీషణుండును మంత్రిసహితుండై వచ్చెను. అనుజు లిద్దఱును వచ్చి నమస్క

Akella Raghavendra's Online-ias.com

లించిన దీవించి సేమం బడిగి యుచితాసనంబులం గూర్చుండ నియోగించినఁ గుంభకర్ణుం డత్యంతమును నానన్నుండై కూర్చుండెను. కొంచెము దూరములోఁ గూర్చుండియున్న విభీషణుండు మరల నన్నతో నిట్లనియె. 15

సీ. దశరథరాముండు తనపత్నిఁ గోల్పోయి
వానరావళిఁ గూడి వచ్చి యిప్పు
డదె చూడు మంభోధియావలి యొడ్డునఁ
గపిబలంబులతోడఁ గలసి యుండె
రామునిసత్త్వంబు రమణిచే మున్వింటి
మాతనితమ్ముండు నట్టిఁడంట
సొరిది వారికిఁ బ్రాపు సుగ్రీవుఁ డున్నాఁడు
వార్ధి నిన్ ముంచినవానితమ్ముఁ

తే. డాతఁడిట వచ్చి నిన్ను నుగ్గాడి కాని
సీతఁ దే వని పంతంబు చేసె నంట
వలదు వైరమ్ము సీత నీవలయు వేగ
నతని నని గెల్వఁగాఁ జాల రమరవరులు. 16

తే. రాముఁ గెలువంగ వచ్చునే రాజసమున
సీత నర్పించి తత్పదాబ్జాతములకు
నర్థిఁ బ్రణమిల్లి శరణ మన్న నతఁడె కాచు
సత్యసంధుండు సత్కృపాసాంద్రుఁ డతఁడు. 17

ఆ. చంప వచ్చినట్టి శత్రువు నైనను
శరణ మొచ్చినంత సదయుఁ డగుచు
నభయ మిచ్చి కాచు టాతని బిరుదంట
సీత నిచ్చి రాముఁ జేరి బ్రతుకు. 18

వ. అవిన విని యారావణుండు కటకటంబడి విభీషణునితో రోషభీషణంబుగా నిట్లనియె. 19

తే. నీవు నాదాయతోఁ గూడి నీచబుద్ధిః
బుద్ధి చెప్పెదు నాకుఁ దమ్ముఁడవె నీవు

Akella Raghavendra's Online-ias.com

కడగి నీమంత్రులును నీవుఁ గంటిలోని
నెరసు నరవిగ నున్నారు నిశ్చయముగ. 20

తే. నాకుఁ దమ్ముఁడవయ్యు ననార్యముగను
నాదుశత్రులఁ బొగడుచు నాకు బుద్ధి
సెప్పవచ్చితి వౌరౌర సిగ్గులేక
యిచ్చవర్తింపుచుండు టిదేమి పనిర. 21

వ. అనిన విభీషణుం డన్నకిట్లనియె. 22

తే. నిన్నుఁ జంపఁగఁ దలపోసి నీదుమంత్రి
వరులు గాచుచు నున్నారు వలదు గోత్ర
కలహ మీచెడుబుద్ధి యేకరణి నచ్చె
నన్న? యింకొక్కకొనమాట యాలకించు. 23

వ. రామచంద్రుం డాదినారాయణుండు సీత యాదిలక్ష్మి వానరబలంబు బృందారకసందోహంబు గావున నీ వా రామచంద్రున కెదిరి జయంబు గొనుట కడిందికార్యంబు నేఁ జెప్పినబుద్ధి విని వేగనారాముని శరణు చొచ్చుము. సుఖంబుగ మనుము. అని విన్నవించిన హితవచనంబులు రోగికిఁ బథ్యాహారంబు రుచింపని పోలికను వీనుల కసహ్యంబు లైయుండ రావణుండు మండిపడి యిట్లనియె. 24

సీ. పటువిషం బొలికించుపాములతో నైన
జెలఁగి యింపుగఁ జెల్మి సేయవచ్చుఁ
గాని శత్రుల నెప్పు గైవారములు సేయు
వానినిఁ దనప్రాణబంధునైనఁ
జేరఁ దీసినయేనిఁ జేటు వాటిల్లును
గావున వీనిబల్గర్వ మణఁతు
విను కుంభకర్ణ! నీవును రాకమునుపు నీ
చెడుగు నాకును బుద్ధి చెప్పఁబూనె

ఆ. ననుచు హుంకరించి యవ్విభీషణుఁ బట్టి
వేగఁగత్తిఁబూని వ్రేయఁబోవ
నటప్రహస్తుఁ డప్పు డడ్డమ్ముగా వచ్చి
దేవ! నీకుఁ దగునె యీవిధంబు. 25

Akella Raghavendra's Online-ias.com

క. నీ కేల యింత కోపము
నీకు హితముఁ జెప్పుచున్న నీతమ్ముని నీ
వే కత్తిఁ వేసి చంపిన
లోకులు నిను మెత్తురయ్య లోకస్తుత్యా. 26

తే. గుణయుతుండైన మనవిభీషణుఁడు లేని
లంక యేటికి సైన్యంబు లింక నేల
వైభవం బేల యామీఁదఁ బ్రాణ మేల
శాంత మవధారు దేవ నీ స్వాంతమందు. 27

వ. అని ప్రహస్తుండు రావణుకోపంబును గొంత శాంతపఱిచె నప్పుడన్న కోపంబునకుఁ దమ్ముండు కుంభకర్ణుండు పకపక నవ్వి యన్న కెదురాడ నోపక తమ్ముని గాదనలేక గద్దియమీఁదఁ గూర్చుండియున్న యన్నకు మ్రొక్కి నిదుర గృహంబునకుం జనియె నట రావణుండు విభీషణుం జూచి యోరీ నీవు విశ్వాస ఘాతుకుండవు స్వామిద్రోహివి గావున నీవు నా కొక్క పేదనరునిఁ బెద్దజేసి చెప్పెద వాతఁడె పౌరుషశాలియేని నీవాతనిం జేరి సుఖంబున బ్రతుకు మనిననతండిట్లనియె.

సీ. విను రాక్షసేశ్వర! విష్ణుసన్నిభుఁడు రా
ముండు హా! పేదనరుండె నీకు
సతనిసత్యస్థితి యతనిపరాక్రమం
బిపుడు నీ కెఱుంగంగ నెట్టు లగును
అవనీపబాణంబు లతిరయంబున వచ్చి
దండించునపుడైనఁ దలఁచు నన్నుఁ
బర్వతశిఖరముల్ పడినట్లు నీతల
లిలఁ గూలునపుడైనఁ దలఁచు నన్ను

తే. నీకు దమ్ముండ నౌటనే నీవు బ్రతుకు
కొఱకుఁ జెప్పిన నీ కింతకోప మేల
వినుము నామాట సీత నర్పించి యతని
శరణు వేఁడుము వలదు నీసాహసమ్ము. 29

వ. అని చెప్పిన హితవచనంబులకు మఱింత కోపోద్దీపితమానసుండై యాజ్యాహుతిం బ్రజ్వరిల్లినహుతాశను గతిన్మండిపడి పెళపెళనార్చి గద్దియమీఁదం

Akella Raghavendra's Online-ias.com

గూర్చున్న విభీషణుని వక్షంబు పగులం దన్నిన నతండు తనకన్నులనుండి తొరఁగు జలకణంబులు హస్తంబులం దుడిచికొనుచు నాక్షణంబున మంత్రు లుందానును దనతల్లియైన కైకసియొద్దకుం జని సాష్టాంగదండప్రణామం బాచరించి యన్నచేసిన దుర్ణయం బెఱింగించి శరణాగతవత్సలుండైన శ్రీరామచంద్రుని సన్నిధానంబునకుఁ బోవుచున్నాఁడ నని చెప్పి యాయమ్మయనుమతంబు వడసి దీవనలు గైకొని చని సముద్రతీరంబున విచారగ్రస్తుండై యున్న శ్రీరామచంద్రునిం గని విభీషణుండు. 30

సీ. భానుకులోత్తంస! వందితామరలోక!
జానకీనాయక! శరణు! శరణు!
తాటకాప్రాణవిదారణ! రఘురామ!
సకలలోకాధార! శరణు! శరణు!
దిక్కు నీవని వచ్చితిని దీనమందార!
పరమపూరుష! రామ! శరణు! శరణు!
మాతృపిత్రాదులమాడ్కి సంరక్షించు
సర్వలోకస్తుత్య! శరణు శరణు

ఆ. రాను వెఱచినాఁడ రక్షించు రక్షించు
మిపుడు నాకు నభయ మిమ్ము ఇమ్ము
చూడు చూడు నిన్నుఁ జొచ్చితి శరణమ్ము
కావు కావు నన్నుఁ గరుణతోడ. 31

వ. అని యివ్విధంబున రామచంద్రుని స్తుతిసేయుచుఁ జేరవచ్చు తఱివి సుగ్రీవుండు శ్రీరామచంద్రునిఁ గని విశ్వాసంబు సూపువాఁడై దేవా వీఁడు రావణుని తమ్ముండు విభీషణుం డనువాఁడు రాక్షసులు మాయలు సేయుదురు గాన వీని వధియింప నాజ్ఞయొసంగు మనిన రామచంద్రుం డందులకు సమ్మతింపక యితం డెవ్వండైన నేమి శరణన్న రావణుని తమ్మునినేకాదు రావణునైనను గాచెద శరణని వచ్చిన వాని ప్రాణంబులు గాపాడుట రాజులకుఁ బరమధర్మంబు. తొల్లి శిబి చక్రవర్తి రాజ్యంబు సేయుచుండ నొక్కఖగం బేతెంచి శరణు చొచ్చిన నభయం బిచ్చి తన దేహముం గోసి దానిం దఱుముకొని వచ్చిన డేగ కిచ్చెనఁట. కావున నాతని నాయొద్దకుఁ గొని రమ్మనవుడు సుగ్రీవుండు విభీషణునిఁ దోడ్కొని

తెచ్చి శ్రీరామచంద్రుని పాదారవిందములపైఁ బడవైచిన నతండు విభీషణునెత్తి యాలింగనంబుచేసి యభయప్రదానం బొసఁగి నేఁడు మొదలు నీవు మాకు హితుండవు బంధుండవు నయితివి గావున నిన్ను మాతమ్ములలో నొకనిఁగాఁ జూచు కొనియెద నని నమ్మఁబలికి విభీషణా! యింక వైరిప్రభావంబు చెప్పుమనిన దశరథ నందనునకు వందనం బాచరించి కరంబులు శిరంబునధరించి యతం డిట్లనియె. 32

క. రావణుబలసత్త్వస్థితి
యావీరుని శౌర్యమహిమ యభినుతి సేయన్
నావశముగా దతం డల
దేవేంద్రుని వెట్టిఁ గొనును దినము నరేంద్రా. 33

క. ఒక్కొక్కగవనివాఁకిట
నొక్కొకయేనూరుకోటు లుందురు దైత్యుల్
పెక్కురఁ గావలి యుంచును
దక్కక మఱి యెల్లకడలఁ దానును దిరుగున్. 34

వ. తన కుమారవర్గంబు లక్షయుం బదివేలు వారల కొక్కొక్కరికి లక్షమంది బంట్ల నేర్పఱచి యుంచిన వారు లంకవీథులలోఁ గొందఱును వగరుచుట్టును గొందఱును మఱికొన్నిచోట్ల మఱికొందఱును గుంపుగూడి తిరుగుచుందురు. అయినను బ్రహ్మాదుల కైనను సాధింప వలనుపడని లంకా పట్టణము మీచేత సాధింపఁబడఁగలదు. కావున మీరు వేవేగ సముద్రునిం బ్రార్థించి సముద్రబంధనంబు సేయవలయు ననిన నంత మహేంద్రపర్వతంబు డిగ్గి సముద్ర ప్రాంతంబున విడిసి జాంబవదంగదసుషేణనీలమైందాదివనచరవీరులచేత నలు దిక్కులయందుం గలపర్వతంబులను వృక్షంబులను బాషాణంబులను దెప్పించి కడలి కట్టం గడంగిన. 35

శా. కూపారుండును నంతసిల్లి జలజాతం జూచి మిన్నందిన
ల్లాపం బుద్ధతిఁ బొంగఁ జూచి విరసోల్లాసంబునన్ రాఘవ
క్ష్మాపాలుండును గోపముం గదుర నీగర్వంబు నాచేత న
మ్మైపోనిప్పుడటంచు లక్ష్మణుఁడు విల్లందియ్యఁబెన్వేఁకతోన్. 36

మ. పరుషోద్యత్కుటిలాకృతిన్ బొమలుచూపట్టంగశోణప్రభో
త్కరరేఖ ల్గనుఁ గొల్కుల న్నిగుడఁ గోదండంబు చేఁదాల్చి భూ

Akella Raghavendra's Online-ias.com

వరవంశాగ్రణి రాముఁ డద్భుతముగా వారాశిమీఁదన్ వడిన్
శరజాలంబులు పేర్చి ప్రేయుటయు నిచ్చన్ ప్రాణభీతిన్ వడిన్. 37

క. రామునియెదుట సముద్రుఁడు
తా మానవురూపుఁదాల్చి దైన్యము దోఁపన్
రామునకు మ్రొక్కి యపుడా
ధీమంతున కనియె నిలిచి తేజం బెసఁగన్. 38

ఆ. ఇంక నేల తడయ నినకులాధీశ్వర!
కపులఁ బంపి వేగఁ గట్టు మయ్య
కట్టఁ గట్టి దాటు కమలాప్తకులచంద్ర!
నీదు కీర్తిలతకు నెలవు గాఁగ. 39

వ. మిమ్ము̈ను దరిసించుటకు మిన్నంటఁ బొంగితి నింతియకాని కపటోపాయంబునఁ బొంగిన వాఁడను గానని రామభద్రుండు కరుణాసముద్రుండు గావున సముద్రు నెప్పటి యట్ల యుండ నియమించి వానరులం బనిచిన. 40

క. రాముని పంపునఁ బ్లవగ
స్తోమం బట్లరిగియరిగి దొడ్డగుకొండల్
క్షేమమునఁ దెచ్చి జలనిధి
రామాజ్ఞను వైచి రధికరభసం బొప్పన్. 41

వ. అట్లు వానరవీరులు పర్వతపాషాణవృక్షజాతంబులు లక్షోపలక్షలు గాఁదెచ్చి వారాశిం బడవైచి తద్దుభగుభధ్వానంబుల కుప్పొంగుచు బ్రహ్మాండభాండంబు బ్రద్దలగు నట్లుగా నార్చుచు నట్టహాసంబులు సేయుచు గంతులు పెట్టుచు వెక్కిరింపుచుఁ బరువు లెత్తుచు మున్ను దెచ్చివైచిన పర్వతాదులనెల్లఁ దిమితిమింగిలములు మ్రింగ నాసమయంబున. 42

ఆ. తిరుగఁదెచ్చివైవఁ దేలి రాకుండుట
నాత్మలోన సంశయంబు నొంది
రాజసింహుఁడపుడు రత్నాకరునిఁ జూచి
యడుగుటయును వేగ నాతఁడనియె. 43

సీ. రావణుపంపున రాలెల్లఁ జేఁపలు
 మ్రింగుచుండెఁ గదయ్య మేదినీశ!
తిమితిమింగిలములు దిరుగుచు నాయందు
 నుండి రావణుపంపు నొనరఁ జేయు
నలుఁడు కట్టినఁ గాని నిలువ నేరదు కట్ట
 నలునిఁ బంపఁగదయ్య నళినసేత్ర!
యని సరిత్పతి సెప్పి యవ్వేళ నరిగిన
 వీరు లిచ్చట మహావీర్యమునను

తే. పర్వతంబులు తేరఁగా భానుకులుని
పంపుచేతను వారిధిఁ బరఁగ వేగ
నలుడు నాప్రొద్దె పది యోజనములు గట్టె
నంతలో సూర్యుఁడస్తాద్రి కరుగుచుండె. 44

వ. అంత సూర్యాస్తమయం బగుటయు వానరేంద్రులు తమబలంబులం గూడి వేగునందాఁక సేతుబంధనంబునకుఁ గాపుండి రంత సూర్యోదయం బయిన వెంటనే మహాబలశాలియగు హనూమంతుండు సువేలాద్రి కరిగి యానగంబుపొంత నున్న హేమకూటంబును నాగపర్వతంబును సింహాచలంబును నను మూఁడుగొండలు వాలపాశంబునం బెకలించి నిమ్మపండ్ల మాడ్కిఁ బూల బంతులవంతున నెగుబవైచుచు నేతెంచి నలున కందిచ్చిన నా పర్వతంబులు మూఁడును దొంబది యోజనంబులు నిడుపుగల్గియుండ నివ్విధంబున శత యోజనములు నిడుపును దశయోజనంబులు వెడల్పునుగా నీరధిని బంధించి నలుండావార్త రామున కెఱింగించినతోడనే యతండు లంక లగ్గలు వట్ట నుద్యోగించి పనసు నుత్తరపుగవను జాంబవంతుఁ బడమటిగవను గవయు దక్షిణపుగవను హనుమంతు దూరుపుగవనుఁ బట్టనియమించిన వారలును లంకాపురంబు లగ్గలకుంజొచ్చి రాక్షసుల నుగ్గునూచంబు గావించుచుండ హతశేషులు పరుగెత్తి యావింతయంతయు రావణున కెఱింగించిన నతండు చింతాక్రాంతుడై దేవాంతక నరాంతకాతికాయ త్రిశిరోమహోదరమహాపార్శ్వాదుల రామలక్ష్మణులం జంపివారిశిరంబులు గొనిరండని పనుప వా రరుగుదెంచి ఘోరాహవంబునం దమశిరంబులె రామలక్ష్మణుల బాణంబుల కర్పించిన వారిలోఁ జావక మిగిలినయతికాయుం డరుగుదెంచి తండ్రి యగు రావణునకిట్టు లనియె. 45

శా. దేవా! భానుకులావతంసుఁడు మహాధీరుండు రాముండు బా
హావిర్భూతమహాప్రతాపమున దైత్యవ్రాతమున్ భూరి వీ
రావేశంబునఁద్రుంచెఁబో మనము నందాశ్చర్యమున్ భీతియున్
ద్రోవన్ వేఱవచింపనేల యిఁకఁ దద్ఘోర ప్రతాపోన్నతుల్. 46

వ. అని యతికాయుఁడు విన్నవించిన నుల్కిపడి కుంభకర్ణుని మేల్కొలుపఁ బనిచిన నతండును లేచి యావులింపుచుఁ బండ్లుగీటుచు లయకాలమృత్యువుం బోలె నేతెంచిన నట్టి యనుజుంజూచి దశముఖుం డిట్టులనియె. 47

క. అనిలో నీ వారాముని
ననుః మబలశాలి యైనయనిలతనూజున్
ఘనుఁ దగులక్ష్మణుఁ గూలిచి
విను వారలతలలు గొంచు వేగమ రమ్మీ. 48

వ. అని యనిపిన. 49

సీ. భేరీమృదంగాది భీమవాద్యధ్వాన
ములకు సముద్రముల్ పొంగిపొరలఁ
గపులపాలికి లయకాలుఁడో యనుచును
వినువీధి దివిజులు వెఱచిఁ తొలఁగ
నతికాయుఁడును మహాహంకారమున వేగ
వెను వెంట రోషప్రవృత్తిఁ జనఁగఁ
గుంభకర్ణుండు కాకుత్స్థుపైఁ బోయిన
దక్షిణోత్తరసముద్రములరీతిఁ

తే. గదిసి యిరువురుఁ బోరాడఁ గడగుటయును
గపులు వేవేగ వచ్చిరి విపులశక్తి
సాధ్యగంధర్వసతులెల్ల సరభసమునఁ
జూచుచుండంగఁ బోరిరి సురుచిరముగ. 50

వ. ఇట్లు పెద్దయుం ప్రొద్దు వీరావేశంబునఁ బోరుచుండఁ గుంభకర్ణుండు విజృంభించి బలంబుల కులికిదిగ్గజకర్ణపుటస్ఫోటితంబుగా నార్చుచు వానరవీరుల నసంఖ్యంబుగా మ్రింగుటకుంగడంగిన రఘువీరుం డలిగి బ్రహ్మాస్త్రంబు ప్రయో

Akella Raghavendra's Online-ias.com

గించి వాలి శిరంబును దునుమాడె నంత నతికాయుండు తన పినతండ్రి పాటున కలిగి రాఘవేంద్రునికభిముఖంబుగా నిలిచి దివ్యాస్త్రంబులు ప్రయోగించుచుండ లక్ష్మణుం డడ్డువొచ్చి నానాస్త్రంబులు ప్రయోగించి ఘోరంబుగా యుద్ధంబుసేసి కడపట వారుణాస్త్రంబు వింట సంధించి విడిచిన నది యతికాయుని శిరంబుం ద్రుంచె నంత హతశేషులైన రాక్షసులు కాందిశీకులయి రావణుంజేరి. 51

తే. దేవ! దేవాంతకుఁడు సచ్చె దీనవృత్తిఁ
గుంభకర్ణుండు సమసెను ఘోరలీలఁ
దెగువ నతికాయుఁడును మ్రగ్గె దీని కింకఁ
బూని ప్రతికార మొనరింపు భూరితేజ. 52

వ. అని విన్నవించిన మండిపడి రావణుం డింద్రజిత్తుం బంపిన నతం డాగ్రహంబున. 53

క. పరవీరులపై వైశ్వా
నరుచేఁ గొన్నట్టి చాపనారాచములుం
బరిఘయు బ్రహ్మాస్త్రముఁ గొని
దుర మొనరింపంగ వచ్చె దోర్బలశక్తిన్. 54

వ. తదనంతరంబున. 55

క. తండోపతండములుగాఁ
జండాశుగసమితిఁ బఱపి శైలశరాశిన్
గాండమయంబుగఁ జేయుచు
భండన మొనరించె దైత్యపతిపుత్త్రుండున్. 56

సీ. మిన్నక రామసౌమిత్త్రులమీఁదను
బ్లవగసేనలమీఁద బాహుశక్తి
బ్రహ్మాస్త్ర మదరింపఁ బటునినాదంబునఁ
బఱతెంచి వానరప్రతతిమీఁద
బ్రహ్మమంత్రజ్ఞానపరులైనవారి ని
ర్బంధంబుగాఁ జుట్టి పట్టి కట్టి
తక్కినవారల నుక్కడగించినఁ
గనుఁగొని యమరేంద్రకంటకుండు

Akella Raghavendra's Online-ias.com

తే. వైరమెల్లను నేటితోఁ దీఱె ననుచు
మించి కెరలుచు విల్లెక్కుడించి పొదలి
శాంతతను బొంది రాక్షసచక్రవర్తి
కడకు నేఁగెను వడి ముద్దుఁగొడుకుఁగుఱ్ఱ. 57

క. మునినాయక విను మంతట
దనమనుమలపాటు దెలిసి తనలోఁ దానే
కనుఁగొనఁ జాలక పోయెనొ
యనఁగను నపరాబ్ధిలోన నర్కుఁడు గ్రుంకెన్. 58

క. అరవిందభవుని కరుణను
వర మందినవాయుసుతుఁడు వసుమతిమీఁదన్
మఱి బ్రహ్మమంత్రజపముం
విరుదై యున్నట్టి యలవిభీషణుఁ డొకఁడున్. 59

వ. తక్కఁ దక్కినవా రెల్లరును మూర్ఛాగతులై చచ్చినయట్లు పడి యున్న సమయంబున వాయుసుతుండు విభీషణుండును దమలో నెవ్వరు సచ్చిరో నొచ్చినవా రెవ్వరో విచారింపఁదగు నని మహోగ్రాంధకారంబునడుమ నింగలపుఁ గొఱవులు పట్టుకొని రణరంగంబుఁ గలయ శోధింపుచువచ్చి శరతల్పంబున నున్న జాంబవంతునిం గని విభీషణుం డిట్లనియె. 60

క. భల్లూకేశ్వర: వానరు
లెల్లను నృపవరులతోడ నిలమీఁదను మూ
ర్ఛిల్లియుఁ జచ్చియు నున్నా
రొల్లంబోవుచును దీని కుపమ యె టన్ననన్. 61

ఆ. అపుడు జాంబవంతుఁ డసురేశ నీవంకఁ
గన్ను విచ్చి చూడఁ గనరాదు
వాయుసుతుని మేలువార్త నాకిప్పుడు
చెవులు సోఁకునటు చెప్పుమయ్య. 62

వ. అనిన విని హనుమంతుండు. 63

Akella Raghavendra's Online-ias.com

చ. పదములఁ జేరి మ్రొక్కెదను పాణియుగంబును మోడ్చి నీ కృపన్
బ్రదికినవాఁడ నన్ను నతిప్రీతినిఁ జేరఁగ దీసి నీవిటన్
బ్రదికితిగాన నీకతనఁ బార్థివముఖ్యుని సేన లన్నియున్
బ్రదుకునిజంబుగా నిపుడుపావనియంచుఁబ్రియంబు సేయుచున్. 64

వ. వినుము వాయునందనా! యాలవణసముద్రంబున్ దాఁటి హిమవంతంబును నిషధాచలంబును గడచి మేరుశైలంబును వెండికొండయును శ్వేతపర్వతంబును నతిక్రమించి ఘృత సాగరంబు లంఘించి ద్రోణగిరి మధ్యంబునం దున్న యౌషధ శిఖరంబునం గల సంజీవిన్యాదిదివ్యౌషధంబులు గొనివచ్చి రాఘవప్రీతిగా సైన్యంబుల ప్రాణంబులు నిలిపి కీర్తి వడయుమని ప్రార్థించిన నియ్యకొని వాయునందనుండు వాయువేగ మనోవేగంబునం జని జాంబవంతుండు చెప్పినదివ్యౌషధాచలంబునె కొనివచ్చి సకలసైన్యంబుల ప్రాణంబులు గాచి నిమేష మాత్రంబున నక్కొండ తొల్లింటి యునికిపట్టుననె నెలకొల్పి వచ్చెనపుడు. 65

క. ఇనుఁ డుదయపర్వతంబునఁ
గనుపట్టినఁ దెల్లవాఱఁ గపిసైన్యములున్
జననాథుఁ గాంచి మ్రొక్కిరి
జనపతియును వాయుసుతుని సంశ్లాఘించెన్. 66

వ. అంత నింద్రజిత్తు పరాక్రమంబునకు సంతోషించి నిజంబును గల్లయును దెలియుటకు రావణుం డనుపఁ జారు లేతెంచి యుత్సాహంబుతో యుద్ధసన్నద్ధులై కెరలుచున్న వానరబలంబులం గనుంగొని మరలి చనుదెంచి రామచంద్రుని బలంబున్న తెఱం గెఱింగించిరి. అది విని కలంగియుఁ గలంగనిన భంగి నాశ్చర్యంబు నొంది రామలక్ష్మణులపైకిఁ గుంభనికుంభగవాక్ష ప్రజంఘ శోణితాక్షులం బంపిన వారును దమతమ బలంబులతోడఁ గరితురగరథారూఢులై వెడలి సింహనాదంబులు సేయుచు నావానరసైన్యంబుపైఁ గవిసి శరవర్షంబులు గురియుచుఁ బరిఘలం జక్కుసేయుచు నడిదంబుల వ్రేయుచు ముద్గరంబులం జెండుచు ముసలంబుల మోఁదుచుఁ గరులచే మట్టింపుచుఁ దురంగమములచేఁ ద్రొక్కింపుచు రథంబులం దోలి వెంపరలాడుచు మహాహవంబు సేయుసమయంబునఁ గపిబలంబు లడరి గిరివర్గంబులుఁ దరువర్గంబులును ననర్గళంబుగఁ గైకొని ప్రతిఘటించి పోరాడునప్పుడు. 67

Akella Raghavendra's Online-ias.com

క. తెంపున వాలికుమారుఁ డ
కంపనుఁ డను వాఁ డెదుర్పఁ గని కోపమునం
గంపింపఁ బట్టి వానిని
జంపెను వక్షంబు పొడిచి సాహసవృత్తిన్. 68

వ. అప్పుడు. 69

చ. కనుఁగొని శోణితాక్షుఁడు నకంపను ప్రాణముఁగొన్న వాలినం
దనునిపయిం గడుం గినిసి తావ్ర్కాఁనితాఁకి రథంబుఁదోలినం
గనలుచు నంగదుండు తురగంబులతోన రథంబు నుగ్గుగా
దనుజుని మీఁదఁదానుఱికి తన్నినవాఁడునుగూలె నేలపైన్. 70

ఆ. అతఁడు నేలఁ గూల నా ప్రజంఘుండును
ఘనుఁడు యూపనేత్రుఁ డెనసి వాలి
కొడుకుమీఁద రాఁగఁ గోపించి మైందుంషు
ద్వివిదుఁ డంతలోనె తెంపు మిగిలి. 71

క. దనుజులఁ దోలఁ బ్రజంఘుఁడు
గనుఁగొని యవ్వాలిసుతునికటములు పొడువన్
గనలి నిశాచరుశిరమును
ఘనతర దృఢముష్టిఁ బొడిచి కడపెన్ ధరకున్. 72

సీ. ఘనుఁడు ప్రజంఘుండు కదసంబులోఁ బడ్డ
నక్షయబలుఁడు యూపాక్షుఁ డంత
గదఁగొని వ్రేసిన ఘనతతోఁ గుప్పించి
భుజశక్తి నాతనిఁ బొదివి పట్టి
కొనిపోవునప్పుడు కోపించి యన్నకై
శోణితాక్షుఁడు వచ్చి శూరుఁ డగుచు
విడిపించుకొనఁ జూడ వడిగ మైందుఁడు డాపి
కలన యూపాక్షుని గదిసి పోరి

తే. సాహసంబున నొఱలంగఁ జంపుటయును
శోణితాక్షుండు ద్వివిదునిఁ జూచి పొడువ

Akella Raghavendra's Online-ias.com

నతఁడు మూర్ఛిల్లి తెప్పిరి యసురఁ బట్టి
శిరము గూలంగ నడిదంబుచేత వ్రేసె. 73

తే. శోణితాక్షుండు పోరిలోఁ జూర్ణమయినఁ
గుంభుఁ డప్పుడు కోపించుకొనుచు వచ్చి
ద్వివిదు నెదుతొమ్ము నాటఁగఁ దీవ్రశరము
లేసి వడిఁ జంపె నాజిలో నేమి చెప్ప. 74

క. తమ్మునిపాటు గనుంగొని
హుమ్మన మైందుండు కుంభు నురతర ముష్టిన్
దొమ్మున బొడిచిన నతఁ డొ
క్కమ్మున గూలంగ నేసె వమకులు దలఁకన్. 75

ఉ. అంగదుఁ డంతఁ గుంభుని శతాంగముపై నొకపర్వతంబు భూ
మిం గలయంగ వ్రేయుటయు మేదినికిన్ వడి దాఁటి వాలిపు
త్రుంగని దైత్యుఁ డాగ్రహముతో ముసలంబున వ్రేయనొచ్చి తోఁ
కంగొని వజ్రిపౌత్త్రుఁడు సగర్వమునన్ దగమోదె నార్చుచున్, 76

క. కాలాంతకరుద్రులతోఁ
బోలుపఁ దగుకుంభుఁ డపుడు భుజబలశక్తిన్
వాలికుమారుని ధరపైఁ
గూలఁగ వడి నేసె నైదుకోలలచేతన్. 77

వ. ఇట్లు వాలికుమారుండు కుంభునిచేత బాణపీడితుండై పడుట యెఱింగి
రామచంద్రుఁడు వానిపై సుగ్రీవజాంబవద్ధనుమదాదులం బంపిన. 78

క. వారంద ఱధిపునాజ్ఞను
భూరుహములు గిరులుఁ గొనుచు భువనము లదరన్
బోరున నార్చుచుఁ గుంభునిఁ
దారసమై వ్రేసిరంత దర్పోద్ధతులై. 79

క. వారలు వ్రేసినతరుగిరు
లారయఁ దనుఁ దాఁకకుండ నవి తునియలుగాఁ
గ్రూరాస్త్రంబులఁ దునుముచు
నారసములఁ వారివారి నాటఁగ నేసెన్. 80

Akella Raghavendra's Online-ias.com

క. ఏసినఁ గుంభుని రవిజుం
డాసమయమునందు నేసె నద రంటంగా
నేసినఁ గ్రమ్మఱ రవిజుని
గాసిల వక్షంబు పొడువఁగా నిలఁ బడియెన్. 81

తే. మూర్ఛ దేఱి యారవిజుఁ డమోఘముష్టి
పూని దైత్యునిఱొమ్ముపైఁ బొడువ నంత
శరధిమథియించు మందరాచలముమాడ్కి
ధీరత యడంగి దిర్దిరఁ దిరిగి పడియె. 82

ఉ. కుంభుఁడు గూలినంగని నికుంభుఁడు దాఁ బరిఘాయుధంబు సం
రంభ మెలర్పఁ ద్రిప్పి దినరాజతనూజునిపైకి రాఁగ బల్
సంభ్రమమొప్ప వాయుజుఁడు శౌర్యము గన్పడ వడ్డమైన ది
క్కుంభిగముల్ కలంగఁగను గొబ్బున వక్షమువైచె నార్చుచున్. 83

క. వ్రేసిన పరిఘాయుధ మది
వీసము నాటంగలేక విఱిగిన మిగులన్
గాసిలి దైత్యుఁడు పవనజు
నాసమయమునందు నేసె నడిదము చేతన్. 84

తే. అంతహనుమంతుఁడుగ్రుఁడై యసురగళము
నందు వాలంబు దగిలించి యాకసమునఁ
ద్రిప్పి ధరణీతలంబునఁ ద్రెళ్ళఁ గొట్టి
సింహనాదంబుఁ జేసె నచ్చెరువు గాఁగ. 85

వ. అట్టిసమయంబున. 86

క. హతశేషులు ఘటకర్ణుని
సుతు లాహవభూమిఁ దెగినసుద్దులు లంకా
పతి కెఱిఁగించిన దుఃఖో
న్నతుఁడై యొక్కింతతడవునకు నిట్లనియెన్. 87

తే. మనకుఁ గలయట్టిబాంధవగణము సుతులు
దొరలుఁ బరివారమును గంధకరులు హయులు

Akella Raghavendra's Online-ias.com

గుటిలకపియూధములబారి గొఱియ లగుచు
దెగిరి మునుముట్ట నేటితోఁ దీవ్రగతిని. 88

వ. అని చింతింపుచుఁ గొంతవడికి ధైర్యంబుంగొని. 89

క. దైతేయవల్లభుఁడు గడు
ప్రీతిన్ మకరాక్షుఁ జూచి పృథుతరశక్తిన్
మీతండ్రి ఖరునిఁ జంపిన
యాతనిపై సూడు వీఁగు మరుగుమటన్నన్. 90

సీ. సింధురరథభటసైంధవంబులతోడఁ
దళుకైనపట్టుఛత్రములతోడఁ
బటహభేరీముఖ్యబహువాద్యములతోడ
దట్టంపునానాయుధములతోడ
వందిమాగధసూతబృందస్తుతులతోడఁ
గెరలాడుబిరుదుటెక్కెములతోడ
బహుళకాహళశంఖభాంకారములతోడ
రాజిల్లునవచామరములతోడ

తే. నడిచె దిగ్దంతి భూదారనాగకూర్మ
కులనగేంద్రయుతముగ భూతలము గదలఁ
బదరజఃపాళి సంఛన్నభానుఁడగుచు
దక్షుఁడైనట్టి మకరాక్షుఁ డాక్షణంబ. 91

వ. ఇట్లు భయంకరాకారంబుగాఁ గదలి వానరవీరులతోడం దలపడి పోరాడునెడ వానరబలంబులు తలచెడి పాఱుటగని రాజపుంగవుండోహో వెఱవకుఁడని తనమఱువునకున్ మరలించి మకరాక్షుండేటి చూచి చండకాండముల తండంబులు ఖండించి హరుల శరంబులపాలుచేసి రథంబులను సారథులతోడం గూడఁ బృథ్విం గలిపి బలంబులఁ జలంబునం దఱిమి సింహనాదంబు చేసినం గినిసి మకరాక్షుం డిట్లనియె. 92

క. మాతండ్రి ఖరునిఁ జంపిన
నీతో యుద్ధంబు సేయ నేఁ డిదె కలిగెన్

నాతీవ్రనిశితసాయక
పాతంబులపా లొనర్తుఁ బగ దీఱ వినుమ్. 93

మ. అనిగర్వోక్తులుపల్కుచుం గెరలి తీవ్రాస్త్రంబులారాముపైఁ
దనబాహాబలశక్తి నేయఁ గని కోదండంబునం దప్పుచున్
వనజాప్తాన్వయుఁ డేసె వాని నటగీర్వాణుల్ ప్రశంసింపఁగా
దనుజుం డేసెను రామభూవిభునిపైఁ దద్బాణజాలంబులన్. 94

క. ఆశరము లుడిపి మఱియొక
యాశుగమున వానిచాప మపుడు దునిమి యా
దాశరథి రథము పొడిగాఁ
గౌశలమున నేయ వాఁడు క్ష్మాస్థలి కుఱికెన్. 95

ఆ. ధరకు నుఱికి దుష్టదైత్యుఁడు గదఁ ద్రిప్పి
భానుకులుని నేయ దానినొక్క
విశిఖముననె తునిమి వేగంబె విభుఁ డగ్ని
శరముఁ దొడిగి వానిశిరముఁ ద్రుంచె. 96

క. ఆయెడ మకరాక్షుఁడు రిపు
సాయకములు దూఱి నాటి చచ్చుట విని దై
తేయుఁడు గుండెలు వగులఁగఁ
బాయనిదుఃఖంబుపాలుపడి చింతిల్లెన్. 97

వ. ఇట్లు చింతాక్రాంతుండై కొంతతడ వూరకుండి మేఘనాదునిఁ గనుంగొనియె. 98

క. అక్కట! నీవును నేనును
దక్కఁగ మఱి తక్కినట్టిదళములు దెగఁగా
నొక్కకపి యైన గానీ
యక్కడ రిపులందు నొచ్చిరనఁగా వింటే. 99

వ. అదియునుంగాక. 100

సీ. నాగపాశంబున నాఁ డాజిలోఁ బడ్డ
ప్లవగు లెరీతిని బ్రదుకు టెట్లు

Akella Raghavendra's Online-las.com

బ్రహ్మాస్త్రమునఁ గూల్పఁబడి ధాత్రి యెడఁబాసి
పోయినకపులెల్లఁ బుట్టు టెట్లు
కుంభకర్ణుఁడు సావఁ గొట్టినవానరుల్
చెచ్చెఱ జీవించి వచ్చు టెట్లు
అతికాయుఁ డడగించినట్టి కీశబలంబు
క్రమ్మఱఁ దానెల్ల గలుగు టెట్లు

తే. రాముఁ డెన్నంగ నాదినారాయణుండె
వనచరావళు లెల్ల దేవతల మున్నె
కానలేనైతి నీరీతిఁ గదనమునను
వారిగెలువంగ నెవ్వారివశము చెపుమ. 101

వ. అని దీనాలాపంబు లాడుచున్న తండ్రికి నమస్కరించి మేఘనాదుండు మేఘగంభీర వాక్యంబుల దుఃఖోపశమనంబు చేసి నేఁటితోడఁ బగ సాధింతునని ప్రాగల్భ్యంబుగఁ బలికి యనిపించుకొని గజవాజిరథాంగాదు లగు చతురంగబలంబులు గూర్చుకొని ఛత్రచామరంబులు పిక్కటిల్ల నట్టహాసంబు సేయుచు లంకాపురంబు వెడలి * సంగ్రామరంగంబునకుం జని తనబలంబులఁ జక్రాకారంబుగా నిలిపి తన్మధ్యంబున రథావతరణంబుచేసి రక్తాంబరగంధమాల్యంబులు ధరియించి లోహపాత్రంబునఁ గృష్ణసర్పరక్తంబు నించి తర్పణంబు చేయుచుఁ దద్విధియుక్తంబైన హోమంబులు సేయుచుండు నెడ నొకకృత్తి ప్రత్యక్షంబై నిలిచి మెచ్చితి వరం బిచ్చెద వేఁడు మనిన నతండు తా నాకసంబున నుండి ఖండనంబు సేయునెడఁ గపులకుం గానరాకుండ నంధకారంబు గావించిన నేను వారిని జయింతునని ప్రార్థించిన నియ్యకొనియె నంత మేఘనాదుండు నభంబున కెగసి మహాంధకార బాణంబు ప్రేసిన దానంజేసి పెంజీకటిం గప్పినఁ జీకాకై పాఱుచున్న వానరులంగని వాయునందనుండు శ్రీరామచంద్రునితో నిట్లనియె. 102

క. వాయవ్యాస్త్రము చేతను
బాయును జు మ్మంధకారబాణవిశేషం
బీయెడ నేయుఁడు శ్రీరఘు
నాయకః యని విన్నవింప నవ్వుచు నంతన్. 103

---

* సంగ్రామంబునకుంజని.

క. విల్లెక్కు వెట్టి మారుత
భల్లము సంధించి తివిచి పార్థివుఁ డలుకన్
బెల్లార్చి యేసె గగనం
బెల్లను వడిఁ మాల దైత్యుఁ డిలపైఁ గూలన్. 104

ఆ. రాజతిలకుఁ డంబరమ్మున కెగయంగ
వాయుశరముఁ దొడిగి వ్రేయఁ దశవె
మాయశక్తి దొలఁగి పోయిన నంతతో
మేఘనాదుఁ డుర్విమీఁదఁ బడియె. 105

చ. పడియును మేఘనాదుఁడు సుపర్వులు బెగ్గిల నుగ్రబాణముల్
తొడిగి ప్లవంగ సేనపయిఁ దోరముగా నదరింప నంతటన్
బెడబెడనార్చి మారుతివిభీషణు లుగ్రత దానవావళిన్
బొడిపొడి సేయలక్ష్మణుఁడు పూనికనాతనిఁదాఁకె నార్చుచున్. 106

క. అంతట దానవసేనలు
పంతము చెడి తలలు వీడఁ బాఱం గని తా
నెంతయు వెఱవకుఁ డనుచును
గుంతము ద్రిప్పుచును దైత్యకుంజరుఁ డంతన్. 107

శా. సౌమిత్రిం గని గర్వమొప్పఁ బలికెన్ శౌర్యంబుసంధిల్లఁగా
నామీఁదం బఱపింపవచ్చితివె నా నాగాస్త్రసంఘంబులన్
నేమిమ్మందఱఁ గట్టుటల్ మఱచితే నేఁడైనఁ జింతింపుమీ
నీమాసత్త్వవిశేషమెల్ల మదిలో నిక్కంబుగా లక్ష్మణా. 108

వ. అని బాణప్రయోగంబు సేసిన. 109

క. వానిని బ్రతిశరములు దాఁ
బూనిక సంధించి త్రుంచి భుజబలశక్తిన్
దానవుని మూర్ఛపుచ్చెను
భానుకులుం డంత నొక్కబాణముచేతన్. 110

ఆ. ఇంద్రజిత్తుఁ డప్పు డినకులోద్భవునిచే
మూర్ఛనొంది తెలిసి మూర్ఖగతిని

Akella Raghavendra's Online-ias.com

భాసమాన మైనబాణత్రయంబున
నతని నొవ్వనేసి యార్చెనంత. 111

సౌమిత్రి తా వానిచాపంబు నడిమికి
ఘనతరాస్త్రంబుచేఁ దునుఁగ నేసి
పదిబాణములు వానిబాహామధ్యంబునఁ
గాటంబుగా వడి నాట నేసి
తురగంబులను నాల్గుతూపులఁ దునుమాడి
సారథి నొక్కట సంహరించి
శరవృష్టిఁ గప్పిన సురవైరి కోపించి
కాద్రవేయాస్త్రసంఘంబు లేయ

గరుడశరమునఁ దునిమి లక్ష్మణుఁడు కినిసి
వడిఁ గుబేరాస్త్ర మతనిపై వైచె నసుర
దానిఁ దునుమాడి వేగ నైంద్రాస్త్ర మేసె
నరవరుఁడు దాని యామ్యబాణమునఁ ద్రుంచె. 112

వ. ఇట్లు త్రుంచిన. 113

వరుణాస్త్రంబును నేసెను
సురరాజవిరోధి రాజసూనుని మీఁదన్
గర మలిగి రాముసోదరుఁ
డరుదారఁగ దాని ద్రుంచె నైంద్రాస్త్రమునన్. 114

వ. మఱియును. 115

కనలి దానవుఁ డతనిపై గంధపుష్ప
సమితి నొప్పెడు గంధర్వశరముఁ దొడిగి
వేయఁ గోపించి దశరథోర్వీపసుతుఁడు
ఖండశశిబాణమున దాని గండడంచె. 116

వ. ఇట్లు గంధర్వశరంబును ద్రుంచి యంతటం బోవక దేవేంద్రదత్తం
నభుజగాస్త్రంబు వింట సంధించి వేదంబులు నిత్యంబగునేని రామచంద్రుండు

Akella Raghavendra's Online-ias.com

ధర్మాత్ముండేని యింద్రాదిబృందారక ద్రోహి యైన యింద్రజిత్తునిశిరంబు నీశరంబు ద్రుంచుంగాక యనివానిపై లక్ష్యంబుచేసి ప్రత్యాలీఢ పాదస్థుండై నిలిచి కర్ణాంతంబుగాఁదిగిచియేసిన నదియును గాలానలాభీలజ్వాలాజాలంబు లుప్పతిల్ల గగనంబునం బఱతెంచి యక్కఱకురక్కసుని శిరంబుఁద్రుంచిన. 117

క. కనుఁగొని దేవత లందఱుఁ
దనుఁ బొగడఁగ మరలి రాముతమ్ముఁడు విజయం
బునఁ వచ్చి మ్రొక్కి నాతని
మనుజేంద్రుఁడు కౌఁగిలించి మఱి యిట్లనియెన్. 118

క. నీచేత వీఁడు ద్రుంగుట
భూచక్రంబెల్ల మేలు పొందెను వినుమీ
నా చేత దశముఖుండును
నీచుఁడు తెగుఁబెల్ల నిజము నిర్మలచరితా. 119

వ. ఇట్లు సౌమిత్రి చేత నింద్రజిత్తు తెగెనని చెప్పిన నారదుని వాల్మీకి మహామునీంద్రుం డటమీఁది కథావిధానం బెట్టి దనియడుగుటయు. 120

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకీనాథా. 121

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద* సూరిజనవినుత కవితాచమత్కారాతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితం బైన శ్రీరామాయణ మహాకావ్యంబు నందలి యుద్ధకాండమునం బ్రథమాశ్వాసము.

---

*నిత్యశైవాచార సంపన్న

Akella Raghavendra's Online-ias.com

శ్రీ

# రామాయణము

## యుద్ధకాండము

### ద్వితీయాశ్వాసము

క. అమలినశుభచారిత్రా
కమలదళసమాననేత్ర! కౌశికమిత్రా!
ద్యుమణికులవార్ధిసోమా!
సమదాసురజనవిరామ! జానకిరామా! 1

వ. శ్రీనారదమహామునీశ్వరుండు వాల్మీకి కెఱింగించిన తెఱంగెఱింగించెద నాకర్ణింపు మట్లు. 2

ఆ. చారులరుగుదెంచి సౌమిత్రిచే నింద్ర
జిత్తుఁ డీల్గె ననుచుఁ జెప్పుటయును
బంక్తిముఖుఁడు సుతునిఁ బలుమాఱు దలఁచుచు
వగవఁ జొచ్చె నెల్లవారు వినఁగ. 3

వ. ఇట్లనేక ప్రకారంబులఁ గుమారుం బలవరింపుచు దుఃఖింపుచుఁ గొంతతడవున కూఱడిల్లి ధైర్యంబు నూలుకొల్పి తనకుమారుం జంపినవానిని నేఁ డవశ్యంబును సంగ్రామ రంగంబునఁ జంపుదు నని నియమంబు చేసి తత్క్షణంబ. 4

సీ. శైలసన్నిభములౌ సామజంబులతోడ
ననిలవేగము గల్గు హరుల తోడఁ
గాంచనోజ్జ్వలములౌ ఘనరథంబులతోడఁ
బ్రతి లేనిఘనమూలబలముతోడఁ
గిమ్మీరవర్ణోరు కేతనంబులతోడఁ
దఱచైన పట్టుఛత్రములతోడ

Akella Raghavendra's
Online-ias.com

భేరీమృదంగాదిపృథువాద్యములతోడ
వరశంఖకాహళధ్వనులతోడఁ

తే. పాదఘట్టనచలితోర్వీభాగుఁ డగుచు
వనధు లెల్లను బిండలివండు గాఁగ
నడిచె లంకేశుఁ డధికసన్నాహమునను
రామచంద్రునితోడను రణ మొనర్ప. 5

మ. కరిఘీంకారములున్ మహాజవతురంగవ్రాతహేషావళుల్
వరకోదండనినాదముల్ సుభటదుర్వారాట్టహాసంబులున్
గురుశంఖోజ్జ్వలనాదముల్ దశదిశాక్రోశంబుగా నొక్కటై
పరగన్ బంక్తిముఖుండు దా నడిచెఁ గోపస్ఫూర్తినిశ్శ్వాసుఁడై. 6

వ. ఇట్లు చతురంగబలంబులు గొల్వ లోకవిద్రావణుం డగు రావణుండు సమరం బొనర్పనరుదేరం గని రాఘవేశ్వరుం డతనికి దండనాయకులం బనిచిన వారును దరుగిరిపాషాణపాణులై యెదురు నడిచి సింహనాదంబులు సేయ నుభయబలంబులుం దలపడి పోరాడు సమయంబున నమరవైరులు శస్త్రాస్త్రవర్షంబులు గురియించి నొప్పించి నంత వానరవీరులు మరల దానవులపైఁ బాషాణపాదపంబు లడరింప నరిబలంబులు విఱిగి పికాపికలై పఱచువత్తఱిఁ బంక్తికంధరుండుద గ్రుండై కెరలుచుఁ గ్రూరనారాచంబులు చాపంబునం దొడిగి పనసపవనతనయనల నీలద్వివిదశరభకుముదగజగవయగవాక్షగంధమాదనాంగదమైందాదుల నొక్కొక్కరిఁ బదేసిబాణంబుల గుదిగొన నేసిన విఱిగి యుగచరసేనలు సురుగున య్యవసరంబున. 7

క. చేరి విరూపాక్షుని దగు
భేరిపయిని నొక్కకొండ ధీరతతోడన్
సూరజుఁ డప్పుడు మిక్కిలి
శూరత్వం బదరనేసి చూర్ణము సేసెన్. 8

ఆ. రథము విఱిగినంత రణమధ్యమున నొక్క
వారణంబు నెక్కివచ్చు నెడను
వాలికొడుకు దాని పటురోషమునఁ దోల
నుఱికి ప్లవగుఁ గోల నఱికె వాఁడు. 9

Akella Raghavendra's Online-ias.com

క. అక్షయబలుఁ డగు రవిసుతుఁ
డాక్షణమున నుగ్రుఁ డగుచు నద రంట విరూ
పాక్షునివక్షముఁ బొడిచిన
రక్షోవీరుండు కూలి రణమునఁ బడియెన్. 10

వ. ఇట్లు కూలిన. 11

క. హుమ్మని యాతనికూరిమి
తమ్ముండును గనలి వచ్చుతపనజు నత్యు
గ్రమ్ముగ మార్కొని జడిగా
నమ్ములవర్షంబుఁ గురియ నాలోఁ బెలుచన్. 12

చ. శరములు తాఁకకుండ నొకశైలమునం దగ నోసరించి యా
యరదము నుగ్గుగాఁ గపికులాగ్రణి వైచిన వాఁడు నేలకున్
వరభుజశక్తి దాఁటి కరవాలున నేసినఁ దప్పఁ గ్రుంకి వా
నరపతి కొట్టె నప్డు మహినాథుఁడు సంతనమంది చూడఁగన్. 13

క. కదనమున నొచ్చిదానవుఁ
డదలింపుచు భానుసుతుని యౌదల వగులన్
గదచే నడిచిన వానినిఁ
గుదియంగాఁ బట్టి వైచెఁ గుంభినిమీఁదన్. 14

క. అంత సుపార్శ్వుఁడు మిక్కిలి
వంతము నెఱపుచును రథము పవనాత్మజుపై
నెంతయుఁ బఱపుచు బాణము
లంతంతనె నాట నేయునవసరమందున్. 15

సీ. హనుమంతుఁ డాదైత్యునరదంబుపై దాఁటి
చెక్కులు వాఱంగఁ ద్రొక్కివేసి
సైంధవంబులఁ జంపి సారథితలఁగొట్టి
గొడుగులు పడగలు పుడమిఁ గలిపి
వడి వానిచే నున్న యడిదంబుఁ గైకొని
విరుసుగా నేసిన ధరను గూలి

Akella Raghavendra's Online-ias.com

గొబ్బునఁ దెప్పిర్లి కోపంబు దీపింప
నవిలజునురము మూఁడంబకముల

తే. జాంబవంతుని నిరుమూఁడుసాయకముల
వడి గవాక్షుని నైదింట వాలిసుతుని
నేడు బాణంబులను దూలనేసె నంత
నవనిఁ బడి లేచి యంగదుం డాగ్రహమున. 16

తే. వాని చేవిల్లు విఱచిన వాఁడు కినిసి
పరిఘఁ గొని యేయ మూర్ఛిల్లి ధరణి వ్రాలి
తెలిసి యంగదుఁ డాదైత్యుఁ దెగువ నురము
పిడు గడంచినగతి ముష్టిఁ బొడిచి చంపె. 17

వ. ఇట్లు సుపార్శ్వాదిరక్షోనాయకు లాక్షణంబునం గూలిన. 18

క. తనకట్టెదురను గూలిన
దనుజులఁ బెక్కండ్రఁ జూచి దశకంఠుఁడు దాఁ
గనలుచు సూతున కనియెను
జననాయకుమీఁద రథముఁ జన నిమ్మనుచున్. 19

ఆ. అధిపుఁ డానతిచ్చినట్టుగా సూతుండు
రామచంద్రుమీఁద రథము వఱపె
నపుడు శంఖకాహళాదిరవంబులు
వందిజనులనుతులు సందడింప. 20

వ. ఇట్లు శతాంగతురంగ హేషారవంబులును బహుళకింకిణీ ఘంటికానినదంబులును రణనేమిస్వనంబులును దనుజభటాట్టహాసంబులును బోరుకలంగ వంగరరంగంబున కరుగుదెంచు నక్తంచరేశ్వరుండు ధనుర్ధరుండై ప్రతిఘటించు సమయంబున. 21

క. తన కెదిరించినరామునిఁ
గని దనుజవిభుండు కినుక గదురఁగ నటఁ జ
య్యన నాగాస్త్రములను దన
ధనువునఁ గిలించి యేసెఁ దనభుజశక్తిన్. 22

Akella Raghavendra's Online-ias.com

క. అవి లెక్కఁ గొనక పోరెఁబోరి
నవనీనాయకుఁడు గినుక నసురాధిపుపై
దివిజారు లులికి పాఱఁగఁ
బవిసన్నిభ మైనతీవ్రబాణము లేసెన్.

సీ. లంకేశుఁ డవి యెల్ల లక్ష్యంబు సేయక
తిమిరాంబకములు సంధించి యేయ
నిబిడమై చీఁకటి నిండంగఁ బర్వినఁ
గపు లెల్ల నంధులై కళవళింప
నుర్వీశ్వరుం డంప నుగ్రబాణంబుల
నంధకారం బంత నడఁగఁ జేసి
వాసవారాతిపై వహ్నిబాణము నేయ
నాతండు రౌద్రాస్త్ర మదర నేసె

తే. రెండు బాణంబులును గూడి గం డెసంగఁ
బెనఁగి యాకాశమున నుండి పృథ్విమీఁదఁ
బడియె నద్భుతగతి జగత్ప్రళయముగను
సురలుఁ గపులును దైత్యులుఁ జోద్యపడఁగ. 24

వ. అట్లు మహాద్భుతకరంబుగా సమరంబు జరుగుచున్నసమయంబున. 25

క. రాముని మేనను బాణ
స్తోమంబులు నాట నేసె సురరిపుఁ డలుకన్
రాముఁడు ఘననారాచ
స్తోమంబులు నాట నేసె సురరిపుమీఁదన్. 26

చ. ధరణిపుమీఁదనుం గనలి దానవనాయకుఁ డేసె నంతభీ
కరశరభోష్ట్రకాకఫణిగండకమూకబలాకభేకసూ
కరకిరిఋశ్యకూర్మశుకగర్దభ భల్లుకనీలకంఠకే
సరివృకగృధ్రకీటబకసైంధవసైరిభవక్త్రబాణముల్. 27

వ. ఇట్లు నిరంతరంబుగాఁ బ్రయోగించిన. 28

Akella Raghavendra's Online-ias.com

చ. పరువడి మీఁదవచ్చుపటుబాణచయంబులఁ జూచి రాఘవుం
డరుదుగ వాని నన్నిటి వియత్తలవీథిని ద్రుంచి క్రమ్మఱన్
సురరిపుమీఁద నేసె బలసూదనముఖ్యులు చూచి మెచ్చని
బ్బరముగ నగ్నిబాణము వథంబునఁ గీలలు పర్వుచుండఁగన్. 29

వ. అమ్మహాస్త్రంబువలన. 30

క. దహన ముఖంబుల శరములు
గ్రహముఖములు గలుగునట్టి ఘనతరశరముల్
మిహిరముఖంబుల శరములు
బహుళముగాఁ గల్గి దైత్యపతిపైఁ బర్వెన్. 31

ఆ. అంత దానవేంద్రుఁ డాబాణతతు లెల్ల
దృణములట్లు నడుమఁ ద్రెంచి వైచి
మయునిచేతఁ గొన్న మహనీయ మగునట్టి
శంబరాఖ్య మైనశరము వైచె. 32

క. ఆశరమున బహుళస్త్రము
లాశుగతిం గలిగి గవియ నన్నిటి నొకటన్
నాశము చేసెను రాముం
డాశాపతు లలర మన్మథాస్త్రముచేతన్. 33

ఆ. శంబరాఖ్యశరము జగదీశుబాణంబు
వలనఁ జెడక రామువక్ష మదర
నాఁటె నంతలోన నాకారిపై నేసె
విశిఖతతులు వేయి వేయునెడను. 34

క. రావణుఁ డాబాణములకు
వేవేగను ప్రతిఘటించి వేసినశరముల్
చేవ మెయిఁ దాఁకి వడి ధా
త్రీవలయంబునను బడి ధరిత్రి వడంకెన్. 35

ఉ. తల్లడ మంది రామవసుధాపతి కడ్డము సొచ్చి లక్ష్మణుం
డుల్లమునొవ్వనాటుచుమహోన్నతకోపముతోడ దైత్యుచే

Akella Raghavendra's OnlineIAS.com

విల్లును నారియుం దునిమివేసి వడిన్ శరసప్తకమ్ముచే
బల్లిదుఁడై నదైత్యకులపాలునివక్షముఁ దూర్చియార్చినన్. 36

క. అంత విభీషణుఁడమరేం
ద్రాంతకు నరదంబుఁ గూల నట నేసిన న
త్యంతజవంబున ధరణికి
గంతుగొనెన్ వడిని బంక్తికంధరుఁ డలుకన్. 37

వ. ఇట్లు తనరథంబుఁ గూలనేసిన విరథుండై రావణుండు మయదత్తంబైనశక్తినిఁ బూని తమ్ముని నేయఁ జూచు చున్నంత శరణాగతవజ్రపంజరుం డగు రాఘవేశ్వరునితోఁబుట్టు వగుటంజేసి లక్ష్మణుండు కరుణాపరుండై విభీషణుం దనవెనుక నిడికొని యెదిర్చినం గని నీవు నాపగర కడ్డంబ వైతివి గావున నీవ యీశక్తిచేత హతుఁడవు గమ్మన యేసిన నదియును శతఘంటికారంజితంబును శతకోటినినదంబును బావకజ్వాలాభీలకీలాన్వితంబునునై పఱతేరంగని సురేంద్రాది దేవగణంబులు భయం బంది రాముతమ్మునకు దీర్ఘాయు వగుం గావుత మని దీవింప జగంబులు తల్లడిల్ల సముద్రంబులు ఘూర్ణిల్లఁ గులాచలంబులువడంకఁ జంద్రార్క బింబంబులు దలంక నేఁగుదెంచిసౌమిత్రియురంబునాటి ధాత్రిం బడియె నట్టియవసరమ్మున. 38

సీ. పంక్తికంధరుఁ దేయుబాణంబు లవి లెక్క
పేయక రఘుకులసింహుఁ డపుడు
తమ్మునిమెయి నాటి ధరణి గాడినశక్తి
నొగి వానరులు తీయ నోపకున్న
నవలీల దాని నొయ్యనఁ దీసి పోవైచి
ఘనులైన కపులను గాపు వెట్టి
నేనె రాముఁడ నైతినేని మజ్జనకుండు
దశరథుం డగునేనిఁ దప్పకుండఁ

తే. గలన నెదిరించి నాతోఁడ గయ్యమునకు
నిలిచె నేనియు దమజేంద్రు నిజము గాఁగ
నమరు లెఱుఁగంగ జంపుదు నతనిచేతఁ
జత్తు నింతియకాని నే రిత్తమగుడ. 39

Akella Raghavendra's Online-ias.com

వ. అని మఱియును. 40

క. రాముఁడు రావణుఁ డనుచును
భూమిపయిని నిర్వురునికి వొసఁగదు సుండీ
నామాట వినుఁడు లెస్సగ
రాముఁడ నే నొందె భువిని రావణుఁ డొందెన్. 41

వ. ఉండుదు మని వీరాలాపంబు లాడుచు రామచంద్రుండుఁ ధనుర్ధరుండై శరవర్షంబులు గురియించిన నసురేశ్వరుండును బ్రతిశరంబుల వాని నన్నింటినిం దూల నేసినఁ గనలి రామచంద్రుండు తొడిగినయమ్మును వెడలు తూఁపులును విల్లుగుణంబుసుపడుటయు నెఱుంగ రానిచందంబునఁ బింజపింజంగఱచి పాఱుచుండునట్లుగా హస్తంబు ముడుచుటయుఁ జూచుటయు దెలియరాకుండ రావణు కాలుసేతు లాడకుండ శరలాఘవంబు నెఱపుచు నేయుచున్న యప్పుడు విఱిగి శరీర భూషణంబు లురులఁ గిరీటంబులు డుల్లఁ దలలు వీడ మరలి మరలి చూచుచు మృగేంద్రుం గన్నగజేంద్రుని చందంబున భీతచేతస్కుండై దశముఖుండు లంకాపురంబుఁ జొచ్చెఁ దదనంతరంబున. 42

క. ఆవేళ లావు సూపుచు
రావణుచేశక్తి దాఁకి రణరంగమునన్
జీవ సెడి పడినలక్ష్మణ
దేవున్ దగ్గఱఁగ రామదేవుఁడు వచ్చెన్. 43

వ. ఇట్లరుగుదెంచి. 44

తే. రక్తసిక్తాంగుఁడై ధాత్రి శక్తి నాఁటి
యున్నతమ్మునిఁ గనుఁగొని యుస్సు రనుచు
దుఃఖ మంతంత నాఁగక తొంగలింపఁ
దొడలపై నిడి బాష్పముల్ దొప్పదోఁగ. 45

సీ. హా! భానుకులదీప! హా! సత్యసల్లాప!
హా! సుగుణకలాప! హా! సురూప!
హాధర్మసంచార! హా! వైరిసంహార!
హా! కీర్తివిస్తార! హా! సుధీర!

Akella Raghavendra's Online-ias.com

హా! నిత్య సుజ్ఞాన! హా! పుణ్యసంధాన!
హా! పూజ్యసమ్మాన! హా! నిధాన!
హా! శౌర్యగుణవృద్ధ హా! యుద్ధసన్నద్ధ!
హా! చిత్తసంశుద్ధ! హా! ప్రసిద్ధ!

తే. హా! మునీశ్వరసంరక్ష! యసురశిక్ష!
హా! గుణస్తోత్రసత్పాత్ర! యబ్జనేత్ర!
హా! సదాచారసంపన్న! హా! ప్రసన్న!
యనుచు శోకాతురాత్ముఁడై యంతకంత. 46

క. జనకునిపంపున నడవికిఁ
జనుదెంచియు నిడుమ కోర్చి సన్మునివృత్తిన్
ననుఁ గూడి నడవ నేర్చిన
యనుజన్మా! యెందుఁ బోయితయ్యా! తలఁపన్. 47

క. వనమునఁ గలఫలమూలము
లనుదినమును భక్తియుక్తి నర్పింపుచు మ
జ్జనకునిభంగిని నన్నును
జనకజఁ బోషించి యెందుఁ జనితివి తండ్రీ! 48

క. నీవంటితోడఁబుట్టువు
నీవంటిగుణోత్తరుండు నిజ మూహింపన్
భూవలయమందుఁ గలఁడే
భావింపఁగ నీవెతక్కఁ బావనచరితా. 49

క. నెఱయక నిద్రాహారము
లెఱుఁగక పదునాలుగేండ్లు హితమతితో మ
మ్మఱిముఱి నరసిన నిన్నును
మఱవ నగునె నీతి గల్గుమనుజుల కెందున్. 50

క. నిన్నిచట విడిచి పురికిని
జన్నను నినుఁ గన్నతల్లి సనుదెంచి ననున్
నిన్నడుగఁ దడవ మదిలోఁ
జిన్నం బోవుచును నేమి చెప్పదుఁ దండ్రీ. 51

Akella Raghavendra's Online-ias.com

వ. అని మఱియును. 52

చ. వినుఁడు కపీంద్రులార! పలవింపుచు మజ్జనకుండు నాకమున్
జనియె ధరాత్మసూభవ నిశాచరుచేఁ జెఱవోయె నేటితో
ననుజుఁడు దీఱె నింక నడిఁబూసల నుండుట నాకు ధర్మమే
చనుఁడు నిజాశ్రమంబులకు సంశయ మొందక మీరు గొబ్బునన్. 53

వ. అని విభీషణుం గనుంగొని. 54

ఉ. అక్కట! నీకు నింటఁ గలయట్టి సుబాంధవకోటిఁ బాసి నీ
యిక్కడ కేఁగుదెంచితి వహీనముదంబున మమ్ము నమ్మి యెం
పెక్కఁగ రావణుండు తగ నేలెడిలంకఁ గడంగ నీకు నేఁ
దక్కఁగ నిత్తునన్ ప్రతిన దప్పె విభీషణ! నీవు పోవుమా. 55

వ. అని యనేక ప్రకారంబులఁ బ్రలపించుచున్న రామభూపాలునకు సుషేణుం డిట్లనియె. 56

ఉ. దేవర! నీకు నీగతి మదిం దలపోయఁగ నేల తీవ్రమై
రావణు చేతిశక్తి బవరంబున నాటుటఁజేసి లక్ష్మణుం
డీవిధిఁ నుండెఁగాని ధరణీశ్వర! చూడు ముఖారవిందమున్
జావఁడు సావఁ డియ్యెడ నిజంబుగ నమ్ము మనంబులోపలన్. 57

ఉ. పున్నమ చందురుం దెగడి పొల్పెసలారెడి మోముఁదమ్మియున్
గన్నులు కల్వతేకులను గాంతి జయించెడుఁ గాని రక్తిమన్
జెన్నుదొలంగియుండ వఱచేతులుఁ బాదములున్ దలంపఁగా
నున్నవి వర్ణముల్ గలిగి యొప్పుతొఱంగదు రాఘవేశ్వరా. 58

వ. అని విన్నవించుచు హనుమంతుఁ గనుంగొని సుషేణుం డిట్టు లనియె. 59

క. ఈయన ప్రాణము లెత్తఁగ
వాయుజ! యలనాఁటిమందు వడిఁ దేవలె నీ
వీయెడ నచటికిఁ దడయక
పోయి వెసన్ రమ్ము ప్రొద్దు పొడువక మును పే. 60

వ. అనిన భూకాంతుండు హనుమంతున కిట్లనియె.

క. రమ్మా వాయుతనూభవ ।
యిమ్మహి సత్కీర్తిఁ బడయు మీతని ప్రాణం
బిమ్ముగ రక్షింపుము నా
తమ్ములలో నీవు నొక్కతమ్ముఁడ వరయన్. 62

వ. అని డాయం జని కౌఁగిటం జేర్చి దీవించి యంపె నప్పుడు. 63

ఆ. పదము లూనఁ ద్రొక్కి వదనంబు దిగఁ జూచి
చేతు లూని నడుము చిక్కఁబట్టి
క్రుంగి నిక్కి యెగసి కుప్పించి వడి దాఁటి
చనియె గగనవీధి ననిలసుతుఁడు. 64

వ. అట్టి సమయంబున. 65

సీ. దనుజేశుఁ డావార్త విని కాలనేమిగే
హము నొచ్చి నడిరేయి యతనితోడఁ
తనచేత హతుఁ డైనధరణీశుతమ్ముని
ప్రాణంబు లెత్తంగఁ బవనసుతుఁడు
నమచున్న యట్టియాపని విఘ్న మొనరింపఁ
గ్రక్కున నటఁ బోయి ర మ్మటన్నఁ
గాలనేమి యిదేటి కార్యంబు తగ దన్న
వినక కోపించిన వేగ నరిగి

తే. ద్రోణశైలంబు చేరువత్రోవయందు
వనముఁ గావించి తగ మునీశ్వరునిరీతి
జపము సేయుచుఁ గన్నులు చక్కమూసి
నడుము నిక్కించి పద్మాసనమున నుండె. 66

వ. అప్పు డాకాశమార్గంబునఁ జనుచున్నయప్పవనసుతుండు వనంబుఁ గాంచి త్రోవ దప్పె నని మనంబున సందియ మొంది యమ్మునీంద్రు నడిగి చనువాఁడై యతనికి నమస్కరించి యిట్లనియె. 67

క. మునినాథ! నేను రాముని
పనికై చనుచున్న వాఁడ బరమౌషధముల్
గొని రావలె మది భావిం
చి నిజమ్ముగ నిపుడు త్రోవ సెప్పుము నాకున్. 68

వ. అని ప్రార్థించి దాహోపశమనంబున కుదకంబు వేఁడిన నక్కపట మునీంద్రుం డిట్లనియె. 69

ఆ. పవనతనయ! రామభద్రునిపని మాకుఁ
దీర్పవలయుఁ గాన నేర్పుతోడఁ
బ్రాణరక్షకొఱకు ద్రోణాద్రి కరుగంగ
వలదు వినుము నాదువనముసందు. 70

తే. ఘనతరం బైన సంజీవి కరణి మొదలు
గాఁగ దివ్యౌషధంబులు గలవుగానఁ
గొంచుఁ బోవచ్చుఁ గావునఁ గోరుపండ్లు
తనివి దీఱంగఁ దిని నీళ్ళు త్రాగుమిచట. 71

వ. అని తనహస్తంబున నున్నవిషయుక్తం బైనకమండలూదకంబు చూపినం గని హనుమంతుం డవి చాల వనిన నక్కపటమునీంద్రుండు క్రూరమకరావృతం బైనకమలాకరం బొకం డెఱింగించి పొమ్మనినఁ బవనాత్మజుండుసని. 72

క. విమలమకరందలుబ్ధ
భ్రమరనికరపక్షపవనపరికంపితన
త్కమనీయకుముదకైరవ
కమలంబులు గలుగుకొలనుఁ గనుఁగొని యచటన్. 73

సీ. మడుఁగులోపలఁ జొచ్చి కడుపార నుదకంబు
గ్రోలంగ దిగ నందుఁ గ్రాలు మొసలి
పాదముల్ కబళించి పట్టినఁ జరణముల్
విదళింపఁ బట్టూని విడువకున్న
గడుసూక్ష్మరూపుఁ డై కడుపులోపలఁ జొచ్చి
వేగంబ భేదించి వెడలె నంత

నది దేవకన్య యై యాకాశముననుండి
తనదువృత్తాంత మంతయును జెప్పి

తే. వీఁడు దైత్యుండు నమ్మకు వీనిఁ జంపి
పొమ్ము సంజీవికొండకుఁ బ్రొద్దు గలుగ
నీకతంబున శాపంబు నాకుఁ దీఱె
ననుచు దీవించి చనియెఁ దా నమరపురికి. 74

వ. అంత హనుమంతుండు తేజోవంతుండై యరుగుదెంచి కపటసంయ
మినింగనిన నతండిట్లనియె. 75

చ. తడసితి వేల యింతవడి దాపుననే వసియించినట్టి యీ
మడువున కేఁగి రాకునికి మాకనుమానము దోఁచెనయ్యః యి
ప్పుడు గలదేనిఁ గొంత గురుపూజకు విత్తముకాన్క వెట్టి నీ
వడుగుము మందులెట్టివి ప్రియం బగునట్టివి నీకు నిచ్చెదన్. 76

చ. అనవుడుఁ గోపమెత్తి పవనాత్మజుఁ డప్పుడు నీకుఁ బూజ గొ
మ్మని యురుముష్టిచేఁ బొడువ నాతఁడు దీకొని పక్షిరూపుఁ డై
తనుఁగదియంగవచ్చుటయు దాని నపక్షముగాఁగ ద్రుంచినన్
గినిసి మృగేంద్రుఁడై పొడువఁ గేసరిపుత్త్రుఁడు దానిఁ గూల్చినన్. 77

తే. అంత సుగ్రీవుఁ డై వచ్చి యనిలతనయః
బ్రతికె సౌమిత్రి మందులపని తలంప
వలదు రమ్మని నన్నుఁ భూవరుఁడు పనిచె
మగిడి పోదము పద మన్నమాట వినుచు. 78

వ. సుగ్రీవుం డని విచారించి కాకుండు చెలఁగి వాని నాహంమన్యంబునఁ
బొడిచిన నతం డారూపంబు విడిచి శతశృంగుం డై నొప్పించిన నలిగి జగత్ప్రాణ
నందనుండు వాలంబున నడిచి కరంబులు ఛేదించి శిరంబుఁ ద్రుంచివైచి సింహ
నాదంబు చేసి జయలక్ష్మిం గైకొని. 79

క. ద్రోణాద్రి కేఁగి మందులు
పోఁటిమి నీకున్నఁ గివిసి పొల్పలరఁగ నా

Akella Raghavendra's Online-ias.com

క్షోణీధర మగలింపుచుఁ
బాణితలాగ్రమునఁ బెట్టి పట్టుకరాఁగన్. 80

సీ. కావలి యున్నట్టి గంధర్వగణములు
పదునాల్గువేలు కోపంబుతోడ
నాహవం బొనరింప నందఱ నచ్చోట
వాలముఖంబున వసుధఁ గూల్చి
గగనమార్గంబునఁ గడుతీవ్రగతితోడఁ
బోవ నంది గ్రామపురమునందుఁ
దైలయుక్తం బైన తలలతోఁ బొరలాడ
గలిగిన రామలక్ష్మణుల తెఱఁగు
తే. భరతుఁ డారాత్రి కలఁ గని భయము దోఁచి
తొడరి దుస్స్వప్న దోషంబు దొలఁగి పోవ
విప్రవరులకు దానముల్ వేడ్కనిచ్చి
వెలుపలను నున్న భరతభూవిభునిఁ గాంచి. 81

తే. రాముఁడే యంచు నూహించి రాముఁ డేల
వచ్చు నిచటికి సౌమిత్రి వనచరులను
జనకనందనఁ దగ డించి జగ మెఱుంగఁ
బగరఁ జంపక రా నేమిపని తలంప. 82

వ. అని యిట్లు సందియంపడి కాఁ డని నిశ్చయించి యంత హనుమంతుండు దక్షిణపాథోనిధి దఱియం జనునప్పుడు దశాననుపంపున సేనలఁ గూడి మాల్యవంతుం డెదిరించి శస్త్రాస్త్రంబులు గురియించి నొప్పించినం గని వాతూలసంభవుండు వాల మల్లార్చి యార్చిపేర్చి దనుజబలంబులఁ జలంబునం దఱిమి వాలముఖంబున గళంబులు పట్టి నానాముఖంబులం బాఱవైచినన్ గని మాల్యవంతుండు తీవ్రశరంబుల నొప్పించిన నదరి యద్దానవేంద్రునికంఠంబున వాలంబుం గీలించి గిరంగిరం ద్రిప్పి సముద్ర మధ్యంబునఁ బడవైచిన వాఁడును బాతాళంబునకుం జనియె నాక్షణంబ. 83

తే. మాల్యవంతునిఁ బోకార్చి మానుషమున
గగనమండల మందంద పగులనార్చి

Akella Raghavendra's Online-ias.com

వచ్చునప్పుడు శతకోటివారిజాప్త
దీప్తిఁ గనుపట్టెఁ బ్రాచీనదిక్కునందు. 84

వ. ఇట్లు వెలుంగుచున్న మహౌషధాచలంబు దివ్యదీప్తులు గనుంగొని రాఘవేశ్వరుం డది సూర్యోదయం బని మనంబునఁ దలంకి* కపిరాజున కిట్లనియె. 85

చ. అదె కనుఁగొంటిరే కలయ నర్కుఁడు పూర్వగిరీంద్ర శృంగమం
దుదయమునొందె నింక నిటనుంచినఁ దమ్ముని ప్రాణవాయువుల్
బ్రదుకుటదుర్లభంబకట! పల్మఱు మ్రొక్కెడు ప్రొద్దె మాకుఁ దా
నదయత శత్రుఁడయ్యెఁ గపులార వినుండిదె మీకుఁ జెప్పెదన్. 86

తే. మాకులంబున కెల్లను మహినిఁ దలఁపఁ
దానె కర్తయై యుండియు ధర్మ మగునె
యుదయ మందంగ మనుమఁ డి ట్లున్న యెడను
గొసరి చుట్టాలుఁ బగవారిఁ గూడవలెనె. 87

క. ఈలాగునఁ దాఁ బొడిచిన
మాలక్ష్మణు ప్రాణ మేల మగుడును భానుం
గూలఁగ నేసెద విల్లును
గోలలుఁ దెమ్మనుచు నందికొనునాలోనన్. 88

వ. రామచంద్రునకు జాంబవంతుం డి ట్లనియె. 89

ఉ. భానుఁడు కాఁడు చూడు నరపాలక! మందులకొండదీప్తి లీ
మానము దోఁచెఁగాని యనుమానములేదు వినుండు వేడ్కతో
వానరసేన నిం కెదురు వాయుతనూజుని గారవింపఁగా
మానవనాథ! పంపు మనుమాత్రనె వచ్చెనతండు తీవ్రతన్. 90

క. అనిమిషులు సన్నుతింపఁగ
హనుమంతుఁడు ద్రోణశైల మతిశీఘ్రముగాఁ
గొని వచ్చి నిలిచి రఘురా
ముని శ్రీపాదముల కెలమి మ్రొక్కినయంతన్. 91

* కపులతో.

Akella Raghavendra Online-ias.com

వ. రామచంద్రుం డతనిం గౌఁగిలించుకొని సుషేణుం జూచి నీ విందలి దివ్యౌషధంబులవలన సౌమిత్రి ప్రాణంబులు తేర్పుమనిన నయ్యధిపునాజ్ఞ శిరంబునఁ దాల్చి వనచరసహితుం డై పర్వతం బెక్కి తొల్లి దేవత లమృతపానంబు చేసిన తావును నారాయణుండు మోహినీరూపంబున నమృతము పంచునప్పుడు సూర్య చంద్రులనడుమ నిలికిన రాహువు శిరంబుఁ ద్రుంచిన తావును బలిచక్రవర్తి యాగంబు చేసిన తావును రాక్షసులు జన్మించిన తావును శంకరభగవానుండు పర్వతరాజు కూఁతును బెండ్లియాడిన తావును వానరులకుం జూపుచు నగ్గిరీంద్రంబుపై నున్న యౌషధంబులు గొనివచ్చి ప్రయోగింప నాయౌషధముల సామర్థ్యంబునం జేసి లక్ష్మణునకుఁ బ్రాణంబులు మగుడ వచ్చె నంత సకలవానరులు నానందరసాబ్ధిం దేలి రప్పుడు సౌమిత్రి రామునకు నమస్కరించిన రామచంద్రుండు కౌఁగిటం జేర్చి హనుమంతుం డొనరించిన యుపకృతికి సంతోషించి యీ పర్వతంబును దొల్లింటి యునికినే యుంచి రమ్మనిన నతం డట్ల కావించెనని నారదుండు సెప్పిన వాల్మీకి మునీశ్వరుం డటమీఁది కథావిధానం బెట్టి దని యడుగుటయు. 92

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకినాథా. 93

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద* సూరిజనవినుత కవితాచమత్కారతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితం బైన శ్రీరామాయణ మహాకావ్యంబు నందలి యద్ధకాండమున ద్వితీయాశ్వాసము.

---

*నిత్యశైవాచార సంపన్న

శ్రీ

# రామాయణము

## యుద్ధకాండము

### తృతీయాశ్వాసము

క. విమలసుధాకరవదనా!
సుమనశ్శ్రేతోబ్జసదన! సుస్థిరకదనా!
కమనీయరదన! శత్రువి
షమ! రఘుకులసార్వభౌమ! జానకిరామా! 1

వ. శ్రీనారదమునీంద్రుండు వాల్మీకి కెఱింగించినతెఱం గెఱింగించెద నాకర్ణింపుము. 2

క. కలకల పక్షులు గూయఁగఁ
బలపలనై తారకములు పసమటఁ దోఁపన్
జలజములు విరియఁ దూర్పున
బలపలనై తెల్లవాఱ భానుఁడు పొడమెన్. 3

సీ. అట మున్ను దశకంఠు డాచార్యుఁడై నట్టి
శుక్రానుమతి దేహశుద్ధితోడ
రణజయార్థంబుగా రథములు గుఱ్ఱముల్
కవచంబు లస్త్రసంఘములు గలుగఁ
బాతాళగుహఁ జొచ్చి వీతిహోత్రునిఁగూర్చి
పాయక హోమంబు సేయుచుండ
నాహోమధూమంబు లాకసంబునఁ బర్వఁ
గని విభీషణుఁడు భూకాంతునకును

తే. విన్నవించెను మాయన్న నిన్న నరిగి
హోమ మొనరింపుచున్నవాఁ డుడుగ కిపుడు

మొనసి యాహోమ మది తుద ముట్టెనేనిఁ
గలనబ్రహ్మాదు లాతని గెలువలేరు. 4

క. ఈపని విఘ్నము సేయఁగ
భూపాలక! కపుల నేర్చి పుచ్చుము లేదే
మీపని విఘ్న మగు ననుచు
భూపాలవరేణ్యుఁ డపుడు భూధరచరులన్. 5

చ. గవయగవాక్షవాలిసుతకంజహితాత్మజనీలవాయుసం
భవనలగంధమాదనవిభాషితభల్లుకనాథముఖ్యులన్
దివిజవిరోధిపైఁ బనుపఁ దీవ్రత నేఁగి పురంబు సొచ్చి దా
నవపతిసేనలం దఱిమి నాకము భేదిల నార్చి యత్తఱిన్. 6

క. గుహ సొచ్చి దనుజవల్లభ!
విహితమె సాహసము విడిచి విను మునివృత్తిన్
దహనగతధూమరేఖల
నహరహమును నీకు వ్రేల్వ నర్హంబగునే. 7

క. మగఁటిమి గలిగినపురుషులె
మగతనమును విడిచి నడువ మగువలు నగరా
తగ దనక నేఁడు మఱుగున
విగతవ్రీడుండ వగుచు వేల్వం దగునే. 8

మ. అని కేతెంచి నృపాల శేఖరుఁడు వాహ్యాళి ప్రదేశంబునన్
విను రమ్మంచును బిల్చుచుండ నిచటన్ నీవుండి వ్యాజంబునన్
దనుజాధీశ్వర! వీరధర్మ మగునే తప్పించుకో నంచు న
వ్వనచారుల్ సిగవట్టి యీడ్వఁగను గ్రవ్యాదుండు నిశ్చింతుఁడై. 9

క. కదలక హృదయజ్ఞానము
వదలక మంత్రంబుచొప్పు వడి తప్పక లోఁ
జెదరక వ్రేల్చుచు నుగ్రత
జెదరక కూర్చుండె నట గభీర ప్రౌఢిన్. 10

Akella Raghavendra's
Online-ias.com

వ. అట్లు శిలాస్తంభంబునగబడి చలింపకున్న నతనిచేత యాహుతులు
చి కో పై చి ప్రస్రువంబులు వడుఁగఁ ద్రొక్కి యిధ్మంబు హోమద్రవ్యంబులు
క్కింత నగ్నిలోఁ ద్రోచి హోమాగ్నిం జిందరవందర చేసి ఋజంబు లెక్కి
వలు పట్టుకొని లాగి తలలు గదలించి పీనులఁ బెనుబొబ్బలిడి కదలకున్నం
సి వాలితనూభవుండంత నంతఃపురంబునకుం బోయి యందున్న మందోదరినిఁ
ట్టుపట్టి యీడ్చుచు బరువునఁ గొని వచ్చి దశవదనుముందట నిలుప నక్కాంత
ఃఖాక్రాంతయై తనకాంతున కిట్లనియె. 11

. రామచంద్రుండె యాదినారాయణుండు
గపులె దేవత లని నీకుఁ గనఁబడంగ
నెల్ల వేళల నేఁ జెవి నిల్లు గట్టి
విన్నపము సేయ నామాట వినకపోతి. 12

ు. మయదైత్యేంద్రునకుం దనూజ నయి సేమంబొప్ప నీపత్నినై
జయవెట్టంగను నింద్రజిజ్జననినై సర్వాంగనాపూజ్యనై
భయ మెన్నండు నెఱుంగనట్టినను నిట్లుంగిన్ వనాటుండు ని
ర్భయవృత్తిం దలపట్టి యీడ్వఁగనుఁ గోఁబాలైతి నీముంగలన్. 13

. రామునిదూతలు నన్నును
బాములు వెట్టంగఁ జూడఁ బండువె నీకున్
నామానము గాపాడవి
నీమానుష మేటి కిపుడు నిర్జరవైరీ. 14

. ఈమునివృత్తికన్న దనుజేశ్వర ! రామునితోడ నేఁడు సం
గ్రామము సేసి గెల్చిన నఖండరమావిభవంబు గల్గు నా
రామునిచేతఁ జచ్చిన స్థిరంబగు మోక్షము గల్గు దీనికై
యేమిటి కింతదైన్యమిసిఁ యిచ్చఁదలంపుము రాక్షసేశ్వరా. 15

వ. అని యనేక విధంబులుగా దీనాలాపంబు లాడుచు వెక్కి వెక్కి
పేద్వం గని లజ్జించి మహోగ్రాకారుండై లేచి దగ్ధశేషకాండంబులచే వానరవీటుల
రంబులు శిరంబులు ముక్కులుఁ జెక్కులు నలుఁగ మొత్తినం బఱచి వారు రామ
ంద్రుని సమ్ముఖంబునకుం బోయి తాము పోయి వచ్చినపని విన్నవించి రట్టి
మయంబున. 16

Akella Raghavendra's Online-ias.com

తే. నగచరులఁదోలి క్రమ్మర నగరి కరిగి
పంక్తికంఠుండు ధైర్యంబు పాదుకొల్పి
విన్నఁదనమున వగపునఁ జిన్నవోయి
చెంత నున్నట్టితనకులకాంతఁ జూచి. 17

క. నాకేలు పట్టి వెలసిన
నీ కేలా చిన్న వోవ నీరజనయనా!
నాకులు బెదరఁగ నల యి
క్ష్వాకుకులోద్భవుల గెలిచి వచ్చెద నింకన్. 18

తే. తెలియ మయపుత్త్రి! నాదుప్రతిజ్ఞవినుము
వనచరులతోడ రామభూవరుని నేఁడు
చంపుటొండెను వానిచేఁ జచ్చుటొండెఁ
గాని యూరక మరలుట కానిమాట. 19

వ. అని వీరరసం బుప్పొంగఁ బ్రతిజ్ఞాలాపంబులఁ దనపట్టపుదేవి యగు
మందోదరి నోదార్చి కొలువుకూటంబున కేతెంచి యచ్చట. 20

క. శిరముల వీనుల గళములఁ
గరముల నురమున నడుమున గమనీయపదాం
బురుహముల భూషణావళు
లరుదారఁగఁ దాల్చి మోహనాకృతి మీఱన్. 21

తే. గంధమాల్యాంబరాదులు బంధురముగ
మేనఁ గలయంగ ధరియించి దానవేంద్రుఁ
డంత రణభేరి వ్రేయించి పంత మలర
బిరుదు రాహుత్తవీరులఁ బిలువఁ బనిచె. 22

వ. అట్టి యవసరంబున. 23

ఆ. రోష మడర ఖడ్గరోముండు వృశ్చిక
రోముఁ డల్ల సర్పరోముఁ డగ్ని
వర్ణుఁడాది గాఁగ వచ్చిరి రాక్షస
వీరు లపుడు దనుజవిభునిఁ గొలువ. 24

Akella Raghavendra's
Online-ias.com

క. ఇరువదిచేతుల శస్త్రో
త్కరములు మెఱయంగఁ దాల్చి కౌతుక మడరన్
దురగములు నూఱు గట్టిన
యరదముపైఁ గూరుచుండ నతివిభవమునన్. 25

సీ. భేరులు తమ్మటల్ పెల్లునిస్సాణముల్
బూరగొమ్ములు కంచువీరణములు
మకిలక్రోవులు వీరమద్దెలల్ గిడుగిళ్ళు
పేరైనతప్పెటల్ పిల్లఁగ్రోళ్ళు
తారలు చిమ్మటతారలు శంఖముల్
కాహళాల్ పసిఁడిఢక్కలును బిడులు
గాలిగొమ్ములు డోళ్ళుకైవళ్ళు రుంజలు
ఛత్రసంఘంబులు చామరములు

తే. బోరుకలఁగంగ దిక్కులు బూరటిల్ల
దనుజవర్గంబు లిరువంకఁ దవిలి కొలువ
వెడలె సన్నాహ మడరంగ వీరరవము
కరువు గట్టినచందంబు గానఁబడఁగ. 26

క. కాలాగ్నికాలభైరవ
కాలాంతక కాలగండకాలాహికళా
భీలసముద్యద్దినకర
కాలాకృతితోడఁ బంక్తికంఠుఁడు వెడలెన్. 27

వ. ఇట్లత్యుత్సాహంబుగా యుద్ధరంగంబునకు బయలుదేఱినసమయంబున-

చూర్ణిక. జయజయ కైకసీగర్భసముద్ర సంపూర్ణ సుధాకరా! జయజయ మయతనూజామనోహరా! జయజయ రాక్షస కులసార్వభౌమా! జయజయ సాగరావరణలంకాధీశ్వరా! జయజయ పాకశాసనభద్రశ్రీహరణచతురా! జయజయ కుటిలవైశ్వానరపుటభేదనిర్ధూమధామా! జయజయ సమవర్తి సంపద్విచ్ఛేదకా! జయజయ దనుజవల్లభహల కల్లోలా! జయజయ యదధీశ్వరతోయశోషణబడబానలా! జయజయ పవమానసంహారా! జయజయ యక్షనాయక దుర్వారగర్వాపహారకా! జయజయ యీశానైశ్వర్యహరణోద్యమా! జయజయ నవగ్రహానుగ్రహవిగ్రహా!

Akella Raghavendra's Online-ias.com

జయజయ దశగ్రీవాలంకారా! జయజయ కైలాస నగేంద్రోత్పాటనకందుక క్రీడా వినోదా! జయజయ భవానీశ్వర శ్రీపాదకమలశిరఃకంజాతపూజాసమర్థా! జయజయ పుష్పకారూఢ సకలదిగంతవిక్రాంతా! జయజయ బ్రహ్మవంశప్రదీపకా! జయజయ త్రిలోకవిజయా! రావణేశ్వరా! జయీభవ దిగ్విజయీభవ. 29

వ. అని వందిబృందంబు లుభయపార్శ్వంబుల జయజయ ధ్వనులతో బిరుదుగద్యపద్యంబులు వక్కాణింప ముక్తాతపత్రంబుల నడుమ మహిళామండలార్పితచామరపవనకంపిత కుంతలుండగుచు వీరరసంబు పురుషాకారంబు దాల్చిన లీల నేతేర ముజ్జగంబులు గడగడ వడంకెఁ గులాచలంబు లొడ్డగిల్లెఁ జంద్రార్కమండలంబులు తడఁబడె నక్షత్రంబులు డుల్లెనట్టి సమయంబునఁ గరిబృంహితంబులు నశ్వహేషారవంబులును దనుజభటాట్టహాసంబులును సురత్రాసజనకంబులుగాఁ బటహనిస్సాణ భేరీశంఖకాహళ ఢాంకార రవంబులును బ్రతిధ్వనుల నీన నంత రావణుపై మేఘంబులు రక్తధారలు వర్షించె బిరుదధ్వజంబులు విఱిగిపడియెఁ దురంగంబుల వాలంబులనుండి నిప్పు లురలె దిక్కుల ధూమంబు నిబిడంబై పర్వెనట రామునిచే రావణుండు తెగుట యవశ్యంబని నభంబును మ్రోసె నట్టి సమయంబున. 30

క. భూనాయకుఁ డతివేగమ
దానవసేనలకు నెదురు దాఁకొని పోరన్
వానరసేనలఁ బంపెను
భానుజముఖ్యాధిపతులఁ బౌరుష మడరన్. 31

మ. తరుశైలంబులతోడనార్చుచు భుజాదర్పంబు లుప్పొంగ వా
నరవర్గంబు లెదిర్చి వచ్చునెడ నానాకారు లాదక్షిణో
త్తరవార్ధుల్ ప్రకటించి డాయుగతి నుద్యత్ప్రౌఢిఁదాఁకొంచు సం
గరముంజేయఁగఁజొచ్చిరంతసురలాకాశంబునం జూడఁగన్. 32

సీ. కరుల నెక్కించి భీకరలీలఁ ద్రొక్కించి
వాజులఁ దోలి తీవ్రముగ నేయ
రథములఁ బఱపి శిరంబులఁ జక్కాడి
చెలఁగి పదాతులఁ జేరి పొడువఁ

బంతంబు చేకూఱఁ బ్లవగోత్తములఁ గేరి
తరువులఁ బాషాణతతులఁ బఱపి
శైలంబు లదరించి సంహారములు సేయఁ
గలఁగక దైత్యులఁ గపులు గలసి

తే. పోరునప్పుడు వానరవీరు లసుర
వరులమీఁదను బాషాణవర్ష మధిక
లీలఁ గురియింప దనుజు లావేళ విఱిగి
తలలు వీడంగఁ బఱచిరి తత్తరమున. 33

సీ. మెండైనరథములమీఁదికిఁ గుప్పించి
విక్రమ ప్రౌఢిమై విఱుగఁ ద్రొక్కి
కరులకొమ్ములు పట్టి బిరబిర వడిఁ ద్రిప్పి
జగతీస్థలంబున జదియఁ గొట్టి
తొడరి సైంధవకోటి తడకాళ్లు విదళించి
పట్టి పెన్ జెక్కులు వాఱఁగొట్టి
కాల్బలంబులపైకిఁ గదిసి శస్త్రంబుల
తోడఁ గూడనె చుట్టి తునియఁ గొట్టి

తే. ఛత్రములు గూల్చి చామరసమితి విఱిచి
కెరలి యార్చుచు బిరుదుటెక్కెములు చించి
వాద్యసంఘంబు లవలీల వసుధఁగూల్చి
కపులు దోఁచిరి దానవగణము నెల్ల. 34

ఆ. అంతఁ బంక్తివదనునరదంబు నెదురుగా
నడుచువాయుపుత్త్రునకును ఖడ్గ
రోముఁ డనియె నతని రూపించి నాతోడ
రణము సేయ వేగ రమ్మటంచు. 35

చ. పిలిచిన రోష మెత్తి కడు భీకరవృత్తిని ఖడ్గరోముతోఁ
దలపడ వానిరోమములు దాఁకి శరీరము నొచ్చి యంతలో
పల నొకపర్వతంబు గొని పావని దైత్యునిమీఁద వేయ ని
శ్చలతను ఖడ్గరోముఁడును జక్కుగఁజేసినఁ దత్ క్షణంబునన్. 36

Akella Raghavendra's Online-ias.com

చ. మఱియొక పర్వతంబు హనుమానుఁడు గైకొనివచ్చి క్రమ్మఱన్
మెఱవడిఁ ద్రిప్పి తద్రథముమీఁదను వైచిన వజ్రధారచేఁ
బఱియలువాఱె ధాత్రిఁ బడుపర్వతమో యనఁ దేరితోడ ని
ర్భరముగ ఖడ్గరోముఁడు సపాటగఁగూలె దురంబులోపలన్. 37

ఆ. రోజి కలన ఖడ్గరోముండు గూలుట
సర్పరోముఁ డెఱిఁగి సాహసమున
వాలిసుతుని దాఁక వాని రోమంబుల
విషము సోఁకి నొచ్చి వేగఁ దెలిసి. 38

క. ఆలోన సర్పరోమునిఁ
దూలించుచు వానిముక్కుదూలము పగులన్
వాలితనూజుఁడు దన్నినఁ
జాలంగా నొగిలి తెలిసి సాహస మొప్పన్. 39

ఉ. వాలితనూజునెన్నుదురు వ్రక్కలువాఱఁగ సర్పరోముఁ డా
భీలత నార్చి చేకొలఁదిఁ బేర్కొని కొట్టిన రక్తధారలన్
దేలుచు నంగదుం డతని దీకొని పూని శిరంబు చెక్కలై
వ్రీలి పడంగ గొట్టఁ బృథివీస్థలిఁ గూలెను సర్పరోముఁడున్. 40

క. ఆలోన సర్పరోముఁడు
గూలుట కనుఁగొనుచు మిగులఁ గోపంబునఁ దా
నాలో వృశ్చికరోముఁడు
నీలునిపై రథముఁ దోలె నిర్భయవృత్తిన్. 41

ఉ. బోరన నీలుఁ డంత నొకభూజముఁ గైకొని వానితేరిపై
ఘోరత నేసి యాక్షణమ చూర్ణముగా నొనరింప నేలకున్
దీరతదాఁటి భూరుహముఁ ద్రెంచఁగనుంగొని నీలుఁడొక్క మం
దార మహీజమున్ వయిచె ధారుణి వృశ్చిక రోముఁ డీల్గఁగన్. 42

సీ. వృశ్చికరోముఁ డావేళఁ ద్రుంగుటఁ జేసి
వడి రోషమున నగ్నివర్ణుఁ డదరి
త్రేతాగ్ని లొక్కఁడై తెరలి మండినలీలఁ
దనమేని మంటలు దరికొనంగ

Akella Raghavendra's Online-ias.com

రావణునెదురఁ బరాక్రమస్థితిఁ బేర్చి
రామచంద్రునిమీఁద రణముఁ దోలి
ప్రల్లదంబునఁ బెక్కుభాషలు నుడువుచు
సాయక నిచయంబు లేయునెడను

తే. వానిశౌర్యంబుఁ దెంపును వానిబలముఁ
జూచి భూపాలుఁ డప్పుడు చోద్యపడుచు
ధనువునందును వారుణాస్త్రంబు దొడిగి
యగ్నివర్ణునితలఁ ద్రుంచె నాక్షణంబ. 43

తే. అగ్నివర్ణుండు తెగిపోవ నసురవరుఁడు
కన్నులారంగఁ గనుఁగొని కలుషవృత్తి
రామచంద్రుని డాయంగ రథముఁ బఱపి
పలికె నుత్కటగర్వ ప్రభావుఁ డగుచు. 44

క. జాఱకుమా బీరము చెడి
పాఱకుమా రిపులు నవ్వ భయపడి వనమున్
దూఱకుమా పేర్కొంచును
జీరకుమా కపులఁ దోడు చేకొని పోరన్. 45

మ. అని విశ్లెక్కిడి దైత్యనాయకుఁడు రోషాయత్తచిత్తమ్మునన్
ఘనమౌర్వీనినదంబు భీకరముగాఁ గావించి పెల్లార్చియ
జ్జననాథాగ్రణిమీఁద నుగ్రశరముల్ సంధించి బిట్టేయఁగా
వినువీథిన్ సురసంఘముల్గొలువఁగా వీక్షించె దేవేంద్రుఁడున్. 46

వ. ఇట్లు కనుంగొని. 47

క. రథ మెక్కి రావణుండును
బృథివీస్థలి నుండి రామపృథ్వీపతియున్
బ్రథనము సేయుట తగ దని
వ్యథఁ బొందుచు నాత్మలోన వాసవుఁ డంతన్. 48

క. మాతలిచేతను గవచము
చాతుర్యము గలుగురథము చాపము శరమున్

Akella Raghavendra's Online-ias.com

భూతలనాయకునకుఁ బురు
హూతుఁడు పుత్తెంచెఁగడు మహోన్నత మహిమన్. 49

వ. ఇట్లు పుత్తెంచిన. 50

చ. ధరణికి వచ్చి మాతలి ముదంబున రామునిఁ జూచి మీకుఁగా
సురపతి పంపినాఁ డధికశోభనకృత్యములై వెలుంగు నీ
శరములు విల్లు వజ్రకవచంబును దేవను వీనిచేత సం
గరమున దైత్యునిం దునిమి కైకొను రాఘవ! శ్రీజయంబులన్. 51

వ. అని చెప్పిన మాతలిప్రియవచనంబులకు సంతసించి విభీషణాను
మతంబున రామభూపాలుండు వజ్రకవచంబు దొడిగి శరశరాసనంబులు గైకొని
యింద్రస్యందనంబునకు వలగొని వందనం బాచరించి బాలాదిత్యుండు పూర్వ
పర్వతం బెక్కుచందంబున రథం బెక్కునంత జయజయధ్వనులతో సుగ్రీవాంగద
హనుమదాదులైన వానరవీరులు మ్రొక్కి రప్పుడంతరిక్షంబున దేవసంఘంబులు
సంగ్రామ రంగంబుఁ జూడ వేడ్కపడి వచ్చి విమానంబులతోఁ గ్రిక్కిఱిసి చూచు
చుండి రాసమయంబున. 52

క. గిరిగిరి నభము నభంబున
ధర ధరయును జలధి జలధి దార్కొనురీతిన్
సురరిపుఁడు నసురరిపుఁడును
దురమున నెదురించి రధికదోర్బలయుక్తిన్. 53

వ. ఇట్లు మార్కొనుచు. 54

శా. వీరాలాపము లాడుచుం గడిసి దోర్వీర్యంబుతోడన్ ధను
ర్జ్యారావంబులు మిన్ను ముట్టనతితీవ్రం బైనశబ్దంబులన్
వారాసుల్ కలఁగంగనార్చి నిజగర్వస్ఫూర్తి సుపొంగుచున్
గ్రూరాస్త్రంబులనేసి రొండొరులపైఁ గోదండపాండిత్యులై. 55

క. దనుజేశుఁ డేయుశరమును
మనుజేశుఁడు తప్పఁ ద్రుంచు మార్కొని కడిమిన్
మనుజేశుఁ డేయుశరముల
దనుజేశుఁడుఁ దప్పఁ ద్రుంచుఁ దశభుజశక్తిన్. 56

Akella Raghavendra's Online-las.com

క. కంటున వేసినశరములు
వింటన్ దప్పించుకొనుచు వెస బాణములన్
గెంటింపుచు దమగాత్రము
లంటక యుండంగ నేటులాడిరి కడిమిన్. 57

క. మొదల నొకబాణ మావలఁ
బదులును బదిపదులు వేయిఁ బదివేలును నేఁ
బదివేలు లక్ష కోటియుఁ
జెదరక విలుకాండ్రమీఁద శీఘ్రమ పర్వెన్. 58

క. తొడిగినబాణము వింటను
దొడిగినయట్లుండు మిగుల దోడ్తోనవలన్
వెడలెడుశరములు లెక్కకుఁ
గడగుఱు తన రాక చిత్రగతులన్ బర్వెన్. 59

వ. అట్టిసమయంబున. 60

చ. అభవమురాంతకాదులు మహాత్ములు వింటికి వారికన్నసున్
త్రిభువనమందు వీరెగణుతింపఁగనెక్కుడటంచు మెచ్చుచున్
నభమున నుండి ప్రస్తుతి ఘనంబుగఁ జేతురు దేవకోటు ల
ట్లుభయఫలంబునందొగడుచుందురు రామునిరావణాసురున్. 61

చ. ధనువుల మ్రోత మేఘనినదంబులుగా శరదీప్తి జాలముల్
ఘనవరచంచలావళులుగా మణిమౌక్తికదీప్తి ధాత్రిమీఁ
దను వడగండ్లుగా క్షతజధారలు సంతతవర్ష ధారగా
ననయముఁ జెప్ప నొప్పె విపులాహవమప్పుడు వానకాలమై. 62

తే. పంక్తికంఠుండు మిగులఁ గోపంబు గదురఁ
దేవగంధర్వశరము సంధించి తివిచి
రామ భూపాలుమీఁద విక్రమము మెఱసి
వేసి వడి నార్చె దిగ్దంతివిసర మదల. 63

క. దానికిఁ బ్రతిశర మప్పుడు
మానవనాథుండుఁ దొడిగి మానుష మదరన్

Akella Raghavendra's Online-ias.com

బూనిక నేసిన దానిం
బోనీయక త్రుంచి వైచె భువనము లలరన్. 64

క. త్రుంచినఁ గనుఁగొని దనుజుఁడు
మించినకోపమున రాముమీఁదను వడి సం
ధించి స్ఫురద్విషబాణము
వంచింపక యేయ దానివలనన్ జాలన్. 65

ఆ. నాగశరము లొదవి నానాముఖంబుల
వచ్చునపుడు మనుజవల్లభుండు
గరుడబాణ మేసి ఖండించె నన్నింటి
మింట సురలు సూచి మెచ్చి పొగడ. 66

చ. అది వృథవోయినన్ దనుజుఁడాగ్రహమూని కరత్రిశూలమ
య్యదనునఁ ద్రిప్పివైవ విపులార్చులఁబేర్చుచువచ్చుదానిపై
వదలక ముందుగాఁ ద్రిదశవల్లభుఁ డిచ్చినశక్తి నేసినన్
బొదలుచుఁ బాఱిత్రుంచె మణిభూషణజాలమునాత్రిశూలమున్. 67

వ. అట్లు శూలంబును దూలి పోయిన. 68

క. సూతుని రథమును వాజులఁ
గేతువుఁ దూలంగ నేసి కినుక మెయిం జే
సేతను నొప్పించిన నృపుఁ
డాతటి దైతేయవిభుని నద్భుత మదరన్. 69

క. సూటి గొని యసురతలలకి
రీటము లవలీల డుల్లిరివ్వన నొసలున్
బీటలు వాఱ శతాంగము
ఘోటకములగుండె లవిసి కూలఁగ నేసెన్. 70

ఉ. ఆయెడ దైత్యనాయకుఁ డహంకృతి రాముని మేన నాటఁగా
వేయుశరంబు లాయముల వేగమె గాఁడిన రక్తపూరముల్
కాయముదొప్పఁదోఁగవడిఁ గ్రమ్మెడునప్పుడుగూడ నొప్పెఁబ
ద్మాయతలోచనుండు చరమాద్రితటిం దగు భానుఁడోయనన్. 71

Akella Raghavendra's Online-ias.com

ఆ. అంత రామచంద్రుఁడత్యంతకుపితుఁడై
బాణవృష్టిఁ గురియఁ బంక్తిముఖుఁడు
కాలు వ్రేలు చెయ్యి కదలింప నోపక
మెదల లేక రథముమీఁద నొరిగె. 72

వ. రావణుండు సొమ్మసిల్లిపోవు టెఱింగి కాలకేతుఁడు తేరు దూరంబుగాఁ గొనిపోయినఁ గొంత ప్రొద్దునకు దనుజేంద్రుండు మూర్ఛ దేరి యోరీ పగవారలు నవ్వఁ దగ దనక రథం బిట్లు తేఁ దగునే యని కోపించినఁ గాలకేతుండును యుద్ధమధ్యంబున దేవరకు సంకటం బైన రథంబు వెడలఁ గొనిపోవుట యోటమిగా దని ధర్మవిదులు సెప్పుదురు గావున నే నిట్లు దెచ్చితి నని విన్నవించిన సూతుని వాక్యంబులకు మెచ్చి పసదనంబు లిచ్చి మనరథంబు రాముని పయిం బఱపు మనిన నట్ల కావించినన్ గనుంగొని. 73

క. ఆతనిరథమున కెదురుగ
మాతలి! మనరథముఁ బఱపుమా యన నతఁడున్
వే తీవ్రగతిం బఱపిన
భూతలపతి వలికె దనుజపుంగవుతోడన్. 74

ఉ. భూరిభుజప్రతాపమునఁ బొంగుచు నిర్జరకోటి మాటికిన్
బోర జయించి తంచుఁ బలుపోకలు పోదువు నీవు భీతిమైఁ
దారక నిల్చి నాయెడఁ బ్రతాపము సూపుము చూపవేని నా
వారిజగర్భుఁ డడ్డపడ వచ్చినఁ జంపుదు నిన్ను రావణా. 75

ఉ. ఆలములోన వానరుల నాలము సేసినయట్లు గాదు నా
పాలిశరంబు నీనుదుటివ్రాలు హరింపఁగఁ బాలుపడ్డ దీ
వేళ వృథాపహాస్యములు వేయివిధంబుల మానలేక తాఁ
గాలుఁడు కన్నుగీటె నిదె కాలము డగ్గఱె నీకు రావణా. 76

చ. హరిగిరివహ్నిగిహ్నిఁ బ్రళయాంతకుఁ గింతకుదైత్యగిత్యవా
ర్వరుగిరు గాడ్పుగిడ్పు ధనవల్లభు గిల్లభు రుద్రు గిద్రు సం
గరమున నోర్చినట్టిదశకంధర! నీకు జయింప వచ్చునే
సురవగధీరు నుగ్రరణశూరుఁ బయోధిగభీరు రాఘవున్. 77

Akella Raghavendra's Online ias.com

క. మతిఁ దలఁప సుఖరతిం బతి
వ్రతలను మునివరులఁ బట్టి వ్రతములు గర్వో
న్నతిఁ జెఱచినట్టిదురిత
స్థితి నిప్పుడు నీవు నాకుఁ జిక్కితి విచటన్. 78

వ. అని గర్వాలాపంబు లాడుచున్న యుర్వీశునకుఁ బూర్వ గీర్వాణా
ధీశ్వరుం డగు రావణాసురుం డిట్లనియె. 79

క. అంతటి భూరిపరాక్రమ
వంతుఁడ వౌ టెఱుఁగుదేని వసుధేశ్వర! నా
పంత మెఱింగియు నెఱుఁగక
యింత ప్రగల్భముల నాడ నేటికి నీకున్. 80

క. నీలావును నాలావును
వాలాయము సురలు సూచి వర్ణింపఁగ నేఁ
డాలములోపలఁ జూపుద
మేలా గర్వోక్తు లిప్పు డినకులతిలకా! 81

మ. జననాథాగ్రణి! నా ప్రతిజ్ఞ వినుమా శాంతాత్ముఁడై నీకునై
వనజాప్తుం డిట వచ్చి కావు మనుచున్ వైళంబ నన్ గోరినన్
వినువీథిన్ సుర లెల్లఁ జూచి వెఱవన్ 1 బీరంబు సంధిల్లఁగా
నిను సీతమ్మనిఁ ంపకుండ మరలన్ నేలంకకుం 2 బోఁజుమీ. 82

వ. అని కోపోద్దీపితమానసు లై వీరాలాపంబు లాడుచు నిద్దఱును సుద్ద
విడి గద్దింపుచు నోలమాసగొనక మీఱిన కోపంబున శరీరంబులు మఱచి జయోల్లా
సంబు లుల్లసిల్ల నొసళ్ళఁ బొడముపెన్ జెమట మొత్తంబులును రక్తపూరంబులు
నున్ బెరసి కాలువలై పాఱుచుండ మెఱుంగుకఱకుటంపగములు నాటినం జాఱు
కెఱుంగక తమకంబులను నిష్ఠురబాణసంఘట్టనంబులను బృథులరథనేమిస్వనం
బులను ద్విసహస్రతురంగహేషారవంబులను భటుల సింహనాదంబులను
గగనంబు వగుల జగంబులు కలంగ సముద్రంబులు ఘూర్ణిల్ల ధాత్రి వడంక

1 వీరంబు.
2 బోదునే.

Akella Raghavendra's Online-ias.com

దిగ్గజంబులు మ్రొగ్గతిల్లఁ బడ నభోభాగంబున దేవ గంధర్వ సిద్ధసాధ్యకిన్నర కింపురుషాదులు సూచి వెఱంగుపడ నిది పగ లిది రాత్రి యని యెఱుంగక తమ కంబున నే డహోరాత్రంబులు పోరాడి యలసి బాణప్రయోగంబు లుజ్జగించి యొకరి నొకరు సూచుచుండ నయ్యవసరంబున. 83

క. సరసీరుహమిత్రాన్వయుఁ
డరుదరుదని సురలు వొగడ నసురేశ్వరున
క్కరములు శిరములుఁ దెగిపడ
నురుముష్టిని దీసి వేగ నుగ్రాస్త్రములన్. 84

క. తెగి పడినతలలుఁ జేతులు
దెగినట్లే మొల్చుచుండఁ దీవ్రత యడరన్
జగతీశుఁ డపుడు మదిలోఁ
దెగ కుండుట చిత్ర మనుచు దీకొని మఱియున్. 85

క. ఒకకోలఁ దలలుఁ జేతులుఁ
బ్రకటంబుగఁ ద్రుంచినంతబాహులుఁదలలున్
వికచాంబుజముల రీతిని
సకలేశుఁడు వెఱగుపడఁగఁ జయ్యన మొలిచెన్. 86

క. తొడిగెడి శరములు ధరపైఁ
బడియెడుమస్తకము లేరుపడ కుండఁగ న
ప్పుడు రామమహీతలవరుఁ
డెడతెగ కుండంగ నేసె నేమని చెప్పెన్. 87

వ. అట్టిసమయంబున. 88

ఆ. వింటఁ దొడుగుశరము వెసవెసుశరమును
దిరుగ మొలచుతలలుఁ దెగినతలలు
నెట్టివారి కైన నెఱుఁగంగ రాకుండ
రాముఁ డేయఁ దొడఁగె రణములోన. 89

ఆ. శరము దొడిగి తివియఁ జక్రంబువలె నుండు
శరము విడుచునపుడు చాప మగును

Akella Raghavendra's Online-ias.com

జూడ నొప్పె నౌర శోభితం బగు రాము
చేతివిల్లు సెప్పఁ జిత్ర మగును. 90

ఉ. కాంచనపుంఖదివ్యవిశిఖంబుల బాహులు మస్తకంబులున్
ద్రెంచినఁ ద్రెంచినట్లె కడుఁదేజ మెలర్పఁగ నుద్భవించు స
త్కాంచనరత్నభూషణనికాయముదీప్తులు ప్రజ్వరిల్లఁగాఁ
గాంచనగర్భదత్తవరగర్వ విశేషముచేత సారెకున్. 91

చ. పొరిఁబొరిఁద్రుంచినన్ దిరిగిపుట్టెడుచందముఁగోల నారిపై
వెరపుగఁ బూనుచందమును వేసెడుచందముఁ బాఱుచందము
న్గరము నుతింపఁగా నరుదుగాదె తలంపఁగ దేవతాళికిన్
శిరములచిత్రమున్ నృపతిచేతి విచిత్రము తూపుచిత్రమున్. 92

ఉ. రావణుఁడేయు బాణములు రాముని బాణము లొక్కపెట్టునన్
రావణు మేన నాటియును రామునినాటియు రక్తపూరముల్
పూవులతోడిమోదుగను బూర్వగిరీంద్రము మీఁది భానునిన్
జేవురుకొండ కాలువలసిందురమున్ దలపించు నెంతయున్. 93

క. ఒత్తిలి రాముఁడు దైత్యుని
కుత్తుక నొకకోలఁ ద్రుంచి కూల్చుట దొడ్డో
నెత్తురు గ్రమ్మకమున్నే
మొత్తములుగఁ దలలు మరల మొలచుట దొడ్డో. 94

వ. అని దేవసంఘములు గొనియాడ శ్రీరామచంద్రుండు దైత్య నాయకునితలలుఁ జేతులుం ద్రుంచి త్రుంచి విసివినం గని విభీషణుండు నరేంద్రున కిట్లనియె. 95

క. పోలఁగ నాతనినాభీ
మూలంబున నున్న యమృతమును మొదలను ని
ర్మూలముగా శ్రీరఘుభూ
పాలక! తెగ్రేయు మగ్ని బాణముచేతన్. 96

క. అది తెగిపోయినపిమ్మటఁ
బదితలలును రెట్టి గలుగుబాహులు మరలన్

Akella Raghavendra's Online-ias.com

జెదరక తునుమఁగఁ దునుమఁగ
దుది ముట్టఁగ మొలుచు నూటతొమ్మిదిషూరుల్. 97

వ. అంత నంతంబౌ నని విన్నవించిన విని రామభూపాలుం డట్లు
గావించిన. 98

క. ఒకతలయు రెండు చేతులు
నకలంకస్థితిని గల్గునట్టితనిన్ నేఁ
డొకతలఁకు దెచ్చె నౌ నని
ప్రకటించిరి సురలు రామభద్రుని నెలమిన్. 99

తే. అంత నమృతంబు తెగిపోవ నసురవిభుని
మేన బాహుఁ దలలును మిన్న కడఁగి
పోయి కనుపట్టె నప్పు డద్భుతము గాఁగ
రెండుచేతులు నొకతల గండు మిగుల. 100

వ. అంత దైత్యేంద్రుండు తన మనంబున. 101

క. ఎవ్వరు నెఱుఁగనిమర్మం
బివ్విభునకు నెఱుకసఱుప నిటు గావించెన్
మవ్వమున నీవిభీషణు
క్రొవ్వెల్ల నడంతు నంచుఁ గ్రూరతతోడన్. 102

సీ. తొల్లి వరప్రాప్తి దొరికినయటువంటి
రక్తాభ మనుమహాశక్తి దివిచి
గంధపుష్పాక్షతకలిత మై కనుపట్టి
విపుల తేజంబున వెలయుచున్న
దానిఁ బ్రయోగింప దారుణానలతీవ్ర
శిఖలు దిక్తటములఁ జెలఁగుచుండ
ఘనఘనారావమై ఘంటానినాదంబు
శ్రుతిపుటంబులకు నశ్రుతము గాఁగఁ

తే. జండతరముగ నట విభీషణునిపైకిఁ
జిచ్చు లుమియుచు నుగ్రమై వచ్చుదానిఁ

గాంచి రాముండు నిశితమార్గణముచేతఁ
దృణముకైవడి నడిమికిఁ ద్రెంచివైచె. 103

వ. ఇట్లు తనశక్తివృథ యగుటఁ గని దానవేంద్రుండు మానవేంద్రునిపైఁ గరం బలిగి నిట్టూర్పు నిగిడింపుచు నసి ముసల ముద్గర పరశు పట్టిస ప్రాస గదా దండ కోదండ భిండివాలాది సాధనంబుల నవక్ర విక్రమంబున నాలంబు సేయుచుండఁగని విభీషణుం డులికి దేవా ! వీఁడు రెండుకరంబులతోడనే మెండుగ యుద్ధంబు సేయం దొడంగె నింక శిరంబులుఁ గరంబులు మరల నుద్భవించెనేనిఁ గార్యంబు దప్పుటకు సందియంబు లేదు. కావున వీని నీలోనన బ్రహ్మాస్త్రంబున నడఁగింపఁ దగు నని విన్నవించిన. 104

మ. అసహుం డుజ్జ్వలచాపదండమున బ్రహ్మాస్త్రంబు సంధించి యొ
య్యనఁగర్ణాంతముగాఁ గడున్ దివిచి ప్రత్యాలీఢ పాదస్థుఁడై
దనుజాధీశ్వరు బాహుమధ్యము వడిం దాఁకంగ లక్ష్యంబుగాఁ
గొనిబిట్టేసె నదల్చి తీవ్రతరమౌ కోపంబు దీపింపఁగన్. 105

క. ఆ వ్రేటు వడిగ నాటిన
రావణుఁ డతివివశుఁడగుచు వ్రాలె ధరిత్రిన్
దేవతతి పొగడి యప్పుడు
పూవులవర్షంబు గురిసె భూవరు మీఁదన్. 106

ఉ. సంగరభూమి రావణుఁడు సత్త్వముఁదూలి ధరిత్రిఁగూలినన్
గ్రుంగె భరంబునన్ ధరణి క్రుంగెఁ గులాచలవర్గమెల్ల వే
గ్రుంగె దిశాకరీంద్రములు గ్రుంగె మహోరగవంశనాథుఁడున్
గ్రుంగె ధులీకులేశ్వరుఁడు క్రుంగె వరాహముగ్రుడ్లు తేలఁగన్. 107

క. జగములకు నెల్లబాధకుఁ
డగు రావణుఁ డాజిఁ గూల నంతటితోడన్
బగ దీఱె ననుచు రాముఁడు
తగఁ దన విల్లెక్కు డించి తమ్ముని కిచ్చెన్. 108

Akella Raghavendra
Online-ias.com

సీ. అఖిలలోకమ్ముల కానంద మొదవెను
సురలకంటికి నిద్రసోఁకె నంత
మునులు చేసినతపంబులు * చాల ఫలియించెఁ
దొదరి సాధ్యులకుఁ దుందుడుకు వాసె
గుహ్యకావళికినిఁ గూడు నోటికిఁ బోయె
సిద్ధులతలఁపులు సిద్ధి నొందె
దర్వీకరంబులతల్లడం బడఁగెను
గిన్నరసంఘంబుకీడు తొలఁగె

తే. గరుడగంధర్వఖేచరగణములకును
క్షేమ మింపారె జనపరిణామ మయ్యె
వేడ్క లింపొందె బాధలు విఱుగఁడయ్యె
సంగరంబున దైత్యుండు సచ్చుకతన. 109

ఉ. అంత విభీషణుండు తనయన్న పదంబులమీఁద వ్రాలి య
త్యంత విషాదదుఃఖజనితాశ్రుకణంబులు రాల నేడ్చె లో
కాంతకుఁ డైన రావణుమహాద్భుత దుష్టపరాక్రమంబు భూ
కాంతునిముంగలన్ దడవి గద్గదకంఠ కషాయనేత్రుఁ డై. 110

వ. అట్టి సమయంబున మందోదరి మొదలైన యంతఃపుర సుందరీ సందోహంబు లేతెంచి తమప్రాణేశ్వరుండైన రాక్షసకుల సార్వభౌముంగని వక్షంబులు శిరంబులు మోఁదుకొనుచు బహువిధంబులఁ బ్రలపింపుచుఁ బరివేష్టించికొని యుండ భూకాంతుండు శాంతాలాపంబుల ననునయించి విభీషణుంగని నీవు దుఃఖం బుడిగి మీయన్నకు నగ్నిసంస్కారాది విధుల నాచరింపు మనిన నతం డట్ల కావించిన యనంతరంబ విభీషణుని లంకానగరంబునకుం బట్టంబు గట్టించిన నతండు సుగంధద్రవ్యంబులును నవరత్నఖచితంబులైన భూషణంబులును జీని చీనాంబరంబులును గానుకగా నిచ్చినం బరిగ్రహించి యవియెల్లను మాతలికిచ్చి ప్రియోక్తులం దనిపి యనిపిన నతండు స్వర్గంబునకుం జనియె నయ్యవసరంబున. 111

---

* తగ

Akella Raghavendra's Online-ias.com

సీ. ఆలోన రాఘవుండా విభీషణుఁ జూచి
* సత్ప్రీతియుక్తిమై సరగఁ బిలిచి
పంక్తికంధరు నాజిఁ బరిమార్చితి నటంచు
వసుమతీతనయకు వార్త సెప్పి
నీదేవి మొద లగునీరజాక్షులచేత
నతివకు శృంగార మమరఁ జేసి
కొంచు రమ్మని చెప్ప నంచితగతి నేఁగి
సరమాదిసతుల కాసరణిఁ జెప్ప

తే. సతులు నిర్మలజలముల జలక మార్చి
పట్టుపట్టంబు ముదమునఁ గట్టఁ బెట్టి
చందన మలంది సురభి పుష్పములు ముడిచి
మేలిమణిభూషణంబులు సాలఁ దొడిగి. 112

క. ఇందిరతో సరి యగునా
సుందరిఁ ద్రైలోక్యమాత సొబ గొందఁగఁ దా
రందలమునఁ గొని వచ్చిరి
కందర్పనిభుండు రాముకడకుం బ్రీతిన్. 113

వ. ఇట్లు గొనివచ్చి రామభూపాలుని సమ్ముఖంబున నునిచిన నద్ధరాతనూజాత పతికి వినయభక్తి తాత్పర్యంబులు వెలయఁ బ్రణమిల్లిన నతండు వనితారత్నం బగుసీతం గనుంగొని యిట్లనియె. 114

క. కులసతిఁ జెఱ గొనిపోయిన
యలశాత్రవు గెలువ నోపఁ డనుపలుకులకున్
గెలిచితిఁ బగ చంపితి నిఁక
వెలఁతా! నీయిచ్చఁ జనుము వే నిన్నొల్లన్. 115

ఆ. అనుచుఁ బలుకుపలుకు లవనీతనూజాత
కర్ణములకు వాఁడి గలుగునట్టి

---

* సద్భక్తి. ఈ పాఠము సమంజసముగా లేదు.

— సంపాదకురాలు.

నారసములు సోఁకి నాటిన యట్లైన
సరసిజాక్షి మూర్ఛఁ జాలి నొంది. 116

చ. నరవర ! నామచిత్తము మనంబున నీవ యెఱింగియుండియున్
బరుషము లాడ నేమిటికిఁ బాపము నాయెడ లేదు కాదుపో
సురలు నుతింప మేటిసొదఁ జొచ్చెద మెచ్చుఁ డటన్న రామభూ
వరునిమనం బొడంబడిన వారిజలోచన సీత యాతతిన్. 117

క. హృదయేశుఁ డలర నప్పుడ
సొదఁ జొచ్చెను భూమిపుత్త్రి సురలు నుతింపన్
ముద మంది పద్మభవుఁ డా
యదనం బ్రత్యక్ష మయ్యె నౌ నౌ ననుచున్. 118

ఆ. అంతఁ బద్మగర్భుఁ డవనీశుఁ డగురామ
భద్రుఁ జూచి పలికెఁ బరమపురుష !
వనజనేత్ర సీతవలన దోసము లేదు
నమ్ము వసుమతీశ ! నాదుమాట. 119

వ. అని పలికిన పితామహునిమాటల కుభయసేనలును సంతసిల్లినవి. అనంతర మగ్నిభగవానుండు నయ్యంగనం గొనివచ్చి పరమ పతివ్రతాభరణం బగునిద్ధరాతనూజాతం గైకొమ్మని యప్పగించిన నయ్యెడ దశరథుండు ప్రసన్నుం డైన శ్రీరామచంద్రుండు సతీసమేతుం డై తమ్ముండును దానును నమస్కరించినఁ గుమారద్వయంబును గోఁదలిని నాలింగనంబుచేసి తద్దుఃఖంబులం బాపి చనియె నప్పుడు సకలదేవతలు ని ట్లనిరి. 120

క. మాకొఱకు జనన మొందితి
రాకాసులరాజుఁ జంపి రక్షించితి వౌ
లోకంబు లెల్లఁ గృపతో
సాకేతపురాధినాథ ! సజ్జనవినుతా ! 121

క. అని వినుతి సేసి కలనన్
జనిపోయినకపుల నెల్ల సత్కృప బ్రదుకం

Akella Raghavendra's Online-ias.com

దని వరము లిచ్చి యరిగిరి
ఘను లాదేవతలు మరలి గగనంబునకున్. 122

వ. తదనంతరంబున. 123

తే. భానుపుత్త్రాది వానరబలముతోడ
ఘనవిభీషణముఖ్యరాక్షసులతోడ
మఱియు జానకితోడ లక్ష్మణునితోడఁ
బుష్పకం బెక్కి చనియె నాభూమివిభుఁడు. 124

వ. ఇట్లు పుష్పకారూఢుండై చనుచుండి రామభూకాంతుండు కాంతారత్నంబునకుఁ జేయెత్తి చూపుచు సంగ్రామస్థలంబిదె రావణకుంభకర్ణాదులైన రాక్షసబలంబును మర్దించిన తా విదె సువేలాచలం బిదె సముద్రంబునన్ బంధించిన సేతుబంధనం బిదె విభీషణుఁడు మమ్ము శరణుచొచ్చిన ప్రదేశం బిదె సుగ్రీవుని కిష్కింధానగరం బిదె వాలిని నేలఁ గూలనేసినచో టిదె భానునందనుండు మమ్ముఁ బొడగన్నస్థలం బిదె ఋశ్యమూకాచలం బిదె వాయుతనూభవుండు మమ్ము బొడగన్న తా విదె పంపాసరోవరంబిదె కబంధుండను దానవుని వధించిన ప్రదేశం బిదె జటాయు వనుపక్షీంద్రుండు నిన్ను గొనిపోవునప్పుడు రావణాసురుని తోడంబోరి మడిసినస్థానంబిదె జనస్థానం బిదె దశవదనుండు నిన్నుఁ జెఱఁ గొని పోయిన చోటిదె మాయామృగంబును బడనేసిన చోటిదె ఖరదూషణాదులు నాతోడఁ బోరి పొలసినతావిదె శూర్పణఖ యనుదాని ముక్కు చెవులుం జెక్కినయిక్క యిదె సుతీక్ష్ణుం డను మునీంద్రుండు వర్తించునాశ్రమం బిదె యగస్త్యాశ్రమం బిదె యత్రి మహామునీంద్రుని పత్ని యనసూయాదేవి యంగరాగంబులు నీకిచ్చిన చక్కియిదె విరాధుం డనురాక్షసుండు నిన్నుఁ బట్టుకొని పోవుచుండ విడిపించిన చోటిదె చిత్రకూటాచలం బిదె భరతుండు మనల నొడంబఱుచి మరలఁ గొనిపోవ వచ్చినచోటిదె గంగానది యల్లదే కనుంగొను మనిచెప్పుచు భరద్వాజాశ్రమంబుఁ జేరం జని యచ్చటఁ బుష్పకంబుడిగ్గి యమ్మునీంద్రునకు నమస్కరించిన నతండు రాముని దీవించిన మహానందంబు నొంది యనిలసంభవా! వేవేగ నీవేఁగి నందిగ్రామమ్మున నున్న భరతునకు మారాక యెఱింగించి రమ్మని యనిపిన. 125

క. అరుదెంచి చూచెఁ బావని
సురుచిరసౌభాగ్యభరతు శోభనచరితున్

Akella Raghavendra's Online-ias.com

విరచితపుణ్యస్ఫురితున్
నిరుపమసత్కీర్తినిత్యనిరతున్ భరతున్. 126

వ. కనుంగొని వందనంబు సేసి కరంబులు మోడ్చి వినయంబున. 127

ఆ. భరతునకును రామభద్రుఁ డేతెంచిన
వార్తఁ జెప్ప వినుచు వాయుసుతుని
గారవించి నిండు కౌఁగిట జేర్చుచు
నగ్రజన్ము సేమ మడిగి యడిగి. 128

క. తల్లులు మువ్వురకును రఘు
వల్లభుఁ డేతెంచినట్టి వార్తలు దెలుపన్
బల్లిదుఁ డగుతనతమ్ముని
నల్లన సాకేతపురికి ననిపెన్ వేడ్కన్. 129

వ. అట భరద్వాజాశ్రమంబున మజ్జనభోజనాదులాచరించి నాఁటి రాత్రి నిలిచి మఱునాఁ డమ్మునీంద్రుని వీడ్కొని శ్రీరామచంద్రుండు పుష్పకారూఢుండై చనుదెంచుచున్న యప్పుడన్నకు భరతుండు సకలసేనా సమేతుండై తల్లులుం దమ్ముండును నెదురేఁగి రాఘవేశ్వరు పాదారవిందంబులకు వందనం బాచరించిన నతం డనుజన్ములఁ గౌగిలించుకొని లక్ష్మణసహితుండై జనకరాజనందనం గూడి తల్లులు మువ్వురకుం బ్రణమిల్లి వార లతిస్నేహంబున నిండుకౌఁగిళ్ళ నొత్తుచు దీవింపఁ దమలోఁదాము పెద్దపిన్న యంతరువుల వందనంబులు సేసికొని మరలి నందిగ్రామంబున కేఁగి యచ్చటఁ బుష్పకంబు డిగ్గి దాని కర్చన లిచ్చి కుబేరుని వీటికిఁ బొమ్మని యనిపి భరతుమందిరంబు ప్రవేశించె నట్టి శుభసమయంబున. 130

క. దానంబు లిచ్చి భద్ర
స్నానంబులు సేసి భూషణంబులు పూఁతల్
చీనాంబరములఁ బరిమళ
సూనంబులఁ దాల్చి రధికశోభనలీలన్. 131

వ. ఇట్లు రామాది సోదరచతుష్టయంబును భూమినందనయును దపోవేషంబు లుజ్జగించి రాజచిహ్నంబులు గైకొని దానవ వానరబలంబులం గూడుకొని షడ్రసోపేతంబులైనభోజనంబులం బరితృప్తులై యారాత్రిగడపి మఱునాఁడు గజ

Akella Raghavendra's Online-ias.com

తురగస్యందనాది వాహనంబు లెక్కి ఛత్రచామరాదులు మెఱయ శంఖభేరీఢాంకా
రంబు లుల్లసిల్ల వందిమాగధుల బిరుదుకైవారంబులు సెలంగ నయోధ్యాపురంబుఁ
బ్రవేశించి నగరులోనికిఁ జొత్తెంచి వసిష్ఠానుమతంబున శుభముహూర్తంబున
భద్రసింహాసనంబునఁ బట్టభద్రుండై రామభద్రుండు భూసురులకు దానంబు
లొసంగి యర్థార్థుల కిష్టార్థంబు లిచ్చి విభీషణ సుగ్రీవాంగద జాంబవద్ధనుమదాదులఁ
బ్రియవచనంబులం దనిపి వారివారికిం దగినపగిదిని గట్నంబులిచ్చి వీడ్కొలిపిన
వారు నిజస్థానంబులకుం జని రంత మహానందంబున. 132

ఆ. అశ్వమేధయాగ మన నొప్పుజన్నంబు
నెలమిఁ జేసి దివిజు లెల్ల మెచ్చ
లీలఁ బదునొకండు వేలేండ్లు ధరయేలెఁ
బరమధర్మమహిమఁ బ్రజలు వొగడ. 133

సీ. సకలౌషధక్రియాసంజీవకరణిచేఁ
దెలఁగి దిక్కులను రక్షింపఁజాలు
బంధురోన్నతశస్త్రసంధానకరణిచేఁ
గుటిలారులను రంభ గూర్పఁ జాలు
సంతతోత్పాదనసౌవర్ణ కరణిచే
నర్థులదారిద్ర్యమడఁపఁజాలు
ననుదిన సంధాన మనుశల్యకరణిచేఁ
. బురుషార్థనికరంబుఁ బ్రోవఁజాలు

తే. సిద్ధివిద్యానురాగప్రసిద్ధుఁడైన
* రాజచంద్రుఁ డితం డని రాజు లెల్ల
సన్నుతింపఁగ విలసిల్లె జగతియందు
భాగ్యవిస్తారి రామభూపాలశౌరి. 134

సీ. కుటిలత నదులందుఁ గుంతలంబులయందు
బొంకు జూదములందు బూతులందు
లేమి వైరులయందు లేమలనడుమందు
భంగ మంబుధులందుఁ బరులయందుఁ

---

* రామచంద్రుండితండని

Akella Raghavendra's Online-ias.com

గోపంబు ఖలులందుఁ గ్రూరవర్తనులందు
వడఁకు పీణలయందు వ్యసనులందు
బంధంబు రతులందుఁ బటుశిరోజములందు
మోహంబు ధనమందు ముదితలందుఁ

తే. చింత కవులందుఁ దపసులచిత్తమందు
వర్ణమిశితంబు చిత్తరువందు యవను
లందుననె కాని యొండెడఁ జెందకుండ
లీల ధర యేలె రామభూపాలవరుఁడు. 135

క. ఈరామచరిత మెప్పుడు
వారక విన్నట్టివారు వ్రాసినవారున్
గోరి పఠించినవారును
శ్రీరామునికరుణ మేలు సెందుదు రెలమిన్. 136

క. జలజాక్ష! భక్తవత్సల!
జలజాసనవినుతపాదజలజాత! సుధా
జలరాశిభవ్యమందిర!
జలజాకరచారుహంస! జానకినాథా! 136

మాలిని. కువలయదళనేత్రా! కోమలస్నిగ్ధగాత్రా!
భవముఖనుతిపాత్రా! భక్తవృక్షాళిచైత్రా!
1 రవిశశిసమధామా! రక్షితాక్షాంఘ్రిభామా!
కపిజననుతనామా! కావుమా మమ్ము రామా! 137

గద్యము. ఇది శ్రీగౌరీశ్వరవరప్రసాదలబ్ధ గురుజంగమార్చన వినోద సూరిజనవినుత కవితాచమత్కారాతుకూరి కేసనసెట్టి తనయ మొల్లనామధేయ విరచితంబైన శ్రీరామాయణ మహాకావ్యంబునందు యుద్ధకాండము సర్వంబును దృతీయాశ్వాసము.

1 రవిశతసమధామా.

[illegible] శిష్టాచార సంపన్న. [illegible] విశ్వవిద్యాలయ [illegible]
మొల్లరామయణము సంపూర్ణము.

Akella Raghavendra's Online-ias.com